భల్లూక రాజ్యం

షెడ్రిన్ చెప్పిన కథలు

అనువాదం: ఆర్. కృష్ణమూర్తి

సంపాదకత్వం: వాసిరెడ్డి వేణుగోపాల్

VASIREDDY PUBLICATIONS
Dr. No. 5-69, Plot No: 34, Rajyalaxmi Nagar-1
Gurramguda, Hyderabad - 501510
Ph: 9000528717, 040-29702868

BHALLUKA RAJYAM
SALTYKOV SHCHEDRIN

Telugu Translation: R.Krishna Murthy
Editing: Vasireddy Venugopal

Normal Edition Price: Rs. 150/-

First Edition: 26th August 2018

For copies:
VASIREDDY PUBLICATIONS
Dr. No. 5-69, Plot No: 34
Rajyalaxmi Nagar-1, Gurramguda,
Hyderabad - 501 510
Phone: 9000528717, 040-29702868

Also available at: flipkart.com, vmrgbooks.com
For e-book: www.kinige.com

Cover Concept & Design
VMRG Suresh

Page Layout
A. Thirupathaiah

Printed at
Om Sai Graphics,
Narayanaguda, Hyderabad.

విషయ సూచిక

ఫేస్ బుక్ మిత్రులందరికీ
పేరుపేరునా ఈ పుస్తకం అంకితం

ముందుమాట

"అహింసావాదులు. మీరు మాంసం తినడం ఏమి మర్యాద స్వామీ?"

"మాంసం!! కల్లుచుక్క పడనిదే మాంసానికి మజా రాదు"

"కల్లు చుక్క కూడా అలవాటైందీ?"

"చుక్కవేసిన తర్వాత చక్కని సాని వుంటే కాని అందం లేదు"

"సరి సరి! సాని కూడానా? ఐతే స్వామీ సానిదానికి ఇవ్వడానికి డబ్బెక్కడిది?"

"దొంగతనం చేస్తాం. జూదమాడి సంపాదిస్తాం"

"దొంగతనంలోనూ, జూదంలోనూ అందెవేసినట్టు కనిపిస్తున్నారే!"

"అన్ని విధాలా భ్రష్టుడైనవాడికి అంతకన్న దారేముంది?"

ఇది భోజరాజుకి, కవి కాళిదాసుకీ జరిగిన సంవాదమని చెబుతారు. ఈ సంవాదం ఒక శ్లోకరూపంలో వుంది. వ్యసనపరుడైన రాజుకు బుద్ధి చెప్పడానికి కవి అల్లిన కథ ఇది.

రాజనీతిని ప్రబోధించడానికి ఏ అజ్ఞాత మహాకవో కల్పించిన పంచతంత్రం ప్రపంచ సాహిత్యానికే మకుటాయమానం.

సమాజంలోని ఎగుడు దిగుళ్లను, కలవారి కండకావరాన్ని, లేనివారి దైన్యాన్ని, అధికార దర్పాన్ని సునిశితంగా విమర్శిస్తూ పిట్టకథలు చెప్పిన ఈసఫ్ ప్రపంచ సాహిత్యంలోనే వందనీయుడుగా పేరుగన్నాడు.

వాచ్యంగా చెప్పిన నీతికన్నా వ్యంగ్యంగా చెప్పిన నీతి మనసుకు హత్తుకుంటుంది. సూటిగా చెప్పిన మాటకన్నా వ్యాజోక్తి సూటిగా తగులుతుంది. ప్రత్యక్షోపదేశంకన్నా అన్యాపదేశం చక్కగా పనిచేస్తుంది.

అందుకనే పంచతంత్రానికీ, ఈసఫ్ కథలకు అంత ప్రపంచ ప్రఖ్యాతి, అంత గౌరవం.

సాల్టికోవ్ షెడ్రిన్ ఈ అన్యాపదేశంలో, వ్యాజోక్తిలో, వ్యంగ్య రచనలో సిద్ధహస్తుడు.

ఇప్పటికి సుమారు 150 సంవత్సరాల క్రితం రష్యాలోని ధనవంతుల దర్పాన్ని, పేదల దైన్యాన్ని, రైతుల హీనస్థితినీ వివరిస్తూ మన పంచతంత్ర ఫక్కీలో రాసిన కథలు ఇవి. గతంలో 'గొప్పవారి గోత్రాలు' పేరిట తెలుగులో వచ్చాయి. ఒకటిన్నర

శతాబ్దం దాటినా.. భారతీయ వర్తమాన పరిస్థితికి అతికినట్టు సరిపోతున్న ఈ కథలను 'భల్లూక రాజ్యం' పేరిట తాజాగా ప్రచురిస్తున్నాం.

పరిగపిల్ల వైరాగ్యం, గద్దరాజుగారి కళాపోషణ, భల్లూక రాజ్యం, ఆదర్శవాది జెల్ల లాంటి కథల్లో షెడ్రిన్ వ్యంగ్య ధోరణి కొట్టొచ్చినట్టు కనిపిస్తుంది.

ఆనాటి తాత్వికులు, రాజకీయ వాదులు, విప్లవ వాదులు కూడా ఎలా ఊహాలోకంలో విహరించేవారో షెడ్రిన్ నిశితంగా తన కథలలో వివరిస్తారు. ఈ కథలలో కొన్ని కేవలం రష్యా వాతావరణానికే పరిమితం. కానీ ఎక్కువ కథలకు దేశకాలాది అవధులు లేవు. అవి అన్ని కాలాలకూ, అన్ని దేశాలకూ వర్తిస్తాయి.

ఇందులో మొదటి కథ ఇద్దరు ఉన్నతోద్యోగులకు నిర్మానుష్య దీవిలో తిండి పెట్టిన అన్నదాత కథ.

నెత్తిమీదికి మిత్తి వచ్చినప్పుడు కూడా పేద రైతు కనిపించేసరికి అధికారులలో పెల్లుబికే అధికార దురహంకారం, పేదరైతు నమ్రతలను హృదయ విదారకంగా వర్ణించాడు షెడ్రిన్. రైతుల కన్నీటి గాధలను వివరించేవే కాకి సత్యాన్వేషణ, ముసలితట్టు అనే కథలు కూడా. ఈ కథల్లో అన్ని దేశాలకు, అన్ని కాలాలకు వర్తించే వాటి విషయంలో అనువాదకుడు కొంత స్వేచ్ఛ తీసుకున్నారు. ఉదాహరణకు కుచేల పుల్లయ్య, కుబేర పుల్లయ్య కథ. 'ఐవాన్ ది రిచ్ – ఐవాన్ ది పూర్' అనే కథకి అనువాదం. ఐవాన్ అనేది రష్యాలో సామాన్య జనవాచకం. కథాకాలంనాటి పత్రికల పేర్లు యధాతథంగా వుంచారు.

అలాగే 'క్రామోల్నికోవ్' అనే పదాన్ని 'పితూరీరావు'గా అనువదించారు. 'క్రామోల్నిక్' అంటే రష్యా భాషలో పితూరీదారు, లేక తిరుగుబాటుదారు అని అర్థం. అక్కడక్కడ ఔచిత్యానుగుణమైన చిన్నచిన్న మార్పులు తప్ప మిగిలినదంతా యధామూలం. అరవై ఏళ్లనాడే అనువాదకుడు కృష్ణమూర్తిగారు చక్కటి తేటతెనుగులో ఈ కథలను అనువదించారు.

విప్లవానికి పూర్వం రష్యా ప్రజల ఆలోచనలను విప్లవ పథానికి మళ్లించిన కొద్దిమంది ప్రసిద్ధ రచయితల్లో షెడ్రిన్ ఒకరు. ప్రపంచ పాఠకులకే అభిమాన పాత్రమైన షెడ్రిన్ రచనలను తిరిగి తెలుగు పాఠకుల ముందుకు తీసుకురావడం చాలా సంతోషదాయకంగా వుంది.

– వాసిరెడ్డి పబ్లికేషన్స్

భల్లూక రాజ్యం



మహా క్రూరులకు మహామహులనే కీర్తి వస్తూ వుంటుంది. అలాంటి వారి పేరు చరిత్రకెక్కుతుంది. కానీ క్రూరుల్లో కూడా అల్పులుంటారు. వాళ్లకు మాత్రం అప్రతిష్ట మిగులుతుంది. పొరపాటునైనా వాళ్లు చరిత్రని అపమార్గాలకు మళ్లించలేరు. సమకాలికుల మెప్పు పొందలేరు.

ఆది భల్లూక దేవర

ఆది భల్లూక దేవరాయలవారికీ విషయం క్షుణ్ణంగా తెలుసును. ఆయనకు చాలా అనుభవం వుంది. గుహలు నిర్మించుకోగలరు. చెట్లను పెకలించగలరు. ఆయనకున్న చిరకాల వాంఛ ఒక్కటే. అది చరిత్రకెక్కడం. మరి చరిత్రకెక్కాలంటే ప్రపంచంలో అన్ని మార్గాలకన్నా రక్తపాతం మిన్న అని ఆయన ఎన్నుకున్నారు. వాణిజ్యం, పరిశ్రమలు, విజ్ఞానశాస్త్రం దేన్ని గురించి ఆయన మాట్లాడినా 'రక్తం, రక్తమండీ, కావలసింది రక్తం' అన్న మాటలతో ముక్తాయించేవారు.

భల్లూక దేవరవారి ఈ రక్తదాహాన్ని కనిపెట్టిన సింహసార్వభౌములు ఆయనకు మేజరు హోదా ప్రసాదించి దూరానున్న ఒక అడవిలో స్థానిక తిరుగుబాటును అణచడంకోసం తాత్కాలిక గవర్నరుగా నియమించారు.

సార్వభౌముని పలుకుబడిలోని వారంతా ఈ వార్త విని తల్లడిల్లారు. వన్యప్రాణుల్లో అప్పుడు చిత్తం వచ్చినట్టు జీవించడానికి అనుమతి వుండేది. మృగాలు పరుగెత్తేవి. పక్షులు ఎగిరేవి. పురుగులు పాకేవి. కానీ కదం తొక్కడం ఎవరికీ ఇష్టంలేదు. కొత్త గవర్నరు తమను పువ్వుల్లో పెడతాడని అవెప్పుడూ అనుకోలేదు. కానీ అనుభవం కానిదే ఊహించే స్థితి మాత్రం వాటికేనాడో నశించింది. ఏమైతేనేం 'గవర్నరు గారిని రానీయండి చూద్దాం' అనుకున్నాయి.

అవలా అనుకుంటూ వుండగానే గవర్నరు భల్లూక దేవరవారు రానే వచ్చారు. అమావాస్య ఆదివారం పొద్దున్నే ఆయన తన బసకు చేరుకున్నారు. చేరుకోగానే 'రేపు నెత్తురు కళ్లజూస్తాం' అని నిశ్చయించుకున్నారు. ఈ నిశ్చయానికాయన ఎందుకు వచ్చారో తెలియదు. ఆయనకు దురుద్దేశాలు ఆపాదించడానికి వీల్లేదు. ఆయన కేవలం ముష్కరుడు.. అంతే!

శనిదేవత నెత్తినెక్కి ప్రలోభపెట్టకపోతే ఆయన ఆశయానికి భంగం కలిగి వుండేది కాదు.

ఇంతకీ ఏం జరిగిందంటే... ఆయన అలా రక్తపాతాన్ని గురించి ఆలోచిస్తూ వుండగా తన పుట్టినరోజు పండుగ సంగతి హటాత్తుగా జ్ఞాపకం వచ్చింది. ఒక సీసాడు ఓడ్కా తెప్పించి తానొక్కడూ కూర్చుని తాగాడు. ఆయనింకా గుహను నిర్మించుకోలేదు. మైకం బాగా తలకెక్కిందేమో అలా అడవి మధ్య ఆరుబైటనే గుర్రుపెడుతూ నిద్రపోయాడు. తెల్లవారేసరికి దైవాద్యా ఒక పైడిపిట్ట ఆయన మీదనుంచి ఎగిరింది. ఇది సామాన్యమైన పైడిపిట్ట కాదు. చాలా తెలివైనది. కడివెడు నీళ్లు తీసుకుని రాగలదు. అవసరమైతే గోరువంకలాగా పాడగలదు కూడా. ఈ పైడిపిట్టను చూసి పిట్టలన్నీ గర్వపడుతూ వుండేవి. 'మా పైడిపిట్ట త్వరలోనే మంచి మంచి పతకాలు సంపాదిస్తుంది' అంటూ వుండేవి. దాని కీర్తి సింహసార్వభౌముల చెవిదాకా వెళ్లింది. సార్వభౌముల సభాసదుల్లోకల్లా బుద్ధికి బృహస్పతి అయిన గాడిదను చూసి 'మా పంజాలో ఆ పిట్ట పాడుతూ వుంటే ఎంత బాగుండును' అని సెలవిస్తూ వుండేవారు.

పైడిపిట్ట ఎంత తెలివైనదైనా ఈసారి పాపం పప్పులో కాలేసింది. మన భల్లూక దేవరవారిని అక్కడ పడివున్న ఒక టేకుమాను అని భ్రమించి మీద ఎక్కి కిచకిచలాడసాగింది. దేవరవారిది కోడి కునుకు. తమ వీపుమీద ఎవరో గెంతుతున్నారని తోచగానే 'బహుశా వాడొక విప్లవకారుడై వుంటాడు' అని దేవరవారు భావించారు.

'గవర్నరుగారి పిరుందున ఎగిరే ఆ ఆకతాయి ఎవరు?' అని గర్జించారు.

అప్పటికైనా ఆ పైడిపిట్ట వెంటనే ఎగిరిపోవలసింది. కానీ ఎగరలేదు. అది మరొక తప్పిదం. పిట్ట అలాగే కూర్చుని 'ఇదేమిటి మొద్దు మాట్లాడుతున్నదే!' అని

ఆశ్చర్యపోయింది. దానితో భల్లూకదేవర సహనం మేరదాటింది. అది సహజమే కదా! ఆ 'దుష్టుడిని' పంజాతో పట్టి అమాంతం మింగేశారు.

మింగనైతే మింగేశారు. కానీ 'ఏమిటి మేం తిన్నది?' అన్న మీమాంస పట్టుకుంది. ఒక పంటి చివరకూడా ఏమీ మిగలలేదే. వాడేలాంటి విప్లవకారుడు? అనుకున్నారు. తల బద్దలయ్యేలాగా ఎంత ఆలోచించినా ఏమీ పాలుపోలేదు. భల్లూక దేవరవారు పైడిపిట్టను తినేశారు, అంతే. ఇదెంత స్వల్ప విషయమైనప్పటికీ మరి ప్రతిక్రియ లేదు. తిన్న తర్వాత దారుణ నేరం చేసిన తిరుగుబాటుదారులాగే ఈ అమాయకపు పిట్టకూడా ఆయన ఉదరంలో జీర్ణిస్తుంది.

'మేం దీన్నెందుకు తిన్నట్టు?' అని తర్కించుకోవడం మొదలెట్టారు.

'మేం బయలుదేరే ముందు సింహసార్వభౌములు గట్టి కట్టడి చేశారు. గొప్ప పనులు చేయి. స్వల్ప విషయాల జోలికి పోకు అని చెప్పారు. మేం చేసిన మొదటి పనేమిటి? ఒక పైడిపిట్టను భక్షించడం! సరే అయిందేదో అయిపోయింది. ఈ చుట్టుపక్కల ఎవరూ లేరు కదా?'

రాజ్యతంత్రంలో మొదటి తప్పు ప్రాణాంతకంగా వుంటుందన్న సంగతి పాపం భల్లూకదేవరవారు మరిచిపోయి వుంటారు. గవర్నరుగారు ఆదిలోనే తప్పుదారిన పడ్డారు. ఆ దారి ఇంకొన్ని తప్పిదాలకు కొనిపోతుంది. ఈ అపభ్రష్ట కార్యాన్ని ఎవరూ చూడలేదులే అని ఆయన మనసు సమాధానం పెట్టుకున్నారో లేదో.. పక్కనున్న భూర్జవృక్షం మీదనుంచి ఒక కాటుకపిట్ట అరిచింది:

'మూర్ఖుడు! మమ్మల్నందరినీ మట్టం చేయడానికి ఈయన్నిక్కడికి పంపించారు. ఈయనిక్కడ పైడిపిట్టలను భక్షిస్తున్నాడు!'

దానితో మన దేవరవారికి పిచ్చెక్కినంత పనైంది. కాటుకపిట్టను పట్టుకోవడంకోసం భూర్జవృక్షం మీదికి ఎగబాకారు. కానీ అదేం తెలివితక్కువ పిట్టకాదు. అక్కడనుంచి తుర్రున మరో చెట్టుమీద వాలింది. భల్లూకదేవర ఆ చెట్టుకూడా ఎగబాకాడు. కాటుకపిట్ట మొదటిచెట్టు మీద వచ్చివాలింది. భల్లూకదేవరకి చెట్లు ఎక్కడం దిగడంతో రొప్పు వచ్చింది. కాటుకపిట్టను చూసిన తర్వాత పిరికి కాకికి కూడా కలేజా వచ్చింది.

'చూడండోయ్ ఆ ముష్కరుడ్ని! అతడు నిజంగా రక్తపాతం చేస్తాడని అంతా అనుకున్నారు. కానీ ఇక్కడ పైడి పిట్టలను భక్షిస్తున్నాడు' అని కాకారవాలు చేసింది.

దానితో భల్లూక దేవర కాకి వెంట పడ్డాడు. అంతలో ఒక పొదలోంచి కుందేలు చెంగున గెంతింది.

'బానకడుపు భల్లూకరాయా పైడిపిట్టను భక్షిస్తావా?'

ఇంతట్లోకి ఒక జోరీగ రివ్వున వచ్చి 'అలమలం అట్టహాసం! వీండు పైడిపిట్టను

భక్షించినాండు!' అన్నది.

'వెర్రిమొర్రి బొర్ర వెధవ! పైడిపిట్టను తినేశాడు!' అని పక్కనున్న గుంటలోంచి కప్ప బెకబెకలాడింది.

భల్లూక దేవరంటే ప్రతివారికీ ఆటైపోయింది. తనను ఉడికించేవాళ్లను పట్టుకోవడంకోసం ఎన్ని పరుగులు పెట్టినా లాభంలేక పోయింది. పరుగులు పెట్టినకొలదీ ఎక్కువ అల్లరి పడవలసి వచ్చింది. ఒక గంట గడిచేలోగానే అడవిలోని ముసలీ ముతకా, పిల్లా మేకా అందరికీ కూడా గవర్నరుగారు పైడిపిట్టను భక్షించారన్న వార్త తెలిసిపోయింది. ఈ వెకిలిపనిని చూసి అడివంతా కోపంతో ఉడుకెత్తిపోయింది. కొత్త గవర్నరు ఇలా చేస్తాడని వారనుకోలేదు. అడివిలోని చెట్టు పుట్ట, మిట్ట పల్లం అంతా ఏకం చేస్తూ నెత్తుటేరులు పారిస్తాడని అంతా ఆశించారు. కానీ ఈయన చేసినదేమిటి? భల్లూక దేవర అడుగుపెట్టిన చోటల్లా అడివి అంతా 'వెర్రి వెధవ. పైడిపిట్టను భక్షించాడు' అన్న హేళనతో మారుమోగింది.

భల్లూక దేవర పిచ్చెత్తినట్టు అడివంతా పరుగులు పెట్టాడు. ఆయన జీవితంలో ఒక్కసారి మాత్రమే ఇలాంటి యాతన పడ్డాడు. ఒకప్పుడు ఆయన గుహలో వుండగా జాగిలాలను ఉసికొల్పారు. అందిన చోటల్లా కరచి కరచి విడిచిపెట్టాయి ఆ కుక్కలు. మృత్యువు కళ్లముందు తారట్లాడింది. కానీ ఎలాగో కొన్ని జాగిలాల కాళ్లు విరగకొట్టి, మరికొన్నింటి కంటిలో దుమ్ముకొట్టి చావుతప్పి బతికి బయటపడ్డాడు. ఇప్పుడెక్కడికి పారిపోవాలి? ప్రతి తుప్పా, ప్రతి చెట్టూ పనిగట్టుకుని ఆయనను వెక్కిరిస్తున్నది. ఆయన చేయగలిగినదల్లా వాటి ఎద్దేవాలను ఆలకించడం. అంతే! ఆఖరికి వెధవ గుడ్లగూబ కూడా 'వెధవ! వీడు పైడిపిట్టను తిన్నాడోయ్!' అంటూంటే ఇంకేం చేయాలి?

వీరంతా భల్లూక దేవరను మాత్రమే అలుసు కట్టలేదు. ఆయన అధికారాన్నే అవమానపరుస్తున్నారు. అది మరీ ఘోరం! ఈ పుకారు చుట్టుపక్కల అడవులకు కూడా వ్యాపించి అక్కడివారు కూడా అలుసుకడితే? ఏమో, అంతపనీ జరుగుతుందేమో!

ఒకొకప్పుడు అతి స్వల్ప విషయాలు కూడా దారుణ పరిణామాలకు దారితీస్తూ వుంటాయి. పైడిపిట్ట సరీగ్గా వేలెడంత కూడా వుండదే అని మీరనవచ్చును. కానీ అదే మన దేవరవారి పరువు ప్రతిష్టలను మంటగలిపింది. పైడిపిట్టను భక్షించే వరకూ ఆయనను తిట్టడానికి ఎవరికీ గుండెలు చాలలేదు. 'దేవరా', 'మహాప్రభూ', 'మీరు మా కన్నతండ్రి లాంటివారు' అన్న మాటలు తప్ప మరొకటి వినిపించేది కాదు. భల్లూకదేవర వారి సంగతి బుద్ధికి బృహస్పతులవారైన గాడిద స్వయంగా సింహానికి మనవి చేసిన విషయం జగద్విదితం. అసలు గాడిదకు అకారణంగా ఎవరిమీదా అనుగ్రహం కలగదు. కానీ ఇప్పుడు అల్పాల్పమైన ఈ ఘటన, పరిపాలనలో జరిగిన చిన్న పొరపాటు, అందరి



కళ్లూ తెరిపించింది. అందరి నాలుకలు కత్తుల్లా పదునెక్కాయి. 'వెధవ! పైడిపిట్టను భక్షించాడు!' అని ఎద్దేవా మొదలైంది. పంతులు దండన భరించలేక విద్యార్థి ఆత్మహత్యకు దిగినట్టుంది ఈ పరిస్థితి. అబ్బే ఈ ఉపమానం కూడా సరియైనది కాదు. విద్యార్థి ఆత్మహత్య చేసుకునే పరిస్థితి కల్పించడం ముష్కరత్వం అవుతుందేమో కానీ అప్రతిష్టాకరం మాత్రం కాదు. ఆ ముష్కరత్వాన్ని చరిత్ర వేనోళ్ల పొగడవచ్చును. కానీ ఇదేమిటి? పైడిపిట్టను భక్షించడం?

'నవ్వాగడం లేదర్రా!' అని చిలుకలు, కప్పలు, ఉడుతలు ఒకటే విరగబడి నవ్వుతున్నాయి.

మొదట భల్లూకదేవర చేసిన పనిని చూసి అడవి ప్రాణులందరికీ కోపం వచ్చింది. అసలిది అడవికే తలవంపులు అనుకున్నాయి. ఆ తర్వాత ఉడికించడం ప్రారంభించాయి. పిట్టలు, కప్పలు, జోరీగలు, ఈగలు.. ఒకటేమిటి అడవి అడవంతా పగలబడి నవ్వింది.

'ప్రజాభిప్రాయం అంటే ఇదేనన్నమాట' అని ముక్కును పంజాతో తుడుచుకుంటూ రుద్ధకంఠంతో అనుకున్నాడు భల్లూక దేవర.

'ఈ పైడిపిట్ట మూలంగానైనా నా పేరు చరిత్రకెక్కుతుందేమో!' అనుకున్నాడు.

చరిత్ర అనేది చాలా గొప్ప వ్యవహారం. దానిపేరు స్ఫురించగానే భల్లూకదేవర ఆలోచనలో మునిగిపోయాడు. అసలు చరిత్ర అంటే ఏమిటో దేవరకంత గట్టిగా తెలియదు. కానీ చరిత్ర పేరు చెబితే సింహసార్వభౌమునికి కూడా వణుకు పుడుతుందని గాడిద చెప్పగా విన్న జ్ఞాపకం వుంది. ముష్కర వేషం వేసినంత మాత్రాన ఎవరికీ చరిత్రలో స్థానం వుండదు. ఘోర రక్తపాతానికి మాత్రమే చరిత్రలో తావుంది. సామాన్య ముష్కరులను అంతా మొహంమీద ఊస్తారు. దేవర కనీసం ఒక ఆలమందను అడ్డుకొట్టివుంటే, ఒక గ్రామాన్ని కొల్లగొట్టి వుంటే, పోనీ ఒక కొంపను నిలువునా కూల్చివుంటే ఆ పరిస్థితి వేరు విధంగా వుండేది. అప్పుడు బహుశా చరిత్ర.. అలాంటప్పుడు దేవర అసలు చరిత్రను లెక్కచేసి వుండేవాడే కాదు. ధన్యవాదాలర్పిస్తూ గాడిద ఆయనకు లేఖ రాసేది. అంతకన్నా ఇంకేం కావాలి? ఇప్పుడేం వుంది? పైడిపిట్టను తిన్న ఖ్యాతి తప్ప! ప్రయాణానికెంతో ధనం సెలవుచేసి, వందల మైళ్లు పరుగులు పెట్టి చేసిన పనేమిటయ్యా అంటే.. పైడిపిట్టను పట్టి భక్షించడం! అయ్యో రాతా! ముక్కుపచ్చలారని పిల్లలు కూడా ఈ మాట వింటే నవ్వుతారుకదా? రాజాజ్ఞ మేరకు తిరుగుబాటును అణచడానికి బదులు గవర్నరు భల్లూకదేవరవారు ఒక పైడిపిట్టను పట్టుకుని భక్షించారని పిండారీలు, థగ్గులు ఒకరేమిటి అంతా ఇకపైన ఆడిపోసుకుంటారు. దేవర పిల్లలు ఇప్పుడు పాఠశాలలో చదువుతున్నారు. ఇంతవరకూ వారిని దేవరవారి బిడ్డలు అని మర్యాదగా చూస్తున్నారు. కానీ ఇప్పుడు తోటి పిల్లలంతా 'ఒరే పక్షి భక్షకా! పక్షి భక్షకా!'

అని ఉడికిస్తారు కాబోలు! ఇంతటి అప్రతిష్ఠ రావడానికి ఎంత నెత్తురు ధారపోయవలసి వుండేదో, ఎంతమందిని హత్యచేయవలసి వుండేదో, ఎందర్ని కొల్లగొట్టవలసి వుండేదో ఆ దేవుడికే ఎరుక!

దారుణ దురంతాలతో జాతీయ శ్రేయస్సుకు పునాది వేసే ఆ రోజులు నిజంగా దౌర్భాగ్యపు రోజులు. కానీ స్వల్పమైన కారణాలతో అదే ఆశయాన్ని స్థాపించాలనుకోవడం అంతకన్నా వెయ్యిరెట్లు దౌర్భాగ్యమైనది.

భల్లూకదేవరకి భయం పట్టుకుంది. కన్ను మూతపడదు. 'ఈ సంగతి వింటే గాడిదేమంటుంది' అన్నదొక్కటే సదా ఆలోచన.

సరే.. కల నిజమైనట్టుగా ఒక రోజున గాడిద దగ్గరనుంచి ఒక లేఖ వచ్చింది. 'మీరు తిరుగుబాటును అణచలేక పోయారనీ, పైగా ఒక పైడిపిట్టను భక్షించారనీ సార్వభౌములకు తెలియవచ్చింది. ఇది నిజమేనా?'

భల్లూకదేవర ఒప్పుకొనక తప్పలేదు. చేసిన పనికి చింతిస్తున్నట్టు ఒక సంజాయిషీ పంపించి ప్రత్యుత్తరంకోసం ఎదురుచూస్తూ కూర్చున్నాడు. దానికి వచ్చిన జవాబు 'వెర్రి వెధవ, పైడిపిట్టను తిన్నావా?' అని మాత్రమే. కానీ నువు చేసిన ఈ దారుణమైన తప్పిదాన్ని మాపుకోవాలంటే అసాధారణ రక్తపాతం చేయవలసి వుంటుంది. నీకు అదొక్కటే మార్గం అని గాడిద లోపాయకారీగా తెలియపరిచింది. భల్లూకదేవర గాడిదకు ఒక తేనెపెర నజరానా పంపాడులెండి!

'ఓస్ ఇంతేనా? ఐతే ఫరవాలేదు. పోయిన పేరు తిరిగి నిలబెట్టుకోవచ్చును' అని ఒక పొలికేక పెట్టి ఆ క్షణంలోనే ఒక గొర్రెల మందపై పడి మందకు మందా మారణహోమం చేశాడు భల్లూకదేవర. అక్కడ్నుంచి బయలుదేరి కలింకాయలు ఏరుకుంటున్న ఒక అబలను అడ్డగించి తట్ట లాక్కున్నాడు. తిరుగుబాటు మూలాలను పట్టడంకోసం అడవినంతా తవ్వి తలకిందులు చేశాడు. కొసకొకనాటి రాత్రి ఒక అచ్చుకూటం మీద దాడిచేసి యంత్రాలను విరగ్గొట్టాడు. అక్షరాలను చిందరవందరగా చిమ్మిపారేశాడు. మానవ మేధ సృష్టించిన ఫలితాన్ని నలిపి చెత్తగుంటలో ఊరదొక్కాడు.

అంతా అయిన తర్వాత తీరిగ్గా రాజుగారి అభిప్రాయంకోసం ఎదురుచూస్తూ కూర్చున్నాడు.

కానీ పాపం ఆయన పడిన అవస్థ అంతా వ్యర్థమైపోయింది.

భల్లూకదేవర చేసిన ఘనకార్యాలను చిలవలు పలవలు అల్లి సింహానికి మనవిచేసింది గాడిద. అది విన్న సింహం దేవరను మెచ్చి బహూకరించడానికి బదులు 'ఈ ఉద్యోగి ధీరుడని మాకు తోచదు. మా ప్రియమైన పైడిపిట్టను మింగేసిన బలుకరాయుడు వీడు' అని తమ రాజ పంజాతో రాసింది.

వెంటనే మేజరు భల్లూకదేవరను పదాతిదళంలోకి బదలాయించారు.

భల్లూకదేవర జీవితాంతం వరకూ ఆ మేజరు హోదాలోనే వుండిపోయాడు. కానీ మొన్ననే ఒక అచ్చుకూటం పెట్టాడు. అందుకని నిస్సందేహంగా జనరల్ హోదాకు వస్తాడు.

ఇమ్మడి భల్లూక దేవర

దారుణమైన దురంతాలు కూడా ఒక్కొక్కప్పుడు కొరగాకుండా పోతాయి. మరొక భల్లూకదేవర వారికి ఇలాంటి శోచనీయ స్థితే వచ్చింది.

ఆది భల్లూకదేవర ఇక్కడ ఏలుబడి సాగిస్తూ వున్న రోజుల్లోనే సింహసార్వభౌములు మరొక భల్లూకదేవరవారిని ఇంకొక అడవికి గవర్నరుగా పంపారు. ఈ భల్లూకదేవర కూడా మేజరే. ఈయన తన పేరింటిగానికన్నా ఆరింద. అంతేగాక గవర్నరు భవిష్యత్తు అంతా ఆయన తొలిచర్యమీదే ఆధారపడి వుంటుందని ఈయనకు బాగా తెలుసును. అందుకని ప్రయాణభత్యం ఇంకా చేతికి రాకముందే ఈయన తన కార్యక్రమాన్ని జాగ్రత్తగా ఆలోచించి మరీ బయలుదేరాడు గవర్నరు పదవి స్వీకరించడానికి.

అయినా ఈయన ఏలుబడి ఆది భల్లూకదేవర పాటికూడా సాగలేదు.

ఆయన రాగానే ఒక అచ్చుశాలను ధ్వంసం చేయాలని నిర్ణయించారు. అలాగని స్వయంగా గాడిద సలహా ఇచ్చింది. కానీ ఇమ్మడి భల్లూకదేవర పలుకుబడికి అప్పగించిన అడవిలో ఒక్క అచ్చుశాలకూడా మచ్చుకైనా లేదు. 'అల్లక్కడామూల చెట్టుకింద' 'అడవి శోభ'ను అచ్చువెయ్యడంకోసం ఒక కొయ్య ప్రెస్సు వుండేదని ముసలివాళ్లు చెబుతూ వుండడం కద్దు. కానీ మాగ్నిట్స్కీ (మొదటి అలెగ్జాండరు హయాంలో వుండేవాడు. విద్యకు గర్భశత్రువు. కరడుగట్టిన కర్కశవాది) హయాంలో సదరు ప్రెస్సును బహిరంగంగా భోగిమంట వేశారు. ఇప్పుడక్కడ మిగిలివున్న సాంస్కృతిక సంస్థ అల్లా సెన్సార్ షిప్ ఒక్కటే. ఈ సంస్థ అడవి వార్తలను అందించే బాధ్యతను కాటుక పిట్టల నెత్తిన పెట్టింది. ప్రతి ఉదయం ఈ నైతాళిక పక్షులు అడవి అంతా తిరిగి అందరికీ తాజా రాజకీయ సమాచారాన్ని అందిస్తూ వుండేవి. మార్పువల్ల ఎవరికీ ఎట్టి కలతా కలగకుండేలాగ జాగ్రత్త వహించేవి. అలాగే వల్లంకిపిట్ట చెట్టుపట్టలమీద 'ఆటవిక చరిత్ర'ను రచించడానికి ఉపక్రమించింది. కానీ ఆ రచన కూడా ఎక్కువకాలం నిలవలేదు. పని సాగుతున్న కొలదీ తిరుగుబాటు చీమలు ఆ పట్టను కొరికి ముక్కముక్కలు చేశాయి. అందుకని అడవి వారికి గతం సంగతీ, ప్రస్తుతం సంగతీ బొత్తిగా తెలియదన్న విషయం సువిదితం. వారు భవిష్యత్తుపట్ల ఏనాడూ ఆసక్తి చూపలేదు. ఏదో అలా అలా కాలక్షేపం చేస్తున్నారు. అంతే.

ఈ అడవిలో తగలబెట్టడానికి కనీసం ఒక విశ్వవిద్యాలయం, ఒక పరిషత్తు అయినా

లేదా? అని భల్లూకదేవరవారు దర్యాప్తు చేశారు. కానీ ఈ విషయంలో కూడా మాగ్నెట్స్కీ గవర్నరుగారి చిత్తాన్ని కనిపెట్టినవాడై యూనివర్శిటీ విద్యార్థులందర్నీ సైనికులుగా నమోదుచేసి దూరదూర ప్రాంతాలకు పంపించివేశాడు. ఆచార్యులందరినీ ఒక చెట్టుతొర్రలో బంధించాడు. అక్కడ వారు జవసత్వాలుడిగి ఈనాటికీ అలాగే పడివున్నారు. భల్లూకదేవరవారు క్రోధానల దందహ్యమానమానసులై సదరు మాగ్నిట్స్కీని ఖండఖండాలుగా ఖండించే నిమిత్తం హాజరు పరచవలసిందని హుకుం చేశారు. కానీ సదరు మాగ్నిట్స్కీ ఇప్పుడు రద్దు అయిపోయాడన్న వార్త చేరింది.

ఇక చేయగలిగినదేమీ లేదు. భల్లూకదేవర కొంతకాలంపాటు ఊరికే వున్నాడు. అయితే హతాశుడు కాలేదు. 'ఈ వెధవలకు హృదయాలు లేవు. అందుకని హృదయ పరివర్తన అనే సమస్య లేదు. కనుక వారి శరీరాలనే మరమ్మతు చేస్తాను' అని మనసులో అనుకున్నాడు.

అనుకున్నదే తడవుగా ఆచరణలోకి దిగాడు. ఒక అమావాస్య రాత్రి బయలుదేరి ఒక రైతు దొడ్లో దూరాడు. అక్కడున్న గుర్రాన్ని, ఆవునీ, పందినీ, గొర్రెల్నీ వరసబెట్టి ఊచకోత కోశాడు. ఇంతటితో రైతు పూర్తిగా దివాలా తీశాడని భల్లూక దేవరకు తెలుసును కానీ, అంతటితో తృప్తి కలగలేదు. 'వుండు. నీ కొంపకూడా కూల్చేసి చిప్ప చేతికి వచ్చేట్టు చేస్తాను' అని ఇంటి కప్పెక్కాడు. కానీ ఇంటి వాసాలలో ఒకటి చినికిపోయిందన్న సంగతి ఆయనకు తెలియదు. వాసంమీద అడుగు పడీపడ్డంతోనే, అది విరిగింది. భల్లూకదేవరవారు గాలిలో ఊగసాగారు. మరొక క్షణంలో కిందపడ్డం ఖాయం అని ఆయనకు తెలుసును. కానీ పడకూడదని ప్రయత్నం. అందుకని ఆ విరిగిన వాసాన్ని వాటేసుకుని బొబ్బరించాడు.

ఆ బొబ్బలు విని గొర్రులు, గొడ్డళ్లతో రైతులు వందలాదిగా చుట్టుముట్టారు. అంతా కల్లోలం. కంచెలు కూలిపోయాయి. తలుపులు విరిగి వున్నాయి. గోశాలలో నెత్తురు మడుగుకట్టింది. ఈ దారుణ హత్యాకాండకంతకీ కారకుడయిన హంతకుడు వాసం పట్టుకుని వేలాడుతున్నాడు. 'వీడి తల్లి సిగదరగ చూడు! దొరల మెప్పు పొందాలని వాడి ఆశ. మనం ఆకలికి మాడాలి. రండెహె ఒక దరువు వేద్దాం!' అని రైతులు భల్లూకదేవర పనిపట్టించారు. తాట వలిచి కంకాళాన్ని దూరంగా పారేశారు. తెల్లవారి గద్దలు, రాబందులు విందు చేసుకున్నాయి.

అప్పటినుంచీ ఆ అడవిలో ఒక సంప్రదాయం ఏర్పడింది. దురంతాలు దు:ఖానికి చేటు అని అక్కడ సామెత పుట్టింది.

ఈ విషయాన్ని గాడిద సింహానికి నివేదించగానే సింహం తన రాజపంజాతో ఇలా బరికింది: 'చరిత్ర ఇచ్చిన తీర్పును ముమ్మడి భల్లూకదేవరకి తెలియజేసేది. ఒళ్లు దగ్గర

పెట్టుకొమ్మని చెప్పేది. ఇతి సింహసార్వభౌమ లిఖితమ్!'

ముమ్మడి భల్లూక దేవరాయలు

ముమ్మడి భల్లూకదేవర తన పూర్వీకులకన్నా ఘటికుడు. సింహసార్వభౌముని శ్రీముఖాన్ని చదువుకుంటూ 'కానికాలం వచ్చింది' అనుకున్నాడు. 'చిన్న నేరాలు చేస్తే సిగ్గు సిగ్గు అంటారు. పెద్దవి చేస్తే అసలుకే ఎసరు వస్తుంది. అసలు నేను వెళ్లకనేపోతే?' అని ఆలోచించాడు. కొసకు అనుమాన నివృత్తికోసం గాడిదకొక లేఖ రాశాడు. 'స్వల్ప దురంతాలకూ, దారుణ దురంతాలకూ అనుమతి లేదు. కాబట్టి నేను మధ్యరకం దురంతాలు చేయవచ్చునా?' అని అడిగాడు. దానికి గాడిద డొంకతిరుగుడు సమాధానం ఇచ్చింది. 'ఇందుకు సంబంధించిన అన్ని ఆదేశాలూ అటవీ శాసనంలో వున్నాయి' అని.

భల్లూక దేవర అటవీ శాసనం పరిశీలించాడు. అందులో ఊహకందే ప్రతి విషయం మీదా నియమ నిబంధనలు వున్నాయి. బొచ్చు పన్నులు, కాయాకసురూ సుంకాలు, కట్టె పుల్లల శిస్తులు. కానీ దురంతాల విషయంలో మాత్రం చట్టం మూగవోయింది. దానిమీద గాడిదకు తిరిగి రాయగా అన్నిటికీ 'తగు విధంగా నడుచుకో' అని అంటీ ముట్టని జవాబు వచ్చింది.

'ఆహా ఏమిటి దారి? పెద్ద పదవిమాత్రం ఇస్తారూ? ఆ పదవికి ఆలంబనగా వున్న దురంతాల విషయంలో మాత్రం పల్లెత్తి పలకరూ?' అని గొణుక్కున్నాడు ముమ్మడి భల్లూక దేవర.

వెళ్లనా? మాననా? అని మళ్లీ తటపటాయించాడు. ఖజానాలో ఆయన ఖాతాకు జమ అయ్యే కొల్లలు కొల్లలు డబ్బు జ్ఞాపకం రాకపోతే అసలు వెళ్లి వుండేవాడేకాదు.

భల్లూక దేవర రాయలు తన స్వంతకాళ్లమీదే నడుస్తూ అడవి చేరుకున్నాడు అతి నిరాడంబరంగా. అధికార సన్మానాలు ఏర్పాటు చేయలేదు. నివేదికలు సమర్పించేందుకు నియమిత కాలాలు పెట్టలేదు. వెళ్లడం వెళ్లడం తన గుహలోకి వెళ్లి నోట్లో పంజా పెట్టుకుని పడుకున్నాడు. 'ఒక్క కుందేలుని కూడా చీల్చి చెండాడడానికి వీల్లేదు. అలా చేస్తే అది దురంతం అంటారు. అలా అని ఎవరంటారు? గాడిదా? సింహమా? ఎవరైతేనేం ఎవరైనా ఫరవాలేదు. కానీ ఈ అడవిమూక అంటుంది. అదే చిక్కు. పైగా వాళ్ల చరిత్ర ఒకటుంది.. ఛీ చరిత్ర!' అని చరిత్రను చీదరించుకుంటూ చాలాసేపు అలాగే పడివున్నాడు. కానీ కడుపులో దేవురించినట్టు ఇదయ్యాడు. చరిత్ర పేరు చెపితే సింహానికి కూడా హడలేనన్న సంగతి అతడికి తెలియదు. అన్ని బాధ్యతలూ తన నెత్తినే కానీ, కొల్లగొట్టడం మాత్రం వల్లకాదు. ఇలాంటి విడ్డూరం ఎన్నడైనా విన్నామా? ఏ పద్ధతిని అనుసరించినప్పటికీ 'ఆగు.. తప్పుదారిన పడుతున్నావు' అని ఆదిలోనే

అరుస్తారాయె! ఈ రోజుల్లో ప్రతివారికీ హక్కులున్నాయి. కొసకు ఉడతకు కూడా. ఉండేలు ఉండల్లా గింజలను ఊదే హక్కుంది దానికి. హక్కులన్నీ వాళ్లవి. బాధ్యతలు తనవి. ఆహాహా ఎంత వింత వ్యవహారం! ఉన్న విధులు కూడా నామమాత్రమే. అలగా సరుకంతా ఒకరినొకరు తిట్టుకుంటారు. తాను మాత్రం ఒక్క కుందేలుని కూడా డొక్కచించడానికి వీల్లేదు. దీనికంతటికీ కారణం అదుగో ఆ గాడిద. దాని కుతర్కం, కూహకం. అసలా గాడిదకు అద్భుతమైన ఆ కాళ్లెవడిచ్చాడు? దౌడు తీయడానికి అనుమతి ఎవడిచ్చాడు? హక్కుల సంగతి అటుంచి ముందు ఈ విషయం ఆలోచించాలి. తగు విధంగా నడుచుకోవాలిట! ఛీ!

చాలా సేపటివరకూ ఇలాగే గోళ్లు కొరుక్కుంటూ ఆలోచించాడు భల్లూకదేవర. తన గవర్నరుగిరీ మొదలుపెట్టను కూడా లేదు. అడివిలో అన్నింటికన్నా ఎత్తయిన చెట్టెక్కి బలంకొద్దీ బొబ్బరిస్తూ తన ఉనికి 'తగు విధంగా' చాటడానికి ఒకసారి ప్రయత్నించిన మాట నిజమే. కానీ దానివల్ల కూడా లాభం కలగలేదు. అడివిలోని పోకిరీ మూకకు దురంతాల సంగతి చాలా కాలంగా తెలియదు. వాళ్లు దేన్నీ లెక్కచేయరు. వాళ్ల పెంపకం అలాంటిది. ఆ బొబ్బరింత విని వారన్న మాటేమిటో తెలుసునా? 'భల్లూకదేవర బొబ్బలు విన్నారా? బహుశా నిద్రలో పంజా కొరుక్కుని వుంటాడు!' అని. ఇంతకు మించిన ఫలితాలు లేకపోవడం చూసి భల్లూక దేవర గుహకు తిరిగివచ్చారు.

అయితే మేం ఇంతకుముందే చెప్పినట్టు ముమ్మిడి భల్లూకదేవర చాలా ఘటికుడు. ఏదో అర్థంలేని బకీర్లు పంపడంకోసం తన గుహకు తిరిగిరాలేదు. అతడేదో వ్యూహం పన్నుతాడు.

నిజంగానే ఒక ఎత్తు ఎత్తాడు.

అతడలా గుహలో పడుకొని వుండగా అడవిలో వ్యవహారాలన్నీ యథాప్రకారం సాగిపోయాయి. వ్యవహారాలు ఇలాగనే వుంటే దీన్ని శ్రేయోరాజ్యమని పిలవడం ఉచితంకాదు. ఇంతకీ గవర్నరు పని ఏదో ఆదర్శరాజ్యాన్ని నెలకొల్పడం కాదు. తరతరాలుగా వస్తున్న పవిత్ర వ్యవస్థను రక్షించడం అతడి విధి. ఆ వ్యవస్థలో లోపాలుండుగాక! దానితో అతడికి నిమిత్తం లేదు. ఈ విధి నిర్వహణతో పెద్దాచిన్నా దురంతాలకు నిమిత్తం లేదు. 'సహజమైన' దురంతాలతోనే అతడు సంతృప్తిపడాలి. తోడేళ్లు కుందేళ్లను చీల్చుకు తినాలనీ, గద్దలూ గూబలూ కాకుల్ని పొడుచుకు తినాలనీ ప్రాచీన సంప్రదాయం విధిస్తూ వుంటే.. అది శ్రేయోరాజ్యానికి భిన్నమైనదైనప్పటికీ అదీ ఒక వ్యవస్థే కాబట్టి దాన్ని మన్నించాలి. గౌరవించాలి. అయినప్పటికీ కాకులూ కుందేళ్లు ఫిర్యాదులు చేయకపోవడంవల్లా, నిరంతరం సంతానాభివృద్ధిని చేసుకుంటూ వుండడంవల్లా సదరు వ్యవస్థ దాని పరిమితులను ఉల్లంఘించడంలేదని స్పష్టమవుతుంది.

కాబట్టి ఈ 'సహజ దురంతాలు' సరిపోవా?

ప్రస్తుతం అడివిలో అంతా అనుకున్నట్టే జరిగిపోతోంది. అడివి సంప్రదాయాలు ఒక్కసారి కూడా విచ్ఛిత్తి కాలేదు. రేయింబవళ్లు అడివిలో కోటానుకోట్ల గొంతులు ప్రతిధ్వనించుతున్నాయి. కొన్ని బాధతో మూలుగుతూ వుంటే మరికొన్ని విజయగర్వంతో వికటహాసం చేస్తున్నాయి. ఆ బాహిరరూపం, ఆ శబ్దాలు, ఆ వెలుగు, ఆ నీడలు, ఆ ప్రాణికోటి అంతా ఘనీభవించినట్టు, చలనం లేనట్టు కనిపించింది. లోతుగా పాతుకొనిపోయిన ఈ వ్యవస్థను చూస్తే చాలును ఎంత ముష్కర గవర్నరయినా దురంతాలతో కీర్తినార్జించగలనన్న ఆశ కలలో కూడా పెట్టుకోడు. అలాంటప్పుడు ఇంక 'దేవరవారి స్వంత పూచీమీద' జరిగేవాటికి ఆస్కారం ఎక్కడిది?

ఇలాగ శ్రేయోరాజ్యాన్ని గురించి ఒక పెద్ద సిద్ధాంతం ముమ్మడి భల్లూక దేవరవారికి మనోనేత్రాల ముందు గోచరించింది. ఒకప్పుడు గాడిద ఇష్టాగోష్టిగా తనతో అన్న మాటలు ఇపుడు జ్ఞాపకం వచ్చాయి.

'ఇదుగో ఈ దురంతాల వ్యవహారాలడిగి నన్నెందుకు చంపుతావు? వర్ణాశ్రమాచార ధర్మాలను ఉన్నవాటినున్నట్టు వుండనీ అనేది రాజ్యతంత్రంలో ప్రధాన సూత్రం. తేటతెలుగు మాటల్లో చెప్పాలంటే ఒక మూర్ఖుడింకో మూర్ఖునిపై సవారి చేస్తాడు. మూడో మూర్ఖుడు కొరడా అవుతాడు. తెలిసిందా నేస్తం? దురంతాలు వాటంతట అవే సంభవిస్తాయి అన్న సూత్రానికి నువ్వు కట్టుబడి వున్నావా.. అంతా సవ్యంగా నడిచిపోతుంది' అని గాడిద చెప్పింది.

అచ్చం గాడిద చెప్పినట్టే ఇప్పుడంతా నడుస్తోంది. ఎవరైనా చేయవలసింది తీరిగ్గా కూర్చుని ఒక మూర్ఖుడు ఇంకొక మూర్ఖుడిపై స్వారీ చేసి మూడవ మూర్ఖుడితో తోలుతూ వుంటే చూసి ఆనందించడం. మిగతా వ్యవహారాలన్నీ సజావుగా సాగిపోతాయి.

'అసలింతకీ గవర్నర్లను ఎందుకు నియమిస్తారో అర్థంకావడం లేదు...' ఇలా ఆలోచన సగం సాగేసరికి తన పెద్ద జీతం సంగతి జ్ఞాపకం వచ్చింది. వెంటనే తన 'అల్లరి చిల్లరి' ఆలోచనలను అణచిపారేశాడు. అంతా సజావుగానే సాగిపోతుందనుకొన్నాడు.

అలా అనుకొని, జీతం తీసుకోవడానికి తప్ప తన గుహ దాటి రాకూడదు అని నిశ్చయించుకున్నాడు. అప్పటినుంచీ అడవిలో వ్యవహారాలన్నీ సజావుగా సాగిపోతున్నాయి. భల్లూకదేవర నిద్రపోయాడు. జనం పందులు, కోళ్లు, తేనె, కాపుసారా, కానుకలు తెచ్చి గుహముందు రాసులు పోశారు. నిర్ణీత సమయంలో భల్లూకదేవర మేల్కొని గుహ వెలుపలికి పాకి అన్నింటినీ ఆరగించాడు.

భల్లూకదేవర అలాగ ఆ గుహలో అనేక సంవత్సరాలు గడిపాడు. అప్పటినుంచీ ఆటవిక జీవితానికి ఎట్టి అడ్డంకులూ సంభవించలేదు. 'సహజ' దురంతాలు తప్ప

మరెలాంటి దురంతాలూ జరగలేదు. భల్లూకదేవర వారిని సింహ సార్వభౌములు మరిచిపోలేదు. తొలుత ఆయనకు లెఫ్టినెంట్ కల్నల్ హోదా ప్రసాదించారు. ఆ తర్వాత కల్నల్ హోదా. కొసకు....

కానీ, భల్లూకదేవర వారికి ఆనందదాయకమైన ఈ దశలో వేటగాళ్లు వచ్చి, ఆయనను గుహలోంచి బైటికి ఈడ్చారు. మొత్తం బొచ్చుగల అన్ని జంతువులకు పట్టినగతే ఆయనకు కూడా పట్టింది.



పేద రైతు విందు



ఒకప్పుడు ఇద్దరు పెద్ద అధికార్లు వుండేవారు. ఉత్త బడుద్ధాయిలే అనుకోండి– వాళ్లు ఓ రోజు తెల్లారేసరికి నరసంచారంలేని ఒకానొక దీవిలో పడ్డారు.

వాళ్లు ఇన్నాళ్లూ జనన మరణాల పట్టీలు తయారుచేసే కచేరీలోనే బతుకు వెళ్లమార్చారు. ఆ కచేరీలోనే పుట్టారు. పెరిగారు. ముసలి వాళ్లయ్యారు. అంచేతనే బయటి విషయాలు ఏవీ వాళ్ల బుర్రలకు పట్టలేదంటే వింతకాదు. వాళ్లకు తెలిసిన మాటా, అనే మాటా ఒకటే... 'ఆ.. మీ దరఖాస్తు మంజూరు'.. ఇదే!

ఇటీవల ఆ కచేరీ ఉత్త దండగమారిదై రద్దు అయింది. దాంతో మన అధికార్ల ఉద్యోగాలూ ఊడిపోయాయి. తమకు రావలసిన పింఛన్లు చేతబట్టుకొని సెంట్ పీటర్సుబర్గ్‌లో చెరోచోట మకాం పెట్టారు. ఆ తర్వాత, ఇంతకు ముందు చెప్పినట్టు.. హటాత్తుగా వాళ్లిద్దరూ నర సంచారంలేని దీవిలో పడ్డారు. ఎండపొడ తగిలేసరికి లేచారు. తీరా లేచి చూసేసరికి ఇద్దరూ ఒకే గొంగళికింద వున్నామని గుర్తించారు. వాళ్ల ఆశ్చర్యానికి అంతులేదు. ఏం జరిగిందో ఏమో వాళ్లకేమీ అంతుబట్టకపోయినా, మామూలు ధోరణిలోనే బాతాఖానీ సాగించారు.

'హరి భగవంతుడా! చూశారూ దొరగారూ! నేను నరసంచారంలేని దీవిలో పడ్డానని చిత్రమైన కలగన్నాను' ఈ మాటలంటూనే ఎగిరి గంతేశాడు. రెండో దొరవారున్నూ అలాగే ఎగిరి గంతేశాడు.

'ఓరి దేవుడా! ఇంతకీ మనం ఎక్కడున్నట్టు?' భయంతో ఆవలించారు ఇద్దరూ. ఒకర్నొకరు గిల్లి చూసుకుని ఇద్దరూ 'ఇది కలకాదు' అని తేల్చారు. 'ఇది కేవలం కల' అని భ్రమించాలని ఎంతగానో ప్రయత్నించారు. కానీ కొట్టొచ్చినట్టు కళ్లకి దీవి కనిపిస్తుంటే నమ్మకుండా ఎలా వుంటారు? ఇటు చూస్తే నురగలు కక్కే సముద్రం. తామున్న ఆ కొంచెం నేల మినహాయిస్తే అటు, ఇటు మహాసాగరం కనిపిస్తోంది.

కచేరి వదిలాక మళ్లా ఇన్నాళ్లకు తొలిసారి మన పెద్ద అధికార్లు కన్నీళ్లు పెట్టారు. ఒకర్నొకరు నఖశిఖపర్యంతం చూసుకున్నారు. ఇద్దరూ రాత్రి దుస్తుల్లోనే వున్నారు. ఇద్దరి మెడల్లో పతకాలు వేలాడుతున్నాయి.

'కాఫీ తాగాలన్నా మన దగ్గరేముంది?' అంటూ, అనుకుంటూ స్థితిగతులు మరోసారి గుర్తుకొచ్చి బావురుమన్నాడు.

'ఇప్పుడేం చేద్దాం మరి? అర్జంటు రిపోర్టు రాసి పంపినా లాభం లేదు కదా!' ఏడుపు గొంతుతో అన్నాడు.

రెండో అతను అన్నాడు.. 'దొరవారూ! తమరు ఇలా తూర్పుగా వెళ్లండి. నేను ఇలా పడమరకి వెళతాను. ఉభయులం సంజెవేళకి ఇక్కడికే చేరుకొందాం. ఏదో ఇంత తిండీ గిండీ దొరక్కపోతుందా చూద్దాం.'

వాళ్లిద్దరూ ఆ తర్వాత తూర్పూ పడమరలను కనుక్కోడానికి నానా తిప్పలు పడ్డారు. ఉహూ.. అంతు దొరికితే ఒట్టు!

"ఇదిగో! తూర్పు తెలుసుకోవాలంటే నువ్వు ఉత్తరానికి ముఖం పెట్టి నుంచో! నీ కుడి చేతివైపే తూర్పు దిక్కు" అని పై అధికారి ఒకానొక సందర్భంలో చెప్పిన మాట సదరు దొరల్లో ఒకరికి జ్ఞాపకం వచ్చింది. సరే, ఆ ఉత్తర దిక్కు ఎటు వుందో ఇద్దరూ వెదికారు. ఇటు కాదని అటు, అటు కాదని ఇటు ఎనిమిది దిక్కులూ వెదికారు. అయితే వాళ్ల బతుకంతా కచేరీ గోడల నడుమ పుస్తకాల బొత్తుల్లోనే గడిచిపోవడం చేత దిక్కే తోచలేదు మరి!

ఆఖరికి రెండో దొర..' చూడండి దొరగారూ! మీరు ఇక్కడినుంచి ఎడమవైపు వెళ్లండి. నేను కుడివైపు వెళతాను. ఇదే మిగిలిన పద్ధతి' అని చెప్పాడు.

ఈ రెండో దొర కొంచెం చురుగ్గా వుండడానికి కారణం వుంది. జనన మరణాల కచేరీలో పనిచేస్తూనే ఈయన ఒక అనాథ బాలల పాఠశాలలో పిల్లలకి అక్షరాలు నేర్పాడు కొన్నాళ్లు. ఆ కాస్త అనుభవం మూలాన మొదటి దొరకంటే ఈయన కొంచెం

మెరుగు.

ఇలా అనుకోవడంతో, చెరోవైపుకి సాగిపోయారు. కుడివైపుకి వెళ్లిన అధికారికి ఓచోట పొడుగ్గా నిటారుగా పెరిగిన చెట్లు కనిపించాయి. ఓ పండు కోసుకు తిందామనుకున్నాడు. కానీ కొమ్మలు చాలా ఎత్తున వున్నాయి. పండు అందదు. ఎలాగ? చెట్టెక్కి కోసుకుందామని ప్రయత్నించాడు. ఫలితం, చొక్కా చినిగిపోయిందంతే! సరే, ఇది లాభం లేదని ముందుకు సాగిపోయాడు. అల్లంత దూరాన కొండవాగు కనిపించింది. చిన్న చేపలు బిలబిలలాడుతున్నాయి. 'ఆహా! ఏం చేపలు! ఇవి నా బసలోనే వుంటేనా?' అయ్యవారికి నోరూరింది. మళ్లా ముందుకు సాగి అడవిలోకి వెళ్లాడు. అక్కడ పౌజులు, గువ్వలు, కుందేళ్లూ కోకొల్లలుగా కనిపించాయి.

'ఏం వాటంగా వున్నాయబ్బా పిట్టలు' కడుపు నకనకలాడుతుంటే కాసేపు గొణుక్కున్నాడు. ఏం లాభం? ఉత్త చేతుల్తోనే అక్కడినుంచి వెనక్కి తిరిగాడు. అనుకున్న చోటికి వచ్చాడు. అంతకు ముందే మొదటిదొర అక్కడకు చేరుకున్నాడు.

'ఏమండీ దొరగారూ తమరికేమైనా కలిసి వచ్చిందా?' అనడిగాడు.

'ఉహూ! పిసరు కూడా దొరకలేదు. ఒక్క మాస్కో దండకవిలె పత్రిక పాత కాపీ మాత్రం దొరికింది'

ఇద్దరూ నడుం వాల్చారు. కానీ ఆకలిమంట ఆగుతుందా? బుర్రలు వేడెక్కిపోయాయి. మనస్సు పరిపరి విధాల పోయింది. 'తమకు రావలసిన పింఛను డబ్బు ఎవరు తెస్తారు?' ఇదో ఆలోచన! ఇంతకు ముందే చూసిన చేపలు, పిట్టలు గుర్తుకు వచ్చాయి.

'చూశారూ దొరగారూ! మనుషులకి కావలసిన ఈ తిండి – రెక్కలు విప్పుకుని ఆకాశంలో ఎగురుతుందని, నీళ్లలో ఈదుతుందని, చిటారు కొమ్మని వేలాడుతుందనీ ఎవరనుకున్నారండీ' అన్నాడు ఒకతను.

'నిజం దొరగారూ! చెప్పొద్దూ నేననుకున్నది ఏమంటే మనం తినే కైమాలు, లడ్లూ ఇవన్నీ చెట్లే కాస్తున్నాయని ఇన్నాళ్లూ నా నమ్మకం'

'చూశారూ! మరోమాట! కాస్త మాంసం పులుసు కావాలంటే ముందస్తుగా వలవేసి పట్టాలన్నమాట? ఆ పట్టినదాన్ని కోయాలన్నమాట? చర్మం ఒలవాలన్న మాట! మసాలా గిసాలా పట్టించి తీరిగ్గా వండాలన్నమాట! అప్పుడా... అబ్బబ్బ! ఇంత కాండ ఒక్క మనిషివల్ల ఎలా అవుతుందండీ!'

'మాటలటండీ మరి? ఎలా అవుతుంది?'

ఆ తర్వాత ఇద్దరూ మౌనంగా కునుకు తీద్దామని చూశారు. కానీ ఆకలి వేయి నోళ్లు తెరిచి హాహాకారాలు చేసింది. దోరగా వేగిన మాంసం వేపుళ్లు, కమ్మటి చేపల పులుసు, నోరూరించే కైమా వుండలు, ఘుమఘుమలాడే వంటకాలు వాళ్ల కళ్ల ముందు

దొంతర్లు దొంతర్లుగా కనిపించాయి.

'చూశారూ! ఈ పళాన మన చెప్పు తోళ్లే తినబుద్ధేస్తోందనుకోండి!'

'నిజం కాదటండీ! చూశారూ! చేతి తొడుగులు.. చినుగు పట్టినవైనాసరే తినడానికి సందేహం లేదనిపిస్తోంది'

హటాత్తుగా ఒకర్నొకరు కళ్లార్పకుండా చూశారు. ఆ కళ్లల్లో క్రౌర్యం తాండవిస్తోంది. పళ్లు పటపటలాడించారు. గొంతుల్లో హూంకారాలు పుట్టాయి. ఎలక మీదకి దూకే గండుపిల్లిలాగా ఇద్దరూ ఒకరిమీదకి ఒకరు దూకి రక్కుకున్నారు. ఒంటిమీది బట్టలు చిరిగి పీలికలై గాలిలో తేలిపోయాయి. హూంకారాలు మిన్నుముట్టాయి. రెండో దొర మొదటి అధికారిని కొరికాడు. మెళ్లో పతకం పెరికి మింగేశాడు. ఈ సంకుల సమరం ఒకరికొకరికి నెత్తురు కళ్లబడేసరికి చప్పగా ఆగిపోయింది. 'ఇలా అయితే ఒకరినొకరు నమిలి మింగేస్తాం' అని ఇద్దరూ ఒకేసారి అనుకున్నారు.

'చూశారూ! ఇంతకీ మనం ఇక్కడికి ఎలా వచ్చామో కదా! మనల్ని ఇలా నెట్టిన ఆ పిశాచపు వెధవ ఎవడో కదా!'

'దొరగారూ! మనం బాతాఖానీలో పడకపోతే మాత్రం ఇక్కడ హత్యలూ, ఖూనీలు జరిగిపోతాయి. సందేహంలేదు సుమండీ!'

'అయితే, తమరే సంభాషణ ప్రారంభించండి'

'అలాగే! చూశారు దొరగారూ! ఈ సూర్యుడున్నాడే మొదట ఉదయిస్తున్నాడు. తర్వాత అస్తమిస్తున్నాడు. ఇలా వరసవారీగానే ఎందుకు జరుగుతోంది? మొదటే అస్తమించి తర్వాత ఎందుకు ఉదయించడో? ఈ విషయంలో తమ అమూల్యాభిప్రాయాన్ని విశదీకరించ కోరతాను'

'తమ ప్రశ్న ఉత్త చెత్త దొరగారూ! తమరు పొద్దున్నే లేచి కచేరీకి వెళ్లి పనిచూసుకుని తర్వాత కదా పడుకుంటున్నారు. అలాగే ఇదీ'

'ఔనూ! ఇలాగే ఎందుకు జరగాలీ అంట! ముందే చక్కా పడుకొని హాయిగా కలల్లో తేలి, ఆ తర్వాతనే లేవకూడదా అని నా ప్రశ్న!'

'ఆ.. ఊ.. ఆ.. ఆ.. కచేరీలో పనిచేసేటప్పుడు నా అనుభవాలూ, జ్ఞాపకాలూ ఏమంటే.. ఇప్పుడు తెల్లారింది, పొద్దెక్కుతోంది, ఇప్పుడు భోజనం వస్తుంది, ఆ తర్వాత పడక.. ఇలాగ ఒక క్రమం వుండేది'

'భోజనం' మాట మళ్లా వినిపించడంతో వాళ్ల మొహాలు ఎండిన ఖర్జూరాల్లాగా ముడుచుకుపోయాయి. మాటలు ఆగిపోయాయి.

కాసేపటికి తమాయించుకున్నారు.

'చూశారూ ఓసారి ఓ డాక్టర్ ఏమన్నాడంటే మనిషి తన ఒంటిలోపలి రసగ్రంధుల్నే

జీర్ణించుకుని చాలా కాలం బ్రతకవచ్చు అని. నాకిప్పుడు గుర్తుకొచ్చింది'

'ఎలా? ఎలా? మళ్లా చెప్పండి'

'ఈ రసగ్రంధులు మరికొన్ని రసాల్ని ఉత్పత్తి చేస్తాయనిన్నీ, అవి మరిన్ని కొత్త రసాల్ని తయారు చేస్తాయనిన్నీ, ఇలా నీరసం వచ్చేవరకూ ఈ రసోత్పత్తి జరుగుతుంటుందనే నా ఉద్దేశం'

'ఆ తర్వాత?'

' ఆ తర్వాత జరిగేదేముంటుందండీ? కడుపారా ఆరగించడమే తరువాయి!'

'దొం...'

ఇలా వాళ్లు ఏ విషయాన్ని ఎత్తుకున్నా అది కాస్తా తిండి గొడవలోకి దిగిపోతోంది. తిండిమాట వచ్చేసరికల్లా ఆకలిమంట నాలుకలు సాచి రేగుతోంది. దాంతో మాట్లాడకూడదని నిర్ణయానికి వచ్చేశారు వాళ్లిదరూ.

మాస్కో దండకవిలె పత్రిక సంగతి జ్ఞాపకం వచ్చింది. ఆ పత్రికను తెరిచి ఒకతను ఇంచుమించు వణుకుతో చదివాడు. అతను చదివింది ఇదీ!

"నిన్న సాయంత్రం మహా ఘనత వహించిన గవర్నరు సర్కారువారు మహా గొప్ప విందు చేశారు. ఆ విందులో నూరు మందికి పైగా పురప్రముఖులూ, అతిధులూ పాల్గొన్నారు. ఆ విందులో ఎన్నడూ ఎవరూ ఎరగని వంటకాలను వడ్డించారు. ఆ వంటకాల రుచి ఇంతింతని చెప్పడానికి ఎవరిచేతా కాదని అభిజ్ఞులు అన్నారు. ఈ ఘనమైన విందులో ఛప్పన్న దేశాల రకరకాలయిన వంటకాలన్నీ ఆశ్చర్యాన్ని కలిగించాయి. తూర్పు ప్రాంతపు పౌజు మాంసంతో పాటు ఎక్కడిదో ఉత్తరాది పిట్టమాంసం వడ్డించారు. అన్నిటికన్నా మించి ఫిబ్రవరిలో ఎక్కడా దొరకని బెర్రీపళ్లు కూడా వడ్డించారు. ఎంత అద్భుతం?"

'తమకు పుణ్యం వుంటుంది. దొరగారూ? ఆ పత్రికలో ఈ విందు గొడవతప్ప చదవడానికి మరే వార్తా దొరకలేదా?' అని అరుస్తూ ఆ పత్రిక లాగేసి తను చదివాడు.

ఆయన చదివింది ఇదీ!

"తులా నుంచి మా ప్రత్యేక విలేఖరి పంపిన ప్రత్యేక వార్త ఇది. యూపా నదిలో నిన్న సాయంత్రం పెద్ద చేపని పట్టుకొన్నందుకు స్థానిక క్లబ్బువారిచే పెద్ద ఉత్సవం జరుపబడింది. (గత ఎనభై, తొంభై ఏళ్లలో ఇలాంటి చేప లభించలేదని అక్కడి వయోవృద్ధులు సైతం చెబుతున్నారు. ఇప్పుడు లభించిన ఈ మత్స్యరాజం ఫలానా పోలీసు ఇనస్పెక్టర్, సి.గారు అని గుర్తించబడింది.) ఆనాటి ఈ కథానాయకుడిని విశాలమైన తక్తాబల్ల మీద వుంచడం జరిగింది. కాగా, పొదీనా, కరివేపాకు ఇత్యాది పాక పరివారాలను ఆ కథానాయకుడి నోట్లో కుక్కారు. చుట్టూ తాజా దోస చెక్కలను

పేర్చడం జరిగింది. ఈ మహోత్సవకర్తలు అయిన స్థానిక డాక్టర్ పి.గారు సదస్యులందరికీ వలపక్షం లేకుండా సరిసమానంగా పంపిణీలు చేయడంతో ఈ ఉత్సవం తాలూకు గొప్పదనం మరింత వెల్లడయింది. అందరికీ అన్ని విధాల నచ్చేలాగ వడ్డన జరగడంతో ఈ ఉత్సవం జయప్రదంగా ముగిసింది'

'క్షమించాలి. తమరు కూడా మళ్లా ఆ వార్తల్నే వల్లిస్తున్నారు సుమీ!' అంటూ ఆ పత్రికను తను లాక్కుని చదివాడు.

అతగాడు చదివిన వార్త ఇలా వుంది.

"ఇప్పుడే వోడ్కా నగరంనుంచి మా విలేఖరి ఒక శతవృద్ధు చేపల పులుసుని సరికొత్తగా తయారుచేయడంలో కొత్త పద్ధతిని కనిపెట్టి పాకశాస్త్రంలో అద్భుత విజయాన్ని సాధించారు అని తెలియజేస్తున్నాడు. ఆ చేపలపులుసు తయారీ పద్ధతి ఇది: చక్కగా బతికివున్న సందువా చేపని తెచ్చి దగ్గర పెట్టుకుని, మొదట దాన్ని బహుమెత్తగా మర్దించాలి. ఆ మర్దనకు ఆ చేప కార్జం ఉబ్బుతుంది. సరిగ్గా ఆ సమయంలో..."

మళ్లా ఇద్దరూ తలలు వేలాడేశారు. వాళ్ల కంటికి ఏది కనిపించినా అది తిండికి సంబంధించిందిగానే వుంది. తమ ఆలోచనలే తమ మీద కుట్ర పన్నినట్టు తోస్తోంది. మొఖంమీద ముసురుకుంటున్న మాంసపు వేపుళ్లనీ, వాటి ఘుమఘుమల్నీ ఎంత తుడిచేద్దామన్నా వాళ్ల వల్ల కాలేదు.

ఇంతలో రెండో అతని బుర్రలో ఓ ఆలోచన తటాలున మెరిసింది.

'చూడండి దొరగారూ! ఓ మాట చెబుతాను. మనం ఇక్కడ ఓ పల్లెటూరి బైతుని పడితే ఎలా వుంటుందంటారు?' తన ఆలోచనకి తనే మురిసిపోతూ అన్నాడు.

'పల్లెటూరి బైతా? తమ ఉద్దేశం ఏమిటో వివరించండి'

'ఏముందండీ! మామూలు పల్లెటూరి బైతే! రోజూ మనకనిపించేవాళ్లే! చులాగ్గా చేపల్ని పడతాడు. పిట్టల్ని కొడతాడు. చిటికెలో వండివారుస్తాడు'

'ఉహూ! ఆ బైతు అనేవాడు మనకెక్కడ దొరుకుతాడంటారూ? ఇక్కడెక్కడా వాడి పొడకూడా కనిపించడంలేదే?'

'తమరలా అంటే ఎలాగ? ఈ బైతులనేవాళ్లు కోట్లమంది దొరుకుతారు. మనం చేయవలసిందల్లా కొంచెం వెతికి చూడ్డమే మరి! పనిపాటలు ఎగ్గొట్టిన వాడెవడో ఒకడు ఈ ప్రాంతంలోనే దొరుకుతాడు'

ఈ ఆలోచన తట్టడంతో ఇద్దరికీ ఆనందం పొంగిపొర్లింది. ఎగిరిగంతేసి ఆ 'బైతు'ని వెదకడానికి బయల్దేరారు.

చాలాసేపు ఉభయులూ తిరిగారు. ఆ మూలనించి ఈ మూలదాకా వెతికారు. ఆఖరికి వాళ్లిద్దరికీ ఓ పక్కనుంచి చెమటతో తడిసిన కావిబట్టల కంపూ, కారం మెతుకుల



ఘాటూ తగిలింది. దాన్నే ఎగబీలుస్తూ వారిద్దరూ ఆ వైపుకి సాగారు.

అల్లంతదూరాన ఓ చెట్టు మొదట్లో ఓ రైతు వెల్లకిలా పడుకుని వున్నాడు. మాంచి ఒడ్డూపొడవూ వున్న రైతు. తలకింద చేయి పెట్టుకున్నాడు. పొగరుబోతు. పని ఎగ్గొట్టి తీరిగ్గా పడుకున్నాడు. అందుకు సందేహం లేదు.

అతగాడ్ని చూడడంతో ఈ పెద్ద అధికార్లు ఇద్దరికీ మా చెడ్డకోపం ముంచుకొచ్చింది.

'సోమరిపోతు వెధవా!' అంటూ ఇద్దరూ ఆ రైతుమీద పడ్డారు.

'ఇద్దరు పెద్ద అధికార్లం. ఆకలికి నకనకలాడి ఉసూరుమంటూంటే, సోమరిపోతు వెధవా! చీమకుట్టినట్టయినా లేకుండా పడుకుంటావ్రా? లే! తక్షణం పనిలో దిగు!'

ఆ రైతు లేచాడు. ఇదేం తమాషా కాదని రైతుకి తోచింది. వీళ్లెవరో కరాఖండి ఉద్యోగులని తట్టింది. అక్కడినుంచి ఎలాగైనా ఉడాయిద్దామనుకున్నాడు. కానీ వాళ్లిద్దరూ అతన్ని చావుపట్టు పట్టారు. ఇహ లాభంలేదని పనిలోకి దిగాడు.

మొదట ఆ రైతు చెట్లెక్కాడు. చిటారుకొమ్మకి ఎగబాకాడు. బుట్టెడు పళ్లని రాల్చాడు. తనకో వగరు కాయని తుంచుకున్నాడు. దిగివచ్చాడు. ఓ చోట తవ్వి బంగాళా దుంపల్ని బయటికి లాగాడు. తర్వాత రెండు కఱ్ఱముక్కల్ని తెచ్చి రాపాడి నిప్పు రాజేశాడు. తన నెత్తిమీది జుట్టు కాస్త ఊడబెరికి దానితో వల అల్లాడు. వల విసిరి కాసిని చేపలు పట్టాడు. ఆఖరికి అదీ ఇదీ చేర్చి పది రకాలు వండాడు, వార్చాడు.

'పాపం, ఈ సోమరి వెధవకి కాస్త మిగుల్చుదామా?' అనుకున్నారు వాళ్లిద్దరూ. అంత బాగా కుదిరాయి వంటకాలు.

ఆ రైతు పడిన శ్రమ కళ్లారా చూశాక, ఆ అధికార్ల హృదయాల్లో కొంచెం సంతోషం కలిగింది. ఇంతకు ముందు రోజల్లా తాము తిండిగింజ లేకుండా చావుకి తయారైన సంగతి బొత్తిగా వాళ్లకి గుర్తులేకుండా పోయింది. వాళ్లకి ఇప్పుడు ఒక్కటే ఆలోచన. 'పెద్ద తరహా ఉద్యోగం చెయ్యడమే గొప్ప. ఎక్కడికి వెళ్లినా ఢోకా వుండదుకదా!' ఇదీ వాళ్ల ధీమా!

'అయ్యగార్లూ! తమకు నచ్చిందాండీ?' అనడిగాడు ఆ 'సోమరిపోతు' రైతు!

'ఓ, బాగా వుంది. నువ్వు చక్కగా పనిచేస్తున్నావని తెలుస్తోందిగా?'

'కాసేపు నడుం వాల్చుకోమంటారా?' అనడిగాడు రైతు.

'మాకో తాడు పేని ఇచ్చి, ఆ పైన నడుం వాల్చు!' అన్నారిద్దరూ.

రైతు అటూ ఇటూ తిరిగి ఎక్కడో గోగునార సంపాదించుకొచ్చాడు. దాన్ని మెత్తగా నలగ్గొట్టి, చక్కగా చీల్చి, మంచి వడిపెట్టి తాడు పేనాడు. అప్పటికి సాయంత్రం అయింది.

ఆ తాడుని మన అధికార్లు స్వీకరించినవారై, దాంతోనే ఆ రైతుని చెట్టుకి కట్టేశారు. తాము నిద్రపోయే సమయంలో ఎటైనా పారిపోతాడేమోనన్న సందేహంతో!

ఒక రోజు గడిచిపోయింది. ఆ మరో రోజు కూడా గడిచిపోయింది.

వీళ్లకి వంటావార్పు చేసి ఆ రైతు పాకశాస్త్రంలో నిధి అయినట్లే! అరచేతిలో వండి వార్చగల నేర్పు వచ్చింది. కోరిన తిండి తేరగా దొరికేసరికి తెగ తిని ఈ అధికార్లు ఇద్దరూ నున్నగా గుండుల్లా తయారయ్యారు.

'ఇక్కడ మాత్రం మనకేం ఇబ్బంది వున్నది కనక. కోరిందల్లా అమరుతోంది. అక్కడ మన పింఛను పైకం పీటర్స్ బర్గ్‌లో పేరుకొంటోంది'

ఓ రోజున భోజనాలవీ అయ్యాక అధికార్లు ఇద్దరూ బాతాఖానీలో పడ్డారు.

'బాబిల్ గోపురం కథ వుంది చూశారూ. ఆ కథ మీ ఉద్దేశంలో వాస్తవమే అంటారా? కాదంటారా? సెలవీయండి'

'నా దృష్టిలో మాత్రం అది నూటికి నూరుపాళ్లు వాస్తవమనే వుంది. ఆ కథే నిజం కాకపోతే ఈ వందలాది విభిన్న భాషలు ఎలా పుట్టాయంటారు'

'అలాగన్నట్టయితే జలప్రళయం అనేది నిజమై వుండాలన్నమాటేగా?'

'సందేహం ఎందుకు? ఆ జలప్రళయంలో ప్రాణుల్ని రక్షించిన మహర్షుల సంగతి ఏమిటి? అదిన్నీ కాక.. ఈ విషయంలో మాస్కో దండకవిలెలో ఏమని రాశారంటే..'

'అయితే ఇప్పుడే చూద్దాం ఆ పత్రికను!'

వాళ్లిద్దరూ ఆ పాత పత్రిక ఎక్కడుందో వెతికి బయటికి లాగారు. అక్షరం వదలకుండా చదివారు. మాస్కో తులా, పెంజా ర్యాజాన్ మున్నగు నగరాల్లో జరిగిన రకరకాల విందు వార్తలున్నాయి. ఎన్ని విందు వార్తలు చదివినా వాళ్లకి ఇప్పుడు బాధలేదు. వ్యధ లేదు!

✦ ✦ ✦

ఇంతకీ చెప్పొచ్చేదేమిటంటే, కొన్నాళ్లకి ఈ పెద్ద అధికార్లకి ఇంటిమీద బెంగపట్టుకుంది. సెంట్ పీటర్స్ బర్గ్‌లో తమ వంటవాళ్లు మాటిమాటికీ జ్ఞప్తికి వచ్చే వాళ్లు. ఒంటరిగా వున్నప్పుడు తలచుకుని కుమిలేవాళ్లు.

'ఈ వేళప్పుడు సెంట్ పీటర్స్ బర్గ్‌లో వంటవాళ్లు ఏం చేస్తుంటారో కదా?'

'ఆ మాట ఎత్తకండి దొరవారూ! అది తలపుకొస్తే గుండె చెరువు అవుతుంది'

'ఇక్కడ ముచ్చటగా వుంది కానీండి, మందని విడిచి గొర్రె ఒంటరిగా వుండడం మంచీ కాదు, మర్యాదా కాదు. ఇప్పుడు ఒంటిమీదున్న దుస్తుల తీరు చూస్తుంటే ఏడ్పొస్తోంది'

'ఉన్నత తరగతి హోదా దుస్తులు వేసుకోవాల్సిన వాళ్లం. వాటిని చూస్తేనే చాలు కడుపు నిండుతుంది'

ఈ అధికార్లు ఇద్దరూ తమని ఇంటికి చేర్చమని రైతుని వేధించుకుతిన్నారు. నమ్మండి,

నమ్మకపోండి ఆ రైతు ఎప్పుడో ఓసారి సెంట్ పీటర్స్‌బర్గ్ వెళ్లాడట. ఓ చుక్క పుచ్చుకున్నాట్ట కూడా! (అయితే పుచ్చుకున్న చుక్క గొంతులోంచి కాక గడ్డంలోంచే జారిపోయిందని రూఢి అయింది.)

'అలాగా! అయితే మేమూ సెంట్ పీటర్స్‌బర్గ్ నుంచే వచ్చామోయ్' అన్నారిద్దరూ రైతు కథనం విన్నాక.

'చూడండీ, ఎప్పుడైనా గోడలకి సున్నం వేస్తుంటేనో, వెలిశెమీద నించుని మరమ్మతులు చేస్తుంటేనో చూశారా మీరు? అలా చూసివుంటే ఆ పనులు చేస్తున్న మనిషిని నేనే సుమండీ' అన్నాడు రైతు.

ఆ తర్వాత ఆ రైతు తనవంటి నిరుపేద చేసిన సేవల్ని స్వీకరించినందుకు, మన్నించినందుకు కృతజ్ఞత తెలియజేద్దామని ప్రయత్నించాడు. కాని తగిన మాటలు తోచనేలేదు.

ఉద్యోగులిద్దరి నిమిత్తం రైతు ఓ డింగీని తయారుచేశాడు. నిజానికది గొప్పదేమీ కాదు కానీ, ఎలాగో సముద్రాన్ని దాటించి సెంట్ పీటర్స్‌బర్గ్ చేర్చడానికి పనికొస్తుంది.

'ఒరే బడుద్ధాయి! నట్టేట్లో పుట్టిముంచక. కాస్త గట్టిగానే కట్టు!' అని ఈ ఉన్నతోద్యోగులు అతడ్ని హెచ్చరించారు.

'లేదు దొరగారూ! మీకేం భయంలేదు. ఇంతకు ముందు ఇలాంటి డింగీలు చాలా తయారు చేశాను'

రైతు డింగీని తయారు చేశాడు.

ఈ గొప్ప అధికార్లు ఇద్దరినీ డింగీలో కూచోబెట్టాడు. రైతు తెడ్డుని పట్టాడు. సముద్రాన్ని చీల్చుకుంటూ డింగీ ముందుకు సాగింది.

అలలమీద తేలిపోయేటప్పుడూ, ఉవ్వెత్తుగా తరంగాలు మీదికి దూకినప్పుడూ, చుట్టూ నీలిసంద్రం సుళ్లు తిరిగి కుదిపేసినప్పుడూ అధికార్ల పని భయంతో చచ్చినచావు అయ్యేది. అట్టి సందర్భంలో ఈ అనర్ధకాలన్నిటికీ రైతు 'సోమరితన'మే కారణమన్నట్టుగా రైతుని తెగతిట్టేవారు. ఆ తిట్ల భాషని ఉచ్చరించడానికి, కాగితమ్మీద రాయడానికీ ఎవరి చేతాకాదు. మిన్నువిరిగి వెన్నుమీద పడుతున్నా ఆ రైతు మాత్రం ఈ అధికార్లిద్దరికీ వేళ తప్పకుండా చేపలతో భోజనం తయారుచేసి పెడుతూనే వున్నాడు.

ఇలా డింగీ సాగిసాగి చివరికి సముద్రాన్ని దాటి నీవా రేవులో కాల్వలోకి మళ్లి కొసకి అధికార్ల ఇళ్లముందు ఆగింది.

దొరలు పిత్తబలిసి మళ్లిరావడం చూసి వంటవాళ్లు కళ్లు తేలేశారు.

పెద్ద అధికార్లు తమ బసల్లోకి చేరారు. మొదట ఇంత తినితాగారు. ఆ తర్వాత తమ తమ హెూదాకు సంబంధించిన దుస్తుల్ని వేసుకున్నారు. ఖజానాలకు వెళ్లారు.

తమకు రావలసిన పైకాన్ని వసూలు చేసుకున్నారు. ఆ పైకం ఎంతో ఎవడు లెక్కపెట్టగలడు కనక?

అయితే.. ఇంతకీ వాళ్లు ఆ పల్లెటూరి రైతుని మరచిపోయారని మాత్రం అనుకోవద్దు.

ఆ రైతుని ఆప్యాయంగా పిలిచారు. ఓ ఉగ్గిన్నెడు సారా, ఓ పావలా కాసు చేతిలో పెట్టారు.

'ఒరేయ్! నీ ఇష్టం వచ్చినట్టు మజా చేసుకోవోయ్!' అని అన్నారు అంతులేని దయతో.



వానర మహాశయుడు



ఒకానొక దేశంలో ఒక పెద్దమనిషి వుండేవాడు. విందులూ, విలాసాలూ తప్ప అతడికి ఇంకొక పనిలేదు. ఆయన జమీలో దేనికీ కొరతలేదు. రైతులు, పాడి, పంట, తోటలు, దొడ్లు, ఒకటేమిటి సమస్తం వున్నాయి. పెద్ద మనిషికి బుద్ధి ఒక్కటే తక్కువ. అయినా జమీందార్ల అనుకూల 'వెస్ట్' అనే పత్రికను మాత్రం నిత్యం చదువుతూ వుండేవాడు. నున్నగా తెల్లగా గుమ్మడిపండులాగా కుదిమట్టసంగా వుండేవాడు ఆ పెద్దమనిషి.

ఒక రోజున ఉదయాన్నే దేవుడికి ఒక విన్నపం పంపించుకున్నాడు.

'భగవాన్! మనిషికి కావలసినదంతా నాకు ప్రసాదించావు. హాయిగా తృప్తిగా వుంది. ఒక్క విషయం హృదయశల్యం లాగా బాధిస్తున్నదయ్యా! ఈ రాజ్యంలో రైతులు ఎక్కువైపోయారు. అదొక్కటే నాకు హృదయశల్యం లాగా బాధిస్తున్నది' అని చేతులు జోడించి చెప్పుకున్నాడు.

కానీ ఈ పెద్ద మనిషికి బుద్ధి తక్కువన్న విషయం దేవుడికి తెలుసును. అందుకని అతడి మహజరును ఖాతరు చేయలేదు దేవుడు.

రైతుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతున్నదే కానీ తరగడం లేదు. ఇది చూసిన

పెద్దమనిషికి బెంగపట్టుకుంది. వీరంతా కలిసి నన్నూ, నా జమీనీ కొసకు తినేయరుకదా అని భయపడ్డాడు.

ఏమైనా ఉపాయం కనిపిస్తుందేమోనని 'వెస్ట్' పత్రికను అటూ ఇటూ తిరగేసి చూశాడు. 'నీకు చాతనైనది చేయి' అన్న సలహా తప్ప మరేమీ కనిపించలేదు.

ఇవి చూడ్డానికి మూడే మూడు పదాలు. అయితేనేం ముత్యాల్లాంటి పదాలు అనుకున్నాడు ఆ పెద్ద మనిషి.

అలాగే తనకు చేతనైనదంతా చేశాడు. కఠినమైన నిబంధనలను తయారుచేశాడు. ఏ రైతు కోడి అయినా తన పొలంలో పడితే ఆ నేరానికి అది దొరవారి పులుసులో పడాలి. ఏ రైతయినా చీకటిపడిన తర్వాత అడవిలో కట్టెలు కొట్టుకోవడానికి పోతే ఆ కొట్టిన కట్టెలకు మూడురెట్లు దొరగారి వంటచెరుకు రాసిలో పడాలి. ఆ రైతుకు జరిమానా కూడా విధించాలని మరొక నిబంధన వుంది.

'అసలు నేను వేసే శిక్షలన్నీ ఈ జరిమానాలే' అని దొరగారు ఇరుగుపొరుగువారితో చెబుతూ వుంటాడు. రైతులకు అర్థమయ్యే శిక్ష ఒక్క జరిమానాలేనని అతడి అభిప్రాయం.

దొరగారికి బుద్ధి పూజ్యమైనప్పటికీ ఆయన పెంకెఘటమన్న సంగతిని రైతులు త్వరలోనే గ్రహించారు. ఇటు కదిలితే తప్పు, అటు కదిలితే తప్పు. దొరగారి నిబంధనలను అతిక్రమించకుండా బ్రతకడమే కష్టం అని అందరికీ తోచింది. ఈ పని చేయకూడదు, ఇక్కడ అడుగు పెట్టరాదు, ఇది మీది కాదు అని అన్నీ నిషేధాలే. అలాంటప్పుడు ఎటు మెసిలినా దండన తప్పదు. పశువులు ఏటిలో నీరు తాగితే 'అది నా నీరు' అని అరుస్తాడు. కోడిపిల్ల అటో ఇటో పోతే 'అది నా భూమి' అని నోరు చేసుకుంటాడు. భూమి, నీరు, గాలి అన్నీ ఆయనవే. దీనితో రైతుల బతుకు కటకట అయింది.

పొయ్యి వెలిగించడానికి, కొసకు వాకిలి ఊడ్చుకోవడానికి పూచికపుల్ల కూడా కరువైంది. ఆఖరికి వారంతా కలిసి దేవుడికి ఒక విన్నపం పంపించుకున్నారు.

'ఓయి దేవుడా! మేమూ, మా బిడ్డలూ చావనైనా చస్తాం కానీ, బతుకంతా ఈ యాతనలు భరించలేం తండ్రీ!' అని మొరపెట్టుకున్నారు.

ఆలనాపాలనా లేని ఈ అనాథుల ఆర్తనాదం విని దేవుడి మనసు కరిగింది. దొరగారి జమీలో ఒక్క రైతు కూడా లేకుండా మాయమయ్యారు. వారంతా ఎక్కడికి పోయారో ఎవరికీ తెలియదు. ఒక పెద్ద సుడిగాలి వచ్చి చిట్టూపొట్టూ బట్టపేలికలను తుడిచివేసింది. దొరగారు మెరాబామీదికి వచ్చి ఒకసారి ముకుపుటాలు ఆడించాడు. ఓహో తన జమీ అంతటా గాలి ఎంత పరిశుభ్రంగా వుండాలో అంత పరిశుభ్రంగా వుంది అని సంతోషించాడు. 'ఇక సుకుమార సుందరమైన ఈ నా శరీరం కావలసినంత సుఖం అనుభవిస్తుంది' అనుకున్నాడు.

ఆ రోజునుంచీ కొత్త జీవితం ప్రారంభించాడు. ముందు కులాసాగా, కాలక్షేపానికి దారి ఏమిటా అని ఆలోచించాడు.

"జమీలో ఒక నాటకశాల పెడితే ఎలా వుంటుంది? నిజమే మహానటుడు సాదోవస్కీకి రాస్తాను. 'అబ్బీ వచ్చి నన్నొకసారి కలుసుకో, ఆ గుంటల్ని కూడా వెంటేసుకొని రా' అని రాద్దాం" అనుకున్నాడు.

ఆ పెద్ద మనిషి అనుకున్న ప్రకారం ఉత్తరం రాశాడు. సాదోవస్కీ ఆహ్వానాన్ని అంగీకరించాడు. తన వెంట నటీనట బృందాన్ని కూడా తీసుకుని వచ్చాడు. కానీ తీరా వచ్చి చూస్తే ఇల్లంతా ఖాళీ. తెరలు కట్టడానికి, దింపడానికి ఎవరూ లేరు.

'రైతులందరినీ ఏం చేశారు' అని పెద్దమనిషిని ప్రశ్నించాడు సాదోవస్కీ.

'ఆ! అదా? భగవానుడు నా ప్రార్థన ఆలకించాడు. నా జమీలో ఆ మడ్డిమృగాల పీడ విరగడ చేశాడు'

'మీకు బుద్ధిలేదని చెప్పవలసి వుంటుంది. మీరు మొహం కడుక్కోవాలంటే నీరెవరు తెచ్చిపెడతారు?'

'అసలు నేను మొహం కడిగి ఎన్నాళ్లయిందో ఆ భగవంతుడికే తెలియాలి'

'మొహంమీద పుట్టకొక్కులు పెంచాలనుకొంటున్నట్టుంది' అని సాదోవస్కీ వచ్చిన దారినే తనవారిని తీసుకుని వెళ్లిపోయాడు.

అక్కడికి దగ్గరలోనే నలుగురు పింఛినీ సేనానులున్న సంగతి అప్పుడు దొరగారికి జ్ఞాపకం వచ్చింది. "ఏం? నేనొక్కడినే కూర్చుని పేషెంట్స్ ఆడుకోవడమెందుకు? వాళ్లను కూడా పిలిస్తే దొంగాట వేసుకోవచ్చునుకదా?' అనుకున్నాడు.

అనుకోవడమే తడవుగా ఆహ్వాన పత్రికలు రాసి టపాలో వేశాడు. పింఛను సేనానులు ఒకప్పుడు నిజంగానే సేనా నాయకులుగా వుండేవారు. కానీ వారికిప్పుడు ఆకలెక్కువైంది. అందుకని ఆహ్వానాలందగానే వచ్చి వాలారు. వారు రాగానే దొరగారి జమీలో గాలి చాలా పరిశుభ్రంగా వుండడం చూసి ఆశ్చర్యపోయారు.

'చూశారూ! భగవంతుడు నా ప్రార్థనలు మన్నించి నా జమీలో రైతుల పీడ విరగడ చేశాడు' అని గొప్పగా చెప్పారు దొరగారు.

'ఓహెూ ఎంత సంతోషం! ఇంక మీకా గబ్బిడాయిల వాసన ఏమాత్రమూ వుండదన్నమాట' అన్నారు పింఛను సేనానులు.

'ఇంత పిసరు కూడా' అని జవాబిచ్చారు దొరగారు.

సరే వారంతా కూర్చుని ఒక ఎత్తువేశారు. మరొక ఎత్తు వేశారు. అప్పటికి కొంచెం పానీయం సేవిస్తే బాగుంటుందని పింఛను సేనానులు భావించారు. ఆకలి కళ్లతో అటూఇటూ మిర్రిమిర్రి చూశారు.

'కొద్దిగా ఫలహారం సేవిస్తారా?' అని అడిగాడు పెద్ద మనిషి.

'అందుకు అభ్యంతరమేమిటి?'

పెద్దమనిషి లేచి అల్మారా తీశాడు. అయిదు లడ్డూలు, అయిదు బిస్కట్లు తెచ్చి తలొకటీ ఇచ్చాడు.

'ఏమిటిది?' అన్నారు సేనానులు ఆశ్చర్యపోతూ.

'అయ్యా! సేవించండి!'

'ఛ ఛ ఇదేమిటి? మాకు మాంసం కావాలి'

'క్షమించండి. ఏం చెయ్యను. ఏమీ లేదు. ఆ గబ్బిడాయిగాళ్ల పీడ విరగడైనప్పటినుంచీ పొయ్యి రాజలేదు'

సేనానులు కోపంతో పళ్లు పటపట కొరికారు.

'అయితే నీవు మాత్రం పూటుగా తింటూనే వున్నావు కాదూ?' అన్నారు సేనానులు.

'అప్పుడప్పుడూ అపక్వాహారమే తీసుకుంటున్నాను. ఇంకా కొన్ని బిస్కట్లు వున్నాయిలెండి'

'నీకు బొత్తిగా బుద్ధి లేదు' అని సేనానులు ఆట సగంలో వుండగానే లేచిపోయారు.

'నీకు బుద్ధి లేదు' అన్న మాట దొరగారిమీద పడ్డం ఇది రెండవసారి. ఆయన దాన్ని గురించే ఆలోచిస్తూ వుండగా హటాత్తుగా దృష్టి పేకదస్తా మీద పడింది. అంతటితో ఆలోచనలన్నీ కట్టిపెట్టి 'పేషెంట్స్' ఆటకు ముక్కలు పంచడం ప్రారంభించాడు. 'ఎవరి పద్ధతి సరియైనదో చూపిస్తానుగా వుండండి వుండండి, గట్టితనం అంటే ఏమిటో చూపిస్తాను'

అలాగే 'పేషెంట్స్' ఆడుతూ కూర్చున్నాడు. అలా ఆడుతూనే 'మూడుసార్లు సరీగా ముక్కలు పడితే గెలుపు మనదే' అనుకున్నాడు. సరీగా అనుకున్నట్టే ఆట పడేది. అందుకని పెద్ద మనిషికింక అనుమానాలు మిగల్లేదు.

'అదృష్టం కూడా అలాగే చెబుతున్నప్పుడు నేను కడవరకూ గట్టిగానే నిలబడతాను' అనుకున్నాడు.

'సరే, దొరగారూ ఇక ఆటచాలును కానీ లేవండి!' స్వగతం చెప్పుకుంటూ లేచాడు. అటూ ఇటూ కాస్తసేపు పచారు చేశాడు. మధ్యమధ్య విశ్రాంతికోసం కూర్చుని మళ్లీ లేచి మళ్లీ పచార్లు చేశాడు. ఇంతసేపూ బుర్ర ఆలోచిస్తూనే వుంది. ఇంగ్లాండునుంచి తెప్పించవలసిన ఇంజన్లు ఆలోచనల్లో మెదిలాయి. జమీ అంతటా స్టీమింజన్లు తప్ప ఇంకేమీ వుండకూడదు. ఆ గబ్బిడాయిల పొడకూడా పడకూడదు. ఇదుగో ఆ ఎదురుగానే పెద్ద తోట వేయాలి. అక్కడ బత్తాయి, ఇక్కడ జామ, ఆ ఎడంచేతి వైపున సీమబాదం. ఇక్కడనుంచి తొంగిచూస్తే చాలును ఎదురుగా తోట కనిపిస్తుంది. అందమైన తోట.

అనుకున్న ప్రకారం వరసల్లో వుంటాయి. పళ్లనన్నింటినీ యంత్రాలతో కోయించాలి. చేతులతో పనిలేకుండా నోటి దగ్గరకు కూడా యంత్రాలతోనే తెప్పించాలి. తాను పెంచబోయే పశువుల్ని గురించీ, పాడిని గురించీ కూడా ఊహించాడు. పాలేమిటి సముద్రమే. రేగిపళ్లు ఒక్కొక్కటి అంతంత వుంటుంది. పౌనుకు ఐదుకన్నా ఎక్కువ తూగవు. రాసులు రాసులు అన్నీ మాస్కోలోనే అమ్మకం!

ఆలోచించి ఆలోచించి అలిసిపోగానే అద్దంలో మొహం చూసుకున్నాడు. ఇదేమిటి! మొహంమీద మన్ను అంగుళం మందాన పేరుకుంది! అనుకొని ఒరే సెంకా అని నౌకరును పిలిచాడు దొర. నౌకర్లంతా జమీ విడిచిపెట్టి పోయారన్న విషయం ఒక నిమిషానికి జ్ఞాపకం రాగానే 'సరే సరే.. ఇప్పటికి ఇలా వుండనీ!' అని నిశ్చయానికి వచ్చాడు. 'అదీకాక ఆ మితవాద నాయకులకు చెప్పానుగా గట్టిగా నిలవడం అంటే ఏమిటో, నిలిచి చూపిస్తాను' అని గొణుక్కున్నాడు.

ఈ గొణుగుడుతోనే సాయంత్రం గడిచిపోయింది. నిద్ర వచ్చింది. నిద్రలో ఇంకా చక్కటి కలలు వస్తాయి. తన దృఢదీక్ష సంగతి విన్న గవర్నరు 'ఎవరయ్యా ఈ అద్భుతమైన వ్యక్తి' అని కొత్వాలును అడిగినట్టు కలవస్తుంది.

లేదా తన దృఢదీక్షకు మెచ్చి ఒక మంత్రి పదవిని ప్రసాదించినట్టుగా కలవస్తుంది. మెడనిండా ధగధగ మెరిసిపోయే పతకాలు, 'గట్టిగా వుండాలి, గట్టిగా నిలవాలి' అని తాను అన్ని ప్రాంతాలకూ అందరికీ ఫర్మానాలు పంపినట్టు కల.

అది కాకపోతే, తాను ఏడెన్‌లో వున్నట్టు, ఈవును మెచ్చుకుంటూ టైగ్రెస్ యూఫ్రెటిస్ నదులగట్టున షికారు చేస్తున్నట్టు కల వస్తుంది.

తెల్లవారగానే కలలన్నీ కరిగిపోతాయి. నిద్రమంచం మీదనుంచి లేచి మళ్లీ 'సెంకా' అని అరుస్తాడు. అంతలోనే జ్ఞాపకం వస్తుంది.

'కాలక్షేపం అవడం ఎలాగ?' అని ఒకనాటి ఉదయమే వితర్కంలో పడ్డాడు పెద్దమనిషి.

ఎవరైనా నన్ను చూడ్డానికి వస్తే ఎంత బాగుండును అనుకొన్నాడు. ఈ మాటలు అతడి నోటినుంచి వెలువడ్డాయో లేదో కొత్వాలు అక్కడ స్వయంగా ప్రత్యక్షమయ్యాడు. పెద్దమనిషి సంతోషానికి మేరలేదు. అల్మారా దగ్గరికి పరుగెత్తి ఎలాగైతేనేం రెండు బిస్కట్లు సంపాదించాడు. 'సరే ఇంతటితోనే సరిపెడదాం' అనుకున్నాడు.

కొత్వాలు లోపలికి వచ్చాడు.

'అయ్యా మీ రైతులంతా ఎలా మాయమయ్యారో కాస్త సెలవిస్తారా?'

'అదా! ఏముంది. నా జమీలో ఈ గబ్బిడాయిల పీడ విరగడచేయి ప్రభో అని దేవుడిని ప్రార్థించాను'

'అలాగా? అయితే వారి పన్నులు ఎవరు కట్టాలో తమరెన్నడైనా ఆలోచించారా?'

'పన్నులు! వాళ్ల పన్నులు వాళ్లే కట్టుకుంటారు. అది వారి విధి'

'మీ ప్రార్థనల ఫలితంగా ఆ రైతులంతా చెల్లాచెదురైపోయారు. మరి వాళ్ల దగ్గరనుంచి పన్నులెలా వసూలు చేయడమో సెలవివ్వండి!'

'అదా? అదా? అదేదో నాకు సరిగా తెలియడం లేదు కానీ నేను మాత్రం ఇచ్చేది లేదు'

'పన్నులు లేనిదే ఖజానా అనేది వుండదన్న విషయం దొరగారికి తెలియనిది కాదు. ఉప్పు పన్ను, సారా పన్ను సంగతి వేరే తమకు మనవి చేయవలసింది ఏమున్నది?'

'ఆ పన్నులా? అదైతే మనకభ్యంతరం లేదు. ఒక గ్లాసు ఓడ్కా సేవిస్తారా?'

'ఒక్క క్షణం ఆగండి! తమ మూలంగా అంగడిలో గిద్దెడు గింజలు కానీ, ఇంత మాంసం ముక్కకానీ లేవన్న విషయం తమరెన్నడయినా తెలుసుకున్నారా? దాని అర్థం ఏమిటో తమరు గుర్తించారా?'

'సరే నేను చేయగలిగినదేమిటో చేయడానికి సిద్ధం. ఇవిగో రెండు బిస్కట్లున్నాయి'

'తమరు బుద్ధిలేని పెద్దమనుషులు అనవలసి వస్తోంది' అని కొత్వాలు ఆ ఓడ్కా, బిస్కట్ల వంక కన్నెత్తి అయినా చూడకుండా వెళ్లిపోయాడు.

ఇప్పుడు దొరగారికి నిజంగా విచారం పట్టుకొంది. తనకు బుద్ధిలేదు అన్నమాట ఇప్పటికి మూడుసార్లు చెవినపడింది. ఇది ఆషామాషీ వ్యవహారం కాదు. మూడవసారి ఆ వచ్చినవాడు మొహంమీద ఉమ్మేసి మరీ పోయాడు. నిజంగా తాను బుద్ధిలేని వాడేనా? తన దృఢదీక్షా, గట్టితనం తెలివితక్కువేనా? లేక మతిభ్రమణమా? తన గట్టితనం వల్ల పన్నులన్నీ నిలిచిపోయాయా? అంగట్లో గిద్దెడు గింజలు కూడా లేవా? ఈ మాట నిజమేనా?

అసలా పెద్ద మనిషికి బుద్ధి పూజ్యం అవడంవల్ల మొట్టమొదట ఈ ఆలోచనలన్నీ రాగానే నవ్వుకున్నాడు. కానీ ఆ తర్వాత దీని అర్థమేమిటో తమరు గుర్తించారా అని ఆ కొత్వాలు వేసిన ప్రశ్న జ్ఞాపకం వచ్చింది.

మామూలుగా పచార్లు ప్రారంభించాడు. ఈసారి కాస్త బెంబేలుపడ్డాడు. దీని అర్థం ఏమిటి అన్న విషయాన్ని గురించి దీర్ఘాలోచన సాగుతూనే వుంది. దీని అర్థం ఎక్కడికైనా ప్రవాసం పంపిస్తారనా? సరే ప్రవాసమే కావచ్చును. ఏమైనప్పటికీ నిజమైన గట్టితనం అంటే ఏమిటో ప్రపంచానికి తెలిసివస్తుంది. ఆ గట్టితనాన్ని అంతా వేనోళ్ల పొగిడే అవకాశం వస్తుంది! ఈ మాటలనతడు ప్రకాశంగానే అన్నాడు. బహుశా ఆ ప్రవాసంలో నా రైతులు కనిపిస్తారేమో అని స్వగతంగా అనుకున్నాడు. కొంతసేపు పచార్లు చేశాడు. కూర్చున్నాడు. లేచి మళ్లీ పచార్లు చేశాడు. కనిపించిన ప్రతిదీ 'నువ్వు బుద్ధిలేని

పెద్దమనిషివి' అంటూన్నట్టే అనిపించింది. ఒక ఎలక ఆమూలనుంచి ఈమూలకు పరుగెత్తింది. తాను ఆడిపడేసిన పేకదస్తావేపు వెళ్లింది. పేకముక్కలు జిడ్డుతేరి వున్నాయి. జిడ్డువాసన ఎలక పసికట్టింది.

'షుషు' అని బెదిరించాడు. కానీ చాలా తెలివైనది ఎలక. నౌకరు సెంకా లేకపోతే దొరగారి అంతటి నిరపాయకరమైన వ్యక్తి మరొకరు లేరని దానికి బాగా తెలుసును. నువ్వంటే లెక్క లేదన్నట్టు ఒక్కసారి తోకను కదిపింది. ఆ వెంటనే సోఫాకిందినుంచి తలెత్తి 'చూడవోయ్ బుద్ధిలేని పెద్దమనిషీ! ఇంతటితో అయిందా? నీ బట్టలకు సరిగా జిడ్డుపట్టిన తర్వాత వాటి పనికూడా పట్టిస్తాను' అన్నట్టుగా తలకాయ ఆడించింది.

కొంతకాలానికి తోటలో కాలిబాటలనిండా గడ్డి మొలిచింది. తుప్పలనిండా పాములూ, తేళ్లూ చేరాయి. ఉద్యానవనం అడవి జంతువులకు ఆటకూటమైంది. ఒకనాడు ఇంటి దగ్గరకు ఒక ఎలుగుబంటి కూడా వచ్చింది. నాలిక తడుపుకుంటూ కిటికీలోంచి దొరగారి వైపు కూడా చూసింది.

'సెంకా' అని దొరగారొక గావుకేక పెట్టారు. అంతలోనే అంతా జ్ఞాపకంవచ్చి పెద్దమనిషి గుడ్లలో నీళ్లు తిరిగాయి.

అయితే ఆయన దృఢదీక్ష మాత్రం సడలలేదు. అప్పుడప్పుడు కొంచెం డీలాతనం కనిపించకపోలేదు కానీ మనసు జారుతున్నట్టు అనిపించేసరికి ఆయన 'వెస్ట్' పత్రిక అందుకునేవాడు. వెంటనే గట్టితనం పుంజుకునేవాడు.

'ఛా..ఛా.. నేను వానరుడినై వన్యమృగాలతో కలిసి అడవిలో తిరగనైనా తిరుగుతాను కానీ, రష్యన్ జమీందారు రాజా ఉరుస్ కుబ్బుం కిల్డిబయేవ్ తన సిద్ధాంతాలు విడిచిపెట్టాడు అన్న మాటమాత్రం రానీయను' అనుకున్నాడు.

అలా అనుకోవడమేమిటి, ఆ పెద్దమనిషి అచ్చం వానరుడయ్యాడు. అది చలికాలం. చలి ఎముకలు కొరుకుతోంది. అయినా అతడికి చలి అనిపించలేదు. ఒంటినిండా చమరీ మృగంలాగా రోమాలు పుట్టాయి. గోళ్లు గట్టిపడి నక్కుల్లా తయారయ్యాయి. ముక్కు చీదడం మానేసి చాలాకాలం అయింది. నాలుగు కాళ్లతో నడక ప్రారంభించాడు. నడవడానికి ఇంత చక్కని పద్ధతి వున్న విషయం తనకింతకు ముందెందుకు తట్టలేదు అని ఆశ్చర్యపడ్డాడు. త్వరలోనే శబ్దోచ్ఛారణ శక్తి నశించి ఊళ, బుసలు, మొరుగుడు కలిసిన ఒక రకం అరుపు నేర్చుకున్నాడు. ఇంతకీ అతడికి వున్న కొరత ఒక్కటే.. అది తోక!

ఇంతకు ముందు ఉద్యానవనంలో విహరించినచోట ఇప్పుడు నాలుగు కాళ్లతో పాకుతున్నాడు. పిల్లిలాగ చెట్టు కొమ్మలపైకి ఎగబాకి గుబురు మాటున నక్కినక్కి కూర్చుంటున్నాడు. ఒక కుందేలు పిల్ల వచ్చి కూర్చుని ఏదో ప్రమాదంతో చెవులు

రిక్కించిందనుకోండి. గౌరవనీయులైన ఈ దొరగారు అమాంతం దానిపైకి ఉరుకుతారు. బాణంలాగ దూసుకువెళ్లి తమ ఎరను ఖండఖండాలుగా చీల్చి చెండాడుతారు.

కాలం గడిచినకొలదీ దొరగారు చాలా గట్టిపడ్డారు. ఒకనాడు కిటికీలోంచి చూసి దొరగారిని భయపెట్టిన ఎలుగుబంటితో నెయ్యానికి కబురంపేటంత బలం వచ్చింది దొరగారికి.

'ఇదిగో ఎలుగూ! ఇద్దరం కలిసి వేటాడుదాం. ఏమంటావు?' అని దొరగారంటే..

'నాకేమీ అభ్యంతరం లేదు' అని ఎలుగుబంటు జవాబిచ్చింది.

'కానీ నువ్వు నీ రైతులతో అలా ప్రవర్తించి వుండవలసింది కాదు'

'ఏం ఎందుచేత?'

'మీ పెద్దమనుషులకన్నా ఆ గబ్బిడాయిలే చాలా నయం. నిజం చెప్పాలంటే నీవు ఉత్త బుద్ధిహీనుడివి' అన్నది ఎలుగుబంటి.

ఇదిలా వుండగా అక్కడ కొత్వాలు.. జమీందార్లు అంటే ఎంత అభిమానస్తుడైనప్పటికీ భూమ్మీద రైతులనే వారు లేకుండా పోయారన్న వాస్తవాన్ని మాత్రం దాచలేకపోయాడు. కొత్వాలు పంపిన కబురు విని పెద్ద అధికారులు కూడా చాలా ఆందోళన చెందారు. పన్నులెవరు కడతారు? ఓడ్కా ఎవరు తాగుతారు? అమాయక వృత్తులెవరు నిర్వహిస్తారు? అని కొత్వాలుకు వారు రాశారు. ఖజానాను ఎత్తివేయవచ్చునని కొత్వాలు జవాబు పంపాడు. ఇక అమాయక వృత్తులంటారా? ఆ వృత్తులన్నీ పోయాయి. వాటి స్థానే దొంగతనాలు, దోపిడీలు, హత్యలు దేశమంతటా పెచ్చరిల్లాయి. పరిస్థితులు ఎంతవరకు ముదిరాయంటే కొత్వాలునైన నన్నే మొన్నొక వానర మృగం అడ్డగించింది. చావుతప్పి బైటపడ్డాను. సదరు మృగం ఈ ఆందోళనకంతకూ కారకుడైన బుద్ధిలేని పెద్దమనిషి తప్ప అన్యులు కారని తెలుస్తోంది.. అని కొత్వాలు అధికారులకు రాశాడు.

అధికారులు ఆదరాబాదరా సమావేశాలు జరిపి సలహా సంప్రతింపులు సాగించారు. రైతులను పట్టుకుని వారి వారి పూర్వ స్థానాలకు పంపాలని నిశ్చయం చేశారు.

ఈ కల్లోలం అంతటికీ కారకుడైన ఆ పెద్దమనిషిని ఇలాంటి చేష్టలు కట్టిపెట్టవలసిందనీ, పన్ను వసూళ్లకు అడ్డంకులు కల్పించవద్దనీ మర్యాదగా మందలించడానికి తీర్మానించారు.

ఆ సమయంలో అదృష్టవశాత్తు రైతుల తండాకు తండా ఆ ఊళ్లో దిగింది. వారు తిన్నగా నగరం మధ్యనే దిగారు. అంగళ్లన్నీ నిండిపోయారు. వెంటనే వారందరినీ పట్టుకొని ఒక బుట్టలో పెట్టి వానర మహాశయుని జమీందారీకి రవాణా చేశారు.

ఆ చుట్టుపట్ల ప్రాంతం అంతా, మళ్లీ రైతుల కోలాహలంతో నిండిపోయింది. అంగళ్లు కూడా నవధాన్యాలతో నిండిపోయాయి. ఒక్క రోజులోనే ఎంత పన్ను


వసూలైందంటే ఖజానాదారు పుట్లకొలదిగా వున్న రూపాయలను చూసి తలాడిస్తూ 'ఈ డబ్బంతా ఎక్కడిదయ్యా ఆ వెధవలకు' అని ఆశ్చర్యపోయాడు.

ఇంతకీ ఆ పెద్దమనిషి ఏమయ్యాడని పాఠకులు అడగవచ్చును. చాలా చాలా ప్రయత్నం చేసిన మీదట అతడిని పట్టుకోగలిగారు. అతడి ముక్కు తుడిచారు. ఒళ్లు కడిగారు. గోళ్లు తీశారు. ఆ తర్వాత తీర్మానం ప్రకారం కొత్వాలు అతడిని మర్యాదగా మందలించాడు. 'వెస్ట్' పత్రికను స్వాధీనం చేసుకుని ఆ పెద్దమనిషిని సెంకా అజమాయిషీకి అప్పజెప్పాడు.

దొరగారు ఈ రోజుకు కూడా సుఖంగా బతికేవున్నారు. ఇప్పటికీ 'పేషెంట్స్' ఆడుతూనే వుంటారు. తాను అడవిలో తిరిగిన ఆ పాతకాలాన్ని జ్ఞాపకం చేసుకుని నిట్టూర్పులు విడుస్తూ వుంటారు. పట్టి బలవంతం చేస్తే తప్ప స్నానం చేయరు. అప్పుడప్పుడూ గురగురలాడుతూ వుంటారు.



పరిగపిల్ల వైరాగ్యం



అనగా అనగా ఒక పరిగ. ఆ పరిగ తల్లిదండ్రులు చాలా తెలివైనవారు. వారు ఏ వాలుగనోటా పడకుండా, ఏ పులుసు కుండా ఎక్కకుండా గంటలు, రోజులు లెక్కపెడుతూ అలాగే ముసలివారయ్యారు. తమ బిడ్డడు కూడా తమలాగే అదృష్టవంతుడు కావాలనుకున్నారు. ఒక రోజున పెద్ద పరిగ తన కొడుకుని పిలిచి 'చూడు బాబూ! జీవితానందం అనుభవించాలి అంటే రెండు కళ్లూ తెరువు' అని హితోపదేశం చేశాడు.

మన పిల్ల పరిగకు చాలా తెలివితేటలున్నాయి. ఆ తెలివితేటల్ని ఉపయోగిస్తూనే వుండేవాడు. కానీ అదృష్టం మాత్రం ఎదురుతిరుగుతూ వుండేది. నీటినిండా చేపలు కోకొల్లలు. అన్నీ పెద్దవే. తాను మాత్రమే అందరిలోకి చిన్న. తనను ఏ చేప అయినా ఇట్టే పుక్కిట పెట్టుకోగలదు. కానీ తనకు కొరకబడే వారు మాత్రం ఎవరూలేరు. అసలు ఒకరిని మరొకరు ఎందుకు మింగాలి? అని ప్రశ్న వేసుకుంటూ వుండేవాడు. ఎండ్రకాయ డెక్కలతో అదిమితే తాను రెండు తుండేలు కావలసిందే. ఒక చిన్న జలగ పట్టుకుందా తన పని గిజగిజ. కర్మంకాలి తానెప్పుడైనా ఒక పురుగును పట్టుకుంటే తన జాతి పరిగలే తండాలు తండాలుగా వచ్చి చుట్టుముట్టుతాయి. తన నోటిలోంచి ఆ పురుగును లాక్కొని అది నుగ్గునుగ్గు అయేవరకు కాట్లాడుకుంటాయి.

ఇక మనిషి సంగతి సరేసరి. ఉత్తి పుణ్యానికి పరిగలను పట్టి హత్య చేయడంలో మనిషికున్న తెలివి మరెవరికీ లేదు. వలలు వేస్తాడు. మావులు(జల్లి గంపలు) పెడతాడు. గాలాలు విసురుతాడు!

అసలు ఈ గాలంకన్నా దారుణమైన వస్తువు మరొకటుందా అనిపిస్తుంది.

మామూలు దారం, దాని చివర ఒక ఇనప కొక్కెం, ఆ కొక్కానికి ఒక ఈగనో, వానపామో ఏదో ఒకటి వుంటుంది. అసలా గాలాన్ని విసరడం కూడా ఏమంత సహజంగా వుండదు. అయినా చాలా పరిగలు ఆ గాలానికే పట్టుబడతాయి.

'ఇదుగో.. గాలం జాగ్రత్త' అని ముసలి పరిగ అనేకసార్లు హెచ్చరించింది. 'ఈ గాలమంత పనికిమాలినది మరొకటి లేదు. అయినా మనవాళ్లలో చాలా మంది ఈ పనికిమాలిన గాలానికే బలవుతూ వుంటారు. నీకేదో ఒరగబెడుతున్నట్టు ఒక పురుగును గాలానికి గుచ్చుతాడు. అంతే మిత్తి నీ నెత్తెక్కుతుంది' అని ముసలి పరిగ చెప్పింది.

కొద్దిలో పులుసుకుండ గండం ఎలా తప్పిపోయిందో కూడా ముసలి పరిగ చెప్పింది. ఆ రోజున మనుషులు ఒక తండాకుతండా వచ్చారు. ఏటికడ్డంగా వలవేసి ఏటి కడుపునంతా గాలిస్తూ చాలా దూరం ఈడ్చుకుని పోయారు. ఆ రోజున వాళ్లు పట్టిన చేపలెన్నని! వాలగలు, బొమ్మిడాయిలు, మట్టగిడసలు, చందువాలు, అన్నీ వున్నాయి. ఇంక పరిగల సంగతి అడిగావూ? వాటికి లెక్కలేదు. వాళ్లు మమ్మల్ని ఈడ్చుకుని పోతూవుంటే మా ముసిలాడి భయం చూడాలి. చెప్ప శక్యంకాదు. ఈడ్చుకుని పోతున్నారని మాత్రమే కానీ ఎక్కడికో ఏమిటో తెలియదు. నాకు అటువైపున ఒక వాలగ, ఇటువైపున చందువా. ఓయి దేవుడా! ఇంకో నాలుగడుగులు వేశానా ఏదో ఒకటి మింగేస్తుంది. అందుకు సందేహంలేదు అనుకున్నాను. కానీ అవి నావైపు కన్నెత్తి కూడా చూడలేదు. అసలది తినడానికి తగిన సమయమా? అందరికీ భయంగానే వుంది. ఏమిటో ఎందుకో మాత్రం తెలియదు. కొసకు వల అంచులు లాగడం ప్రారంభించారు. వలనంతనీ ఈవలికీడ్చి ఒడ్డునున్న పచ్చగడ్డిమీద చేపలను రాసిపోశారు. అప్పుడే నాకు పులుసు కుండ సంగతి తెలిసింది. అక్కడ ఇసకమీద ఏదో ఎర్రనిది ఎగురుతోంది. దానిలోంచి నల్లని చారలు పైకి లేస్తున్నాయి. అదెంత వేడిగా వుందంటే ఒక్క క్షణంలో నాకు స్పృహ తప్పిపోయింది. అసలు నీళ్లు లేకుండా వుండడమే మహాకష్టం. అందులో వారు ఆ వేడిని ఇంకా ఎక్కువ చేస్తున్నారాయె. దాన్ని వారు మంట అని అంటూండడం విన్నాను. ఆ మంటమీద నల్లనిదేదో పెట్టారు. అందులో నీరుంది కానీ తుపాను వచ్చినప్పటి మాదిరిగా కళపెళమంటోంది. దాన్ని కుండ అన్నారు. వాటినా కుండలో పడేయండి చేపల పులుసు చేద్దాం అన్నారు వాళ్లు. అనడమేమిటి చేపలను ఎత్తెత్తి ఆ కుండలో పడేయడం మొదలుపెట్టారు. చేపలు పిచ్చెత్తినట్టు ఎగిరెగిరిపడ్డాయి. మునిగిపోయాయి. ఆ తర్వాత అంతా సద్దుమణిగింది.

ముందు వారు ఆ చేపా, ఈ చేపా అని చూడలేదు. చేతికందిన దాన్నల్లా కుండలో వేశారు. అప్పుడొక ముసలి జాలరి నావైపు చూశాడు. 'అది మరీ నలుసంత వుంది. పులుసుకు పనికిరాదు. ఇంకొంచెం పెరగనీ' అని చెప్పి తోకపట్టుకుని నీటిలోకి

విసిరిపారేశాడు. వెంటనే ఆదరాబాదరా పడుతూ లేస్తూ ఇంటికి చేరుకున్నాను. ఇంటిదగ్గర మీ అమ్మ చచ్చి సగమై ఎదురుచూస్తూ నిల్చుంది! అని ముసలి పరిగ చెప్పాడు.

చేప పులుసును గురించి ముసలి పరిగ ఎంత కష్టపడి చెప్పినా, చేపలకు చేప పులుసు సంగతి పూర్తిగా బుర్రకెక్కడం కష్టం.

కానీ పిల్లపరిగ మాత్రం తండ్రి హితవచనాలను మరిచిపోలేదు. మనవాడు కుశాగ్రబుద్ధి, ఉదారాశయాలు కలవాడు. జీవితం హంసతూలికాతల్పం అంతటి మెత్తనిది కాదని తెలుసుకున్నవాడు. 'ఒరే అబ్బీ జాగ్రత్తగా వుండరా, లేకపోతే ఏ కాలానికి ఏం వస్తుందో చెప్పలేం' అని ఆత్మబోధ చేసుకున్నాడు. ఈ బోధతోనే జీవిత వ్యాపారంలో అడుగుపెట్టాడు. మనవాడు చేసిన మొట్టమొదటి పని ఒక చిన్న కన్నం వెతకడం. తన ఒక్కడికి మాత్రమే చోటుగల ఇరుకు కన్నం ఒకటి చేసుకున్నాడు. ముక్కుతో ఆ కన్నం తవ్వడానికి ఒక ఏడాది పట్టింది. ఆ ఏడాదీ ఎలా గడిచిందో తలుచుకుంటే ఒళ్లు గగుర్పొడుస్తుంది. ఏ మూలనో నక్కి ప్రాణాలు అరచేత పెట్టుకొని పడుండవలసి వచ్చేది. ఎలాగైతేనేం కన్నం తయారైంది. చాలా అందంగా కూడా వుంది. తనకొక్కడికి మాత్రమే అందులో చోటుంది. ఆ తర్వాత చేసిన పని దినచర్యను నిర్ణయించుకోవడం. రాత్రిపూట మనుషులు, పశువులు, పక్షులు, చేపలు నిద్రపోయే సమయంలో మనవాడు వ్యాయామసాధన చేసేవాడు. పగలంతా తన కన్నంలో చేరి చలికి వణుకుతూ పడివుండేవాడు. కానీ అందరిలాగే అతడికి కూడా తిండికావాలి. జీతనాతాలు కానీ, నౌకరు చాకర్లు కానీ లేరు. అందుకని మధ్యాహ్నంపూట చేపలన్నీ తృప్తిగా తిని తిరుగుతున్న సమయంలో మెల్లిగా బైటికి వచ్చి అదృష్టముంటే ఒక పురుగునో, ఈగనో వేటాడేవాడు. ఏమీ దొరకకపోతే ఆకలితోనే తన కన్నంలోకి పోయి ముడుచుకుని పడుకునేవాడు. 'కడుపునిండా తిని ప్రాణంమీదకు తెచ్చుకోవడం కన్నా కాలే కడుపుతోనైనా బతికుండడం మేలు' అని మన పరిగ పిల్ల మతం.

తన దినచర్యనెన్నడూ తప్పలేదు. రాత్రిళ్లు వ్యాయామం చేసి, వెన్నెల్లో అలా అలా తిరిగి వచ్చేవాడు. పగలంతా ఆ కన్నంలో పడివుండేవాడు. సరీగా మిట్టమధ్యాహ్నమప్పుడు మాత్రమే వేటకు బయలుదేరేవాడు. మధ్యాహ్నంపూట వేట లాభంలేదు. పురుగులన్నీ ఆ వేడికి ఆగలేక చల్లగావున్న ఏ ఆకుమాటుకో చేరేవి. అందుకని మన పరిగ చాలాసార్లు నాలుగు గుక్కల నీళ్లతోనే సంతృప్తి పడవలసి వచ్చేది.

ఇలాగ రోజులు రోజులు కంటికి కునుకులేకుండా కడుపుకి తిండిలేకుండా ఆ కన్నంలోనే గడిపాడు. 'నేనింకా బతికేవున్నాను. రేపు ఏమవుతుందో భగవంతుడా' అన్న ఆలోచన తప్ప మరొక ధ్యాస లేదు.

అప్పుడప్పుడు మాగన్ను పడేది. అప్పుడప్పుడు తనకు లాటరీలో ఓ రెండు లక్షలు



వచ్చినట్టు కల వచ్చేది. ఆ సంతోషంతో అటునుంచి ఇటు ఒత్తిగిలేవాడు. దానితో ముక్కు బయటపడేది. అప్పుడు పైన ఏ వాలుగ పిల్లయినా వుంటే ఏంగాను? గుటకాయస్వాహా. అందులో సందేహంలేదు.

మగత విరిగిపోయి కళ్లు తెరిచిచూస్తే ఎదురుగా ఒక ఎంౡకాయ కళ్లార్పకుండా అలాగే పరిగవైపు చూస్తూ వుంటుంది. మీసాలు మాత్రమే ఇటూ అటూ ఆడుతూ వుంటాయి. పాపం అలాంటప్పుడు పరిగకు గుండెలు జారిపోతాయి. పరిగ బైటపడుతుందేమోనన్న ఆశతో ఎంౡకాయ ఒక పూట పూటంతా అక్కడే తిష్టవేసింది. ఆ పూటంతా పరిగ తన కన్నంలోనే గజగజలాడిపోతూ కూర్చుంది.

ఒక రోజున తెలతెలవారే ముందు కొద్దిగా జోగుతూ వచ్చింది పరిగ. తీరావస్తే ఇంకేంవుంది. తన గుమ్మానికెదురుగానే వుంది ఒక వాలగ. ఆ వాలగ రోజు రోజంతా అక్కడే బైఠాయించింది. కానీ మన పరిగ మహా చురుకు. అసలు కన్నం వదిలి ఈవలికి రానేలేదు.

ఇలా ఆపదలు దాటడం ఒకసారి కాదు. రెండుసార్లు కాదు. ప్రతి రోజూ అతి సాహసంతో విజయం పొందుతూనే వుంది. ఇంకా బతికే వున్నానురా బాబూ అనుకుంటూనే వుంది.

అంతటితోనే అయిందా! మన పరిగ అసలు పెళ్లే చేసుకోలేదు. అందుకని పిల్లాపీచూ బెడదలేదు. తన తండ్రి సంసారం చాలా పెద్దది. 'అసలు నా జీవితంతో పోల్చిచూస్తే నాన్న బతుకేమిటి నవ్వులపాలు బతుకు!' అని అనుకుంటూ వుండేవాడు.

ఆ రోజుల్లో వాలగలకు చాలా కరుణ వుండేది. చందువలు కూడా ఇలాంటి చిన్న చేపలను ఆశించేవి కావు. ఆ రోజుల్లో తన తండ్రి ఒకప్పుడు పులుసు కుండలో పడబోయాడు. కానీ తోకపట్టుకుని నీళ్లలోకి విసరడానికి అప్పుడొక ముసలివాడున్నాడు. ఈ రోజుల్లో ఏటిలో చేపలే కరువయ్యాయి. అందుకని పరిగలే గొప్ప. అబ్బెబ్బే పిల్లలూ, సంసారం లాభంలేదు. నువ్వు బతికుంటే అక్కడికదే పదివేలు.. ఇలా తలపోస్తూ వుండేవాడు.

ఈ విధంగా వైరాగ్యంగల ఆ పరిగ నూరేళ్లకు పైగానే బతికింది. ఈ నూరేళ్లూ గజగజ వణుకుతూనే కాలక్షేపం చేసింది. స్నేహితులు లేరు, చుట్టాలు లేరు, తానెవరింటికీ వెళ్లడు, ఒకర్ని తన ఇంటికి పిలవడు. చీట్లపేక ఆడడు. సారా తాగడు. చుట్టకాల్చడు. అందమైన అమ్మాయిల వెంట ఎప్పుడూ పడలేదు. అతడు చేసేదల్లా గజగజగజ వణకడం. దేవుని దయవల్ల నేనింకా బతికే వున్నాను అనుకుంటూ వుండడం. అంతే.

అలా వుండగా వుండగా వాలుగలు కూడా అతడిని పొగడ్డం మొదలుపెట్టాయి. 'అసలు ఈ జలచరాలంతా అతనిలాగే బతికితే ఎంత బావుంటుంది?' అని అంటూ

వుండేవి. ఇలా అనడానికి కారణం లేకపోలేదు. ఏదో ఒక విధంగా ఉబ్బేసి పరిగను బయటికి లాగాలని వాటి ఎత్తు. కానీ మనవాడు మాత్రం ఆ జిత్తులకెన్నడూ లొంగలేదు.

మొదటి శతాబ్దం తర్వాత మరెన్ని సంవత్సరాలు అతడు బతుకుతాడో మనం చెప్పలేం. కానీ, కొసకు కాలం ముంచుకు వచ్చింది. ఒక రోజున కలుగులో వచ్చేప్రాణం, పోయేప్రాణంగా పడుండి 'దేవుడి దయవల్ల అమ్మానాన్నలాగే సహజ మరణమే నాక్కూడా ప్రాప్తిస్తోంది' అనుకున్నాడు. 'మనమంతా కూడా ఈ విరాగి పరిగలాగానే బతికితే ఎంత బాగుండును' అని వాలగలన్న మాటలు జ్ఞాపకం వచ్చాయి. అయితే అప్పుడు ఈ జీవితం ఎలా వుంటుంది?

తన అమూల్యమైన తెలివితేటలు, చదువులు అన్నీ జ్ఞాపకం చేసుకున్నాడు. 'అలాగైతే మొత్తం పరిగ జాతే నశిస్తుంది' అని ఎవరో చెవిలో ఊదినట్టు అనిపించింది.

జాతి వృద్ధి పొందాలంటే ముందు సంసారం కావాలి. ఈ పరిగకు అసలు సంసారమే లేదు. అంతటితో ఆగిందా? పరిగజాతి తామరతంపరగా అభివృద్ధి చెందాలంటే అవి సహజసిద్ధమైన ప్రదేశాలలో వుండాలే కానీ ఇలాంటి చీకటి కోణాల్లో కాదు. పిల్ల పరిగలకు తగిన తిండి వుండాలి. సాహసం వుండాలి. ఒకరితో ఒకరు పరిచయాలు చేసుకుని ఒకరి మంచి గుణాలను మరొకరు నేర్చుకోవాలి. అలా అయినప్పుడే జాతి నీరసించకుండా వుంటుంది.

బతుకంతా భయంతో వణుకుతూ సగం చచ్చి, సగం పిచ్చెక్కి తమ కన్నాల్లోనే కాలక్షేపం చేసే పరిగలను సత్పౌరులు అనడానికి వీల్లేదు. అలాంటి వారెందుకూ కొరగారు. ఇతరులకు వారు ఉత్సాహమూ కలిగించలేరు. నిరుత్సాహమూ కలిగించలేరు. అలాంటివారికి కీర్తీ రాదు, అపకీర్తీ రాదు. గౌరవమూ వుండదు, అగౌరవమూ వుండదు. అలాంటివారి జీవితం కూటికి చేటు.

ఇదంతా పరిగకు చాలా స్పష్టంగా అవగతమయింది. దానితో ఒక కొత్త ఉత్సాహం పుట్టి, తలెత్తి ఏటిలో వీరవిహారం చేయాలనిపించింది. అలా అనిపించేసరికి మళ్లీ గుండె భయంతో దడదడలాడింది. ఆ భయంతోనే గడియలు లెక్కపెడుతూ పడివుంది. భయంతోనే ఇన్నాళ్లూ బతికింది. ఆ భయంతోనే ఇప్పుడు మరణిస్తుంది.

పరిగకు గత జీవితమంతా కళ్లముందు కనిపించింది. తనెన్నడైనా చిరునవ్వు నవ్వాడా? ఓ మిత్రుడితోనైనా కులాసాగా గడిపాడా? ఏ దారేపోయే వాడికైనా ఇంత ఆశ్రయం ఇచ్చాడా? ఆదరణ చూపాడా? కష్టాల్లో మునిగిన ఏ ఒకరికైనా అండగా నించున్నాడా? పోనీ, తనని గురించి ఎవరికైనా తెలుసా? తన పేరన్నా తెలుసా? ఈ ప్రశ్నలన్నిటికీ ఒకే ఒక జవాబు తట్టింది 'లేదు!' అని.

అతగాడి బతుకంతా వజవజ వణుకుతూనే గడిచింది! ముంగిట మృత్యువు కాచుకొని

కూర్చున్న ఈ సమయంలో కూడా పరిగ గుండె భయంతో కొట్టుకుంది. ఎందుకో ఈ భయం ఏమీ తెలియదు. కన్నంలో అంతా చీకటి. కదలడానికి కూడా వీల్లేనంత ఇరుకు. ఒక్క వెలుగురేఖ కూడా అక్కడికి రాదు. ఆ చీకటి ఇరుకు కన్నంలో నిస్సహాయంగా, నీరసంగా పడివుంది. ఆకలికి నకనకలాడుతూ మృత్యువుకోసం ఎదురు చూస్తున్నది.

ఇతర చేపలు పక్కనుంచి పరుగెడుతున్న శబ్దం వినిపిస్తున్నది. బహుశా అవి తనలాగే పరిగలు కావచ్చును. అందులో ఒక్కదానికి కూడా తన సంగతి పట్టలేదు. 'వాలుగ నోటపడకుండా, పీతలవాత పడకుండా, గాలానికి బలికాకుండా ఈ పరిగ నూరేళ్లకు పైగా ఎలా బతకగలిగింది' అని అడుగుదామన్న జ్ఞానం ఒక్క చేపకు కూడా లేదు. అన్నీ ఏమీ పట్టనట్టే ఈదుకుంటూ పోయాయి. ఈ చీకటి కన్నంలో మహాజ్ఞాని అయిన పరిగకు అవసానకాలం వచ్చిందన్న సంగతి కూడా బహుశా వాటికి తెలియకపోవచ్చు.

అసలు తన విజ్ఞతను గురించి ఎవరూ చెప్పుకోకపోవడం మరీ బాధ కలిగించింది మన పరిగకు. 'అన్నపానీయాలు మాని, ఎవరికంటా పడకుండా ఆ చీకటికన్నంలో వున్న ఆ మూర్ఖుడిని చూశావా?' అనైనా కనీసం ఎవరూ అనడంలేదు. వాడొక తెలివితక్కువ దద్దమ్మ! వాడివల్ల ఈ ఏటికంతకీ అప్రతిష్ట వస్తోంది అని కొంతమంది అనవచ్చును.


ఇలా ఆలోచించగా కొసకు మగత కమ్మింది. అది చావుకు ముందు వచ్చే మగత. మృత్యుదేవత గుసగుసలు ఏవో చెవినబడుతున్నాయి. మరొకసారి ఇష్టమైన కలగన్నాడు. లాటరీలో రెండు లక్షల రూపాయలు వచ్చినట్టు, తానొక అరగజం పొడవు పెరిగినట్టు, వాలుగనే పుక్కిటపెట్టినట్టు కలగన్నాడు.

అలా కలలుకంటూ వుండగా మెలిమెల్లిగా పరిగ ముక్కు కన్నం బయటపడింది.

అంతే, హటాత్తుగా మాయమైపోయాడు. ఏమైనట్లు? వాలుగ మింగేసిందా? పీత విరిచేసిందా? సహజమైన మృత్యువే వచ్చిందా? ఏమో.. చూసినవారు లేరు. చెప్పగలిగినవారూ లేరు. బహుశా అతడు మరణించివుంటాడు. సగం చచ్చిన ముసలి పరిగ, అందులోనూ విరాగి అయిన పరిగ.. ఏ వాలుగకు రుచిస్తుంది కనక?



స్వార్థం ఎరగని కుందేలు



తోడేలు దృష్టిలో కుందేలు నేరం చేసింది. ఆగకుండా గుహ ముందునుంచి పరుగు పెడుతున్న కుందేలును పసిగట్టింది తోడేలు. 'ఇదిగో కుందూ.. కాస్త ఆగమ్మా' అంది తోడేలు. ఆ మాటను కుందేలు ఖాతరు చేయలేదు. అంతేనా, ఇంకా వడిగా పరుగుపెట్టింది. అయినా తోడేలు మూడంగల్లోనే దాన్ని ఒడిసి పట్టుకుంది. 'ఇదిగో! చెప్పినప్పుడు నువు ఆగలేదు, అందుకని నిన్ను ఖండఖండాలుగా ఖండించాలని శిక్ష విధిస్తున్నాం. అయితే మాకూ, మా శ్రీమతికీ ప్రస్తుతం ఆకలిగా లేదు. అదీకాక ఐదు రోజుల వరకూ సరిపడిన సంభారాలున్నాయి. అందుకని ఈ తుప్పకింద కూచుని నీ వంతు వచ్చేవరకూ ఎదురుచూస్తూ వుండు, విన్నావా? బహుశా మేం నిన్ను క్షమిస్తామేమో కూడా!' అని ఒక్క పెడనవ్వుతో ఫర్మానా చేసింది తోడేలు.

పాపం, కుందేలు ఏం చేస్తుంది? కిమ్మనకుండా తుప్పకింద కూచుంది. 'ఇంక చావుకెన్ని గంటలు బాకీ' అన్న ఆలోచన తప్ప కుందేలుకి మరొక ధ్యాసలేదు. బెదురుబెదురుగా ఎప్పుడైనా గుహవైపు చూసిందా! తోడేలు కళ్లు చింతనిప్పుల్లా కనిపించేవి. ఒకొక్కప్పుడూ తోడేలు భార్యను తీసుకుని కుందేలు ముందు పచార్లు చేస్తూ వుండేది. ఓరకంటితో కుందేలును చూసి, తోడేలు భాషలో ఏదో తన భార్యతో చెప్పేది. ఆ తర్వాత ఆ రెండూ విరగబడి నవ్వేవి. తోడేలు పిల్లలు కూడా వీటికి తోడయేవి. పళ్లు పటపటలాడిస్తూ కుందేలు పైకి పంజా విసిరి చెలగాటమాడేవి. పాపం అలాంటప్పుడు కుందేలు గుండె పాదాల్లోకి జారిపోయేది.

ఇప్పుడు కుందేలుకి ప్రాణంమీద మహా తీపి పుట్టింది. మంచి యవ్వనంలో వుంది. అయినా ఒద్దిక గలది. మొన్నమొన్ననే ఒక వితంతు కుందేలు కూతుర్ని ప్రేమించి పెళ్లి చేసుకోవడానికి నిశ్చయించుకుంది. ఆ ప్రియురాలి కోసం పరుగుపెడుతూ వుంటేనే ఈ తోడేలు అడ్డుతగిలి కాళ్లకు బంధాలు వేసింది. పాపం అక్కడ ఆ వెర్రిపిల్ల ప్రియునికోసం ఎదురు చూసిచూసి 'బహుశా ఆ వాలుకన్నుల వన్నెకాడు కల్ల బాసలాడెనేమొ' అనుకుంటూ వుండవచ్చును. లేదా చూసిచూసి లాభం లేదనుకుని మరొకర్ని వరించి వుండవచ్చును. అదీ కాకపోతే అలా తుప్పల్లో కూచుని ఎదురుచూస్తూ వుండగా ఏ తోడేలైనా కబళించి వుండవచ్చును.

ఇలాగ మనస్సు పరిపరి విధాలపోయి పాపం కుందేలు కళ్లు చెమ్మగిల్లాయి. దాని తీయటి కుందేటి కలలన్నీ కరిగిపోతున్నాయి. కొద్ది రోజుల్లోనే వివాహం చేసుకుందామనుకొంది. పెళ్లయిన తర్వాత తానూ తన ప్రేయసీ ఫలహారాలు చేస్తూ సరసాలాడుకోవడాన్ని ఊహించుకుంది. అలాంటిది ఇప్పుడిక్కడ నిర్బంధం! ఇంకా చావుకెన్ని గంటలు వున్నాయి?

ఒకనాటి రాత్రి అలా కూచుండగానే కునుకుపాట్లు వచ్చాయి. తోడేలు తనను ప్రత్యేక రాయబారిగా నియమించినట్టు, తాను రాచకార్యాల్లో మునిగివున్నప్పుడు తోడేలు తన ఇంటికి వస్తూపోతూ వున్నట్టు కలగన్నది. ఎవరో డొక్కలో పొడిచినట్టు ఉలికిపడి మేల్కొంది. కళ్లు తెరిచి చూస్తే ఎదురుగా తన కాబోయే బావమరిది కనిపించాడు. 'లేవోయ్ బావా! పెళ్లి కూతురికి ప్రాణంమీదకు వచ్చింది. నీ స్థితి విన్నప్పటినుంచి నిద్రాహారాలు లేవు. కడసారి చూపు అందుతుందో అందదో అన్న బెంగ ఒక్కటే వుంది' అంది ఆ వచ్చిన కుందేలు.

ఈ కబురు వినేసరికి పాపం కుందేలు గుండెకాయ వక్కలైపోయింది. ఈ దుర్గతి పట్టడానికి తాను చేసిన పాపమేమిటి? తానెవరిమీదా కుట్రలు పన్నలేదు. విప్లవాలు నడపలేదు. ఆయుధాలు తీసుకుని ప్రభుత్వంమీద ధ్వజం ఎత్తలేదు. కేవలం తన స్వంత పనిమీద పరుగెత్తింది. అంత మాత్రానికేనా ఈ మరణశిక్ష? మరణం అన్నమాట ఎంత భయంకరమైనది? ఈ మరణం తనొక్కడికే కాదు ఆవిడకు కూడా. పాపం ఆవిడ చేసిన పాపమల్లా మనసారా తన కుందును ప్రేమించడం అంతే! తనకు రెక్కలే వుండి ఆవిడ ముందు వాలగలిగితే? పొడవాటి ఆవిడ చెవులను నిమిరి ఆ చిట్టితలపై వేయి ముద్దులు కురిపించగలిగితే?

ఇలా ఆలోచిస్తూ వుండగా 'పద పరుగెత్తుదాం' అంటున్నాడు కాబోయే బావమరిది!

ఆ మాట చెవిన పడేసరికి కుందేలుకి కొత్త జవం వచ్చింది. అప్పటికే చెవులు వెనకకు వాల్చి నడుము కుదించి కూర్చుని వుంది. ముందుకురికితే చాలును

ఆఘమేఘాలమీద పోవచ్చును. అప్పుడసలు వెనక్కి తిరిగి గుహవైపు చూడాల్సిన అవసరమే లేదు. కానీ ఏం లాభం? చూసింది. గుండె జారింది.

'రాలేను. తోడేలుగారి హుకుం!' అని గొణిగింది. తోడేలు ఆదినుంచీ అంతా కనిపెడుతూనే వుంది. అంతా వింటూనే వుంది. భార్యవైపు తిరిగి చెవిలో ఏదో గుసగుసలాడింది. బహుశా కుందేలు సత్ప్రవర్తనను గురించి మెచ్చుకుంటున్నదేమో!

'పారిపోదాం పద' అంది కబురుతెచ్చిన కుందేలు.

'ఎలా రాగలను?' అంది ఖైదీ కుందేలు.

'ఏమిటి గూడుపుఠాణీ చేస్తున్నారు?' అని హటాత్తుగా గర్జించింది తోడేలు.

కుందేళ్లు రెండూ హడలెత్తిపోయాయి.

కావలి స్థానం విడిచిపెట్టమని బంటుకు దుర్బోధ చేయడమా? దానికి శిక్షేమిటి? చట్టంలో ఏం వుంది? పాపం కుందేలు అటు ప్రియురాలినీ, ఇటు బావమరిదినీ కూడా కోల్పోవలసి వుంటుంది. తోడేలు కుటుంబం వాటిని చీల్చుకుని తింటుంది.

ఆ రెండు కుందేళ్లు అదురునుంచి తేరుకొన్నాయో లేదో, పళ్లు పటపట గీరుతూ, కళ్ల నిప్పులు చెరుగుతూ తోడేలూ, తోడేలు భార్యా ఎదురుగా వచ్చి నిలబడ్డాయి.

'మేం నేరమేమీ చేయలేదు మహాప్రభో! మేం మాట్లాడుకుంటున్నామంతే. ఇది మా పొరుగింటి కుందేలు. నన్ను చూడ్డానికి వచ్చింది. అంతే' అని ఖైదీ కుందేలు సగంచచ్చి వణుకుతున్న కంఠంతో మనవి చేసుకుంది.

'నేరమేమీ చేయలేదూ? నీ సంగతి నీకన్నా మాకెక్కువ తెలుసునులే. అసలు నిన్ను నమ్మడానికి వీల్లేదు. ఏమీ దాచకుండా వున్నదున్నట్టు చెప్పండి'

'మహాప్రభో! అసలు విషయం ఇది' అని ప్రారంభించింది రెండవ కుందేలు.

'మా చెల్లెలు, ఇతగాని ప్రియురాలు, చావుబతుకుల మీదుంది. కడసారి కళ్లారా చూద్దామని దాని కోరిక. దేవరవారు కరుణించి ఒక్కసారి వెళ్లిరావడానికి సెలవిప్పించాలి'

'హుం. ప్రియురాలు ప్రియుడ్ని ప్రేమిస్తోంది. బాగుంది. అంటే కుందేలు పిల్లలు చాలా పుడతాయన్నమాట. మాకు చాలా ఆహారం సమకూరుతుంది' అంది ఆడతోడేలు. 'మేం కూడా ఒకరినొకరం ప్రేమించుకుంటున్నాం. మాకు చాలామంది పిల్లలున్నారు. ఇప్పుడు మాతో వున్న చంటివాళ్లు నలుగురు. పెరిగి పెద్దవాళ్లయి రెక్కలు వచ్చినోళ్లు చాలామంది వున్నారు. అయితే ఏమండీ పాపం పెళ్లికూతుర్ని చూసివస్తాడట. కడసారి కోరిక మన్నించరూ?' అని అడిగింది అనునయంగా భర్తను.

'కానీ మనం వాడ్ని రేపే భోజనం చేయవలసి వుంది కదా?'

'మహాప్రభో! చిటికలో తిరిగి వస్తాను. నన్ను నమ్మండి!' అంది రొప్పుతూ ఖైదీ కుందేలు.

తోడేలు భార్యకు చాలా విచారం వేసింది. 'చూడండి! అలగా జంతువు కుందేలు తన ప్రియురాలినెంత గాఢంగా ప్రేమిస్తున్నదో!' అంది భర్తతో. భార్య అలా అన్న తర్వాత తోడేలు ఇంకేం చేయగలుగుతుంది? అనుకున్న ప్రకారం ఆలస్యం చేయకుండా తిరిగి రావాలనే షరతుమీద కుందేలు ప్రయాణానికి అనుమతించింది. కుందేలు తిరిగి వచ్చేవరకు దాని బావమరిదిని ఇక్కడ ఖైదీగా వుంచుతానంది.

'ఎల్లుండి ఉదయం ఆరు గంటలయేసరికి నీవు తిరిగి రాకపోతే నీ బావమరిదిని తినేస్తాం. నీవు అదనులో తిరిగివస్తే ఇద్దరినీ తినేస్తాం. చిత్తంవస్తే నిన్ను క్షమిస్తాం' అంటూ ఒక్క వెడనవ్వు నవ్వింది తోడేలు.

కుందేలు బాణంలాగ దూసుకుపోయింది. అడుగుపడిన చోట నేల దద్దరిల్లింది. కొండలు వస్తే వాటిమీంచి దొర్లుకుంటూ పరుగెత్తింది. ఏరు వస్తే రేవుకోసం చూడలేదు. ఏటికడ్డంపడి ఈదింది. కుందేలు ఇల్లు మూడార్ల రాజ్యంలో వుంది. అక్కడికి వెళ్లి మంగళస్నానం చేసి పెళ్లాడాలి. మళ్లీ తోడేలు ఫలహారంవేళ మించకుండా తిరిగి రావాలి.

కుందేలు వేగాన్ని చూసి పక్షులు కూడా ఆశ్చర్యపోయాయి. 'కుందేళ్లకు గాలితప్ప కలేజా వుండదని మాస్కో దండకవిలె పత్రిక రాసింది. అయినా చూడు ఆ కుందేలెలా పరుగెడుతోందో' అని పిట్టలు చెప్పుకున్నాయి.

ఎలాగైతేనేం కుందేలు ఇల్లు చేరుకుంది. అప్పటి దాని సంతోషాన్ని చెప్పడానికి నోరుచాలదు. రాయడానికి చేయిచాలదు. అక్కడ చిట్టికుందేలుకు ప్రియుడు కంటపడగానే జ్వరం దిగజారింది. లేచి కూర్చుని తన చిట్టి పంజాతో చిన్న డప్పును వాయించింది. అసలు తన ప్రియుడ్ని ఆశ్చర్యంలో ముంచుదామని డప్పువాద్యం నేర్చుకుంది. చిట్టి కుందేలు తల్లి వృద్ధ వితంతువు సంతోషంతో ఒళ్లు మరచిపోయింది. అల్లుడికెక్కడ పీటవేయాలి, ఎక్కడ ఆకువేయాలి, ఏం వడ్డించాలి అన్న ఆలోచనలతో అతలా కుతలమైపోయింది. పెళ్లికూతురు చుట్టాలు, పక్కాలు, స్నేహితులు పరుగులు పెట్టుకుంటూ వచ్చారు. పెళ్లికొడుకెలా వుంటాడో చూడాలని తహతహ. పెళ్లి విందుమీద యావ.

పెళ్లి కొడుక్కి మాత్రం ముళ్లమీద కూర్చున్నట్టుంది. పెళ్లి కూతురికి రెండు ముద్దులైనా పెట్టలేదు. అప్పుడే 'త్వరత్వరగా మంగళ స్నానాలు కావాలి. వెంటనే పెళ్లి అయిపోవాలి' అని గొడవ ప్రారంభించాడు.

'ఏం బాబూ ఏమిటా తొందర?' అంది అత్తగారు ముసిముసి నవ్వులు ఒలికిస్తూ.

'నేను రేపే వెళ్లిపోవాలి. తోడేలు ఒక్కరోజు మాత్రమే సెలవిచ్చింది'

వెక్కి వెక్కి ఏడుస్తూ కథంతా చెప్పింది కుందేలు. అసలు వెళ్లడానికి కాళ్లు రావడంలేదు. అయినా వెళ్లాలి. మాట ఇచ్చిందాయె మరి. కుందేళ్లకు మాట నిలకడ వుండాలి. వచ్చిన చుట్టాలు పక్కాలూ అంతా సలహా సంప్రతింపులు చేసి, వారు కూడా

అదే అభిప్రాయానికి వచ్చారు. 'నిజమే బాబూ. మాటంటే మాటే. నిలబడి తీరాలి. మాట తప్పిన కుందేలు మన చరిత్రలో ఎక్కడా లేదు' అన్నారు.

చెప్పడానికి ఎక్కువసేపు పట్టదు. కానీ కుందేళ్లలో చేయడానికి కూడా ఎక్కువసేపు పట్టదు. ఉదయానికల్లా కుందేలుకి వివాహం అయిపోయింది. సాయంత్రం కొత్త పెళ్లికూతురివద్ద సెలవు తీసుకుని బయలుదేరింది.

'తోడేలు నన్నెలాగూ తినేస్తుంది. తప్పదు. నీవు మాత్రం పాతివ్రత్యానికి హాని రానివ్వకు. పిల్లలు పుడితే వాళ్లను పాడుచేయకు. వాళ్లు డప్పువాద్యమే కాదు. రెల్లు గొట్టంలోంచి బటాణీలను ఉండేలు గుళ్లలా ఊదడం కూడా నేర్చుకుంటారు'.. అలా అని వెంటనే ఏదో కలకన్నట్టు (బహుశా తోడేలు జ్ఞాపకం వచ్చివుంటుంది).. 'బహుశా తోడేలు క్షమించవచ్చునేమో' అంది కుందేలు. అవే కడసారి చూపులు.

ఇక్కడ కుందేలు పెళ్లి వేడుకలలో ప్రియురాలితో సరససల్లాపాల్లో వుండగా, ఈ దేశానికీ, తోడేలు గుహవున్న దేశానికీ మధ్య మహా ఉత్పాతాలు వచ్చాయి. వానలుపడి ఒకచోట ప్రళయమే వచ్చింది. వచ్చేటప్పుడు కుందేలు దారిలో ఏరును అవలీలగా దాటగలిగింది. కానీ ఇప్పుడా ఏటికి వరదపోటు తగిలి కోసెడు వెడల్పున సుడులు తిరుగుతూ పారుతోంది. మరొకచోట మన కుందేలు వెళ్లవలసిన దారిలో నాపరాజుగారు నూపరాజుగారి మీదికి దండెత్తి వచ్చారు. ఇప్పుడక్కడ ఇరువాగులవారికీ తుముల యుద్ధం సాగుతోంది. ఇంకొకచోట మహమ్మారి గత్తర వ్యాపించింది. అందుకని మన కుందేలు పాతికామడలు చుట్టుతిరిగి పోవలసి వుంటుంది.

అదీగాక అడుగడుగునా ఎన్ని తోడేళ్లు, ఎన్ని నక్కలు పొంచివున్నాయో ఏమో!

మన కుందేలు చాలా జాగ్రత్తగలది. తాను ప్రయాణం చేయవలసిన దూరాన్ని, తనకున్న వ్యవధిని జాగ్రత్తగా బేరీజు వేసింది. మూడు గంటలు ముందే బయలుదేరింది. కానీ దారిలో అడుగడుగునా అడ్డంకులు ఎదురవడంతో పాపం నరాలన్నీ చప్పబడ్డాయి. గుండెలు బేజారెత్తాయి. పగలల్లా పరుగెత్తింది. రాత్రల్లా పరుగెత్తింది. సూదుల్లాంటి రాళ్లు గుచ్చుకుని అరికాళ్లు నెత్తుర్లు చిమ్మాయి. ముళ్ల పొదలకు వళ్లంతా గీరుకుపోయింది. కగ్రాకంపా కాళ్లకు అడ్డంపడ్డాయి. కళ్లు బైర్లుకమ్మాయి. నోటివెంట నెత్తుటి నురగలు కక్కాయి. ఇంకా పరుగెత్తవలసిన దూరం చాలా వుంది. అక్కడ తోడేలు దగ్గర ఖైదీగా వున్న తన బావమరిది రూపు మనసులో మెదులుతోంది. తోడేలు గుమ్మం ముందు కావలి కాస్తూ తన బావగారు ఎప్పుడు వస్తారా, ఎప్పుడు వస్తారా అని గంటలు లెక్కపెడుతున్నట్టు కనిపించింది. అడవులు, కొండలు, ఏరులు, వంకలు ఏవీ లెక్కకు రావడంలేదు. గుండె పగిలిపోయేటట్టుంది. అనవసరమైన ఆందోళన రాకుండా వుండేందుకని గుండెకాయ తీసి చేత్తో పట్టుకుంది. కన్నీళ్లకిది సమయం కాదు. చింతలూ

వంతలూ ఇప్పుడు పనికిరావు. అక్కడ మిత్రుడు అపాయంలో వున్నాడు. అతడిని తోడేలు బారినుంచి తప్పించాలి. అదొక్కటే కుందేలుకున్న ఆలోచన.

తెలతెలవారవచ్చింది. గబ్బిలాలు, గుడ్లగూబలు గూళ్లకు తిరిగిపోతున్నాయి. వేకువ చలిగాలి వీస్తోంది. అంతలో ప్రాణాలెగిరి పోయినట్టు తోచింది. అయినా కుందేలు పరుగు మానలేదు. 'సరియైన సమయానికి చేరుకోగలనా?' అన్నదొక్కటే మెదడులో మెదులుతున్నది. తూరుపు ఎర్రవారింది. తొలిసంజె వెలుగు దూరాన మబ్బులకు మలామా పూస్తోంది. వెలుగు క్రమంగా విస్ఫారింది. భళ్లుమని తెల్లవారింది. పచ్చగడ్డిమీది మంచుబొట్లు వెలుగుపడి మిలమిల మెరిశాయి. పక్షుల కలకూజితాలు విన్పిస్తున్నాయి. చీమలు జీవనయాత్ర ప్రారంభించాయి. ఎక్కడనుంచో పొగలాంటి ఒక తెరకమ్మింది. పొలాలమీద గలగల ధ్వనులు పారాడాయి. కానీ కుందేలుకు ఇవేవీ వినిపించడంలేదు, కనిపించడంలేదు. 'లేదు, మా నేస్తం ఇక లేదు!' అని ఒకటే గొణుగుడు.

ఇక్కడొక కొండ, ఆ తర్వాత చిత్తడి బీడు. అది దాటితే తోడేలు గుహ. 'అయ్యో కుందూ వెనకబడ్డావోయి' అని స్వగతంగా అనుకుంది. నవనాడులూ కూడదీసుకుని కొండమీదికి ఎగబాకింది. అమ్మయ్య అనుకుంది. అంతే.. ఇంక సత్తువ లేదు. సమయానికి చేరుకోలేదు.

అక్కడికి ఎదురుగానే వుంది గుహ. ఎక్కడో దూరాన గడియారం ఆరు కొట్టింది. ఒక్కొక్క గంటా కుందేలు గుండెమీద సమ్మెట పోటులా పడింది. ఆరో గంట కొట్టగానే తోడేలు ఇవతలికి వచ్చింది. ఒక్కసారి ఒళ్లు విరుచుకొని, తోక ఆడించి చూసింది. ఖైదీ పొట్టలో గోళ్లు గుచ్చి తనకొక చెక్కా, భార్యకొక చెక్కా చీల్చుదామనుకుంది. తోడేలు పిల్లలు కూడా ముకుపుటాలాడిస్తూ పళ్లు గీటుతూ అమ్మదగ్గరే వున్నాయి. అవి నాన్న చేస్తున్న దానిని చూస్తూ పాఠం నేర్చుకుంటున్నాయి.

ఇంతలో 'ఇదిగో వచ్చాను' అని కోటి కుందేళ్ల బలంతో అరిచి, కొండ కొమ్మునుంచి కిందికి దొర్లింది కుందేలు.

తోడేలు కుందేలును ప్రశంసించింది.

'కుందేళ్లను నమ్మవచ్చునని ఇప్పుడు తెలుసుకున్నాం. సరే ఇదిగో నా నిర్ణయం. నా అవసరం వచ్చేవరకూ మీరిద్దరూ కూడా ఈ తుప్పకిందే కూర్చోవాలి. ఏమో.. ముమ్ముందు నిన్ను క్షమిస్తానేమో!'



పాప పుణ్యాలు



పాప పుణ్యాలు కలహించి పూర్వం ఎప్పుడో విడిపోయాయి. పాపాలు తెలివితేటలతో వ్యవహరించి సుఖంగా జీవితం గడుపుతున్నాయి. కానీ పుణ్యాలకు బతుకు వెళ్లమారడమే గగనంగా వుంది. అయితేనేం బాలశిక్షల్లోనూ, వాచక పుస్తకాల్లోనూ వాటికి మంచి ప్రశస్తి వుంది. కీర్తి ప్రతిష్టలెన్ని వున్నప్పటికీ 'అయ్యో మనంకూడా పాపాల్లాగే సుఖంగా బతకడానికి ఏమైనా చేస్తే ఎంత బాగుండును?' అని అప్పుడప్పుడు అనుకోవడం కద్దు. కానీ ఆ పని మాత్రం చేయలేకపోయేవి.

వారిలో వారికి కలహం ఎందుకు వచ్చిందో, ముందు ఆ కయ్యాన్ని ఎవరు ప్రారంభించారో చెప్పడం కష్టం. బహుశా తొలుత పేచీ పెట్టింది పుణ్యాలే కావచ్చును. పాపానికిప్పుడు మంచి పలుకుబడి వుంది. నానా రకాల చిలిపి చేష్టల్లోనూ సిద్ధహస్తుడు. వాడు మొదట విహారానికి బయలుదేరినప్పుడు పెద్ద పెద్ద అంగలు వేస్తూ ప్రపంచాన్నంతా చుట్టబెట్టాడు. పట్టుపీతాంబరాలు, బంగారు భూషణాలూ తొడిగి జగాన్ని మిరుమిట్లు గొలిపాడు. పుణ్యాలు వాడి ముందు వెలవెలపోయాయి. అది చూసిన పుణ్యాలకు చాలా మనస్తాపం కలిగింది.

'ఒరే! దగాకోరూ నీ పట్టుపీతాంబరాలతో ఎంతకాలం కులుకుతావులే! ఎప్పటికైనా

చింకిరిపాతలు కట్టిన మమ్మల్నే ప్రజలు గౌరవిస్తారు' అని పుణ్యాలు పాపాన్ని శాపాలు పెట్టాయి.

'తథాస్తు. అలాగే గౌరవం పొందండి' అని పాపాలు జవాబిచ్చాయి.

పాపాలు ఇలా వెక్కిరించడం చూసి పుణ్యాలకు ఒళ్లు మండింది. పాపాలను తిట్టుకుంటూ దేశంమీదికి బయలుదేరాయి. చింకిపాతలు, జీబు జుట్టుతో వీధి మొగల్లో నిలిచి దారేపోయేవాళ్లనందర్నీ పిలిచి 'ఇదిగో మీరంతా బుద్ధిమంతులు, మేం చింకిపాతలతో వున్నప్పటికీ మమ్మల్నేగా మీరు అభిమానిస్తున్నారు. నిజం చెప్పండి' అని ఊదరపెట్టాయి.

'ఇదుగో ఇటీవల మీ గొడవ మరీ ఎక్కువయింది. దారికడ్డంలెండి. మీకు పుణ్యం వుంటుంది' అని దారినపోయే వారంతా అనేవారు.

పుణ్యాలు న్యాయస్థానాలకు విన్నపాలు పంపుకున్నాయి. తమ రక్షకులైన పోలీసులను కదిలించి చూశాయి.

'మీ కళ్లెక్కడున్నాయి! ప్రజల కళ్లేలు విడిచిపెట్టేస్తే ఎలాగ? వాళ్లు పాపకూపంలో పీకల్లోతు మునిగి వున్నారని తెలుసునా?' అని ప్రశ్నించాయి.

కానీ పోలీసులు ఉలకలేదు, పలకలేదు. పాపాలను చూస్తే మాత్రం కొయ్యల్లా నిలబడి శాల్యూట్ చేసేవారు. పుణ్యాలు హతాశులై బెదిరింపులకు దిగాయి.

'వుండండి.. వుండండి. ఇంతకింతా అనుభవించి తీరుతారు' అని శాపాలు పెట్టాయి పుణ్యాలు!

ఇలా వుండగా పాపాలు ఆనాటికానాడు వీరవిహారం ప్రారంభించాయి.

'ఓహెూ! ఏం పిల్లి శాపాలు! ఇంతకింతా అనుభవిస్తామా? మా మాట ఏమో కానీ మీరు పుట్టినప్పటినుంచీ మాత్రం నరకం అనుభవిస్తూనే వున్నారు. ఆ రూపం చూడండి. పగలు చూస్తే రాత్రి కల్లోకి వచ్చేట్టుంది. ఒట్టి ఎముకల గూళ్లు. కోపంతో పళ్లుకొరకడం తప్ప వ్యవహార జ్ఞానం మాత్రం లేదు' అని పాపాలు, పుణ్యాలమీదికి లేచాయి.

ఇలాగ రోజులు గడిచినకొలదీ వీరి వైషమ్యం ముదురుతూనే వచ్చింది. ఒక్కొక్కప్పుడది సిగపట్లవరకూ వచ్చేది. అలాంటప్పుడు అదృష్టం సాధారణంగా పుణ్యాలను విడిచిపెట్టి పోయేది. గెలిచిన పాపాలు ఓడిన పుణ్యాలకు అరదండాలు తగిలించి 'అల్లరిమూక. కదలకుండా ఇక్కడే పడుండండి' అని పోయేవి. కొత్త అధికారులు వచ్చి విముక్తి కలిగించేవరకూ పుణ్యాలు అలాగే బందీలై పడివుండేవి.

ఒకసారి వీరిలాగ జుట్టూ జుట్టూ పట్టుకుంటూ వుండగా పరమానందయ్య ఆ దారిన వచ్చాడు వీరిని చూసి.

'ఏమిటీ తెలివితక్కువ పని... మీకేమైనా మతి వుందా లేదా? ఆదిలో మీరంతా

ఒకలాగే వుండేవారు. అంతా "గుణాలు" మాత్రమే. ఆ తర్వాత మనుషుల లోభమోహాలవల్ల పాప పుణ్యాలు ఏర్పడ్డాయి. కొన్ని గుణాలను అణచివేసి మరికొన్నింటికి స్వేచ్ఛనిచ్చారు. దానితో అంతా తారుమారూ తలక్రిందులూ అయింది. సంక్షోభం, విద్వేషం, విషాదం అవతరించి ప్రపంచాన్ని అలముకొన్నాయి. అందుకని మీ ఆదికాలంవైపు దృష్టి సారించండి. బహుశా మీలో ఐక్యత పుట్టవచ్చును' అని చెప్పి, పరమానందయ్య ఖజానాలో పన్నులు కట్టడంకోసం తన దారిన తాను పోయాడు.

పరమానందయ్య మాటే పనిచేసిందో లేక పోరిపోరి అలసటే వచ్చిందో... ఏమైతేనేమి వారు కత్తులు కిందపెట్టి ఆలోచనలో పడ్డారు.

పుణ్యాలు బుర్ర బద్దలయేలాగ తెగ ఆలోచించాయి. ఆకలిగొట్టు దరిద్రులు అంతకన్న చేసేదేముంది? ఇక పాపాలు పోరు చల్లారగానే తమ అల్లరిచిల్లరి వ్యాపకాల్లో మునిగిపోయి అందరిచేతా ఓహెూ అనిపించుకున్నాయి.

'ఆ పరమానందయ్య గుణాలను గురించి వాగడం బాగానే వుంది. గుణాల సంగతి వాడికెంత తెలుసునో మనకీ అంతే తెలుసును' అంది వినయం. పుణ్యాలలో మొదట నోరు విప్పింది ఇదే.

'పట్టు ఉడుపులు తొడిగి, బంగారం తిని కొన్ని గుణాలు దర్జాగా తిరుగుతూ వుంటే, మరికొన్ని గుణాలు ఆకలికి నకనకలాడుతూ చింకిపాతలతో తిరగవలసి వస్తున్నది. పీకలదాకా మెక్కి బ్రేవ్ అని తేనుస్తూ మనకు చెప్పొచ్చాడు ఆ పరమానందయ్యగాడు. ఇలాంటి నీతులకు లొంగే ఘటాలు కావివి' అంది వినయం.

'అసలు వాడీ గుణాలను ఎక్కడినుంచి తవ్వుకొచ్చాడయ్యా?' అని ప్రశ్నించింది మర్యాద.

'అసలు వాడి మాటలు మతిమాలిన మాటల్లా కనిపించడంలేదూ? పుణ్యాలు పుణ్యాలే. పాపాలు పాపాలే! శతాబ్దాలు సహస్రాబ్దాలుగా అవి అలాగే వున్నాయి. ఈ విషయాన్ని గురించి శతసహస్రాదిక గ్రంథాలు వెలువడ్డాయి. ఇప్పుడు వీడెవడో వచ్చి తనే మహా తెలివైన వాడిలాగా అన్నీ కేవలం గుణాలే అంటున్నాడు. ఎందుకూ.. ఆ వేలూ లక్షలూ పుస్తకాలు తీసి చూడు. వాటిలోంచి ఎంత దుమారం రేగుతుందో!' అంది మర్యాద.

ఇలాగ కొంతసేపు సిద్ధాంత రాద్ధాంతాలు జరిపి మర్యాద అన్న మాటలు అక్షరాలా నిజం అని నిర్ణయించాయి.

ఎన్ని వేల శతాబ్దాలనుంచో పుణ్యాలు పుణ్యాలుగాను, పాపాలు పాపాలుగాను వుంటున్నాయి. ఈ విషయాన్ని గురించి మహామహులు వేలాది గ్రంథాలు రచించారు. అవి రాయడానికి కాగితాల కొండలు, సిరా సముద్రాలు ఖర్చు అయి వుంటాయి. పుణ్యాలు సదా కుడివైపున, పాపాలు ఎడమవైపున వుంటూ వచ్చాయి. ఇప్పుడెవరైనా

హటాత్తుగా ఈ మూర్ఖుడిని నమ్మితే అంతటినీ కొట్టిపారేసి కేవలం 'గుణాల'ను మాత్రమే మిగల్చవలసి వస్తుంది. ఒకరి హోదాని, అంతరువుని తీసివేసి కేవలం 'మనిషి' అనడం ఎంత చెడ్డదో ఇదికూడా అంతే చెడ్డది. ఇది చాలా సామాన్యంగానే కనిపించవచ్చును. కానీ సామాన్యత అనేది దోపిడీకన్నా దారుణంగా వుండే రోజులున్నాయి. సామాన్యంగా ఎందులోనైనా వేలుపెట్టిచూడు.. ఆదిలోనే ఎన్ని హంసపాదులు ఎదురవుతాయో! తలకాయ మెడమీద మిగిలిందా అదృష్టవంతుడవే.

అబ్బే లాభంలేదు. ఈ గుణాలను గురించి ఆలోచించి ప్రయోజనం లేదు. ఏదో రాజీకి రావడం (లేదా బేరం కుదుర్చుకోవడం) చాలా మంచిది. ఆ బేరం పుణ్యాలకు హుషారిచ్చేదిగా వుండాలి. పాపాలకు ఫర్వాలేదనిపించాలి. పాపాలు కూడా అప్పుడప్పుడు చిక్కుల్లో పడుతూనే వున్నవాయె. మొన్ననే కదా లోభం కన్నంలో దొంగలాగా దొరికిపోయింది. ఇప్పుడు దానిమీద కేసు నడుస్తోంది. ఆ రాత్రే వ్యభిచారాన్ని దిగంబరంగా మేడ మీదనుంచి కిందికి తోసివేశారు. మొన్నమొన్నటి దాకా స్వేచ్ఛాలోచన పని మూడు పూవులూ ఆరు కాయలుగా వుండేది. ఇప్పుడు దాన్ని కూకటివేళ్లతో కుళ్లగించేశారు. అందుకని ఏదో బేరానికి దిగడంవల్ల పాపాలకు కలిగే నష్టమేమీ లేదనిపిస్తోంది.

'ఓ పుణ్య మహాశయులారా! ఏమిటి మీ సలహా? మీలో పాదరసంలాంటి బుద్ధి ఎవరిది?'

ఈ ప్రశ్నకు మొదట జవాబిచ్చింది ముసిలి వగ్గు అనుభవం. (అనుభవాల్లో కూడా రెండు రకాలున్నాయి. ఇది పుణ్యాలకు చెందిన అనుభవం). అనుభవం చేసిన ప్రతిపాదన ఇది:

'పుణ్యాలకు గౌరవపాత్రుడు, పాపాలకు ఆమోదయోగ్యుడు అయిన ఒక మణిపూసను వెదకండి. అతడి చేతికి సంధి పతాకాన్నిచ్చి శత్రు శిబిరానికి పంపించండి'

వారంతా అటూ ఇటూ వెతగ్గా వెతగ్గా వారికి కావలసిన మణిపూస ఇద్దరు ప్రౌఢల రూపంలో దొరికింది. ఒకరిపేరు మితవాదిని. ఇంకొకరి పేరు చండశాసని. వీరిద్దరూ పుణ్యాల బస్తీ మురికిపేటలో వుంటున్నారు. వీరు దిక్కూదివాణంలేని అనాధలు. కాపుసారా అమ్మడం వారి వ్యాపారం. పాపాలతో వారికి లావాదేవీలు వున్నాయి.

ఈ అనాధలంత అందగత్తెలు కారు. వారికి అప్పజెప్పిన పనిలో జాణలు కూడా కాదు. వారు పాపాల శిబిరంలో అడుగుపెట్టి మెల్లిగా తమ వచ్చిన పనిని ప్రస్తావించేసరికి పాపాలన్నీ వారిమీద విరుచుకుపడ్డాయి.

'ఈ సోదంతా ఇంతకుముందు విన్నదే కానీ ఇక దయచేయండి. ఇందాకటినుంచీ ఊదరపెట్టింది చాలును. ఊ.. త్వరగా కదలండి. కాలికి బుద్ధిచెప్పండి'

ఈలాంటి సంధిబేరాలకు తాము లొంగే బాపతు కాదని చెప్పడంకోసం పాపాలు ఆ రాత్రి అంతా సమర్కంద్ హెూటల్లో విందు వినోదాలతో గడిపాయి. ఉదయం హెూటలునుంచి పోతూపోతూ వ్రతాన్ని, మానాన్ని వడేసిపట్టాయి. పాపం ఆ ఇద్దరమ్మాయిల్నీ పాపాలు చేసిన పనిని రాయడం కష్టం. సమర్కంద్ హెూటల్లోని తాతార్‌ఖానులకు కూడా ఆ దృశ్యాన్ని చూసి జుగుప్సతో ఒళ్లు జలదరించింది. 'చూడ్డానికి మంచి పెద్దమనుషుల్లా వున్నారు. వారు చేస్తున్న పని చూడండి' అని ఖానులు ముక్కుమీద వేలేసుకున్నారు.

దీనితో పరిస్థితులు విషమించాయని పుణ్యాలు గుర్తించాయి. వ్యవహారాన్ని ఇంక ముదరనీయరాదని నిశ్చయించాయి.

ఆ దశలో వారిలోంచి ఒక నపుంసక లింగం ఉద్భవించింది. అది మగువా కాదు, మగవాడూ కాదు. ఉభయుల కలగలుపు. పుట్టడంతోనే పెరిగి పెద్దదయింది. ఇదమిత్థమని చెప్పడానికి వీల్లేని ఈ అర్థనారీశ్వరం పేరు కపటం!

దీని పుట్టుక మొదలుకొని ప్రతిదీ రహస్యమే. దీన్ని గురించి ఎవరికీ ఏమీ తెలియదు. ఒకప్పుడు నిష్ఠ, కామం చీకటి తప్పు చేశాయనీ, దాని ఫలమే ఈ బిడ్డ అనీ వృద్ధులు అంటూ వుండేవారు. ఈ బిడ్డను పుణ్యాలన్నీ కలిసి సాకాయి. గొప్పింటి బిడ్డలకోసం శ్రీమతి డాంబికం నడిపిస్తున్న పాఠశాలలో చదివించాయి. కపటం ఎప్పుడు చూసినా తలవంచుకునే కనిపించేది. అయితే అప్పుడప్పుడు దాని ముఖంలో శ్రీమతి కామం ఛాయలను పరిశీలకులు కనిపెట్టారు. అప్పుడప్పుడది నడుస్తూ వుంటే ఆ కదలిక మర్యాదకు భిన్నంగా కూడా వుండేది. శ్రీమతి డాంబికంగారి పాఠశాలలో కపటం అన్ని విద్యలనూ కూలంకషంగా అభ్యసించింది. తైరు కొట్టడం, చెవులు కొరకడంలాంటి శీలాలను అలవర్చుకుంది. మిడిసిపాటు నృత్యంలో నైపుణ్యం సంపాదించింది. అంతటితో ఆగితే బాగుండేది. శ్రీమతి డాంబికం కపటం తలిదండ్రుల సంగతంతా చెప్పేసింది.

మీ అమ్మ కామం విలాసానికి పెట్టింది పేరు. కనిపించిన వారినల్లా కుట్టనిదే ఊరుకునేది కాదు. ఇక మీ నాన్న నిష్ఠ అంత అందగాడు కాదు. కానీ ఎవరైనా పొడిచినప్పుడు అతడు వేసే కేక మాత్రం చాలా అందంగా వుండేది అని శ్రీమతి డాంబికం చెప్పింది.

ఇలా తరిఫీదు పొందిన కపటాన్ని పుణ్యాలు తమ రాయబారిగా ఎన్నుకున్నాయి. కపటం ఎన్నడూ తలెత్తి చూసేది కాదు. కానీ కడకంటి చూపుల్లోంచి కామం తళుక్కుమంటూ వుండేది. తమకూ పాపాలకూ మధ్య కపటం సంధి కుదర్చగలదని పుణ్యాలు భావించాయి.

'అయితే నీవు మా మాదిరిగా ఎలా నడుచుకుంటావు?' అని ధైర్యం ప్రశ్నించింది..

ముందు రాయబారిని పూర్తిగా పరీక్షిస్తే తప్ప లాభం లేదనుకుని. 'ఏమిటి ఈ ప్రశ్న నన్ను అడుగుతున్నారు?' అని ఆశ్చర్యంతో అడిగింది కపటం. 'ఇదుగో ఇలాగా' అనిచెప్పి బుగ్గలు ఎర్రపడగా చేతులు కట్టుకొని నిలబడింది. శుద్ధ అమాయకురాలైన ముగ్ధ! ఇంతకన్నా ఏం కావాలి?

'ఓహెూ అద్భుతం! అద్భుతం! సరే పాపాలలాగా ఎలా ప్రవర్తిస్తావు?

ఈ ప్రశ్నకు కపటం జవాబివ్వలేదు. ఆ వెంటనే ఏదో చేసింది. కానీ ఏం చేసిందో ఎవరికీ తెలియలేదు. ఒక్క నిశితదృష్టి మాత్రమే దాన్ని కనిపెట్టింది. జుగుప్సతో కుంగిపోయింది.

అప్పుడు పుణ్యాలు తమ వ్యవహారాలన్నీ నిర్వహించడంకోసం కపటానికి పవరుపట్టా ఇవ్వాలని ఏకగ్రీవంగా నిర్ణయించాయి. ఈ పవరు పట్టాను ప్రఖ్యాత చెట్టుకింద ప్లీడరు ఫలానాచేత రాయించాలని కూడా నిశ్చయించాయి.

కపటం పాపాల నగరానికి ప్రయాణమయింది. 'ఈ కుళ్లు చాలా దూరం వ్యాపించిందే!' అని ప్రకాశంగా అని, 'పాపాల జీవితం ఎంత హాయిగా వుంది!' అని స్వగతంగా మెచ్చుకుంది. పుణ్యాల బస్తీనుంచి ఒక మైలు కూడా సాగిందో లేదో కపటం చుట్టూ నవ్వులు, నాట్యాలు, ఆటలు పాటలతో గాలి మత్తెక్కింది. పాపాలు నిర్మించుకున్న నగరం ఎంత అందంగా వుంది! విశాలమైన వీధులు, వీధులకు ఇరువైపులా బారులు తీరిన దీపాలు, మధ్యమధ్య ఉద్యానవనాలు, చౌకులు, కూటసాక్ష్యాల వీధి, కుమ్మక్కు చౌకు వున్నాయి. అప్రతిష్ట రోడ్డు అనేది కూడా ఒకటుంది. అక్కడ అబద్ధయ్యకొక దుకాణంకూడా వుంది. టోకుగాను, చిల్లరగాను అపవాదులనక్కడ అమ్ముతూ వుంటారు.

జిత్తులలోనూ, ఎత్తులలోనూ ఆరితేరిన పాపాలు కూడా కపటాన్ని చూసేసరికి అలాగే బిత్తరపోయాయి. చూడ్డానికి ముగ్ధలాగా కనిపిస్తోంది. కానీ నిజానికి ముగ్ధేనా అని అనుమానం. అవునో కాదో దేవుడికి కూడా తెలియదు. ఈ ప్రపంచంలో తనకు ధీటురాగల కల్మషంలేదని గర్వించే అబద్ధయ్య కూడా అలా కళ్లప్పగించి నిలుచుండిపోయాడు.

'ఈ ప్రపంచంలో నన్ను మించిన చీడపురుగు మరొకడు లేడని అనుకుంటూ వుండేవాడ్ని. అలా అనుకోవడం శుద్ధ తెలివితక్కువ' అనుకున్నాడు అబద్ధయ్య.

'ఇదిగో ఇది అసలైన విషప్పుచ్చె. నాదంతా ముక్కుకు సూటిగా పోయే వ్యవహారం. అందుకనే అప్పుడప్పుడు నాలుగు తాపులు, మూడు హెచ్చరికలు తగులుతూ వుంటాయి. కానీ ఈ మణిపూస తగులుకుందా నిలువునా చీల్చినా, చీల్చి పేనినా విడిచిపెట్టడం వుండదు'

కపటంగారి ఆగమనంతో ఎంత ఉత్సాహం పెల్లుబికినప్పటికీ ఇక్కడకూడా చిన్న

పేచీ ఒకటి పుట్టకపోలేదు. పాపాల్లో సంప్రదాయానికి ఎక్కువ గౌరవం ఇచ్చే పెద్దలు వితండం, డంబం, అసూయలాంటి వారు కపటానికి ఎదుర్కోలు ఇవ్వడానికి ఒప్పుకోలేదు. అంతటితో ఊరుకున్నారా? 'నిజమైన పాపానికి మర్మం అవసరంలేదు' అని హెచ్చరించారు.

'ఇదేదో మనమీద ధ్వజం ఎత్తి వచ్చింది. కానీ మనలో లేని ప్రత్యేకత దీనిలో ఏం వుంది? తరతరాలుగా మనకు కరతలామలకమైన విద్యలకన్నా దీనికి ఎక్కువేం తెలుసును? ఏమీ లేదు. పైగా ఇది మన వాదాలను మన మీదకే తిప్పే ప్రమాదం వుంది. అప్పుడు మన పరిస్థితికి మనం సిగ్గుపడవలసిన అవసరం లేకపోయినా దాదాపు అంతపనీ చేయవలసిన దుస్థితి కలుగుతుంది. ఇంతవరకూ మనకు అనుయాయులకు కొదవలేదు. కానీ వారుకూడా ఈ వాదాన్నే నేర్చుకుని ఈ పాపాలు నిజంగా చాలా పెచ్చుపెరిగి పోయాయని చెప్పి వారంతా మనలను విడిచిపెట్టిపోతారు. ఆ తర్వాత మన మొహం చూసే దిక్కుండదు. చూస్తూ వుండండి!'

వితండం, డంబం, అసూయ మున్నగు పాపాలకు కొత్త ఆలోచనన్నా, కొత్త ధోరణి అన్నా, కొత్త మార్పులన్నా గిట్టవు. వాళ్లు పుట్టింది పేడకుప్పల మీద. అక్కడే మునిగితేలుతూ తమ తాతల ఆచారాలను తూచ తప్పకుండా నడుస్తూ వుండాలనేది వారి మతం.

వీరిలాగే కపటం విషయంలో మూతి విరిచినవి మరికొన్ని వున్నాయి. కపటం అంటే వీటికి గిట్టక కాదు. ఇవి కపటం సహాయం లేకుండానే పుణ్యాలతో లావాదేవీలు పెట్టుకున్నాయి. దగా, ద్రోహం, మోసం, కొండెం వగైరాలు ఈ బాపతు. వీరు కపటానికి స్వాగతం చెప్పలేదు. చప్పట్లు కొట్టలేదు. మర్యాదలు చేయలేదు. 'మరేం ఫరవాలేదు. ఇది మీ ఇల్లే అనుకో' అన్నట్టు కళ్లు మాత్రం గీటాయి అంతే.

ఏమయితేనేం. కపట రాయబారం ఫలించడం ఖాయం. యువకులైన కామం, మోహం, మదం, మధుపానం మున్నగువారు కపటానికి బ్రహ్మాండమైన స్వాగతం ఇచ్చారు. దాన్ని చూసి వితండం అంతటివాడు విధిలేక సణుగుడు కట్టిపెట్టవలసి వచ్చింది.

'ఇదుగో ముసిలి తొత్తుకొడుకుల్లారా! మీరు ప్రజలను ఊరికే పీడిస్తున్నారు. మీరు మమ్మల్ని కూడా సుఖంగా బతకనీయడంలేదు' అని యువకులు ముసిలివారిమీద పడ్డారు.

'ఇకపైన వాచక పుస్తకాల్లో మా పేరుంటుంది. సర్వత్రా మాకు పూజలు జరుగుతాయి. బాలరండలు మమ్మల్ని భక్తితో కొలుస్తారు'

సరే. సంధి షరతులు కుదిరాయి. కపటం తిరిగివచ్చి తన రాయబార విశేషాలను పుణ్యాలకు తెలియపరిచింది. పుణ్యాలు, పాపాలు శత్రుకూటాలుగా చీలివుండడం

పనికిరాదు అని ఏకగ్రీవంగా తీర్మానించారు. అయితే పాత పేర్లను మాత్రం రద్దు చేయడానికి వారు ప్రయత్నం చేయలేదు. ఏమో ఏ కాలానికి ఎలా వుంటుందో! ఈ ఒప్పందాలకు విలువేమిటి? బూడిద బుగ్గికాక!

అప్పటినుంచీ పుణ్యపాపాలు పరస్పర ఆదరభావంతో మెలగసాగాయి. అవినీతికి నిష్టతో కాలక్షేపం చేయాలని బుద్ధిపుట్టినప్పుడు కపటానికి కైదండ ఇచ్చి కొనిపోయేది. వారిని దూరాన్నుంచి చూడగానే నిష్ట ఎదురేగి 'దయచేయండి, దయచేయండి. నిన్ననే మీ ప్రస్తావన వచ్చింది' అంటాడు.

లేకపోతే నిష్టకు అవినీతి అతిథిగా కాలక్షేపం చేయాలని బుద్ధిపుట్టినప్పుడు కపటాన్ని తన వెంట తోడ్కొనిపోతాడు. అవినీతి వారికి ఎదురేగి కైదండ ఇచ్చి 'దయచేయండి, దయచేయండి, నిన్ననే తమ ప్రస్తావన వచ్చింది' అంటుంది.

ఉపవాస వ్రతాలు చేసేటప్పుడు వారు ఒకరికొకరు ఫలహారాల విందులు చేసుకుంటూ వుంటారు. ఉపవాస వ్రతాన్ని విరమించినప్పుడు నిషిద్ధాహారం తీసుకుంటూ వుంటారు. ఒక చేత్తో పూజలు చేస్తూ, మరొక చేత్తో మహాదారుణ కృత్యాలు సాగిస్తూ వుంటారు. ఒక కన్ను ఆముష్మికం వైపు, మరొక కన్ను ఐహిక భోగాలవైపు. పుణ్యాలు తమ జీవితంలో మొదటిసారిగా షడ్రసోపేత భోజనాలు చేస్తున్నాయి. అయితే అంతమాత్రాన పాపాల స్థితి ఏమీ తరగలేదు. 'మన జీవితంలో ఇంత పసందైన విందులు ఎరగం' అని పుణ్యపాపాలు అనుకుంటూ వుంటాయి.

ఇక పాపం పరమానందయ్యకి విషయం ఈనాటికీ బోధపడ్డంలేదు. అసలు పుణ్యాలు, పాపాలు కేవలం గుణాలే కదా! అలాంటప్పుడు ఆ ఆదిరూపాన్ని తెలుసుకుని సఖ్యత సంపాదించడానికి బదులు కపటం ద్వారా ఈ రెండింటికీ సంధానం ఎలా కుదిరిందా అని పరమానందయ్య ఆశ్చర్యపోతూ వుంటాడు.



దగాకోరు ఎడిటర్



అనగా అనగా ఒక పత్రికా సంపాదకుడూ, ఒక పాఠకుడు. పత్రికా సంపాదకుడు పచ్చి అబద్ధాలకోరు. విధీ విరామం లేకుండా అబద్ధాలాడుతూ వుండేవాడు. పాఠకుడు అమాయకుడుడవడం వల్ల అన్నీ నమ్మేసేవాడు. అసలు ప్రపంచం పుట్టినప్పటినుంచీ ఇంతే. అబద్ధాలకోర్లు అబద్ధాలాడ్డం. అమాయకులు వాటిని నమ్మడం.

సరే.. పత్రికా సంపాదకుడు తన గుహలో కూర్చుని అబద్ధమాడేశాడు. 'ప్రియ పాఠకా జాగ్రత్త!' 'శీతజ్వరం వ్యాప్తి!' 'తొలకరినుంచీ వర్షాభావం!' 'కరువు ముంచుకొని వచ్చే సూచనలు' 'పల్లెలూ పట్నాలూ అగ్నికాహుతి!' 'ప్రైవేటు ప్రభుత్వ ఆస్తులను కొల్లగొట్టిన వైనం'... పాఠకుడు వీటన్నింటినీ మూటకట్టుకున్నాడు. పత్రికా సంపాదకుడు తన కళ్లు తెరిపించాడని నమ్మాడు. 'ఆహా! మనకు పత్రికా స్వాతంత్ర్యం వుంది. ఎక్కడ చూసినా అగ్ని, కరువు, శీత జ్వరాలు!' అని ఒక్క నిట్టూర్పు విడిచాడు.

తన అబద్ధాలు పాఠకుని మనసుకు హత్తుకొన్నాయని తెలిసిన సంపాదకుడు ఆ సంతోషంతో మరిన్ని పచ్చి అబద్ధాలు కుమ్మరించాడు. 'సాంఘిక భద్రత ప్రజల, మాన ప్రాణ రక్షణ, కలికానికి కూడా మిగల్లేదు! పాఠకుడా వీధుల్లోకి వెళ్లకుండా వుండడం మంచిది. వెళ్లావా అరదండాలు తగిలించి జైల్లో తోయడం ఖాయం!' అని హెచ్చరించాడు. అమాయక పాఠకుడు వీధులన్నింటినీ జాగ్రత్తగా పరికించాడు. 'భద్రత బొత్తిగా లేదని

పత్రికా సంపాదకుడు చెప్పిన మాటలు అక్షరాలా నిజంగా కనిపిస్తున్నాయి!' అనుకొన్నాడు. అది చాలనట్లు మరొక అమాయక పాఠకుడిని కలుసుకుని 'ఇవాళ పత్రిక చదివావా? భద్రతారాహిత్యాన్ని గురించి రాసింది అద్భుతంగా లేదూ? నీకు కూడా అలాగే అనిపించింది కాదూ!' అని అడిగాడు. 'నిజం! ఇంత దారుణం ఎన్నడూ లేదు' అని రెండవ అమాయక పాఠకుడు జవాబిచ్చాడు.

'అవునండీ. సరిగా మాడు పగలగొట్టాడంటే నమ్మండి. వీధుల్లో నడవడమే కష్టమైపోయింది. ఎప్పుడు అరదండాలు తగిలిస్తారో, ఎప్పుడు జైల్లో తోస్తారో ఏమీ చెప్పలేం'

ఇలాగ వారు పత్రికా స్వాతంత్ర్యాన్ని పొగుడుతూ మాట్లాడుకొన్నారు. 'ఇంతకు ముందు ఈ శీతజ్వరం సంగతి మనకేమీ తెలియదు. ఇప్పుడు తెలుసుకొన్నాం' అని తాము కొత్తగా ఆర్జించిన విజ్ఞానానికి వారంతా మురిసిపోయారు. పత్రికా సంపాదకుడిప్పుడు స్వయంగా వచ్చి ఇదంతా అబద్ధమన్నా లాభం లేదు!

ఇక పత్రికా సంపాదకుడు చాలా ఆనందించాడు. అబద్ధాలు అతనికి కనకరాసులు కురిపిస్తున్నాయి. అసలు నిజం రాసే వ్యాపారం ఎవరికి కావాలి? అయినా ప్రయత్నించి చూడండి. పంక్తికి దమ్మిడీ చొప్పున కూడా గిట్టుబాటు కాదు. ఇక అబద్ధాలన్నారా వాటి వ్యవహారమే వేరు. చేతికొచ్చిన చెత్త రాసిపారేయండి. పంక్తికి దమ్మిడీలు కొల్లలు కొల్లలుగా వస్తాయి.

పత్రికా సంపాదకుడు, పాఠకుడు ప్రాణస్నేహితులైపోయారు. సంపాదకుడు అబద్ధాలాడిన కొలదీ కోటీశ్వరుడయ్యాడు. అబద్ధాలకోరుకి అంతకన్న కావలసినదేముంది? ఇక పాఠకుడు ఎక్కువ అబద్ధాలు చదివిన కొలదీ ఎక్కువ పైసలు పత్రిక ఏజెంటుకు ధారపోశాడు. పత్రికా సంపాదకుడు చిల్లరగాను, టోకుగాను కూడా ధనమార్జిస్తున్నాడు.

గిట్టనివాళ్లతన్ని చూసి 'చూడవోయి, మొన్నటిదాకా వీడికసలు ఒంటిన సరైన బట్టలు కూడా వుండేవి కావు. అలాంటివాడు ఇప్పుడెలా ఊరేగుతున్నాడో చూడు! ఇప్పుడొక పక్షిగాడ్నీ జానపద కథా రచయితనీ కూడా కొలువులో పెట్టుకొని ఒక వెలుగు వెలుగుతున్నాడు!' అని రుంజుకుంటూ వుంటారు.

అతనిచేత నిజమైన వార్తలు రాయించాలని ఇతర పత్రికల వాళ్లు చాలా ప్రయత్నాలు చేశారు. బహుశా ఆ పత్రిక పాఠకులంతా తమ పత్రికలవైపు మొగ్గుతారేమోనని ఆశించారు. కానీ అలా జరగలేదు. పాఠకులు తమ పద్ధతిని మానలేదు.

హుషారుగొలిపే అబద్ధమొక్కటున్న చాలు
బలాదూరు దానిముందు పదివేల నిజాలు!

ఇలా ఎంతకాలం గడచిందో ఎవరికీ తెలియదు. కానీ కొంతమంది దయాళువులు అమాయక పాఠకుడిని గురించి చింతించారు. వారు దగాకోరు పత్రికా సంపాదకుడిని పిలిపించి 'సిగ్గూ లజ్జాలేని ఈ దగాకోరు వ్యాపారాన్ని కట్టిపెట్టు. ఇంతవరకూ అబద్ధాలమ్మి ధనమార్జించావు. ఇప్పటికైనా బుద్ధి తెచ్చుకుని నిజాన్ని అమ్ముకో' అని హితవు చెప్పారు.

క్రమంగా పాఠకుల్లో కూడా కొందరు విషయం గ్రహించి పత్రికా సంపాదకునికి లేఖలు రాశారు.

'మహాశయా! నిన్న రాత్రి నేనూ, మా అమ్మాయీ కలిసి అలా షికారు వెళ్లాం. ఆ రాత్రంతా లాకప్‌లో వుండవలసి వస్తుందని ముందే అనుకున్నాం. ఎందుకైనా మంచిదని ముందు జాగ్రత్తపడి ఇన్ని రొట్టెలు కూడా సంచీలో వేసుకున్నాం. జరగనున్నదంతా ఊహించుకునేసరికి ఒళ్లు గగుర్పొడిచింది. కానీ ఇద్దరమూ కూడా సురక్షితంగానే ఇంటికి తిరిగి వచ్చాం. ఇటీవల సాంఘిక భద్రతను గురించి మీరు రాసిన సంపాదకీయాలకూ, ఇప్పటి మా అనుభవాలకూ పొంతన కుదరడంలేదు. తమ రాతలకు అర్థం ఏమిటో సెలవిస్తారా?'

అసలిలాంటి లేఖలు వస్తాయని పత్రికా సంపాదకునికి ముందే తెలుసును. నిజం చెప్పాలంటే అతడికిప్పుడు అబద్ధాలాడి ఆడి విసుగు పుట్టింది. చాలా కాలంనుంచీ నిజం చెప్పడంకోసం ఉవ్విళ్లూరుతున్నాడు. అబద్ధాలు చెబితే తప్ప పాఠకులకు నచ్చనప్పుడేం చేయాలి? అబద్ధాలాడ్డం ఘోరమే అనుకోండి. కానీ బ్రతకాలంటే అబద్ధాలాడక తప్పదుమరి. ఇప్పుడంతా నిజం తెలుసుకోవాలని ఇంతలా కుతూహలపడుతున్నప్పుడు సంపాదకుడికి అభ్యంతరం ఏం వుంటుంది?

సంపాదకుడు తన పాఠకులకు దినదిన సత్యాలు పంచడం ప్రారంభించాడు. 'శీతజ్వరం మటుమాయమై పోయింది' ఇలాంటి వార్తలెలా వున్నాయి. లాకప్పులు లేవు. అగ్ని ప్రమాదాలు లేవు. ఫలానా ఊరు కాలిపోయినప్పటికీ దాన్ని తిరిగి పూర్వంకన్నా సుందరంగా నిర్మించారు. ఇటీవల పడ్డ వర్షాల మూలంగా పంటలు ఏపుగా పెరిగాయి. కావలసినంత తినడమే కాకుండా, కొంత మన కాళ్ల ముందు జర్మనీ వాళ్లకు కూడా పారేయవచ్చును. తీసుకోరా జ... కు...!

పత్రికా సంపాదకుడు కేవలం సత్య ప్రవచనాలనే రాసినప్పటికీ పంక్తికి పైసా చొప్పునే చెల్లించుకుంటూ వచ్చాడు. కానీ చిల్లర అమ్మకంలో నిజం విలువ పడిపోయింది. అప్పుడు నిజాలూ, అబద్ధాలూ రెండూ ఒకటేనని, నిజానికి రెండింటికీ కూడా విలువ శూన్యమేననీ కనిపెట్టాడు. పత్రికల వార్తలు చప్పపడలేదు. పైగా చాలా హుషారిచ్చేవిగా తయారయ్యాయి.

పాఠకుడు తేరుకున్నాడు. స్పష్టంగా చూడగలిగిన శక్తిని తిరిగి సంపాదించాడు.

అబద్ధాలని నిజాలని నమ్మిన రోజుల్లో పాఠకునికి బాధ అనిపించలేదు. ఇప్పుడు మనస్సుకు కావలసినంత శాంతి దొరికింది. రొట్టెల దుకాణానికి వెళితే 'రొట్టెలు చవక అయ్యేట్లు కనిపిస్తోందే' అని రొట్టెలవాడంటాడు. పిట్టల దుకాణానికి వెళితే 'అసలు ముందు ముందు కౌజులకు ఖరీదే పెట్టవలసి వుండదనిపిస్తోంది' అంటాడు.

'నిజం! ఇప్పుడు వాటి ధర ఎంత?'

'జోడు రెండు రూపాయలు'

ఎంత మార్పు వచ్చింది?

ఒక రోజున అమాయక పాఠకుడు చక్కగా ముస్తాబై వీధిన బయలుదేరాడు. చేతికర్ర తిప్పుకుంటూ కులాసాగా కూనిరాగం తీస్తూ 'ఇదుగో చూశారా, ఇప్పుడు నేనెంత క్షేమంగా వున్నానో' అన్న ధోరణిలో నడిచాడు.

కానీ ఈ సందర్భంలో దౌర్భాగ్యవశాత్తు ఒక సంఘటన జరిగింది. అతడలా నాలుగడుగులు వేశాడో లేదో చట్ట సంబంధమైన పొరపాటొకటి జరిగింది. దానితో మన అమాయక పాఠకుడు కటకటాల వెనకకు చేరాడు. అక్కడ రోజంతా తిండీతిప్పలూ లేకుండా పడివుండవలసి వచ్చింది. అతనికి అన్నం తీసుకొచ్చారు. మర్యాదగానే ముందు పెట్టారు. కానీ దానివైపు ఒకసారి కన్నెత్తి చూసి 'అయితే బాగా పండిన పంట ఇదన్నమాట' అని గొణుక్కున్నాడు.

ఆ మర్నాడే అతనికి శీతజ్వరం కూడా తగిలింది.

చట్ట సంబంధమైన పొరపాటును ఆ మర్నాడే దిద్దుకున్నారు. మన పాఠకుడిని విడిచిపెట్టారు. అయితే జామీను తీసుకున్నారు. (అతడిని తిరిగి తీసుకొని రావలసి వస్తుందేమో ఎవరికెరుక!)

పాపం ఇంటికి తిరిగివచ్చి చచ్చిపోయాడు.

ఇక దగాకోరు సంపాదకుడి సంగతి. అతడు రోజురోజుకూ గొప్పవాడవుతున్నాడు. ఇప్పుడతని నాలుగో మేడ తయారవుతోంది. పొద్దుటినుంచీ సాయంత్రం వరకూ అతడు ఒకే ప్రశ్నను గురించి ఆలోచిస్తూ వుంటాడు. అమాయక పాఠకుడిని దగా చేయడానికి మంచి మార్గం ఏది? అబద్ధం చెప్పడమా? నిజం చెప్పడమా?



గద్ద రాజుగారి కళాపోషణ



గద్దరాజులుంగారి మీద చాలామంది కావ్యాలు రాశారు. అంతా గళమెత్తి దాని గుణగణాలను కీర్తించారు. సాటిలేని సౌందర్యం, మేటిచూపు, ఎగురుతూవుంటే రాజఠీవి ఉట్టిపడుతుంది అని కవులు పొగిడారు. గద్ద ఇతర పక్షుల్లాగ రెక్కలల్లారుస్తూ ఎగరదు. ఆకాశంలో తేలియాడుతుంది. సూర్యుణ్ణి సూటిగా చూడగలుగుతుంది. పిడుగుల్ని లెక్క చేయదు. కొందరు కవులు గద్దది దయార్ద్ర హృదయమని కూడా ప్రస్తుతించారు. ఏ కవి అయినా పోలీసువాణ్ణి పొగడాలనుకొన్నాడనుకోండి. అప్పుడతడు గద్దతో అతడిని పోల్చుతాడు. ఫలాన పోలీసు కానిస్టేబు గద్దలాగ ఒడిసిపట్టాడు. విన్నపాలు విన్నాడు, కరుణించాడు అని పోల్చేవారు.

ఈ స్తోత్రాలను నేను చాలాకాలం నమ్మాను. 'ఒడిసి పట్టడం, ఆ తర్వాత కరుణించడం,' ఎంత గొప్ప విషయం! కరుణించడం అన్నది చాలా అద్భుతమైనది. ఈ కరుణ ఎవరి మీదనుకొన్నారు? ఒక ఎలకమీద! ఒక ఎలక! వెంటనే ఒక కవి మిత్రుని వద్దకు పరుగెత్తి గద్ద మహౌదార్య వార్తను అందించేవాణ్ణి. కవి వెంటనే భద్రాసనంలో బైఠాయించి ఒక్క క్షణంసేపు గాలి మేసి కవిత్వాన్ని కక్కుతాడు.

కాని ఒకరోజున హఠాత్తుగా నాకో భావం కలిగింది. అసలు గద్ద ఎలకనెందుకు క్షమించాలి! ఎలక ఏదో తన స్వంత పనిమీద దారినపోతుంది. గద్ద దాన్ని పసిగట్టింది. నేలను దూసుకొనివచ్చి ఒడిసిపట్టింది. ఆ పట్టడం గొంతు నులిమినంత పని చేసింది...

ఆ తర్వాత కరుణించింది. గద్ద ఎలక నెందుకు కరుణించాలి? ఎలకే గద్దనెందుకు క్షమించరాదు?

ఆలోచించిన కొలదీ అనుమానాలు ఎక్కువయ్యాయి. ఎవరేం చెప్పినా విన్నాను. పరిశీలించాను. ఎక్కడో మెలిక వుంది. మొదటి విషయం గద్ద ఎలకను క్షమించడం కోసం పట్టిందా? సరే గద్ద ఎలకను క్షమించగలదనే అనుకొందాం. అటువంటప్పుడు ఎలక విషయంలో అసలు జోక్యంచేసుకొనడమెందుకు? గద్ద కానీయండి గద్ద తాత కానీయండి ఏమైనా అది పక్షి. అలాంటప్పుడు ఆ పక్షితో పోల్చినప్పుడు పోలీసు వాడైనప్పటికీ సంతోషించడు.

గద్దను గురించి నా భావాలు చెప్పమంటారా? గద్దలు గద్దలే. అంతకు మించిన హెూదా వాటికిలేదు. క్రూరపక్షులు. వాటికి ఆశ ఎక్కువ. ప్రకృతి సిద్ధంగానే అవి శాకాహార విరోధులు అని సమర్ధించవచ్చును. అయినా వాటిని క్రూర పక్షులేనని చెప్పాలి. బలంగల పిట్టలు. దూరదృష్టి, వేగం, నిర్దాక్షిణ్యం వాటి ప్రత్యేకతలు. వాటిని చూస్తేచాలు పక్షి ప్రపంచమంతా హడలిపోతుంది. ఈ హడలు వాటిమీద భయంతోనే కాని కవులు చెపుతున్నట్లు భక్తితో కాదు. గద్దలకూ సమాజ జీవితానికీ చుక్కెదురు. అగమ్య ప్రదేశాలలో ఒంటరిగా బతుకుతాయి. పొరుగుపచ్చను సహించవు. ఎప్పుడూ ఏదో కొట్టుకొని తినడం, తినవలసిన అవసరం లేనప్పుడు కునుకుపాట్లుపడ్డం ఒకటే పని.

✦ ✦ ✦

ఒకప్పుడొక గద్ద వుండేది. ఏకాంతవాసంతో విసుగుపుట్టి ఒకరోజున భార్యను పిలిచి ఇలా అంది: “మనిద్దరమూ తప్ప మరో పలుకుతోడు లేకపోతే ఏమీ తోచడంలేదు. పగలంతా అలా సూర్యుడికేసి చూస్తూ కూర్చుంటే కొసకు పిచ్చెక్కుతుందేమో కూడా.”

గద్ద ఆలోచనలో పడింది. ఆలోచించిన కొద్దీ పూర్వ కాలపు జమీందార్లలాగ వుంటే ఎంత బాగుంటుంది అనిపించింది. మందిమార్బలాన్ని పోగుచేసి దొరలాగ ఎందుకు బతకకూడదు అనుకొంది. కాకులు తాజా పుకార్లు మోసుకొని రావాలి. చిలకలు పిల్లిమొగ్గలు వేయాలి. ఏంత్రింత వంటకాలు చేయాలి. గూబలు, పెద్దపులుగులు, పసిడిగంటలు రాత్రి పహరా కాయాలి. వేటపులుగులు, డేగలు, రాబందులు భోజన సంభారాలను తీసుకొని రావాలి. తాను రక్తపాతాన్ని కావిస్తూ వుండాలి. ఇలాగ ఆలోచించి, ఆలోచించి కొసకు నిశ్చయానికి వచ్చింది. డేగనీ, వేటపులుగునూ, రాబందునూ పిలిచి ఇలా ఫర్మానా జారీచేసింది.

“మందిమార్బలాన్ని తోలుకొని రండి. వారంతా నాకు కొలువు చేయాలి. నాకు వినోదం కల్పించాలి. నేను వారిని నిరంతరం భయం కొల్పుతూ వుంటాను. అంతే.”

ఆ పక్షులు గద్ద ఆజ్ఞలను శిరసావహించి నలుమూలలకూ ఎగురుతూ పోయాయి. మొదట అవి ఒక కాకుల మూకను పోగుచేశాయి. వాటి నన్నింటినీ జనాభా పట్టికలో నమోదుచేసి పన్ను సన్నదులిచ్చాయి. కాకి మెత్తనిపక్షి. దేనికైనా సరే వెంటనే ఒప్పుకుంటుంది. దాని ప్రధాన లక్షణం ఒకటుంది. పల్లె బైతుగా వుండగల అసాధారణ ప్రజ్ఞ దానికుంది. సరే ఇక పల్లెబైతులు అంటే రైతులు అందుబాటులో వున్నప్పుడు మరికొన్ని హంగులు సమకూర్చుకొనడం చాలా సులభమన్న సంగతి అందరికీ తెలుసును. గద్ద అనుచరులు ఆ పనే చేశారు. నీటి పిట్టల్ని చేర్చి నౌబత్ ఖానా ఏర్పరచారు. చిలకలకు విదూషక వేషం వేశారు. ఏంత్రింత పేరుమోసిన దొంగ కాబట్టి దానికి ఖజానా తాళం చెవులు అప్పగించారు. గూబలను, పసిడి గంటలను పహరాకు నియోగించారు. ఆస్థానం హంగు అంతా ఏర్పడింది. కోయిలను కూడా మరిచిపోలేదు. దాన్ని గద్దరాణీ వారివద్ద శకునపక్షిగా నియమించారు. కోయిల పిల్లలకోసం ప్రత్యేక అనాధ శరణాలయం కట్టించారు.

కాని ఆస్థానం అనుకొన్నట్లు సాగలేదు. ఏదో కొరవడింది. ఆ కొరవడింది ఏదా అని చాలాకాలం ఆలోచనలు చేశారు. కొసకు అదేమిటో తట్టింది. ప్రతీ జమిందారుగారి ఆస్థానంలోనూ కళలకు, శాస్త్రాలకు స్థానం వుండాలి. కాని గ్రద్దగారి దర్బారులో ఈ రెండూ లేవు. ఈ కొరతను ముఖ్యంగా మూడు పిట్టలు తమకు అవమానంగా భావించాయి. అందులో ఒకటి కత్తెరపిట్ట, రెండవది వల్లంకిపిట్ట, మూడవది బుల్బులు.

కత్తెరపిట్ట చాలా తెలివైనది. చాడీలు దానికి వెన్నతో పెట్టిన విద్య. సిపాయి పిల్లల స్కూల్లో చదివింది. క్రమశిక్షణకు సంబంధించిన నిబంధనలన్నీ క్షుణ్ణంగా తెలియడం వల్ల "అడవి గోల" అనే పత్రికను సెన్సారు లేకుండా నడపుకొనడానికి అనుమతి సంపాదించింది. కాని ఎంత ప్రయత్నించినా అధికారుల మెప్పు దొరకలేదు. నిషిద్ధ విషయాలను తడవడమో చెప్పవలసిన విషయాలను మరిచిపోవడమో ఏదో ఒకటి జరిగేది. దీనితో పాటు తల బొప్పిలుకడుతూ వుండేది. అందుకని గద్ద కొలువులో చేరాలని నిశ్చయించింది. ప్రతి ఉదయం గద్దగారి కీర్తిని ఉగ్గడించే నందిగా కుదురుతే ఎట్టి అపాయమూ రాదనుకొంది.

వల్లంకి పిట్ట బాగా పాండిత్యంగల దిట్ట. ఏకాంతవాసి. ఎన్నడూ ఎవరినీ చూసి ఎరగదు. పగలంతా ఓ చెట్టుకొమ్మ మీద కూర్చుని చెలిస్తూ వుంటుంది. అడివి చరిత్రమీద అనేక గ్రంథాలను చెక్కింది. "బ్రహ్మరాక్షసి వంశానుక్రమణిక", "పేదరాసి పెద్దమ్మకు పెళ్ళయిందా?", "మాయల మల్లి మదన విలాసమూ జనాభా లెక్కలు" ఇలాంటి గ్రంథాలెన్నో గిలికింది. కాని ఎంత గిలికినా దానికి ప్రచురణకర్తలెవరూ దొరకలేదు. అందుకని వల్లంకిపిట్టకూడా ఆస్థాన ఐతిహాసికునిగా గద్దకొలువులో చేరాలని

నిశ్చయించింది. ఏమో గద్ద తన రచనలను అచ్చు వేయిస్తుందేమో (కాకుల్ని కొట్టి) ఎవరికి తెలుసును?

ఇక బుల్బులు కెప్పుడూ అసంతుష్టి అన్నమాటే లేదు. దాని తీయని పాటల్ని విని లేత మొక్కలుకూడా మత్తిల్లి పోయాయంటే ఇక షావుకార్ల సంగతి వేరే చెప్పాలా? బుల్బులు గొంతులోంచి రాగాలు సాగుతూవుంటే ప్రపంచమంతా ఊపిరి బిగబట్టి వింది. విని మూర్ఛపోయింది. కాని బుల్బులికి కామం మెండు. కీర్తి కామం అంతకన్న మెండు. స్వతంత్ర అటవీ ప్రాంతమంతటినీ తన గాన మాధుర్యంతో ముంచెత్తి ప్రతి హృదయాన్ని మత్తెక్కించినా చాలలేదు. గద్ద స్వయంగా చీమగుడ్ల హారాన్ని తన మెడలో అలంకరిస్తుందనీ, బతికివున్న బొద్దెంకనే పతకంగా బహూకరిస్తుందనీ ఆశపడింది. గద్దరాణి వెన్నెల రాత్రులలో తనకు సంకేతాలేర్పరుస్తుందని కలలుకంది.

ఇంతకీ చెప్పవచ్చేదేమిటంటే ఈ మూడు పిట్టలూ తమకు ఆస్థాన ప్రవేశమిమ్మని డేగని వేధించాయి. ఆస్థానంలో కళలకు, శాస్త్రాలకు స్థానం కల్పించవలసిన అవసరాన్ని గురించి డేగ చేసిన మనవిని గద్ద చిత్తగించింది. కాని అది చిత్తానికెక్కడానికి మాత్రం చాలాకాలం పట్టింది.

అగ్రుమీది ఎరకలను అటూ ఇటూ కదిలిస్తూ అలాగే కూర్చుంది. కళ్ళు ఎండలో కెంపుల్లా మెరిశాయి. గద్ద జీవితంలో ఎన్నడూ పత్రిక చూసి ఎరగదు. మాయలాడినీ, మంత్రకత్తెనూ గురించి ఎన్నడూ ఆలోచించలేదు. బుల్బులు అంటే అదొక చిన్నపిట్ట అనీ ఒక పంటికిందికి కూడా రాదు అని మాత్రమే తెలుసు.

"అసలు బోనాపార్టీ చనిపోయిన సంగతి కూడా మీకు తెలియదు. కావలిస్తే పందెం వేస్తాను" అంది డేగ.

"బోనాపార్టీ? ఎవడు వాడు?" వాడిని గురించి తెలుసుకొనడం వల్ల వచ్చే నష్టమేమీలేదు. మీరెవరికైనా విందుచేశారనుకోండి. అప్పుడెవరైనా బోనాపార్టీ కాలంలో అది అలా వుండేది. ఇది ఇలా జరిగింది అన్నారనుకోండి. అప్పుడు మీరు కళ్లుమిటకరిస్తు కూర్చోవాలి. అవునా?"

గూబను సలహాకోసం పిలిచింది గ్రద్ద. ఆస్థానంలో శాస్త్రాలను, కళలనూ పోషించాలని గూబకూడా సలహా ఇచ్చింది. దానివల్ల గద్ద జీవితం మహోజ్వలంగా వుండగలదనీ మంచి కీర్తి రాగలదనీ చెప్పింది.

"విజ్ఞానం వెలుగు. అజ్ఞానం చీకటి. పొట్టనింపుకొనడం, నిద్రపోవడం గొప్పకాదు. ఒక గుంపులో ఎన్ని బాతులున్నాయో లెక్కపెట్టడానికి ప్రయత్నిస్తే అప్పుడు తెలుస్తుంది. లెక్క చేతకాకపోతే ఎంత అవమానం? ఆ పైడి పిట్టను చూడండి. దానికి తెలిసిన విద్యల్లా ఒక నీళ్ళ కడవ మోయడం. ఆయన దాన్ని చూడ్డానికి ఎంత ధనం ఖర్చు

పెడుతున్నారు?

"నేను చీకటిలో చూడగలను. అందుకని నన్నంతా విజ్ఞాని అని పిలుస్తారు. ఇక మీరు మీరుకూడా రెప్పార్పకుండా సూర్యునివైపు గంటలకొలదీ చూడగలరు. అయినా అంతా ఏమంటున్నారో తెలుసునా? గద్ద చురుకైనదే కాని మట్టిబుర్ర అని"

"సర్‌ర్‌ర్ రే! నేను శాస్త్రానికి విరోధినికాను" అంది గద్ద.

అనడం తరువాయి. అంతా అమరింది. మర్నాడు గద్ద ఆస్థానం "స్వర్ణయుగం"లో అడుగుపెట్టింది. కాటుక పిట్టలు "బాలలకు విజ్ఞాన ఫలమిచ్చు బలము" అన్న కొత్త జాతీయ గీతాన్ని సాధనచేశాయి. నీటి పిట్టలు నౌబత్ ఖానాలో సన్నాయిమేళం కట్టాయి. చిలుకలు కొత్త కొత్త జాతీయాలు నేర్చుకొన్నాయి. కాకులపైన కొత్త పన్ను విధించి దానికి "చదువుల పన్ను" అని పేరు పెట్టారు. వేట పులుగులు డేగల పిల్లలను పౌజు పాఠశాలలో చేర్చారు. గూబలను విజ్ఞాన శాస్త్ర పరిషత్తులో చేర్చారు. కాకి పిల్లలకు కూడా అణాకానీ బాలశిక్ష లిచ్చారు. కాటుక పిట్టల్లో పెద్దదాన్ని ఏరి ఆస్థానకవిగా నియమించారు. మర్నాడు ఉదయం బుల్బులుతో పోటీకి సిద్ధం కావలసిందని హుకుం చేశారు.

ఎలాగైతేనేం తెల్లవారింది. కొత్తగా సంస్థానానికి వచ్చిన పండితులు, కళాకారులూ గద్ద దొరవారిముందు తమ తమ విద్యలు ప్రదర్శించడానికి నిలిచారు.

కత్తెరపిట్ట గొప్ప విజయం సాధించింది. గద్దను ప్రశంసిస్తూ ఉదయం పత్రికలోంచి ఒక వ్యాసాన్ని ధారాళంగా చదివి వినిపించింది. అదంతా గద్దకు అర్థమయినట్లే అనిపించింది. బతుకు హాయిగా గడుస్తోందని కత్తెరపిట్ట చదివింది. బాగో! అని గద్ద తలూపింది.

"నా పత్రిక బాగా అమ్ముడుపోవడం ఒక్కటే నేను కోరుకుంటున్నాను" అని చదివింది కత్తెరపిట్ట.

'బాగో!' అని మళ్ళీ తలూపింది గద్ద.

"ప్రభువు జీవితం కన్న భృత్యుని బతుకు హాయి. ప్రభువుకు బోలెడన్ని పుస్తకాలు. భృత్యునికేం వుంది. సత్ప్రభువులు తన భృత్యులను కంట కనిపెడుతూనే వుంటారు."

"బాగో!"

"నిజాయితీ వున్నంతకాలం కట్టబట్టకూడా లేదట. అది చచ్చిన తర్వాత చీనిచీనాంబరాలు కడుతున్నాడట."

"బాగో!"

కాని కొంతసేపటికి గద్దకు విసుగెత్తింది. "తర్వాతెవరు?" అని ఒక్కసారి అరిచింది.

వల్లంకిపిట్ట గద్ద వంశక్రమాన్ని సూర్యుని దగ్గరనుంచీ ప్రారంభించింది.

గద్ద తన తండ్రిద్వారా ఇలాంటిదెపుడో విన్న జ్ఞాపకం. అందుకని ఇక్కడకూడా మాటమాటకు "బాగో" అంది.

వల్లంకిపిట్ట చదువుకు పోతోంది. సూర్యునికి ముగ్గురు పిల్లలు. అందులో సొరమీను ఆడపిల్ల. సింహమూ గద్దా మొగపిల్లలు. సొరమీను భ్రష్టాచారాలకు దిగింది. అందుకని తండ్రి దాన్ని సముద్రంలో పారేశాడు. సింహంకూడా తండ్రిమాట జవదాటింది. అందుకని దాన్ని అడవులకు పంపివేశాడు. కాని గద్దమాత్రం పితృభక్తి కలిగివుంది. అందుకని తండ్రి దానికి తన దగ్గరలోనే స్థానం కల్పించి ఆకాశ రాజ్యం ఏలమని ఆనతిచ్చాడు.

ఇలా వల్లంకిపిట్ట ఇంకా పీఠికనైనా ముగించలేదు. గద్దకు విసువెత్తిపోయి "తర్వాతెవరు?" అంది.

ఇప్పుడింక బుల్బులు పిట్ట వంతు. గొంతెత్తడంతోనే జీరబోయింది. తనకొక ప్రభువును పంపినందుకు భృత్యుడు ఆనందిస్తూ దేవుణ్ణి స్తోత్రంచేసే ఒక కీర్తన పాడింది. సేవా భావం వుట్టిపడేలాగ పాడ్డానికి బుల్బులు ఎంతో ప్రయత్నించింది. కాని దానిలో నిగూఢమైవున్న కళ మాత్రం చావలేదు. బుల్బులులో నఖశిఖ పర్యంతం సేవకభావంవుంది. అయినా కళమాత్రం అణగి వుండక అడుగడుగునా కట్టలు తెంచుకొని పైకుబికింది. బుల్బులెంత పాడినా గద్దకుమాత్రం అర్థం కాలేదు.

"ఏమిటా వెధవ అలా అరుస్తాడు?" అని అరిచింది గద్ద.

"ఆస్థాన కవిని పిలవండి"

ఆస్థాన కవి హాజరయ్యాడు. ఆపాద సేవ్యసేవక ఇతివృత్తాలనే తీసుకొని కవిత్వం చెప్పాడు. కాని కవిత్వం చాలా గొప్పగావుంది. గద్ద "బాగో బాగో" అని మెచ్చుకొంది. కావ్యగానం అయిన తర్వాత కాటుక పిట్టకు చీమగుడ్ల కంఠహారాన్ని బహూకరించింది గద్ద. కళ్ళవెంట నిప్పులుకక్కుతూ బుల్బులు వైపుచూసి "ఆ వెధవ నవతలికి తరిమి వేయండి" అని ఉరిమింది.

దానితో బుల్బులు పని అయిపోయింది. కనుమూసి తెరిచేంతలో దాన్ని ఒక బుట్టలో పెట్టి ఒక హెూటేలు యజమానికి అమ్మివేశారు. అదక్కడ ఈనాటికీ మధుర విషాన్ని మదనార్తుల హృదయాల్లో నింపుతూ పాడుతూవుంది.

అయినా విద్యాశాఖను మాత్రం ఎత్తివేయలేదు. వేట పులుగు పిల్లలూ, డేగ పిల్లలూ కాలేజీలో చదువుతూనే ఉన్నాయి. "విజ్ఞాన శాస్త్ర పరిషత్తువారు ఒక నిఘంటువు రచనకు ఉపక్రమించారు. అతికష్టం మీద "అ" అనే అక్షరం సగంవరకూ సాగింది బండి. వల్లంకి పిట్ట "బ్రహ్మరాక్షసి వంశానుక్రమణిక"లో పదవభాగాన్ని పూర్తి చేసింది. కాని పండిత త్రయంతో మూడవది మాత్రం అంతా చూస్తూ కూర్చుంది. విద్యా వ్యాప్తిని

గురించి చేసే ఈ రభసంతా ఏదో ఒక రోజున హఠాత్తుగా అంతరిస్తుందని కత్తెర పిట్ట ఆదినుంచీ అనుకొంటూనే వుంది. దాని భయాలు నిరాధారాలేమికాదు.

ఇంతకీ ఏం జరిగిందనుకొన్నారు? విద్యాధికారి పదవిని స్వీకరించిన పెద్ద పులుగూ, వేట పులుగూకూడా పెద్ద పొరపాటు ఒకటి చేశాయి. గద్దకు వ్యాకరణం నేర్పాలని అవి నిశ్చయించాయి. చాలా సులభమైన ధ్వని పద్ధతినే అనుసరించి పాఠాలు మొదలుపెట్టాయి కాని ఏడాది గడచినా గద్ద తన పేరును "గద" అనే రాస్తూంది. ఒకోసారి పలకవలసివస్తే వర్ణక్రమం కూడా తప్పుతోంది. ఇలా ఎవరైనా ప్రామిసరీనోటుపై సంతకం చేస్తే ఆత్మగౌరవం గల ఏ షావుకారూ దాన్ని అంగీకరించడు.

అంతటితో ఆగితే పోయేది. కాని ఉపాధ్యాయులందరి లాగానే ఈ రెండు పిట్టలు కూడా తమ శిష్యునికి ఊపిరి సలపనివ్వలేదు. అదే అన్నింటికన్నా పెద్ద పొరపాటు. గూబ కదం తొక్కుతూ క్క . . . చ్చ . . . ట్ట . . . త్త . . . ప్ప అని విధీ విరామం లేకుండా ఒక మూలనుంచి రొదచేస్తూ వచ్చింది. లెక్కలలో ప్రాథమిక సూత్రాలు నాలుగూ తెలియకపోతే కొల్లగొట్టిన సరుకును పంచుకొనడం కష్టం అని వేటపులుగు గద్దను ఊదర పెట్టింది.

"ఉదాహరణకు మీరు పది బాతుగుడ్లను దొంగిలించారనుకోండి. అందులో రెండు పోలీసువాడికి లంచం పెట్టారు. ఒకటి తిన్నారు. ఇంకెన్ని వుంటాయి?" అని అడిగేది వేట పులుగు.

ఈ లెక్కకు జవాబు తెలియని గద్ద ఊరుకొనేది. కాని లోలోపల మాత్రం వేటపులుగును నమిలి మింగేద్దామన్నంత కోపం రాజుకొంటూ వచ్చింది.

ఈ విధంగా ఉద్రేకాలు పెరిగాయి. కుట్రదారులు ఈ పరిస్థితిని పూర్తిగా వినియోగించుకొన్నారు. కుట్రకు మూలస్తంభం రాబందు. కోయిలను కూడగట్టుకొంది. కోయిల గద్దరాణీ చెవిలో ముక్కుపెట్టి ...

"ఇదుగో ఈ చదువు పేరుతో వాళ్ళు గద్దదొరగారి ప్రాణం తీస్తారు. నా మాట నమ్మండి" అని నూరిపోసింది. దేగమీద రాబందూ, కోయిలా కలిసి కొండాలు చెప్పి గద్ద మనసు విరిచాయి.

ఒకరోజున తెల్లవారేసరికి గూబ పాఠలకు హాజరైంది. అప్పటికింకా గద్ద కళ్ళయినా తెరవలేదు. గూబ గ్గ–జ్జ–డ్డ–ద్ద–బ్బ– అని పాఠాలు ప్రారంభించింది.

"ఏమిటా సొద.. ఫో అవతలికి!" అని కసిరింది గద్ద.

"దేవరవారు చిత్తగించాలి. నేను చెపుతూ వుంటాను. తమరు వల్లెవేయాలి.. ప్ప .. బ్బ..మ్మ ."

"పోతావా పోవా?"

"య్య. . . ౦్ర. . . ల్ల. . . వ్వ. . ."

గద్ద మహా కోపంతో లేచి గూబను నిలువునా చీల్చిపారేసింది.

ఒక గంట తర్వాత వేటనుంచి తిరిగి వచ్చింది వేట పులుగు. జరిగిన సంగతి దానికేమీ తెలియదు.

"దేవరవారి కొక లెక్క. రాత్రి దోపిడిలో నలభై శేర్ల మాంసం వచ్చింది. దేవరవారికొక భాగం, దాస గణానికొక భాగం.. సమానంగా రెండు వాటాలు వేశాం. తమ వాటా ఎంత వస్తుంది?" అంది వేట పులుగు.

"మొత్తం అంతా" అని గద్ద జవాబు.

"ఇదుగో అదేం జవాబు? అంతా మీదే అయితే నేను లెక్కెందుకు అడుగుతాను?" అంది వేట పులుగు.

వేట పులుగు ఇలాంటి లెక్కలివ్వడం కొత్తకాదు. కాని ఈసారి వేటపులుగు ధోరణి గద్దకు అగ్గిమీద గుగ్గిలమైంది. తాను అవునన్న దాన్ని ఒక నౌకరు కాదనడమా? ఎంత బేహద్బీ! గద్ద నెత్తురు కళ పెళ ఉడికింది. గద్ద నెత్తురు ఉడుకెత్తినప్పుడు విద్యకు, తిరుగుబాటుకు గల భేదం దానికి తెలియదన్న సంగతి జగద్విదితం. ఇప్పుడు కూడా అంతే అయింది.

వేట పులుగును కూడా నిశ్శేషంగా సంహరించిన మీదట "శాస్త్ర విజ్ఞాన పరిషత్తు పూర్వంలాగే పనిచేస్తుంది" అని గద్ద ఫర్మానా జారీచేసింది.

"బాలలకు విజ్ఞాన ఫలము బలమిచ్చు" అని కాటుక పిట్టలు తిరిగి జాతీయ గీతాలాపన చేశాయి. కాని స్వర్ణయుగం చరమదశలో పడ్డదని మాత్రం అందరికీ తెలిసిపోయింది. ఇక అజ్ఞానాంధకారం ఆవరిస్తుంది. దానితో కుట్రలు కూహకాలు, కల్లోలాలు చెలరేగుతాయి.

వేట పులుగుస్థానంలో డేగ, రాబందు అధికారంలోకి వచ్చాయి. దానితో కల్లోలాలకు బీజం పడింది. పెద్ద ఉద్యోగులు స్పర్థల్లో, స్వార్థాల్లో మునికి వుండగా నౌకర్ల సంగతి చూసేనాథుడు లేకపోయాడు.

ఒక నెల గడిచేసరికి "స్వర్ణయుగ" చిహ్నాలు కలికానికి కూడా కానరాకుండా అంతరించాయి. కాటుకపిట్టలకు సోమరితనం బలిసింది. నౌబత్ ఖానాలో అపస్వరాలు పలుకుతున్నాయి. గోర్వొంక అందింది అందినంతవరకూ జాగ్రత్త చేసుకొంది. కాకుల పన్ను బకాయీలు పేరుకొనిపోయాయి. వాటిని వసూలు చేయడానికి దొరతనంవారు కొరడాలు వాడవలసి వచ్చింది. ఆనాటికానాడు పరిస్థితులు మరీ అధ్వాన్నం అయ్యాయి. కొసకు గద్దరాజుగారి సువారానికి కుళ్ళు మాంసం వస్తోంది.

ఈ స్థితిని సమర్థించుకొనడంకోసం డేగా, రాబందూ తాత్కాలికంగా మిలాఖత్తు

అయి నెపమంతా విద్యా విధానం మీద నెట్టాయి. "విజ్ఞాన శాస్త్రం లాభదాయకమైనదే కాని దాన్ని అదును చూసి నేర్పాలి. ఇంతకీ మన తాత ముత్తాతలకేం శాస్త్రాలు తెలుసును? వారికి మహారాజులా గడవనేలేదూ? మనకూ అంతే" అని వాదించాయి.

దోషమంతా ఈ విద్యలోనే వుందని నిరూపించడం కోసం అవి కుట్రలను కనిపెట్టి పట్టుకొన్నాయి. పెద్దబాలశిక్ష ప్రాథమిక ఉపాధ్యాయుడు ఇలాంటి కుట్రలలో వుండడం సహజమే కదా! సోదాలు, తనిఖీలు, దర్యాప్తులు, విచారణలు, ఎడతెరిపి లేకుండా సాగాయి.

ఒకనాడు హఠాత్తుగా "చాలించండి" అని గద్ద గర్జించింది. విద్యావిధానం అంతటితో ఆఖరయింది. నాటినుంచీ ఆ రాజ్యమంతా నీరవత నిండుకొంది. ఆ నీరవ నిస్తబ్దతలో గుసగుసలుగా వేసే నీలాపనిందలు కూడా భూమి నలుచెరగులకూ పాకాయి.

కొత్త రాజనీతికి వల్లంకిపిట్ట ప్రథమ కబళమయింది. దానికి వ్యాకరణం వచ్చును. అంతకన్న నేరం ఇంకేం కావాలి?

"నీకు సంధులు వచ్చునా?"

"వచ్చు దేవరా వచ్చు. సంధిపరిచ్ఛేదం అంతా నిద్రలో లేపి అడిగినా అప్పజెప్పగలను"

"స్త్రీలింగ, పుంలింగాలకు భేదం గుర్తించగలవా?"

"ఆహా! చీకటిలో కూడా వాటిభేదం గుర్తించగలను."

చాలును. వల్లంకపిట్టకు అరదండాలువేసి ఒక చెట్టు తొర్రలో బంధించారు. కాని పాపం అక్కడ బతికుండగానే దాన్ని చీమలు తినేశాయి. ఆ మర్నాడు ఆ తొర్రలోనే పంచత్వం పొందింది.

వల్లంకి పిట్ట వ్యవహారం ఇలా ముగిసిందో లేదో అక్కడ విజ్ఞానశాస్త్ర పరిషత్తులో పెద్ద దొమ్మీ బయలుదేరింది. కాని గూబలూ, పెద్దపులుగులూ ఆ దొమ్మీని ఎదుర్కొన్నాయి. వాటికి ప్రభుత్వం ఇచ్చిన భవనాలు, ఆ భవనాల్లోని విలాసాలు వదులుకోవడం ఇష్టంలేదు. అసలు విజ్ఞానం దుష్టుల చేతుల్లో పడకుండా చూడ్డమే తమకు ముఖ్యం. కాని దాన్ని ప్రచారంచేయడం తమ ప్రధానాశయం కాదని వాదించాయి. అయితే శాస్త్రం వల్ల కలిగే మేలేమిటి అని అడిగింది గద్ద. దానికి జవాబు దొరకలేదు గూబలకు. అంతటితో వెనక్కు తగ్గాయి. ఈ నేరానికిగాను ఆ గూబల్ని చంపి, రైతులకు అమ్మేశారు. రైతులు వాటిని కాకుల్ని తరమడం కోసం దిష్టిబొమ్మలుగా ఉపయోగించారు.

పిల్లకాకుల దగ్గరనుంచి బాలశిక్షలను లాక్కొని నానవేసి రుబ్బి చీట్లపేకగా అచ్చుపోశారు. ఆ తర్వాత పరిస్థితులు ప్రచండవేగంతో పరిణమించాయి. గూబల తర్వాత కాటుకపిట్టలు, నీటిపిట్టలు, చిలుకలు, పైడిపిచికలు, వంతులవారీగా రాజాగ్రహానికి గురయ్యాయి. కొసకు చెవిటి కౌజుకు కూడా ఏవో భావాలున్నాయని అనుమానించారు.

అది పగలంతా మౌనముద్ర ధరిస్తుంది. రాత్రంతా నిద్రపోతూవుంటుంది.


గద్దగారి హవేలీ ఖాళీ అయిపోయింది. మిగిలినది గద్ద దంపతులిద్దరూ. సిబ్బంది మొత్తం మీద డేగా వేటపులుగూ ఇంతే. దూరాన మాత్రం మూగి కాకులమూక తమకేమీ పట్టనట్లు సంతానాభివృద్ధి సాగిస్తున్నాయి. వాటి సంతానం పెరిగినకొలది పన్నుల బకాయిలు కొండల్లా పేరుకొంటున్నాయి.

వేట పులుగూ, డేగా ఇక ఎవరిమీద పడాలో తెలియక (కాకులు ఒక లెక్కకాదు) పరస్పరం కారాలు, మిరియాలూ నూరుకోసాగాయి. ఇదంతా శాస్త్రం పేరనే జరుగుతుంది. వేటపులుగు రహస్యంగా ప్రార్థన పద్యాలు చదువుతోందని డేగ పోలీసులకు మాటజేరవేసింది. డేగ ఒక పాటల పుస్తకాన్ని చెట్టుతొర్రలో దాచుకొందని వేటపులుగు పోలీసుల చెవికొరికింది.

గద్దకు ఏమిచేయడానికి పాలుపోలేదు. అలాంటి స్థితిలో ఈ గందరగోళాన్నంతనీ పరిష్కరించడానికా అన్నట్లు చరిత్ర గతి మారిపోయింది. తమ సంగతి పట్టించుకొనే నాథుడు లేడని కాకులు తెలుసుకొన్నాయి. దీన్ని గురించి అణాకానీ బాలశిక్షలో ఏమని రాశారు? అదేదో సరీగా జ్ఞాపకానికి రాకముందే అనుకోకుండా మూగి కాకుల మూక ఆకాశమార్గాన్ని పట్టాయి.

గద్ద వాటి వెంటపడింది. కాని లాభం లేకపోయింది. దారిలో ఒక పల్లెటూరి పెద్దమనిషి గద్దని పట్టుకొని బడితెబాజా వాయించాడు. దానితో రెక్కలు పులిసి ముద్దయిపోయాయి. అప్పుడు గద్దరాణీ దగ్గరకు ఎలాగో అతికష్టం మీద చేరుకొని “ఇది గద్దలన్నింటికీ గుణపాఠం అగుగాక!” అని ఒక ఫర్మానా జారీచేసింది.

గుణపాఠం అంటే విద్య హానికరమా? లేక విద్య రాకపోవడం హానికరమా? ఆ గద్ద ఉద్దేశ్యం ఏమిటి అన్న ప్రశ్న ఉదయిస్తుంది. కాని అంతకుమించి గద్ద ఇంకేమీ చెప్పలేదు.



ఆదర్శవాది జెల్లచేప



ఒక జెల్లకూ బొమ్మిడాయికీ వాదం వచ్చింది. నిజాయితీగా బతకడం సాధ్యం అని జెల్ల అంది. లౌక్యం లేకపోతే లాభంలేదని బొమ్మిడాయి వాదించింది. లౌక్యం అంటే బొమ్మిడాయి ఉద్దేశ్యం ఏమిటో తెలియదుకాని అది ఆమాట అన్నప్పుడల్లా మొహం కందగడ్డలా చేసుకొని "ఆ మాటనకు నాకు ఒళ్లుమంట" అనేది జెల్ల. "సరే చూద్దాంగా!" అనేది బొమ్మిడాయి.

జెల్ల ఒకరి జోలికీ, సొంటికీపోదు. దానిది ఆదర్శవాదం. అలాంటప్పుడు బైరాగులకి అది ప్రీతికరం కావడంలో ఆశ్చర్యం ఏంవుంది? రోజంతా ఎక్కడో రాళ్ళమధ్య పడి వుంటుంది. నలుసుల్లాంటి చిరుమీలను ఏరుకుతింటుంది. అలా గంటల తరబడివుంటే ఏవేవో వూహలు పుట్టడం సహజమే కదా. అందులో కొన్ని మరీ తెంపరి ఊహలు. జెల్లల అభిప్రాయాలకు సెన్సారు గొడవలేదు. పోలీసుల బెడదా లేదు. అందుకని రాజకీయంగా ప్రమాదకరమైన బాపతు అన్న అనుమానం వాటిని గురించి ఎవరికీ కలగదు. అప్పుడప్పుడు జెల్లలమీద దాడులు జరగడం మనం చూస్తూ వుంటాం. అయితే ఆ దాడి తినడం కోసమేకాని అవి స్వేచ్ఛగా ఆలోచిస్తున్నాయని కాదు.

అసలు జెల్లలను మావులు (జల్లిగంపలు) వేసి కానీ వలలు వేసికానీ పట్టాలి. కాని వాటిని పట్టాలంటే ఒడుపు చాతనవాలి. వర్షం పడిన తర్వాత నీరు అల్లకల్లోలంగా

వుంటుంది. అనుభవంగల జాలర్లు చాపలు పట్టడానికి అదే మంచి అదునంటారు. వలలువేసి నీటిపైన కర్రలతోనూ తాళ్ళతోనూ కొట్టి నానా హంగామా చేస్తారు. ఆ హంగామా అంతా విని విప్లవభావాలకు విజయం కలిగిందనే ఉద్దేశ్యంతో జెల్లలు మెల్లిగా లేచి తాము కూడా పాల్గొనవచ్చునా అని అడుగుతాయి. దానితో అన్నీ కట్టకట్టుకొని మానవుల వలలో పడతాయి. జల్లల్ని వేపుడు చేసినట్లయితే పెద్దపెద్ద గవర్నర్లకు కూడా వడ్డించ తగినంత రుచిగా వుంటుంది.

ఇక బొమ్మిడాయికి ప్రతిదానిమీద అనుమానమే. పైగా అన్నీ ముళ్ళు. అయితే సరైన పాకంలో వండితేమాత్రం మహారుచిగా వుంటుంది.

జెల్లకీ బొమ్మిడాయికీ తగువెలా వచ్చింది అని అడిగితే చెప్పడం కష్టమే. అవి మొట్టమొదల తారసిల్లగానే వాదన పెట్టుకొన్నాయి. ఒకసారి అయింది. రెండుసార్లు అయింది. రెండింటికీ కూడా వాదన లేకపోతే తోచేదికాదు. అందుకని ప్రత్యేకంగా వాదనకోసం స్థలకాల నిర్ణయాలు కూడా చేసుకొనేవి. ఏదో ఒక నాచుమొక్కకింద చేరి జ్ఞాన చర్చలు సాగించేవి. ఆ జ్ఞానాన్ని జీర్ణం చేసుకొనడం కోసం చందువా ఆ చుట్టుపక్కలే పొంచి తారట్లాడుతూ వుండేది.

సిద్ధాంతం ప్రతిపాదించడం ఎప్పుడూ జెల్లవంతు. "సంఘర్షణ న్యాయం వల్లనే జీవులు అభివృద్ధి పొందుతున్నాయన్న మాటను నేను నమ్మను. అభివృద్ధి శాంతియుతంగా అహింసాత్మకంగా సాగాలి. సామరస్యం వుండాలి. సుఖం అన్నది ఏదో ఊహాఫలం కాదు. నేడో రేపో ప్రాణులన్నీ కూడా సుఖపడతాయిని నా దృఢవిశ్వాసం"

"మన్ను – మశానం" అనేది బొమ్మిడాయి.

బొమ్మిడాయికి తొందర ఎక్కువ. మనసులో కక్షపెట్టుకొనే రకం. దానిది రాతిగుండె. ఇంకా నయం ప్రాణులను అసహ్యించుకొనే దాకా వెళ్ళలేదు. కాని నమ్మకాలన్నీ నశించి చాలా కాలమైంది. ప్రతిచోటా దానికి శాంతికి మారు సంక్షోభం, అభ్యుదయానికి మారు ముష్కరత్వం కనిపిస్తుంది. బతకతలుచుకొన్న ప్రతివారు నిజాన్ని సూటిగా చూడాలంటుంది. జెల్లకి ఆలోచనలు అధికం అంటుంది. కాని ఈ ప్రపంచంలో ఎవరైనా నమ్మదగ్గవారున్నారా అంటే అది జెల్ల ఒక్కటేనని ఒప్పుకొంటుంది.

బొమ్మిడాయి అన్నమాట జెల్లను వాదాని కీడ్చింది.

"ఏమన్నావు? మన్నూ – మశానమా? మనమంతా క్రమంగా సుఖపడతాం. మనమిప్పుడు చీకటిలో ఈదులాడుతున్నాం. ఈ చీకటి అంతా అదృష్ట భావన దుష్ఫలితం. ఆధునిక విజ్ఞానశాస్త్రం అదృష్టభావనను అంతంచేస్తోంది. చీకటిరోజులు పోతున్నాయి. భవిష్యత్తు అంతా కాంతిమయం. వెలుగు వస్తుంది. నా మాట విను! వెలుగు వస్తుంది!!"

"నీ వుద్దేశ్యం ఏమిటి? వాలగలనేవి లేని రోజొకటి వస్తుందంటావా?"

"వాలగలంటే?" అని అడిగింది జెల్ల మొహం చిట్లించి.

"వాలగలుంటాయి, జెల్లలు కలలుకంటూ కూర్చుంటే లాభంలేదు" అని ఎవరైనా ఎప్పుడైనా అంటే అవన్నీ కాకమ్మ కథలనీ పిల్లలను దడిపించడానికి కనిపెట్టిన బూచి అనీ జెల్ల భావిస్తూ వుండేది.

"మడ్డిమొహం! వాలగంటే తెలియదు కాని ప్రపంచాన్ని మరమ్మత్తు చేస్తాడట" ఒకసారి రెక్కలు విదిలించి ఈదుకొంటూ పోయేది బొమ్మిడాయి. కాని తర్వాత రెండూ మళ్ళీ ఒక నిర్జన ప్రదేశంలో కలుసుకొని తమ తర్కాన్ని కొనసాగించేవి.

జెల్ల సిద్ధాంతం ప్రతిపాదించేది.

"మంచి అన్నది జీవితానికి సహజలక్షణం. ఏవో అపోహలవల్ల దుర్బుద్ధులు పుడుతూవుంటాయి. అంతేకాని మంచే ప్రధాన జీవశక్తి."

"నీ బొంద"

"ఇదిగో బొమ్మిడాయ్! మర్యాదతప్పి మాట్లాడకు. నీ బొంద ఏమిటి? అదేనా మాట్లాడవలసిన పద్ధతి?

"అసలు నీతో మాట్లాడ్డమేమిటి? నీకా యోగ్యత కూడా వుందీ? నువ్వు ఉట్టి నస్మరంతివి. అంతే!"

"ఇదిగో ఒక్క క్షణం ఆగు! నా వాదన పూర్తిగా విను. చెడు అన్నది ఏనాడూ కూడా సృజనాత్మక శక్తిగా లేదు. చరిత్ర సైతం మనకీ విషయాన్నే బోధిస్తోంది. చెడుపువల్ల కలహాలు క్షామాలు, అనర్థాలూ వినాశాలూ కలిగాయి. ఇక మంచి అన్నావా? ఆ మంచి ఒక్కటే జీవనదాయిని. మంచి అనేది పీడితులకు తోడ్పడింది. వారి శృంఖలాలను ఛేదించింది. ఉదాత్తాశయాలను పురికొల్పింది. ఉత్తమ ఆలోచనలను రేకెత్తించింది. ప్రాణశక్తి అయిన ఈ మంచే లేనినాడు చరిత్ర అనేదే వుండదు. నిజానికి చరిత్ర అంటే ఏమిటి? చెడుగుమీద మంచి సాధించిన విజయాల వీరగాథ కాదా?"

"చెడుగు పూర్తిగా నశించిందని నమ్మినట్లు కనిపిస్తున్నావే!"

"ఇంకా పూర్తిగా నశించలేదు. కాని నశించి తీరుతుంది. అందులో సందేహం లేదు. ఈ విషయంలో కూడా మనకు చరిత్రే దాఖలా. గతాన్ని ప్రస్తుతంతో పోల్చిచూడు. చెడుగు బాహ్య స్వరూపం కొంత మెత్తపడినట్లు అనిపించడమే కాదు; ఆ చెడుగనేది మొత్తానికే చాలా తగ్గినట్లు కనిపిస్తుంది. ఉదాహరణకు మన సంగతే తీసుకో. పూర్వం వేసంగికి ముందు మనలను పట్టుకొనేవారు. అసలు మనంతట మనమే ఎగిరి వలలో పడేవారం. కాని ఇప్పుడలా జరగడం లేదు. వేసంగికి ముందు మనం వలసపోతామనీ అలా వలస పోయేటప్పుడు మనల్ని పట్టుకొనడం తగదనీ భావిస్తున్నారు. పూర్వం మనలను అతిముష్కరంగా నాశనం చేసేవారు. ఆ రోజుల్లో పెద్దనదిలో ఈటెలు విసిరి

చేపలు పట్టినప్పుడు మైళ్ళ పర్యంతం నీరు ఎర్రపడేదని చెప్పగా విన్నాను. ఇప్పుడలాంటి దెక్కడైనా చూశావా? లేదు. వలలు, జల్లి గంపలు, గాలం చువ్వలు ఇవే ఇప్పటి సాధనాలు. ఇంతెందుకు ఎలాంటి వలలు కావాలి? ఏ రోజుల్లో వలలు వేయాలి? ఎందుకోసం వేయాలి? అన్న విషయాలను ఇప్పుడు కమిటీల్లో కూడా చర్చిస్తున్నారు."

"నువ్వు కూరకుండలో పడే పద్ధతిని తలుచుకొని మురిసిపోతున్నట్లున్నావు."

"ఏమిటీ?"

"అయ్యోరాత! కూరకుండ సంగతి పేరుకూడా వినలేదే జెల్లా! పైగా నాతో వాదిస్తున్నావా? నువ్వు నాతో వాదించాలంటే కనీసం ఈ విషయాన్ని తెలుసుకొని వుండాలి. ప్రతీ జెల్లకోసం ఒక కూరకుండ యెదురుచూస్తూ వుంటుందన్న సత్యం కూడా తెలియని నీకు ఈ వాదాలెందుకు? తగ్గు తగ్గు. లేదా తడాఖా చూపిస్తా"

అలా అని బొమ్మిడాయి కోపంతో జేవురించేసరికి జెల్ల ఏటి అడుగున ఏమూలకో ఉరుకు పెడుతుంది. కాని మర్నాడు ఆ రెండూ ఎక్కడో ఒకచోట కలుసుకొని చర్చలు ప్రారంభిస్తాయి.

"నిన్న వాలగ మన కలుగువైపు చూసింది" అని బొమ్మిడాయి జెల్లతో చెప్పింది.

"మొన్న నీవు చెప్పావు అదేనా?"

"అదేనయ్యా! అదే. అలా ఈదుకొంటూవచ్చి ఇటూ అటూ చూసింది. 'ఇక్కడ ప్రశాంతంగా వున్నట్లుందే! జెల్లలు కొల్లలుగా వుండవచ్చునన్నమాట.' అని గొణుక్కుంది.

"అయితే నీ సలహా యేమిటి?"

"సిద్ధంగా వుండు. అంతే. అది నీ దగ్గరకొచ్చి నోరు తెరిచేవరకూ కాచుకొని వుండు. తర్వాత రెక్కలు ముడుచుకొని నోటిలోంచి గొంతులోకి దూకు!"

"ఎందుకు దూకాలి? నేను చేసిన నేరమేమిటి?"

"నీకు బుర్రలేదు. వచ్చిన చిక్కల్లా అదే. మెదడులో కొవ్వు చాలా పెరిగింది. కొవ్వు బలిసినవారు వాలగ గొంతులో దూకాలని శాస్త్రాలు చెపుతున్నాయి కాదూ?"

"అలాంటి శాస్త్రమెక్కడా లేదు" అని కోపంతో అరిచింది జెల్ల.

"నన్ను అలా మింగే హక్కు వాలగకు లేదు. అది ముందు నాకు తగిన సమాధానం ఇవ్వాలి. అది కనిపించనీ ఏం చేస్తానో చూద్దువుగాని, ఉన్నదున్నట్లు నిజం చెప్పేస్తాను. నిజం అంటే అచ్చమైన నిజమన్నమాట."

"నీవొక గాడిదవని ఇంతకు ముందే చెప్పాను. ఇప్పుడు మళ్ళీ చెపుతున్నాను. నీవు గాడిదవి. అప్పటికీ ఇప్పటికీ కూడా అడ్డగాడిదవే."

చర్చ ఈ దశకు చేరేసరికి బొమ్మిడాయికి కోపం మిన్ను ముట్టింది. ఇకమీద నీతో మాట్లాడితే ఒట్టు అని జెల్లతో చెప్పింది. కాని కొన్ని రోజులు పోయేసరికి అలవాటు

ప్రకారం రాక మానదు.

"అసలు మన చాపలన్నీ ఒక కట్టడి చేసుకొంటే..." అని ముందు జెల్ల యథాప్రకారం చర్చను మొదలు పెట్టింది. దీనితో బొమ్మిడాయికి దిమ్మురేగింది.

"హే భగవాన్ ఏమిటీ బుర్రలేని వాదన. అదేం మాట్లాడుతుందో దానికే తెలిసిచావదు. పక్కనే వుంది దొంద. దాని చెవినిపడితే? ఏమో కానికాలం." అనుకొంది బొమ్మిడాయి మనసులో. జెల్లకు నచ్చజెప్పాలనే ఉద్దేశ్యంతో అనునయిస్తూ అంది:

"అనవసరంగా నోరు పారేసుకోకు. మాట్లాడేది జాగ్రత్తగా ఆలోచించి మరీ మాట్లాడు. అదీకాక అంతపెద్ద గొంతుకతో ఎందుకు అరుస్తావు? చెప్పతలుచుకొన్నది చెవి దగ్గర చెప్పు చాలును"

"ఈ గుసగుసలు నాకు నచ్చవు. ఢంకామీద దెబ్బ కొట్టినట్లు గట్టిగా చెప్పవలసిందే. మన చేపలన్నీ ఒక కట్టడి చేసుకొంటే...."

బొమ్మిడాయి ఇంక సహించలేకపోయింది. "నీతో వాదిస్తూ కూర్చుంటే కడుపునిండేనా కాలునిండేనా?" అని అక్కడినుంచి దారిపట్టింది. బొమ్మిడాయికి ఎంత కోపము వచ్చినా జెల్లమీద జాలికూడా లేకపోలేదు. జెల్ల ఎంత మూర్ఖంగా వున్నా అంతకన్నా నమ్మదగ్గ చేప మరొకటిలేదు. నిన్ను చూసి విసుక్కోదు. విడిచిపెట్టదు. ఈ రోజుల్లో ఇలాంటి సద్గుణాలు ఎవరికున్నాయి? రోజులా బాగులేవు. తల్లీ తండ్రిని కూడా నమ్మడానికి వీల్లేదు. దొందేవుంది. దానిలో చెప్పుకోదగ్గ దోషం ఏమీలేదు. కాని దానితో మాట్లాడేటప్పుడు మాత్రం మహాజాగ్రత్తగా వుండాలి. తెలియకుండానే గోతిలో పడతాం. చిల్లరమల్లర చేపలసంగతి చెప్పనే అక్కరలేదు. వాటికొక పురుగును పారేస్తేచాలును ప్రమాణం చేసి మరీ చెపుతాయి నామీద చాడీలు. ఇలాంటి మూకమధ్యపడితే పాపం జెల్లకింకేమైనా వుందా?

"అసలు నిన్ను నీకొకసారి చూసుకో జెల్లా" అంది ఒక రోజున బొమ్మిడాయి.

"అవసరమైతే నీ ఆత్మరక్షణకు ఏంచేస్తావు? నీకు బొర్ర పెద్దది బుర్ర చిన్నది. ఇక నీ నోరు. దానిసంగతి చెప్పనే అక్కర్లేదు. పోనీ పొలుసులు చూద్దామా? వాటిని చూస్తేనే నువ్వు వస్తుంది. వేగంగా పోలేవు. పైగా కంగారు. దేని పంటికిందనైనా నీవు పడ్డానికెంతసేపు?"

"అసలు నేనొకరి పంటికింద ఎందుకు పడాలి? నేనేమీ తప్పుచేయలేదే? ఎవరికీ అపకారం తలపెట్టలేదే?" అని ఎప్పటిలాగే ఎదురుప్రశ్న వేసింది జెల్ల.

"ఓయి తెలివితక్కువ దద్దమ్మా విను! తప్పుచేసినందుకు ఎవరినైనా మింగారా? మనల్ని ఎవరో తినాలనుకొంటారు కనుక మనం హతమారుతూ వుంటాం. తెలిసిందా? తిండి నాకూ అవసరమే. కాదంటావా? నీవు బురదలో మూతెందుకు దూరుస్తావు?



చిరుమీను దొరుకుతుందేమో అనేకదా? అవికూడా నీలాగే బతకాలనుకొంటాయి. కాని నీవొకడివి తయారై ముప్పొద్దులా పొట్ట నింపుకొంటూ వుంటావు. వాటినలా ప్రతిక్షణం నీవు శిక్షించడానికి అవి చేసిన నేరమేమిటి? చెప్పు. చేపలన్నీ ఒక కట్టడి చేసుకొంటే అని మొన్న నీవు చెప్పావే నీతి? అదెందుకు జ్ఞాపకంరాదు నీకు? సరే. చిరుమీలన్నీ కలిసి నీపై కుట్రపన్నితే ఏమవుతుంది? సంతోషిస్తావా? ఇంతకీ నీకు బుర్ర శూన్యం?"

ఇలా మొహాన పట్టుకొని దులిపేసరికి చచ్చినంత పనైంది జెల్లకు. గొంతు పూడిపోయింది. మాట పెకల్లేదు.

"చిరుమీలు.... కాని.. అవి...." మాటలు తడబడ్డాయి జెల్లకు.

"చీరుమీలు చిరుమీలే. జెల్లలు జెల్లలే. చిరుమీలను జెల్లలు తింటాయి. జెల్లలను వాలగలు మింగుతాయి. అందులో చిరుమీలు చేసిన పాపమూ లేదు. జెల్లలు చేసిన నేరమూ లేదు. అయినా అవి రెండూ అనుభవించక తప్పదు. కావాలంటే యుగాలు యుగాలు ఆలోచించు. నీకు వేరే దారి కనిపించదు."

దీనితో జెల్ల చాలా దీర్ఘాలోచనలో మునిగిపోయింది. ఆలోచించింది. ఆలోచించింది. అంతసేపూ చీరుమీలను నములుతూనే వుంది. నమిలినకొలదీ ఇంకా నమలాలనే అనిపిస్తోంది. కొసకు ఎలాగైతేనేం ఒక ఆలోచన తట్టింది.

"కాదోయ్ బొమ్మిడాయ్. చిరుమీలు ఏదో నేరం చేశాయని నేను వాటిని తినడం లేదు. నీవు చెప్పింది నిజమే, చిరుమీలు నాకు ప్రకృతి సిద్ధమైన ఆహారం. అందుకని వాటిని తింటున్నాను."

"ఈ సిద్ధాంతాన్నెక్కడినుండి తీసుకొచ్చావు?"

"నాకే తోచింది, చిరుమీలకు ఆత్మలులేవు. వాటిని తిన్నాననుకో. ఆ విషయాన్నవి తెలుసుకోనేలేవు. అదీకాక వాటి ఆకారవికారాలు చూస్తే తినకుండా ఎలా ఉండగలం? నోటినిండా నీరుపీల్చు, పుక్కిటినిండా చిరుమీలు వస్తాయి. వాటిని కావాలని నేను మింగడంలేదు వాటంతట అవేవచ్చి నా నోట్లో పడుతున్నాయి. మరి జెల్లలన్నావా? అది వేరే విషయం. మూరెడు పొడవు జెల్లలు కూడా వున్నాయి. అలాంటి వాటిని తినడం మాటలుకాదు. అది నిజంగా ఏదైనా నేరం చేస్తేనే అప్పుడు..."

"సరే ఒక వాలగ నిన్ను కబళించే వరకూ అలాగే వుండు. అప్పుడు తెలుస్తుంది. అంతవరకు నోరు మూసుకొని కూర్చో."

"నేను నోరు మూసుకోను. నేను వాలగను స్వయంగా చూడలేదు. కాని నీవు చెప్పినదాన్నిబట్టి అది సత్యాన్ని వినలేని చెవిటిదేమీ కాదని తెలుసుకొన్నాను. అభం శుభం ఎరగని జెల్ల బురదలో పడివుంటే నిష్కారణంగా ఒక వాలుగ వచ్చి దాన్ని కబళించడం మహాఘోరం. అసలింత దురన్యాయం వుంటుందా? నేను నమ్మను."

నువ్వొక అడ్డగాడిదవి. పొద్దున్నే ఆ జాలరి ఒక వల వేసి మనవాళ్ళందర్నీ పట్టుకొన్నాడు చూడలేదూ? వాటినన్నింటినీ కూర్చోపెట్టి కుశల ప్రశ్నలు వేయడానికి గట్టున చేర్చాడంటావా?

"ఏమో నాకేమీ తెలియదు. ఇంతకీ వాటిని తినడానికే పట్టాడో ఒక కోనేరులో పెంచడానికే పట్టాడో ఏం చెప్పగలం? ఇక్కడకన్నా అక్కడ అవి హాయిగా వున్నాయేమో?"

"అయితే నీవుకూడా అక్కడికే పోరాదూ?"

రోజులకు రోజులు గడిచినా ఈ వాదనలకు చర్చలకు అంతు కనిపించడం లేదు. అవి వుంటున్నది చాలా ప్రశాంతమైన ప్రదేశం. నలువైపులా పచ్చని నాచు అలముకొని వుంది. చర్చలు జరపడానికి ఇంతకన్నా చక్కని స్థలం ప్రపంచంలో మరెక్కడుంటుంది? ఎంత చర్చలు సాగించినా ఏంచేసినా భయమనేదిలేదు. దీనితో జెల్ల వాదాలు సాగుతున్నకొలదీ దాని గొంతుకూడా ఉచ్చస్థాయి నందుకుంటోంది. ఒక రోజున:

"చేపని చేప ప్రేమించాలి. ఒక చేపకు ఆపద వస్తే అన్నీ కలసి ఆదుకోవాలి. ప్రతి ఒకటీ అందరి క్షేమం కోసమూ పాటుపడాలి. అసలు సామరస్యం అప్పుడు వస్తుంది."

"ఈ ప్రేమ సిద్ధాంతాన్ని వాలగకు బోధించు" అంది బొమ్మిడాయి ఎత్తిపొడుపుగా.

"అదికూడా చేస్తాను. చూస్తూవుండు. ఒకటి రెండు మాటలు వినేసరికి ఎలాంటి వాలగయినా జెల్లగా మారిపోతుంది."

"అంతకన్నా కావలసినదేముంది. అలాగేకానీ"

"మంచి అనేది వుందా? వుంటే మన చేపజాతిపట్ల ఎలా ప్రవర్తించాలో తెలుసా? అని వాలగను అడిగేస్తాను."

"ఓహో అది నిజంగా సమ్మోహనాస్త్రంలా పనిచేస్తుందనుకో! నీ పొట్టచీల్చి ఈ పసిడి పలుకుల్ని ఏరుకోవాలనిపిస్తోంది!"

"వేళాకోళాలు చాలిద్దూ"

మరొక రోజున జెల్ల చర్చకు ఉపక్రమిస్తుంది.

"అసలు చేపలన్నిటికీ చిన్నతనంనుంచీ పౌర ధర్మాల విషయంలో తరిఫీదిస్తే మన హక్కులేమిటో మనకు సదా జ్ఞాపకం వుంటాయి."

"పౌరధర్మంవల్ల ఏమి సాధిద్దామనుకొంటున్నావు?"

"సరే – ఏమైనప్పటికీ . . . "

"ఏమైనప్పటికీ కట్టిపెట్టు. పౌర మర్యాదను అమలు జరపగలిగినప్పుడు బాగానే వుంటుంది. కాని నీవీ బురదలో పౌరసత్వాలనెలా అమలు పరుద్దామనుకుంటున్నావు?"

"అది బురదలోనే వుండాలనడం లేదు. సర్వత్రా వుండాలంటున్నాను."

"ఉదాహరణకు?"

"ఒక జాలరి నన్ను కూరకుండలో వేశాడనుకో! అప్పుడు విచారణలేనిదే ఇంత దారుణమైన శిక్ష నాకు విధించే హక్కు నీకు లేదని అంటాను."

"అలా అన్నందుకు కుండలోంచి తీసి నిన్ను తిన్నగా కుంపటిలోనే పడేస్తాడు. ఈ బురదలో పౌరసత్వాలు అంటే తెలివితక్కువ ఆలోచనలు.. పనికిరావోయ్. నోరు మూసుకొని బురదలో దూరి ఒళ్ళు దాచుకో. తెలిసిందా బుజ్జినాన్నా?"

ఇదుగో, అసలు చేపలు తమ జాతిని తినకూడదు. ప్రకృతి మనకోసం కమ్మని పదార్థాల నెన్నిటినో సృష్టించింది. చిరుమీలు, ఈగలు, దోమలు, లూతలు, పీతలు, పాములు, కప్పలు ఇవన్నీ కమ్మగానూ వుంటాయి. పుష్టినీ ఇస్తాయి. ఏమంటావు?" అని అడిగింది ఒక రోజున జెల్ల.

"జెల్లలు.. వాలగ నోటికి చాలా కమ్మగా వుంటాయి కాదూ?"

"జెల్లలను వాటిలో చేర్చడానికి వీల్లేదు. జెల్లకు ఆత్మరక్షణకు కావలసిన ఏర్పాటు ఏదీ ప్రకృతి చేయలేదు. అందుకని వాటి రక్షణకోసం ఒక ప్రత్యేక చట్టాన్ని చేయడం అవసరం."

"ఆ చట్టాన్ని ఎవరూ ఖాతరు చేయరనుకో! అప్పుడు?"

"అప్పుడు శాసన ధిక్కారం చేసినవారిని తగురీతిగా మందలిస్తూ.. అంటే శాసన ధిక్కారంకన్న శాసనరాహిత్యమే మేలు లాంటి ఒక ప్రకటన చేయాలి."

"అది సరిపోతుందనుకుంటున్నావా?"

"ఆ. అది చూసి చాలామంది సిగ్గుతో తలవంచుకొంటారు."

ఇలాగ జెల్ల రేయింబవళ్ళు వాదన పెట్టుకొంటోంది. మరొకరు అయివుంటే ఈనాటికి బాగా దేహశుద్ధి జరిగేదే. కాని జెల్లకు అలాంటిదేమీ జరగలేదు. జెల్ల కొంచెం మెళకువ చూపివుంటే ఈ నాలిక కల్పాంతం వరకూ అలాగే ఆడుతూ వుండేదేమో. కాని ఆలోచనా ప్రవాహంలో బుర్ర కొట్టుకొనిపోయింది. పాపం. వాలగ దొరసానిగారు ఈ ప్రాంతాలను సందర్శించడానికి వస్తున్నారని ఒకనాడు దొంద శ్రీముఖాన్ని కొనివచ్చింది. "రేపు ఉదయం ఆరు గంటలకు స్వాగతానికి సిద్ధంగా వుండు!" అని జెల్లను హెచ్చరించి పోయింది.

అయితే జెల్ల గాభరాపడలేదు. వాలగను గురించి చాలా కథలు వింది. అందుకని ఇప్పుడు పరిచయభాగ్యం లభించనున్నదికదా అని సంతోషించింది. అదీకాక మంత్రాలలాంటి తన మాటలు వింటే మహామహా వాలుగలుకూడా జెల్లలైపోవాలి అనుకొంది.

జెల్ల నమ్మకాన్ని చూసి బొమ్మిడాయికి ఆశ్చర్యం వేసింది. ఇంతకాలంనుంచీ తాను

ఎతి అంటే ప్రతి అని మరీ మూర్ఖత్వం చూపించానేమో అనుకొంది. వాలగ నిజంగా ప్రేమకోసం తపిస్తోందేమో? మంచి మాటలు విని తరించాలని ఆలోచిస్తున్నదేమో ఎవరికి తెలుసును? అసలు వాలగ నిజంగా దయాళువేమో? జెల్ల పైకి కనిపించేటంత అమాయకుడు కాకపోవచ్చును. పూర్వాపరాలు జాగ్రత్తగా బేరీజు వేయగల రాజనీతి దురంధరుడు కావచ్చును. జెల్ల తాను కనిపెట్టిన సత్యాల్లో ఒకటి వాలగకు చెప్పి, దాన్ని నిర్విణ్ణను చేయవచ్చును. ఎవరికి తెలుసును? అది విని 'జెల్లా' నీవు నిజం చెప్పినందుకు ఈ జలరాశికంతా నిన్ను అధిపతిని చేస్తున్నాను, అని వాలగ అంటుందేమో?

మర్నాడు ఉదయం అన్నమాట ప్రకారం వాలగ ఈదుకొంటూ వచ్చింది. దానివైపు చూసింది జెల్ల. "వాలగను గురించి అనవసరంగా ఉన్నవీ లేనివీ చెప్పారు. ఇదికూడా అందరిలాగానే వున్న సాధారణమైన చేప. కాగా నోరు మాత్రం మహాపెద్దది. గొంతులోంచి జెల్లలు సులభంగా దూరిపోతాయి" అనుకొంది మనసులో జెల్ల.

"నీవు చాలా తెలివైనదానివనీ, మంచి వక్తవనీ మాకు వినవచ్చింది. నీతో చర్చ జరపాలని వుంది. కానియ్యి" అంది వాలగ.

జెల్ల వినయగాంభీర్యాలతో ప్రారంభించింది వాదం.

"నే నెప్పుడూ సుఖాన్ని గురించే ఆలోచిస్తూ వుంటాను. సుఖం నాకొక్కనికే కాదు. అందరికీ వుండాలి. చేపలన్నీ తమ కిష్టం వచ్చిన నీటిలో స్వేచ్ఛగా ఈదగలగాలి. బురత కావాలనుకొన్నవారు మనసారా బురదలో మునగడానికి స్వేచ్ఛవుండాలి."

"ఇలాంటిది సాధ్యమనే అనుకొంటున్నావా?"

"ఆహా! అంతేకాదు, ఏ క్షణంలోనైనా ఇలాంటి వ్యవస్థ రావచ్చునని ఎదురు చూస్తున్నాను."

"సరే.. నేనే ఒక జెల్ల పక్కన ఈదుతున్నాననుకో! అప్పుడెలా వుంటుంది ఆలోచించు!"

"ఎలా వుంటుందేమిటి చాలా బాగా వుంటుంది."

"ఇలాంటి వాదన వినడం ఇదే ప్రథమం. సరే నేను పక్కకు తిరిగి దాన్ని కబళించాననుకో, అప్పుడు?"

"దేవరవారు మన్నించాలి. అలాంటిదెక్కడా చట్టంలో లేదు. చీరుమీలు, ఈగలు, పురుగులు శరీరపోషణకు వినియోగపడాలి అని చట్టంలో స్పష్టంగా వుంది. ఆ తర్వాత సవరణలు చేసి దానికి బాతులు, పీతలు, మిడతలు, కప్పలు తదితర జలచరాలను చేర్చారు. అంతేకాని చేపలను చేర్చలేదు."

"నాకు నచ్చలేదు. ఏమోయ్ దొందా అసలలాంటి చట్టం వుందా?

"దానికి కాలదోషం పట్టింది దేవరా!" అని దొంద ఆరిందా అధికారిలాగా

జవాబిచ్చింది.

"మేమూ అలాగే అనుకొన్నాం. అసలలాంటి చట్టం ఉండడానికి వీల్లేదు. సరే జల్లా! ఏ క్షణాన్నయినా ఇంకేం జరుగుతుందని ఆశిస్తున్నావు?"

"న్యాయం జయించాలని నా అభిమతం. బలవంతులు బలహీనులను, ధనవంతులు దరిద్రులను బాధించకూడదు. ప్రతి చేపకూ సముచితస్థానం గల సమాజాన్ని నిర్మించాలి. ఆ సమాజంలో ప్రతిచేపా తన సముచిత పాత్రను నిర్వహిస్తుంది. బలమూ, తెలివీ గల మీ వాలగలకు అందులో ముఖ్యమైన స్థానం వుంటుంది. నాలాంటి జెల్లలు ఏవో చిన్న చిన్న పనులు శక్తికొలదీ చేయగలుగుతాయి. ప్రతివారూ సమాజం శ్రేయస్సుకూ, సమాజం ప్రతివారి శ్రేయస్సుకూ పాటుపడాలి. మనం ఒకరి కొకరం బాసటగా వుంటే మనకెవరూ ఎర వేయజాలరు. ఎవరికి తోచినరీతిని వారు రాళ్ళ కింద, నాచుకింద, బొరియల్లో, బురదలో తలదాచుకొంటే వలలు మనలనేమీ చేయలేవు. చాపల పులుసు సంగతి వారింక మరచిపోవలసివుంటుంది."

"నాకంత నమ్మకం లేదు. రుచిగల వాటిని జనం మరిచిపోలేరు. సరే అలాంటిది జరుగుతుందనే అనుకొందాం. కాని అదెప్పుడు జరుగుతుందో ఎవరికీ తెలియదు. సరే ఒక ప్రశ్న అడుగుతున్నాం. నీ వాదాన్ని బట్టి చూస్తే మేంకూడా పనిచేసి తీరాలని చెపుతున్నట్లు అనిపిస్తోంది. నిజమేనా?"

"ఆహా. అందరూ చేసినట్లే మీరూను."

"ఈ మాట వినడం ఇదే మొదలు. అబ్బీ పోయి కాస్త నిద్రపో!"

జెల్ల నిద్రపోయిందో లేదో ఎవరికీ తెలియదు.

ఏమైనా ఆ తర్వాత వాలగను కలుసుకొన్నప్పుడు మాత్రం జెల్ల తెలివి తెల్లవారింది. మధ్యాహ్నం వాలగతో వాదన చేయడానికి జెల్ల వచ్చింది. నిర్భయంగా రావడమే కాదు, మహా సంతోషంగా కూడా వచ్చింది.

"మేం పనిచేయాలి. ఫలితాన్ని నీవు అనుభవించాలి, ఔనా?" అని అడిగింది వాలగ!

"మనం ఉమ్మడిగా పనిచేస్తాం. ఇతరుల శ్రమ ఫలసాయాన్ని ప్రతివారూ అనుభవిస్తారు."

"అదా సంగతి... తెలిసింది. ఇతరుల శ్రమ ఫలితాన్ని ప్రతివారూ అనుభవిస్తారు. అంటే నా శ్రమ ఫలితాన్ని కూడా అన్నమాట. నీ ప్రసంగాలు ప్రమాద రహితాలు కాకపోలేదని ఇప్పుడు నాకు తోస్తోంది. దొందా ఇలాంటి ప్రసంగాలను ఈ రోజుల్లో ఏమని పిలుస్తారు?"

"శేషలిజం! దేవరా"

"మాకు తెలుసును. ఈ జెల్ల విద్రోహాన్ని రెచ్చగొడుతున్నదని చాలా కాలంనుంచీ

వింటున్నాం. జెల్ల చెప్పే మాటలను స్వయంగా విందామని బుద్ధిపుట్టింది. నీ వ్యవహారం ఇదన్నమాట!" అలా అని వాలగ తోక కొరడాలాగ జళిపించింది. దాని అర్థమేమిటో జెల్లకు తెలిసిపోయింది.

"తమకు ద్రోహం తలపెట్టలేదు దేవరా. నేను వినయంగానే మనవి చేస్తున్నాను దేవరా" అని ప్రాధేయపడింది.

"వినయం ధూర్త లక్షణమన్నారు. బుద్ధిహీనుల్ని స్వేచ్ఛగా విడిచిపెడితే నానా రభసా చేస్తారు. నీ సంగతి చాలా విన్నాం. కాని నీవు సామాన్య జెల్లవేననీ, నీలో ప్రత్యేకత ఏమీలేదనీ ఇప్పుడు తెలుసుకొన్నాం. నీతో మాట్లాడ్డం మొదలుపెట్టి అయిదు నిమిషాలు కాలేదు. తలనొప్పి పట్టుకొంది."

వాలగ క్రీగంట జెల్లను చూస్తూ అలా కొంతసేపు కూర్చుంది. దానితో జెల్లకు అంతా అర్థమైపోయింది. అంతకు ముందు కడుపునిండా ఆరగించిందేమో ఆవులింతలు వచ్చి గుర్రుపెట్టసాగింది వాలగ. వాలగ గురక ప్రారంభించగానే దొందలు జెల్లను చుట్టుముట్టి నిర్భంధంలో వుంచాయి.

ప్రొద్దు క్రుంకగానే మరొకసారి వాదనకోసం జెల్లను వాలగముందు హాజరుపెట్టాయి. ఈసారి మాత్రం జెల్లను కుళ్ళపొడిచి చుట్టూ కావలి నిలిచాయి దొందలు. దర్యాప్తు సమయంలో ఒక దొంద జెల్ల తోకను సగం కొరికింది. మరొకటి వీపుమీదనుంచి ఒక కండ ఊడబెరికింది.

జెల్ల జంకలేదు. తన మాటల మహత్తుమీద ఇంకా దానికి నమ్మకం వుంది.

"నీవు మాకు శత్రువువైనప్పటికీ వాదన లేనిదే మాకు తోచదు. అందుకని ఏదీ మొదలు పెట్టు" అంది వాలగ.

దీనితో జెల్ల హృదయంలో అగ్ని రాజుకొంది. సగం తెగిన తోక నాడిస్తూ వాలగ కళ్ళల్లోకి సూటిగా చూసింది. ఉన్న శక్తినంతనీ కూడదీసుకొని "మంచితనం అంటే ఏమిటో తెలుసునా?" అని ప్రశ్నించింది.

వాలగ తెల్లపోయి నోరు తెరచింది. తనకు తెలియకుండానే గొంతులోకి నీరు లాక్కొంది. ఆ నీటితో జెల్ల కూడా వాలగ గర్భకుహరంలో పడిపోయింది.

ఈ దృశ్యాన్ని చూసిన చేపలు నిర్ఘాంతపోయాయి. వెంటనే తేరుకొని వాలగ వద్దకు చేరాయి. దేవరవారికి అది గొంతు కడ్డుపడలేదు కదా అని కుశలప్రశ్నలు వేశాయి. ఇలాంటిది జరుగుతుందని ఏనాడో ఊహించగలిగిన బొమ్మిడాయి ముందుకు ఈది ఇలా ప్రకటించింది:

"మన తగువులు ఇలాగే ముగుస్తాయి!"

✦ ✦ ✦

బతికిచెడ్డ పైడిపిట్ట



పికిలిపిట్టను పైడిపిట్టకిచ్చి పెళ్ళిచేశారు. పెళ్ళి మహా వైభవంగా జరిగింది. "ఆటపాటలు" అనే దుకాణంలో ఒక చిన్న కొయ్య దేవాలయాన్ని కొన్నారు. ఆ గుళ్ళోనే పెళ్ళి జరిగింది. కత్తెరపిట్ట పౌరోహిత్యం చేసింది. బెగ్గురు పిట్టలు మేజువాణీ కట్టాయి. చూడవచ్చినవారినందర్నీ సర్దడం కోసం పోలీసు సూపర్నెంటు ఒక వేట పులుగు పటాలాన్ని పంపించాడు.

ఆ దంపతులను చూడ్డానికి అడివిలోని పిట్టలన్నీ వచ్చాయి. కొంతమంది గొప్పగొప్ప అతిథులు కూడా విచ్చేశారు. ఏంట్రింత పైడిపిట్టకు తోడుపెళ్ళికొడుకు అయింది. బుల్బులి పికిలిపిట్టకు తోడి పెళ్ళికూతురుగా వచ్చింది. పెళ్ళికొడుకు తరపున పెద్దగా వుంటానని రాబందు కబురు పెట్టింది. అందుకు ఒప్పుకోజాలమని సవినయంగానే తిరిగి కబురుపెట్టారు. పెళ్ళిపెద్దగా చెవిటి కౌజును తీసుకొని వచ్చారు. దానికి చెవుడుకు తోడు మతిమరుపు కూడా ఎక్కువ. అందుకని రాజాస్థానంలో సలహాదారు పదవి

దానికి లభించింది.

పెళ్ళికి వచ్చిన పెద్దలు, దంపతులు, కన్యాదాతలు అంతా పెళ్ళి వైభవానికి ఆనందించారు. పైడిపిట్ట రానున్న మధురక్షణాలను ఊహించుకొంటూ గర్వంతో నెమిలిపిట్టలా మురిసిపోయింది. పికిలిపిట్ట వయ్యారంగా ముక్కుతో రెక్కలను గీరి కులుకులు చూపింది. "అమ్మయ్య ఇప్పటికి పెద్ద పిల్లనొక ఇంటిదాన్ని చేసి గట్టెక్కాం" అని పిల్ల తలిదండ్రులు బరువు దించుకొన్నట్లు సంతోషించారు. విందులో తాము ఆరగించబోయే పురుగు పులుసునూ, పంచదార పాకం పట్టిన ఈగలనూ, రాసులుగా పోసే గింజలనూ తలుచుకొని నోళ్ళు చప్పరిస్తున్నారు అతిథులు.

ఒక్క కాకి మాత్రమే శకున పక్షిలాగ అపశ్రుతి పలికింది. "ఈ దాంపత్యం నిలిచేది కాదు. నిలిచేది కాదు" అని అపశకునపు కూతలు కూసింది.

మనుషులు కాకిని శుద్ధ తెలివితక్కువ వాజమ్మకింద జమకడతారు కాని, కారణం లేనిదే కాకి కూయదని పక్షుల నమ్మకం. కాకి కూత మానగానే "ఈ శకునపక్షి మాట నిజమౌతుందేమో" అని కోకిల దీర్ఘాలు తీసింది. కాబుకపిట్ట, తేనెపిట్ట, పాలపిట్ట ఆ రాగాన్నందుకొని ఆలాపన చేశాయి.

వచ్చిన వారందరి కళ్ళు దంపతులమీదికి తిరిగాయి. వారిద్దరి పుట్టుపూర్వోత్తరాలనూ గుర్తుచేసుకొనడానికి మధనపడ్డాయి. దంపతుల పూర్వ చరిత్రను, వారి అలవాట్లను, అభిరుచులను ఒక్కొక్కటే నెమరువేసుకొన్నాయి. ఇలాంటి సందర్భాలలో ఫలితం ఎప్పుడూ కూడా మహారసవత్తరంగా వుంటుంది.

పైడిపిట్ట సాధు స్వభావంగలది. దానికి మూడు సుగుణాలున్నాయి. ఒకటి డాంబికం అనేది లేదు. రెండు ఎప్పుడూ నీటుగా గోటుగా వుంటుంది. మూడు అయినింట పుట్టింది. అవసరమైతే కుర్రాళ్ళతో కుస్తీ పట్టగలననే నమ్మకం దానికుంది. అయినా వయస్సు మాత్రం మళ్ళిందనే చెప్పాలి. బతుకంతా పటాలం కొలువులో గడిచిపోయింది. అక్కడ అది మేజరు హెూదా వరకూ వెళ్ళింది. అక్కడ దాని తెలివి పదునెక్కింది. రసికతకూడా ఒంటపట్టింది. లంచాలెప్పుడూ పట్టలేదు. అయినా కిందామీదాపడి ఆస్తి బాగానే సంపాదించింది. ఒకమాటొక వ్యవహారంలో ప్రతిఫలం పికిలిగింజల రూపంలో ముట్టింది. "నేను పికిలిపిట్టను పెళ్లాడి ఈ పికిలిగింజలతో సంతానాన్ని పోషిస్తే బాగుండదూ?" అన్న అభిప్రాయం అప్పుడే ఏర్పడింది. చిన్నప్పుడే తల్లీ తండ్రీ పోయారు. పిత్రార్జితం ఏమీ లేదు. అందుకని దానికున్న గౌరవ ప్రతిష్టలన్నీ కేవలం స్వార్జితమే కాని ఇతరులవల్ల వచ్చినవి కావు. స్వయంకృషి మీదే పైకి వచ్చింది.

పెళ్లికొడుకు కైఫియ్యతు ఇది. చెడ్డగా చెప్పుకోదగిందేదీ లేదు. న్యాయశాస్త్రరీత్యా చూసినా లోపమేమీ లేదు.

చూపులకంత స్ఫురద్రూపి కాదు. సామాన్యమైన రూపం. సామాన్యమైన వేషం. అంతే. ఏ యువతినైనా మెచ్చుకోవలసివచ్చినప్పుడు రెక్కలల్లార్చి, కళ్ళు గిరగిర తిప్పేది. అది చూసి పిచికలు పగలబడి నవ్వేవి. పైగా ఆ మెచ్చుకోలు మాటల్లో కూడా చమత్కారం ఏమీ వుండేది కాదు. ఏదో పాత పటాలం పరిహాసాలకు మించి కొత్తేమీ వుండేదికాదు. బండివాడు బాడుగ ఎంత చెప్పినాసరే దానికి అర్ధణా తగ్గించి ఇచ్చేవాణ్ణనో లేదా నీ లెక్కేమిటని నడిచిపోయే వాణ్ణనో చెప్పేది.

అదే దానికి తెలిసిన చమత్కార సంభాషణ.

"సరే ఇప్పుడు నాకేమీ లోటులేదు. దేవుడు మేలు చేస్తే పిల్లా పీచూ పెరిగినా పోషించగలను" అంటూ వుండేది.

ఇలాంటి మాటలు ఆడపిల్లలు గలవారి చెవులకు అమృతంలా వుంటాయి. అలాంటి అల్లుణ్ణి సంపాదించడానికవి ఏ పనైనా చేస్తాయి. ఒకసారి ఈ తల్లుల మధ్యపడి ఊపిరి సలపక ఉక్కిరిబిక్కిరి అయింది పైడిపిట్ట. కూతుళ్ళు మాత్రం దానికి "పటాలం బడుద్ధాయి" అని పేరుపెట్టి ఉడికిస్తూ వుండేవారు. తల్లులు కసురుతూ వుండేవారు. కాని పైడిపిట్ట ఉడుక్కునేది కాదు. పైగా ఎందుకలా కసురుతారు అని తల్లులనడిగేది.

"మరేం పరవాలేదండీ. ఇలాంటివి నాకలవాటే. మా పటాలం ఆఫీసులో ఒక ఏంట్రింత వుండేది. మహా అందమైందిలెండి. మొదట అదికూడా నన్నుచూసి హీహీహీ అని ఇకిలిస్తూ వుండేది. 'మనం నేస్తాలుగా వుందాం అమ్మాయ్' అనేవాణ్ణి. కాని అది 'పోవోయ్ బడ్డూ' అని కసిరికొట్టేది. నేను వెంటపడినకొలదీ అది నాకందకుండా పరుగెత్తేది. కొసకు పట్టుకొన్నాను. అప్పుడేమయిందో తెలుసునా? నన్నెంతలా పొగిడిందనుకొన్నారు!"

"ఎంత అద్భుతం" అనేవారు తల్లులు. "అయితే అబ్బాయి నీకు ప్రేమ సంతానం ఏమీ లేదుకదా?" అని అడిగేవారు.

"నేను నికరంగా చెప్పలేనండీ! నా కాలంలో నేను కూడా ఇంద్రియ దౌర్బల్యానికి లోనయ్యాను. ఈ విషయంలో నా అభిప్రాయం ఇది: ప్రతిదీ మితంగా వుంటే తప్పులేదు. అమితత్వం మాత్రం పనికిరాదు. ఆనందం అనుభవిస్తే తప్పేముంది? సారాకూడా అంతే. నేనెప్పుడూ ఒళ్ళు తెలియకుండా తాగలేదు. కాని అడపాదడపా ఒకటి రెండు మోతాదులకు నాకభ్యంతరం లేదు."

ఇక చాలును అనుకొని కొద్దిరోజుల క్రిందటే కొలువు చాలించుకొంది. అవసరాలు బహుకొద్ది. దేవుని దయవల్ల ఉద్యోగరీత్యా ఆర్జించిన ఆస్తి కావలసినంతవుంది. అసలు పొదుపరి. ఉన్న ఆస్తిమీద వచ్చే సామాన్య వడ్డీతోనే కాలం హాయిగా గడుస్తుంది. ఇక చక్రవడ్డీకిస్తే ఆ డబ్బునంతా ఏం చేయాలో కూడా తెలియదు.

"నాకు దుస్తులు ఉచితంగా వస్తాయి. దేవుని దయవల్ల భోజన భాజనాలు కూడా ఉచితంగానే దొరుకుతున్నాయి. ఎప్పుడైనా వినోదం కావాలనుకొంటే అదికూడా చవకగానే లభిస్తుంది. ఈ ప్రపంచంలో ఈగలకూ లూతలకూ కొరత లేదు.. వాటిని పట్టగల బలం వుండాలేకాని. దానికి లోటు లేదు. బలం ఉడిగిననాడు కన్నుమూస్తాను. మూస్తేనేం? అన్ని పిట్టలూ ఆఖరికంతేకదా?" అని అంటూ వుంటుంది.

పటాలంలో పనిచేస్తున్నంత కాలమూ సంసారసౌఖ్యాల మీదికి మనసుపోయేది. పందిరి పట్టిమంచమూ, పడక దుస్తులూ జ్ఞాపకం వచ్చేవి. ఇవి జ్ఞాపకం వచ్చినకొలదీ ఒక ఇంటివాడు కావాలని మనసు పీకుతూవుండేది. అందుకని ఒక పికిలిపిట్టను వరించింది. దుస్తులు వేసుకొని కాబోయే అత్త మామలతో సంబంధం మాట్లాడుకోవడానికి బయలుదేరింది.

జీవితంలో తొలిసారిగా గర్వం మనసులో పొంగులు వారింది. మొదటిసారిగా గొంతులో ఒక కూనిరాగంకూడా గులగులలాడింది. కానున్న వధువు పికిలిపిట్ట మనస్సంతా నిండిపోయింది. ఇంతకీ ఆ పిట్ట ఎలాంటిది? కట్నమెంత ఇస్తారు? అన్న విషయాలనుకూడా అడగడం మరిచిపోయింది పైడిపిట్ట. ఇది దాని స్వభావానికి విరుద్ధమే అయినా ప్రేమ సముద్రంలో తలమునకలై స్వభావాన్నే విస్మరించింది.

పెళ్ళికూతురు గొప్పవారిళ్ళల్లో తిరగనేర్చిన నెరజాణ. హొయలు, వయ్యారాలు చూపడం సరదా. వేషభూషణల మీద మక్కువ ఎక్కువ. సంగీతం వచ్చును. హార్మణీ వాయిస్తుంది. పాడేటప్పుడు చుట్టుపక్కల యువకులు తారట్లాడకపోతే నిరుత్సాహంతో నీర్రైపోతుంది. మనసులో కరుణవుంది. కాని దాన్ని చూపించడానికి తగిన తీరికా లేదు, అవకాశమూ కలగలేదు. సరికొత్తగా దిగిన బట్టలనెవరో ఒకరు తెస్తూ వుంటారు. లేదా తన అన్న చదువుతూన్న పటాలం స్కూలు కుర్రాళ్ళు కాలక్షేపానికి వస్తూవుంటారు. ఇలా తీరిక లేని పనుల్లో మునిగి వుండడంవల్ల పికిలిపిట్టకు తనలో కరుణ వుందన్న విషయం తెలుసుకొనడానికైనా అవకాశం లేకపోయింది.

"నీ సుందర పాదార విందాలను చుంబించే వరం ప్రసాదిస్తావా బాలా" అని ఒక పటాలం విద్యార్థి అంటాడు.

"అబ్బే నువ్వా నీ ... సరే అలాగే కానీ."

అలాగే జరుగుతుంది.

పికిలిపిట్ట తలిదండ్రులు ఘరానా కుటుంబంవారు. తమ బిడ్డకూడా ఘరానా సమాజంలో తిరగాలని వారి అభిమతం. దాని తండ్రి పికిలి రాష్ట్రంలో పదిహేనేళ్ళపాటు ఖిలేలదారుగా పనిచేశాడు. నాలుగు ఆస్తులు కలిసిరాగా ఆ నాలుగింటినీ కూడా ఆర్పేశాడు. ఒక ఏడాదికిందటే ఆఖరి విక్రయ దస్తావేజు మీద సంతకం పెట్టాడు.

ఇప్పుడు చిల్లర మల్లర వాయిదా బేరాలే జీవనాధారం. అయితే వాటిలో మాత్రం అతడు సిద్ధహస్తుడు. బండివాడికి బురిడీకొట్టి పెద్దభవంతులలో దూరి పక్కవీధిలోకి జారగల తెలివితేటలుకూడా వున్నాయి.

ఇక తల్లి. ఆమె తనకాలంలో పికిలిపిట్టగా వుండేది. ఇప్పుడూ అంతే. గండు పిట్టలకోసం ఆ కంచెమీంచి ఈ కంచెమీదికి, ఈ కంచె మీంచి ఆ కంచెమీదికీ గెంతేది. వాళ్ళాయన ఖిల్లేదారుగా పనిచేస్తున్న రోజుల్లో తాను వెన్న బిస్కత్తులు తినేది. అప్పుడు గవర్నరుగా వుండిన నెమిలిపిట్ట తాను కంటపడితే చాలును పురివిప్పేది. ఇప్పటికీ ఆ జ్ఞాపకాలు మాసిపోలేదు. ఆ జ్ఞాపకాలతోనే తన పెద్దకూతుర్ని పెంచింది.

“అసలు దాన్ని కాలేజీకి పంపాలని నేనెప్పుడూ అనుకోలేదు” అంది తల్లి, పైడిపిట్ట పెళ్ళి ప్రస్తావన తేగానే.

“ఆడపిల్లకి ఇంగ్లీషు మాట్లాడడం, కొమ్మమీంచి కొమ్మ మీదికి ఎగరడం చక్కగా ముస్తాబు చేసుకొనడం, అతిథుల్ని సంతోషపెట్టడం చేతనైతే చాలునని నా అభిప్రాయం. ఆడది సుఖపడాలంటే అది చాలును.”

“చాలా బాగా చెప్పారు. మీ అమ్మాయిని మీరు మంచి కట్టడిలో పెంచారు. మగవాళ్ళకంటే దేశ సమాచారం కొంత తెలిసివుండాలి. అధికారులు ఎప్పుడు ఎక్కడికి బదిలీ చేస్తారో తెలియదాయె. ఆడపిల్లలకన్నారూ ఏ పెద్ద మనిషైనా సంతోషంతో దారిచూపుతాడు. కాగా తప్పు దారిన పడకుండా తగు జాగ్రత్తలో వుంటే చాలును” అంది పైడిపిట్ట.

“తప్పు దారులు? అలాంటిది మాయింటా వంటా లేదు. నా మాట నమ్మండి. మా అమ్మాయికి పాపభీతి మెండు. ఇంతెందుకు అడివిలో ఒంటిగా రౌడీ మూక చేతిలో పడినాసరే, చెక్కుచెదరకుండా నలగని పువ్వల్లే తిరిగి వస్తుంది.”

“నేనూ అలాగే అనుకొంటున్నానండీ”

పికిలిపిట్ట కుటుంబంలో ఇప్పుడు చెప్పిన ముగ్గురూ కాక ఇంకొక అమ్మాయి, ఇద్దరు మగపిల్లలూ వున్నారు. చిన్నమ్మాయిలో పికిలిపిట్ట లక్షణాలకన్న బొంతకాకి లక్షణాలెక్కువ. అందుకనే దానికి విదారిణి అని పేరు కూడా పెట్టారు (పెద్దమ్మాయి పేరు విలాసిని). కథల్లో సవితి కూతురులాగ విదారిణి కష్టశీల అని తల్లిదండ్రులనుకొంటూ వుండేవారు. మెత్తని మనసు. ఇంటి పనులన్నీ చేస్తూ వుంటుంది. ఎప్పుడూ కళకళలాడుతూ వుంటుంది. ప్రతీవారు దానికదీ ఇదీ పురమాయించి చాకిరీ చేయించుకొంటూ వుంటారు. పైగా తిండి దండగ అని ఈసడిస్తూ వుంటారు. అయినా అన్నలన్నా, అక్కలన్నా, అమ్మా, నాన్నా అందరిమీదా దానికి తగని అభిమానం. ఇంటి చాకిరితోనే కాలం సరిపోతుంది కాని, కాలేజీ కెళ్ళడానికి తీరిక లేదే అన్న చింత ఒక్కటే దానికుంది.



ఇక అన్నలున్నారు. అందులో పెద్దవాడు పిండారీ పటాలంలో తరిఫీదు అవుతున్నాడు. నీతిశాస్త్రం పరీక్షలో ఎప్పుడూ సున్నాలే వస్తాయి. రెండవవాడు కాలేజీలో చదువుతున్నాడు. అయితే అక్కడ గ్రీకుభాష నేర్చుకోవాలని ఎందుకు కోరుతున్నారో మాత్రం వాడి కర్థంకాదు.

"ఆ చచ్చుభాష నేర్చుకొనడం వల్ల లాభమేమిటే అమ్మా? ఇక లాటిన్ అన్నావా దాన్ని వల్లించడం సులభం. నాలుగు పద్యాలు చదవడానికి పనికివస్తుంది. వ్యాసాల్లో అక్కడక్కడ నాలుగు ముక్కలు వాడితే వాటికొక హుందాతనం వస్తుంది. ముందు చీటీలు రాయడానికి పనికివస్తుంది. గ్రీకుభాష ఏం చేసుకోవాలి?"

"అది నేర్చుకుంటే నడవడి బాగుపడుతుందేమోరా" అని వాళ్లమ్మంది.

"ఏమో అమ్మా!"

రోజు రోజంతా ఇల్లు సందడిగా వుంది. అంతా పరుగులే. వచ్చే అతిథులు, పోయే అతిథులు. విందులు, వినోదాలు. కొమ్మనుంచి కొమ్మకు గెంతులు, పాటలు.

పచారీ కొట్టువాడికి ఆర్నెల్లనుంచీ ఒక్క పైసాకూడా చెల్లించలేదు. అయినా ఇంట్లో వేసే విస్తరీ తీసే విస్తరీ. ముసిలి పికిలిపిట్ట సంసార సాగరాన్ని ఈదలేక తల మున్కలౌతోంది. తెల్లవారి లేవగానే పరిచయస్తులందరినీ చూడ్డానికి బయలుదేరుతుంది. వాళ్ళ ముసలమ్మ చచ్చిపోయినట్లు ఇప్పుడే వార్త వచ్చిందనీ వారసత్వం దక్కాలంటే కొంత డబ్బు అవసరమనీ ఒకరితో చెపుతుంది. తన జమీలో బొగ్గుగనులు వెలువడ్డాయనీ, వాటిని తవ్వడానికి మదుపు కావాలనీ మరొకరితో చెపుతుంది. ఎర్రని ఏగానీకూడా లేక చాలా బాధపడుతున్నట్లు వేరొకరితో స్పష్టంగా చెప్పేస్తుంది.

అప్పుడప్పుడు ఇంటికివచ్చే పటాలం కుర్రవాళ్ళ వద్దకు వెళ్ళి "ఇదుగో ఒక పావలా వుందటోయ్ బాబూ! రేపిచ్చేస్తానులే" అంటుంది. పటాలం కుర్రవాళ్ళు వెంటనే ఇస్తారు. అందుకు ప్రతిగా వాళ్ళ సరదా వాళ్లు తీర్చుకొంటారు. ఒకసారి తండాకితండా ఇంటికి వస్తారు. పెద్దమ్మాయిని చుట్టుముట్టి మీసాలు దువ్వుతారు. అక్కకొచ్చిన అపాయాన్ని చూసి పాపం చిన్నమ్మాయి కుమిలి కుమిలి ఏడుస్తుంది.

ఇలాంటి కుటుంబంతో సంబంధం చేసుకోవడానికి పైడిపిట్ట నిశ్చయించుకొంది. ముసిలి పికిలిపిట్ట దివాలా తీసిన సంగతి ఇరుగుపొరుగు ఎవరినడిగినా చెప్పివుండేవారు. మొన్న మొన్ననే తల్లి పికిలి వడ్డీవ్యాపారి బొంతపిచికతో ఒక తుప్పచాటు గుసగుసలాడ్డం అంతా చూశారు. పెద్దమ్మాయి సంగీత పాఠాలు చెప్పుకొనడానికి మిషపెట్టి రోజూ బుల్బులి దగ్గరకు పరుగెత్తుతూ వుండేది. ఆ తర్వాత గాలిగుడ్లు కూడా పెట్టిందని అంతా చెప్పుకొన్నారు.

కాని పైడిపిట్ట మాత్రం ఇవి వినదలుచుకోలేదు. చూడదలుచుకోనూలేదు.

పిల్లనివ్వడానికి ముసలివాళ్ళు ఒప్పుకొన్నదే తడవుగా సంతోషంతో కొమ్మకొమ్మకూ ప్రియురాలు కనిపిస్తుందేమోనని మిర్రి మిర్రి చూసింది. ప్రియురాలు కంటపడేసరికి గొంతులో కూని రాగాలు తారాడేవి. పాటలో అన్నీ అపశృతులే అయినా తనకింతటి అదృష్టాన్ని ప్రసాదించిన ఆ పరమాత్మను స్తుతించడానికి అంతకన్నా వేరుమార్గంలేదు.

"నా అర్హతకు మించిన అదృష్టం నాకు పట్టిందని తెలుసును. దానికి తగినట్లు నడుచుకొనడానికి శాయశక్తులా ప్రయత్నిస్తాను" అని గొణుక్కొనేది.

కాని విలాసిని మాత్రం పైడిపిట్టను చూస్తే ముఖం తిప్పుకొనేది. తన అయిష్టాన్ని దాచడానికి కూడా అదెప్పుడూ ప్రయత్నించలేదు. ఈ సంబంధం చేసుకొనడానికి మేజరు పైడిపిట్ట అంగీకరించి తమను కృతార్థులను చేసిందని ముసిలిపిట్టలు విలాసినితో చెప్పాయి.

ముహూర్తం కూడా పెట్టేశామన్నాయి. ఆ మాట విన్నప్పుడు విలాసిని విరగబడి నవ్వింది.

"ఆమ్మో వాడు బలే గంథోళిగాడిలా వున్నాడే?"

ఇద్దరికీ ఎక్కువ చనువు ఏర్పడడంకోసం తలితండ్రులు వారిని ఏకాంతంలో విడిచిపెట్టేవారు. అప్పుడు సరదాగా కబుర్లు చెప్పుకొనడానికి బదులు మాటలన్నీ పుల్లవిరుపుగా సాగేవి.

"నీవు పిసినిగొట్టువా?" అని అడిగింది విలాసిని.

"పిసినిగొట్టును కాదుకాని పొదుపరిని. నీ దగ్గర కావలసినంత ధనం వుందనుకో! దాన్ని పారేసుకోవలసిన అవసరంలేదు. కాని నీవు కోరేపక్షంలో నా అలవాటు మార్చుకొంటాను" అని జవాబిచ్చింది పైడిపిట్ట.

తర్వాత లేచి పటాలం బాణీలో చెప్పులను కిర్రుమనిపించింది. అది చూసి విలాసిని మళ్ళీ విరగబడి నవ్వింది.

"ఆ చెప్పులలా కిర్రుమనిపించినప్పుడు నీ వెంత తమాషాగా వున్నాను? అదీ అద్దదీ! హా హా హా సరే. ఇంటిదగ్గరేం తింటావు? ఏదో చెత్తాచెదారం అయివుంటుంది. అవునా?"

"ఆ భగవంతుడేం ప్రసాదించాడో అది తింటాను. సామాన్య భోజనమే కావచ్చును కాని సంతృప్తికరమైన తిండి. కాని నీకోసం మాత్రం పికిలిగింజలు తెస్తాను."

"అబ్బే నాకు కూరగాయలంటే ఇష్టం."

"కూరగాయలా? నీకోసం వాటిని సంపాదించడమెంతపని? పొద్దున్నే ఎగిరి ఎవరి పెరటిలోకైనా వెళ్ళి తేవచ్చును. ఇతరులైతే డబ్బుపోసి కొనుక్కొంటారు. ఎంత డబ్బు పోస్తారో ఆ దేవునికే తెలియాలి. కాని నేనుమాత్రం నీకోసం ఉల్ఫాగానే తెస్తాను."

"బాగానేవుంది. అయితే నాకు పెళ్ళి బహుమతి ఏమిస్తావు? కొత్తగా పారిస్‌నుంచి

దిగుమతి అయ్యాయి లేసులు. మొన్ననే చూశాను. అవి నాకు కొనిపెడతావా?”

“చాలా సంతోషం. అందుకభ్యంతరమేమి. రేప్పొద్దుటి కల్లా తయారుగా నేసి వుంచమని లూతకు పురమాయిస్తాను”

“సరేకాని నా మనసుకు నచ్చిన లేసులుమాత్రం చాలా ఖరీదైనవి.”

“ఖరీదు విషయం పట్టించుకోకు. డబ్బు, అడగడానికి లూతవచ్చినప్పుడు గప్‌చిప్‌గా దాన్ని కబళించేస్తాను. మనకింక అప్పూగిప్పూ వుండదు.”

“బలే తమాషా అయినవాడివి.”

ఇలాగే బాతాఖానీ సాగింది. ప్రియా ప్రియతమా అనే సంబోధనలు లేవు. విలాసిని పైడిపిట్టను అసలు లెక్కచేయడం మానేసింది. పటాలం కుర్రాళ్ళను చుట్టూ చేర్చుకొని రోజంతా సిగ్గూ ఎగ్గూ లేకుండా వాళ్ళతో గుసగుసలాడ్డంతోనే సరిపోయేది.

ఒకనాడు పైడిపిట్టను పట్టుకొని “వారంతా నిన్నేమంటున్నారో తెలుసా మేజర్” అని అడిగింది. గత యుద్ధంలో నీవు “పటాలానికి కుళ్ళు బిస్కత్తులు సరఫరా చేశావని చెపుతున్నారు” అని మొహంమీదే అనేసింది.

పాపం పైడిపిట్ట చాలా బాధపడింది. కాని వచ్చిన ఆరోపణను కాదనడానికి గుండె చాల్లేదు. అప్పుడు బిస్కత్తుల సరఫరా బాధ్యత తనది కాదు. అయినప్పటికీ మనసు తేటగా లేదు. అశ్వికదళానికి ఆ రోజుల్లో తాను “వింత గడ్డి” సరఫరా చేసినమాట నిజం. మనుషులైతే కనీసం ఫిర్యాదైనా చేస్తారు. కాని గుర్రాలకు నోరులేదే? అది మరీ ఘోరంకాదూ?

అప్పుడు తాను చేసిన పని నిజంగా చాలా చెడ్డది.

ఒకొక్కప్పుడు విలాసిని పటాలం కుర్రాళ్ళందరి ముందూ మేజర్ని వెర్రి వెంగళాయని చేసి ఆడించేది. అంతా దాగుడుమూత లాడేవారు, కాని ఈ “పీడ” ఎప్పుడూ వారి నంటిపెట్టుకొనే వుండేది. అందుకని పైడిపిట్టనుకూడా ఆటలోకి దింపి కళ్ళకు గంతలు కట్టేవారు. రెక్కలు సాచి వారిని పట్టుకొనడానికి వెంటపడేది.

కాని విలాసినీ, దాని పటాలం నేస్తాలూ తుప్పల్లో దూరిపోయేవారు. అప్పుడప్పుడు తుప్పల్లోంచి తొంగి చూచి పట్టుకోగలిగితే పట్టుకోచూద్దాం మేజర్ అని అల్లరిగా అరిచేవారు. కొసకి మేజరు ఏ చెట్టుకో గుద్దుకొని తల బొప్పికట్టుకొనే వరకూ ఈ ఆట సాగేది.

ఈ వ్యవహారమంతా చూసి మేజరుకు కోపం వస్తుందేమోనని ముసిలి పికిలిపిట్ట భయపడింది. ఈ ఆటలు చాలించమని కూతుర్ని మందలించేది. కాని తర్వాత తర్వాత మేజరుకిదేమీ పట్టలేదన్న సంగతి తెలిసింది. అప్పటినుంచీ మందలించడం మానుకొంది. ప్రతి సాయంత్రం మేజర్ని “ఒక రూపాయుందా మేజర్? రేపిచ్చేస్తాను” అని క్రమం

తప్పకుండా అడిగి పుచ్చుకొనేది.

పైడిపిట్ట దుస్థితిని చూసి విదారిణి జాలిపడేది. జాలి కన్నా మెత్తని భావం మరేంవుందో దాని మనసులో ఎవరికి తెలుసును? ఏమయితేనేం ఒకనాటి సాయంత్రం మేజర్ తీరిగ్గా తన గూటివైపు ఎగురుతూన్నప్పుడు, విదారిణి దాన్ని కలుసుకొంది.

"నిజం చెప్పు! ఆ సీతాకోక చిలుకను ప్రేమించడం నీకు భావ్యమేనా? నన్ను పెళ్ళాడు. నిన్ను కనిపెట్టుకొని వుంటాను."

కాని మేజరుకిది చెవిటివాని ముందు శంఖం ఊదినట్లయింది. అసలు విదారిణి చెప్పింది పూర్తిగా వినడానికి కూడా మేజరుకు మనస్కరించలేదు.

"ఇదుగో! నేనొక బొంతకాకిని పెళ్ళాడదలుచుకొంటే అప్పుడు నీ సంగతి ఆలోచించేవాణ్ణి. కాని మీ అక్కతో సంబంధం కలుపుకోవాలనుకొన్నానంటే అర్థం ఆవిడనే పెళ్ళాడుతానని! తెలిసిందా?" అని నిర్మొహమాటంగా చెప్పింది పైడిపిట్ట.

అయితే పైడిపిట్ట ఏమీ చూడకుండా కళ్ళు మూసుకొని కూర్చుందని చెప్పడానికి వీల్లేదు. దానికన్ని విషయాలూ స్పష్టంగా తెలసును. అంతా నిర్ణయమైపోయిందని కూడా తెలుసును. ఎందుకలా నిర్ణయమైందో చెప్పలేదు కాని అంతా నిర్ణయమైపోయిందని మాత్రం గొణుగుకొంటూ వుండేది.

సరే పెళ్ళి అయిపోయింది. వేడుకలూ, వినోదాలూ ముగిశాయి. రాత్రి చాలా పొద్దుపోయిన తర్వాత పైడిపిట్ట నవోఢతో కలిసి గూడు మరమ్మత్తు మొదలుపెట్టింది.

రాత్రి చాలా అందంగా వుంది. గాలి సువాసనలతో మత్తెక్కింది. వినీలాకాశంలో చుక్కలు రవ్వల్లా మిలమిల మెరుస్తున్నాయి. పైడిపిట్ట మదన జ్వరంతో కాగిపోయింది. నరాలలో ఒక కొత్తజవం ప్రవహించింది. పాడాలో ఏడవాలో కూడా తెలియని అయోమయంలో పడ్డది. కాని నిగ్రహించుకొంది. పైడిపిట్ట ప్రేమను చూసి విలాసిని కూడా పరవశం చెందింది. ఆ పారవశ్యంలో కన్నులరమోడ్చి వయ్యారంగా కంపిస్తూ పైడిపిట్ట తలను కొనముక్కుతో దువ్వింది.

సరీగా అప్పుడే తాగుబోతుల తండా వచ్చిపడింది. విలాసిని సోదరులు, వారి స్నేహితులు తాగిన మైకంతో తూలుతూ అక్కడికి వచ్చారు. ఈలలు వేస్తూ పదాలు పాడారు. వారి గొంతు వినిపించేసరికి పెళ్ళికూతురిలో పెద్ద మార్పు వచ్చింది. ఆ పడకటింటి దుస్తులతో అలాగే ద్వారం దగ్గరకు పరుగెత్తింది. అక్కడ ఆ పటాలం పిల్లకాయలతో ఇకిలిస్తూ కోడికూసేవరకూ అలాగే వుండిపోయింది. పైడిపిట్ట కూడా పటాలం దుస్తులు వేసుకొని భార్య వెనుక నిలబడి కులాసాగా నవ్వడానికి ప్రయత్నించింది. కాని మేజరు హోదాలో వున్నవారికి వేడుకలూ, వినోదాలూ సరిపడవనే విషయం జ్ఞాపకం వచ్చింది. పైడిపిట్ట ఎంత ప్రయత్నం చేసినా, పై పడిన

వయస్సు విజ్ఞతను మప్పుతూనే వచ్చింది. అందుకని ఆ దృశ్యాన్ని అలా చూస్తూ వుండడం సాధ్యపడలేదు. వేంటనే తొౖరలో దూరి గుర్రుపెట్టింది. ఆ తర్వాత పటాలం పిల్లకాయలు నవ్విన వెడనవ్వులకు కూడా దానికి తెలివిరాలేదు. ఇలా ఆ పటాలం దుస్తులలోనే గాఢనిద్రలో ఆ తొలిరేయి గడిచింది.

అప్పటినుంచీ భార్యకతనిమీదగల కొద్దీ గొప్పా గౌరవం కూడా అంతరించింది.

పైడిపిట్ట ఇంకా చీకటి వుండగానే లేచింది. కాని విలసిని జాడమాత్రం ఎక్కడా కానరాలేదు. ఇంటిపనులు చేయడానికి కుదుర్చుకొన్న పూరిపిట్ట నడిగింది. "విలాసినీ కుమారిగారు కన్నవారింటికి వెళ్ళిపోయారు. భోజనానికి తిరిగి వచ్చేదీ రానిదీ ఏ విషయమూ చెప్పలేదు" అని చెప్పింది పూరిపిట్ట. "విలాసినీ కుమారి" అన్నమాట వినేసరికి గుండె జల్లుమంది పైడిపిట్టకు.

పైడిపిట్ట తల అటూ ఇటూ తిప్పి పక్కనున్న కొమ్మ మీదికి పోయి వాలింది. అడవి అంతా నీరవంగా నిస్తబ్దంగా వుంది. ఉదయానికి కొద్ది ముందు ప్రకృతి జీవం లేనట్లు కనిపిస్తుంది. పిట్టలింకా నిద్రపోతున్నాయి. ఆకు అల్లాడ్డం లేదు. తూర్పున మాత్రం కెంజాయలు అలముకొంటున్నాయి. ఉషోదేవి మూతివిరిచి వెక్కిరిస్తున్నట్లనిపించింది పైడిపిట్టకు. దాని జీవితంలో ఏదో ఒక విషాదఘటన జరిగింది. దాని బతుకుపై మాయని మచ్చ ఏదో పడింది. అసలు అది తన విధిని విస్మరించింది. ఆ విధి అంత కష్టతరమైనది కాదు. సామాన్యమైనది. అయినా దానికది బానిస అయిపోయి విస్మరించింది.

ఆ భయంకర పరిస్థితినంతటినీ పరామర్శించడానికి పూనుకొంది. మొదటి అడుగులోనే తాను మోసం చేసింది. ఇంకా శాస్త్రీయంగా వుండడంకోసం మూలకారణం దగ్గరనుంచీ ఆలోచించింది. విధినిర్వహణను విస్మరించడానికి కారణం ఏమిటి? ఆ కారణానికి తాను కారణమా? "ఈ దుస్థితికంతకీ నిజంగా నేనే కారణమైనట్లయితే ఇక చెప్పవలసినదేమీ లేదు. దోషం నాదే అయితే ఇదుగో నా తల. కాని ఎంత ఆలోచించినా నా తప్పేమీ కనిపించడం లేదు. అయినా ఇలా ఎందుకు జరిగింది?"

ఇలా ఎంతసేపు ఆలోచించినా లాభంలేదనుకొంది. కొన్నికొన్నింటికి హేతువాదం పనిచేయదు. అవి అలా జరిగి తీరుతాయంతే! అది ఎలా జరిగివుండవలసింది, ఎలా జరగలేదు అనే తర్కం అక్కడేమీ పనిచేయదు.

న్యాయస్థానందాకా ఎందుకు? ఏ యువకుణ్ణడిగినా, ఏ తల్లి నడిగినా మరే పెద్దమనిషిని అడిగినా అంతా చెప్పే తీర్పు ఒక్కటే. "సిగ్గు సిగ్గు సిగ్గు !" అని.

ఆ తాగుబోతు మూకను తరిమి కొట్టవలసింది. తన గూడును దుర్గమదుర్గంగా చేయవలసింది. తన విధి నిర్వహణాధికారాన్ని నిర్వర్తించడం కోసం రొమ్ము

కాయవలసింది.

"ఎంత సిగ్గుచేటు!" అని అప్రయత్నంగా అంది పైడిపిట్ట. అలాగే దుస్తులైనా మార్చుకొనకుండా అప్రయత్నంగా గూడు విడిచి 'అక్కడికి' పరుగెత్తింది.

అప్పటికి ముసిలిపికిలి లేచింది. మటమట మండిపోతూంది. ఆ రాత్రి తన ముద్దుబిడ్డ విలాసినికి జరిగిన అవమానానికి తోడు చుట్టంచూపుగా వచ్చిన తన పినతల్లి కూతురు చెప్పిన కథలు అగ్గిమీద గుగ్గిలమయ్యాయి. ఆమెకూడా తన కూతురు కలహాకంఠిని ఒక కత్తెర పిట్టకిచ్చి పెళ్ళిచేసింది. దానికీ దీనికీ పోలికెక్కడ?

"మా కలహాకంఠి భర్త ఎలాంటివాడనుకొన్నావు? అబ్బ ఒళ్ళంతా కళ్ళుచేసుకొని ప్రేమిస్తాడనుకో!"

అలా అని ఏదో చెవిదగ్గర గుసగుసలాడింది. వెంటనే సంతోషం ఒలకబోస్తూ "మా కలహాకంఠి ఆశ్చర్యాన్ని చూసి తీరాలి" అంది.

ముసిలి పికిలి వింటున్నంతసేపూ రెక్కలు విరుచుకొంది.

"మీ కలహాకంఠిని దేవుడు చల్లగా చూడాలి... చల్లగా చూడాలి" అని గొణిగింది. "కొంతమంది అదృష్టం. వారికంతా సుఖమే. మరి మాకో?... మగనివల్ల మీ కలహాకంఠికి కలిగే సుఖం... మా సంగతి చూడు... విలాసిని అనాకారి యేమీకాదు. గుమ్మటంలా వుంటుంది. ఆ చెంపలు, ఆ రొమ్ము... అసలా వెధవ ఈ అందాలను కన్నెత్తి చూశాడంటావా?"

"చూడకుండా ఎలా వుండగలిగాడమ్మా చోద్యం?"

ఆ సమయానికి పైడిపిట్ట లోపలికి వచ్చింది. పల్లెత్తి మాట్లాడబోయే లోగానే అత్తగారు అగ్గి అయిపోయి "సిగ్గు సిగ్గు" అని వంత పలికింది.

పైడిపిట్టకు నోట మాట పెకల్లేదు. ఎక్కడికైనా ఎగిరిపోదామనిపించింది. కాని రెక్కలు విరిగినట్లయిపోయి కదల్లేదు. ఎలాగైతేనేం పడుతూ లేస్తూ గూడు చేరుకొంది. అవమాన భారాన్ని అక్కడ దాచుకొందామనుకొంది. అప్పటికే పిట్టలన్నీ లేచాయి. ఈ సంగతి ఊరూ నాడూ పాకిపోయింది. అందులో ఒక్కటి కూడా ఓదార్పు మాట అన్న పాపాన పోలేదు. కొన్ని పైగా ధన్యవాదాలు కూడా చెప్పాయి. అన్ని కళ్ళల్లోనూ సిగ్గు సిగ్గు! అని స్పష్టంగా రాసివున్నట్లు కనిపించింది.

ఏమయితేనేం సాయంత్రానికి విలాసిని తిరిగి వచ్చింది. ఒక్కమాటేనా పలకకుండా తిన్నగా గూటిలోకి పోయింది.

"ప్రియా! ప్రేయసీ! ప్రియతమా!" అని పైడిపిట్ట ప్రాధేయపడుతూవుంటే చూసి అలగాజాతిలో పుట్టిన పూరిపిట్టకు కూడా మనసు కరిగిపోయింది.

కాని విలాసిని మాత్రం నోరు మెదపలేదు. పండుకోవడం కోసం విలాసిని పక్క

సర్దుకొన్న సవ్వడి తప్ప పైడిపిట్టకు మరేమీ వినిపించలేదు.

"దేవీ! దేవతలిచ్చిన వరప్రసాదమా!" అని బ్రతిమాలింది పైడిపిట్ట. గొంతు బొంగురుపోయింది. ఏడుపుకూడా వచ్చింది.

కానీ ఈ కన్నీరు కాతరస్వరంకూడా కరిగించలేక పోయాయి విలాసినిని. పైడిపిట్ట మంచం దగ్గరకు వెళ్ళి ప్రేయసి పైన వాలింది. కాని అప్పటికప్పుడే ఆమె నిద్రపోయింది. నిద్రపోతున్నట్లు కనిపించింది.

ఇలాగ ఈ రాత్రికూడా పైడిపిట్టకు ఒంటరిపాటుతోనే గడిచింది. కోటు విప్పేసింది. కాని లాగు విప్పడానికి ధైర్యం చాలలేదు. విలాసిని ఏమైనా అనుకొంటుందేమోనని భయం. మర్నాడుకూడా చీకటితోననే లేచింది పైడిపిట్ట. విలాసిని అప్పటికప్పుడే కన్నవారింటికి తుర్రుమంది.

ఇలాగ మొదలైంది మేజరు పైడిపిట్టగారి వీరమరణం.

ఒక నెల గడిచినా నవోఢ మేజరును పల్లెత్తికూడా పలకరించలేదు. కన్నెత్తి చూడనూలేదు. ప్రతిరాత్రీ గూటికి తిరిగివచ్చేది. రాగానే మంచంమీద వాలేది. మర్నాడు ఉదయానికల్లా మాయమైపోయేది. అసలు అదెప్పుడు బైటికి వెళుతున్నదో పైడిపిట్ట ఎంత ప్రయత్నించినా కనుక్కోలేక పోయింది. నాలుగైదుసార్లు పటాలం మూకను వెంట వేసుకొని వచ్చింది. పూరిపిట్టను పిలిచి విందు వంటకాలు తయారుచేయమని పురమాయించేది.

పైడిపిట్ట కళ్ళముందరే తానూ తన పటాలం నేస్తాలూ సిగ్గూ ఎగ్గూ లేకుండా తిని తాగి గెంతులేసేవారు. మేజరుని ఒక నౌకరుకన్నా హీనంగా చూసేది. అంతేకాని ఆ గూటి యజమానికదా అని మాటవరసకైనా మన్నన చూపేది కాదు. అక్కడ అత్తవారింట్లో కూడా మేజరు ప్రస్తావన వచ్చినప్పుడు అంతా "ఆ వెధవ" అనేవారు.

"ఈవేళ ఆ వెధవ ఒక లాటరీ టిక్కెట్టు తీసుకొన్నాడు" అని ముసిలి పికిలి తన పినతల్లి కూతురుతో చెప్పింది. పినతల్లి కూతురు వెళ్ళడానికి కాళ్ళు రావడం లేదని అక్కడే మకాం వేసింది.

"ఆ వెధవకి కొద్దిరోజుల్లోనే పిచ్చెత్తుతుంది. చూస్తూవుండు. ఇప్పుడే మతిలేని వాడిలా తిరుగుతున్నాడు" అంటుంది అత్తగారు.

మామగారొక్కడే అప్పుడప్పుడు అల్లుణ్ణి చూడ్డానికి వస్తూవుండేవాడు. నాలుగు ఓదార్పుముక్కలు చెప్పేవాడు. విలాసిని చెవులు మెలేస్తానని కూడా చెప్పేవాడు. అంతేకాని ఆ పని మాత్రం ఎప్పుడూ చేయలేదు. ఈ సానుభూతి చూపినందుకు ఉపకృతిగా అల్లుడి డబ్బును కొల్లగొట్టుకుపోయేవాడు.

మరొక నెల గడిచింది. విలాసినికీ, ఆమె భర్తకూ గల సంబంధంలో మార్పు వచ్చింది.

అయితే ఆ వచ్చిన మార్పు మంచికోసం మాత్రం కాదు. విలాసిని పూర్తిగా కట్టుతప్పింది. మానాభిమానాలను విడిచిపెట్టింది. ఇష్టం వచ్చినట్లు తిరుగుతోంది. ఇంతకు ముందున్న మౌనముద్ర ఇప్పుడు లేదు. ఒక మహారాణీ మార్జకునితో మాట్లాడినట్లు పైడిపిట్టతో మాట్లాడుతుంది.

"డబ్బు" అని అడుగుతుంది.

"ఎంత కావాల ప్రియా?"

"ఎంత గింత పనికిరాదు ఇటియ్యి. అంతే"

ఇంత కావాలి అని ఎప్పుడూ చెప్పలేదు. ఆ డబ్బు ఏం చేస్తున్నదో అసలే చెప్పలేదు. పైడిపిట్టకు పిచ్చెత్తించాలనే ఉద్దేశ్యంతో అలా చేస్తున్నదో, అదొక్కటే కారణం కాదో తెలియదు. ఆమె ఉద్దేశ్యం ఏమిటో ఎవరు చెప్పగలరు? పికిలిపిట్ట మనసు శూన్యంగా వుంటుంది. ఆ మనసులో అనురాగ విరాగాలు ఎప్పుడు ఎలా పుడతాయో మహామహా మేధావులకు కూడా తెలియదు. ఏమయితేనేం పైడిపిట్ట మాత్రం పైకం ఎన్నడూ లేదని చెప్పలేదు.

తొర్రవెనక గదిలోకి వెళ్ళి వణుకుతున్న చేతులతో గల్లాపెట్టి పట్టుకువచ్చేది. కూడబెట్టిన ధనాన్నంతనీ చిత్రంగా నవ్వుతూ చేజిక్కించుకొనేది పికిలిపిట్ట. పైడిపిట్ట గుండెలు పగిలినంత పనయ్యేది. పైడిపిట్ట పీనాసి అనికాదు. అసలు తన భార్య ఏంచేస్తోంది అన్న విషయం తెలుసుకోవాలని దానికుండేది.

భర్త కూడపెట్టిన ధనాన్ని కొల్లగొట్టి ఎగిరిపోయింది పికిలిపిట్ట. ఒక గంటపోయిన తర్వాత ఈ కొల్లబోయిన ధనం ఏమయిందో స్వయంగా చూసింది పికిలిపిట్ట. విలాసిని ఒక పెద్ద పటాలాన్ని, వన్నె పిట్టల్ని వెంట వేసుకొని ఇక ఇకలు పకపకలతో రొదచేస్తూ పక్కనున్న పచ్చికబయల్లో వాలింది. అక్కడ పైడిపిట్ట డబ్బుతో వనభోజనాలు జరిగాయి. ఆటలు పాటలు, నృత్యాలతో పొద్దు వాటారింది. అప్పుడప్పుడు సేద తీర్చుకొనడం కోసం జంటలు జంటలుగా తుప్పల్లోకి పోయేవి. మళ్లీ ఆటలు పాటలు.

ఒకనాటి సందెవేళ విలాసిని చాలా ఉత్సాహంతో గూటికి చేరింది. సంతోషంతో తొర్రలో రెక్కలు టపటపా అల్లార్చింది. గిరగిర గిరికీలు కొట్టింది. పాడింది. నవ్వింది. ఏడ్చింది. పైడిపిట్ట కిదంతా చూడగా మొదట భయాశ్చర్యాలు కలిగాయి. ఆ తర్వాత మోహం ముంచుకొచ్చింది. తన భార్య క్షమించిందనీ ఇక తన కష్టాలన్నీ గట్టెక్కాయనీ అనుకొంది. సగం పట్టు విడిచిందని భావించింది.

ఇక తనకు స్వర్గసౌఖ్యం ప్రసాదిస్తుందని ఆశించింది. దానితో ఒక మధురభావం నిలువెల్లా పారాడింది. దానితో పటాలం మేజరుకి ఎవరికీ అలవికానంత ధైర్యంకూడా వచ్చింది. ఆ మోహావేశంతో విలాసిని వద్దకు చేరింది. విలాసిని తొర్ర ముంగిటలో

నిలిచి శూన్యంలోకి చూస్తోంది. పైడిపిట్ట వెనుకనించి వచ్చి ముక్కుతో మృదువుగా మూర్ధాన్ని తాకింది.

"ఛో వెధవా !" అని అరచింది విలాసిని. పొదువుకొనబోతున్న పైడిపిట్టను తప్పించుకొని తుర్రుమంది.

అంతకుముందు పగలంతా బైట తిరిగేది. దీనితో యిప్పుడు రాత్రిళ్ళుకూడా ఎగిరిపోతోంది. మర్నాడు ఉదయం గూటికి తిరిగి వచ్చింది. కాని రోజంతా కుమిలి కుమిలి ఏడ్చింది. సాయంత్రం పైడిపిట్ట గుర్రుపెడుతూండగా చూసి తుర్రుమంది.

పగలల్లా శోకం. చీకటిపడేసరికి మాయం. ఇలా రెండు వారాలు గడిచాయి. పైడిపిట్ట చింత చెప్పనలవికాదు. ఏ క్షణాన విలాసిని మూర్ఛపోతుందోనని నీళ్ళకూజా పట్టుకొని సదా వెన్నంటి వుండేది.

"ఇదిగో ప్రేయసీ! గుక్కెడు నీళ్ళుతాగు. నీకొచ్చిన ఇబ్బందేమిటో నాతో చెప్పు. భర్తతో ఏం చెప్పననుకోకు. నాకా సుఖం అనుభవించే యోగం లేదు. తండ్రిననుకో! అన్న అనుకో! ఇప్పుడు మనసువిప్పి చెప్పు. నీకు కష్టం కల్గించినదెవరు?"

"ఛో వెధవా ! ! !"

సరే, ఒకరోజున విలాసిని అసలే తిరిగిరాలేదు. పైడిపిట్ట ఒకరోజు ఎదురుచూసింది. రెండురోజులు ఎదురుచూసింది. కలకాలం అలా ఎదురుచూడాలని నిశ్చయించుకొంది. ఇక ఇది ఒంటరి బ్రతుకు. భార్య లేచిపోయింది. బంధువులు కూడా మాటమాత్రమైనా చెప్పకుండా వెళ్ళిపోయారు. బహుశా పెద్ద పికిలిపిట్టకు ముసిలమ్మ ఆస్తి కలిసిందేమో. ఇక ఇతర పిట్టలకు మొహం చూపడానికి సిగ్గేస్తోంది. కొసకు కొలువుకు పెట్టుకొన్న పూరిపిట్టకూడా ఒక పిచ్చికతో పారిపోయి గూడు పెట్టుకొంది.

ఇంతవరకూ బాధలు తప్ప మరేమీలేవు. పిచ్చిగా ఎగరాలని, ఏడవాలని, తిట్టాలని అనిపించేది. అయినా ఆశ మాత్రం పోలేదు. ఇప్పుడు బాధలకు మనసు బండబారింది. అన్నిటిమీదా విరక్తి పుట్టింది.

చలికాలం వచ్చింది. పిట్టల గూళ్ళన్నీ కోలాహలంగా వున్నాయి. వెచ్చని చోటికి ఎగిరిపోవడమా, ఈ గూటిని ఇలాగే అంటిపెట్టుకొనడమా అనేది నిర్ణయించుకోలేక పోయింది పైడిపిట్ట. శీతగాలి తిరిగింది. అడవులన్నీ బోసిగా కనిపిస్తున్నాయి. చలి, ఆకలి, ఒంటరితనం.. పైడిపిట్ట అలాగే గూటిముందు రెప్ప వాల్చకుండా ప్రతీక్షిస్తూ కూర్చుంది. పెద్ద పులుగు చాలాసార్లు భీకరంగా కూస్తూ పక్కనుంచే ఎగిరిపోయింది. ఒకసారి దాని రెక్క గూటిక్కూడా తగిలింది. మానుపిల్లి చాలాసార్లు తొర్రలోకి తొంగిచూసింది. కాని అదృష్టవశాత్తు పెద్ద పులుగూ, మానుపిల్లీ చెరుపేమీ చేయలేదు. ఈ ఎముకలపోగును తింటే ఏం కడుపు నిండుతుందని అనుకొని వుంటాయి. లేదా

ఈ పైడిపిట్ట తన రోజుల్లో పటాలంలో చాలా సామర్ధ్యం చూపిందని వాటికి జ్ఞాపకం వచ్చివుంటుంది. అలాంటి సమర్ధుని సేవాభాగ్యాన్ని దేశానికి లేకుండా చేయడం మంచిది కాదనుకొని వుంటాయి.

తన బతుకు బ్రద్దలయిందని పైడిపిట్టకు తెలుసును. అందుకని గత జీవితమంతా జ్ఞాపకం వచ్చింది. ఆ రోజుల్లో తన బతుకు ఎంత చక్కగా, ఎంత హుందాగా, ఎంత క్రమబద్ధంగా వుండేదో గుర్తుకు రాగానే పైడిపిట్ట హృదయం సంతోషంతో పొంగులు వారింది. ఆ జీవితంలో ఆనందకరమైన అనుభవాలు లేకపోలేదు. పటాలంలో పై వ్యవహారాలొక్కటే కాదు. ఉదాహరణకు ఏంట్రింత వ్యవహారమే వుంది. దోసకాయలాగ మహా చక్కనిపిల్ల. ఆదిలో అది కూడా "ఎంత తమాషా అయినవాడివి" అని పళ్ళికిలించేది.

ఆ నవ్వులాటల్లోనే ఒకనాటి సాయంత్రం "ప్రియా నేనెంత మూర్ఖురాలిని! అనవసరంగా కాలాన్ని వ్యర్థం చేస్తున్నానుకదా?" అంది. పైడిపిట్ట దాన్ని అప్పుడే పెళ్ళాడి వుండవలసింది. కాని ఆ పని చేయలేదు. ఆర్గురు బిడ్డల్ని దానికి ప్రసాదించి విడిచిపెట్టింది. పూటకూటిల్లు పెట్టిన మైనా జ్ఞాపకం వచ్చింది. అది వితంతువు. బరపటాలు, మెరిగలు అమ్ముతూ వుండేది. "బరపటాల ధరెంత? మెరిగెల ఖరీదెంత? పాపం భర్తలేని ఒంటరి జీవితం!" అని తాను పిచ్చాపాటిలోకి దిగింది. అంతలో దీపాలు మలిగిపోయాయి. తర్వాత దాన్నయినా పెళ్ళాడి వుండవలసింది. పెళ్ళాడతానని మాటకూడా ఇచ్చింది. కాని అందరిలాగే దాన్నికూడా విడిచిపెట్టింది.

ఆ రోజులు మళ్ళీరావు! ఏంట్రింత, మైనాల విషయంలో ఎంత కర్కశంగా ప్రవర్తిస్తే అంత గర్వంగా వుండేది తనకప్పుడు. దానికి తగ్గట్టు అంతా పొగిడేవారు. "మగాడంటే మేజరేనయ్యా" అని పటాలం గుమాస్తాలనేవారు.

నిజమే, మళ్ళీ పటాలానికే పోతే? ఎందుకు పోగూడదు? ఇదుగో కలం కాగితం.. ఒక్క దరఖాస్తు గిలికేస్తే మారుమాట్లాడకుండా ఉద్యోగమిస్తారు!

ఆ భావాన్ని అంతటితోనే తుంచేసింది. ఇప్పుడు ఏంట్రింతలనీ, మైనాలనీ తలుచుకొనకూడదు. ఇక ముందు తనకున్నదొకటే. ఒంటరితనంతో కుమిలిపోతూ ఎదురుచూస్తూ వుండడం. తన రత్నాలరాసి, బంగారుబరిణ, అందాలపేటి, తన ప్రేయసి తిరిగివస్తుంది. తప్పకుండా తిరిగి వస్తుంది.

అప్పుడప్పుడు చిర్రెత్తుకొస్తూ ఉండేది. అది తాను కోరి తెచ్చుకొనేది కాదు. దుష్టపిట్టలు కొన్ని అప్పుకోసం వచ్చేవి. అన్నిటిలోకి మరీ దుష్టు కాటుక పిట్ట. పైడిపిట్ట కొచ్చిన ఆపద పట్ల సానుభూతి చూపుతూ ఓదార్పు మాటలతో మొదలు పెట్టేది. ఎందుకొచ్చిన బెడద.. ఈ రోజుల్లో విడాకులివ్వడం చాలా మంచిది అని దుర్బోధ చేసేది.

"ఇదుగో ఒక లాయరును చూడు. పని జరిగిపోతుంది. చిటికలో అంతా అయిపోతుంది. దాన్ని గురించి బెంగపెట్టుకోకు. విడాకులిచ్చిపారెయ్!"

బొంతపిచుక కూడా దుర్బోధలు చేసేది. కాని విడాకులు దానికి నచ్చవు. పోలీసులకు ఫిర్యాదు చేయమని అది సలహా యిచ్చింది.

"విడాకులివ్వడం వాళ్ళను చాలా గౌరవించినట్లవుతుంది. ప్రతిదానికీ విడాకులిస్తూ కూర్చోడమే పనా? పోలీసులకు ఫిర్యాదు పంపు. చచ్చేదాకా జ్ఞాపకం వుండేలాగ కుళ్ళబొడిచి వదులుతారు."

పైడిపిట్ట కొసకు ఈ దుర్బోధలకు లొంగిపోయింది. పట్నానికి వెళ్ళి లాయరు డోలు పిట్టను కలుసుకొంది.

"నేను పెళ్ళాడుదామనుకొంటున్నాను. కాని భార్య బ్రతికివుంది. ఏం చేయమని సలహా?"

"దానికేంవుంది. నాకు నలుగురు పెళ్ళాలున్నారు. మొన్ననే అయిదవదాన్ని పెళ్ళాడాను. ఇంతవరకూ శిక్షపడలేదు."

కాని లాయరు ధోరణిచూస్తే తన ప్రయత్నం నిష్ఫలమని తోచింది పైడిపిట్టకి.

డోలుపిట్టకు ఫీజుకింద ఇరవై పైసలు చెల్లించి (ఉత్తి పుణ్యానికి.. పైగా అబద్ధాలు చెప్పినందుకు!) బరువైన గుండెతో పోలీసు కార్యాలయానికి వెళ్ళింది. అక్కడ కూడా అదృష్టం కలిసిరాలేదు.

"దాన్నిటు తీసుకొనిరా కుళ్ళబొడిచి విడిచిపెడతాం. కాని ఇక్కడ మమ్మల్ని వేధించకు! నీవు మేజరువయ్యేది, మరొకరివయ్యేది నిన్ను ముందు కుళ్ళబొడుస్తాం" అని చాలా సజావుగా చెప్పారు.

దానితో ఆశలన్నీ అడుగంటాయి. రెక్కలీడ్చుకుంటూ గూటికి తిరిగివచ్చింది.

శీతాకాలం గడిచిపోయింది. చలికి వొళ్ళు కొంకర్లు పోయి కొనప్రాణంతో వుంది పైడిపిట్ట. అలాగే పడుతూ లేస్తూ ఏటిగట్టుకు వెళ్ళింది. తిండి ఏమైనా దొరుకుతుందన్న ఆశతో ఏటిలోని ఒక బండమీదికి గెంతింది. నీళ్లలో తన నీడ చూసుకొనేసరికి గుండె చెరువైంది. ఎముకలు చర్మం మాత్రమే మిగిలాయి. ఆ పూర్వపు ఒళ్ళు చాయలు కూడా లేవు. మెడమీద జూలులేదు. ఏమైపోయిందో దేవునికే తెలియాలి. విచారించి గూటికి తిరిగివచ్చింది. అప్పటినుంచీ ఆశలన్నీ పోయాయి.

పెళ్ళాం తిరిగి వచ్చేవరకూ తను బతికివుండి మాత్రం ఏం లాభం? ఏమని స్వాగతం ఇవ్వగలదు. తన ప్రేమని, తన కఠోరదీక్షనెలా వ్యక్తం చేయగలదు?

వసంతం వచ్చింది. ఒకనాటి రాత్రి ఆమెకూడా తిరిగి వచ్చింది. ఆవిడ ఆరోగ్యం చెడిపోయింది. రెక్కలన్నీ రాలిపోయాయి. తోక వికారంగా వుంది. రంగుపోయింది.

ఒణుకు ఒకటి. చలికే వణుకుతోందో, సిగ్గుతో కంపిస్తోందో తెలియదు. పైడిపిట్ట దాన్ని గుర్తుపట్టలేకపోయింది.

"ఇదుగో వచ్చాను" అంది పికిలిపిట్ట.

"లోపలికిరా" అంది పైడిపిట్ట.

వారు మాట్లాడిన ఆఖరి మాటలవే. గతాన్ని గురించి గుసగుసలు లేవు. భవిష్యత్తును గురించి పలుకులులేవు.

అప్పటినుంచీ రెండూ ఒక గూటిలోనే వుంటున్నాయి. అయినా మాటల్లేవు. ఎప్పుడూ ఏదో ఆలోచనలో మునిగి వుండేవి. ఏదో మహాద్భుతం జరిగి హృదయాలు మళ్ళీ ప్రేమతో క్షమతో నిండి పోకూడదూ అని ఆలోచిస్తున్నాయేమో? కాకపోతే వేదనలను నెమరువేసుకొంటూ "నా జీవితాన్ని నీవు భగ్నంచేశావు కదా గుండెల్లేని కూనా!" అంటే "నా యవ్వనానికి విషం పెట్టావు దుర్మార్గుడా" అని ఒకరినొకరు మౌనంగా నిందించుకొంటున్నారేమో!



ఇరుగూ పొరుగూ



ఒక గ్రామంలో కుబేర పుల్లయ్య, కుచేల పుల్లయ్య ఇరుగూ పొరుగున వుండేవారు. కుబేర పుల్లయ్యని పుల్లయ్యగారూ అనీ, పురుషోత్తంగారూ అనీ పిలిచేవారు. కాని కుచేల పుల్లయ్యని మాత్రం పుల్లిగా అనికూడా అనేవారు. ఇద్దరూ మంచివారే. అందులో కుబేర పుల్లయ్య మరీ మంచివాడు. నెరదాత. కష్టపడి స్వయంగా సంపదను సృష్టించక పోయినా సంపద పంపిణీ విషయంలో మాత్రం అతనికి చాలా గొప్ప అభిప్రాయాలున్నాయి.

"అది నావంతు. కొంతమంది సంపదా సృష్టించరు. వారికి గొప్ప అభిప్రాయాలూ వుండవు. అలాంటి వాళ్ళను చూస్తే నాకు మహాచికాకు. కాని నేనలాంటి వాణ్ణికాను" అంటాడు కుబేరపుల్లయ్య.

కుచేల పుల్లయ్యకు సంపద పంపిణీ విషయంలో అసలు అభిప్రాయాలే లేవు (అందుకు తీరకకూడా లేదు). కాని సంపదను మాత్రం సృష్టిస్తాడు. అతను కూడా "అది నావంతు" అంటాడు.

శనివారం సాయంత్రం కలవారికీ లేనివారికీ అందరికీ తీరిక. అందుకని ఇద్దరూ కలుసుకొంటూ వుండేవారు. కుబేర పుల్లయ్య భవంతి ముందు అరుగుమీద కూర్చుని బాతాఖానీ వేసేవారు.

"రేపు వంటకాలేమిటి?" అని అడిగేవాడు కుబేర పుల్లయ్య.

"ఏమీ లేదు" అని జవాబిచ్చేవాడు కుచేల పుల్లయ్య.

"నేను రేపు కోడిని కోయిస్తున్నాను"

అలాగని ఆవులించి చిటిక వేస్తాడు. చేతులు పైకెత్తి పరమాత్మకు దండం పెట్టి, కుచేల పుల్లయ్యపై దయాదృష్టులు సారిస్తాడు.

"మనది చాలా చిత్రమైన ప్రపంచమోయ్. ఒకరు రోజంతా రెక్కలు ముక్కలు చేసుకొన్నా కూటిలోకి కూరాకు తప్ప వేరుండదు. ఒకరు పొద్దస్తమానూ తీరికగా పనికివచ్చే వ్యాపకాల్లో వుంటారు. నిత్యం మాంసం తింటారు. ఇలా ఎందుకు జరుగుతుందని?"

''ఇలా ఎందుకు అవుతుందా అని నేను కూడా చాలా కాలం నుంచీ అనుకొంటున్నాను. కాని నాకు ఆలోచించడానికి తీరికలేదు. ఆలోచన మొదలు పెట్టేసరికి ఇంతలో కట్టెపుల్లలు కొట్టుకు రావలసి వస్తుంది. ఆ పని అయిన తర్వాత పొలానికి ఎరువు తోలుకుపోవాలి. ఎప్పుడూ ఏదో ఒక పనివుంటూనే వుంది. ఆ పనిలో మునిగి వుండగా ఆలోచనలన్నీ ఎప్పుడో ఎగిరిపోతాయి"

"అయినా దీన్ని గురించి మనమేదో ఒకటి ఆలోచించాలి."

"నేను కూడా అదే అంటున్నాను."

ఇప్పుడు ఆవులించడం కుచేల పుల్లయ్య వంతు. చిటికలు వేసుకొంటూ లేచి రేపటి చప్పిడికూడును తలుచుకొంటూ నిద్రపోతాడు.

మర్నాడు ప్రొద్దున నిద్రలేచేసరికి కుబేర పుల్లయ్య పావుసేరు మాంసం పంపించాడు.

మరుసటి శనివారం ఇరుగు పొరుగు ఇద్దరూ కలుసుకున్నారు. మళ్ళా ఆ పాత సంగతే ప్రస్తావించారు:

"కన్నుమూసినా తెరిచినా నాకొకటే ధ్యాస. పాపం నువ్వెంత పేదవాడివి అని. అలాచెపితే నీవు నమ్మవేమో కూడా" అన్నాడు కుబేర పుల్లయ్య.

"మీరు చాలా దయగల మారాజులండి" అన్నాడు కుచేల పుల్లయ్య.

"అసలు నా అభిప్రాయాలు ఈ సమాజానికి ఎంతో అమూల్యాలనుకో. అయినా నీవు అదనులో దుక్కిదున్నకపోతే అప్పుడప్పుడు నీలాగే నాకు కూడా తిండివుండదు. అంతే కాదూ?"

"అది నిజమే అనుకోండి బాబుగారు. కాని అదనులో దున్నకపోతే ఆకలికి మొదట నీల్గిచచ్చేది నేను."

"నీవు చెప్పేదానిలో కూడా నిజముందోయ్. మన బతుకులే దగాకోరు బతుకులు. అయితే నేను దాన్ని ఒప్పుకొంటున్నాననుకునేవు. దేవునితోడు! కుచేల పుల్లయ్య సుఖంగా

బతికే మార్గం ఏమిటా, నాతో అతడికి కూడా సమానంగా వంతు ఎలా వస్తుందా అని ఒకటే ఆలోచన. ఇందుకు నేనేం చేయాలి అని ఒకటే మధన."

"తమరు చాలా దయగల వారండి బాబుగారు. తమరు దయ చూపించకపోతే కిందటి ఆదివారం పచ్చిపులుసు మెతుకులే గతయ్యేవి నాకు."

"అదేముంది. ఆ విషయం పదేపదే చెప్పకు. ఆ సంగతి మరిచిపో. ఇంతకీ నేను చెప్పవచ్చేదేమిటంటే: నా సంపదలో సగం పేదల కిచ్చేయాలని నేనెన్నిసార్లనుకోలేదు. నిజంగా అలా చేశాను కూడా. కాని ఏం జరుగుతున్నదో తెలుసా? ఈ వేళ సగం సంపద ఇచ్చేశాననుకో, రేపు నిద్రలేచే సరికల్లా నేనిచ్చిన సగానికి బదులు ముప్పాతిక తిరిగివస్తోంది."

"అంటే వడ్డీతో సహా నన్నమాట."

"ఏం చెయ్యను మరి? ఎప్పుడూ డబ్బును వదిలించుకొందామనే నా తాపత్రయం కాని అది మాత్రం నన్ను వదలడం లేదు. నేను పేదలకు రెండు పైసలిస్తాను. వాటికి మారుగా మూడు పైసలు నాకు తిరిగి వస్తున్నాయి. ఎలా వస్తున్నాయో ఆ పరమాత్మునికే తెలియాలి. ఎంత చిత్రమో చూశావా?"

ఆవులింతలు వచ్చేదాకా వారిదే ధోరణిలో కబుర్లు సాగించారు. అలా ఒక మూల మాట్లాడుతూ వుండగానే రేపు కుచేల పుల్లయ్య కూటిలోకి మాంసం వెళ్ళే ఉపాయాన్ని గురించి కుబేర పుల్లయ్య ఆలోచిస్తూనే వున్నాడు.

"ఇదుగో విను నేస్తం. ఇక పొద్దుకూకుతుంది. అలా మా తోటలోకివచ్చి కాస్త రెండు మళ్ళు తవ్విపెడుదూ. ఎంతసేపూ, రెండు పారలు వేశావంటే అయిపోతుంది. నీవు నిజంగా కాయకష్టం చేసినట్లే నిన్ను సంతోష పెడతాను."

కుచేల పుల్లయ్య గంటో ఎంతో శ్రమపడ్డాడు. "నిజంగా కాయకష్టం" చేసినట్లే మర్నాడు మాంసంకూర రుచిచూశాడు.

ఇలాగ ఈ ఇరుగు పొరుగు నేస్తాలు కబుర్లు చెప్పుకోగా చెప్పుకోగా కొసకు కుబేరపుల్లయ్యకు విసుగెత్తి పోయింది. ఇంక ఇది భరించలేకపోయాడు. ఒకరోజున "నేను పెద్ద గవర్నరుగారి దగ్గరకు వెళతాను. వెళ్ళి కాళ్ళమీద పడతాను. పడి మహాప్రభో తమరు చక్రవర్తికి వీనుల్లాంటివారు. నేత్రాల్లాంటివారు. నిగ్రహానుగ్రహ సమర్థులు. నన్నూ, కుచేల పుల్లయ్యనూ సమానుల్ని చేయండి! అతగాణ్ణి సేవకు వినియోగిస్తే నన్నూ వినియోగించండి. అతగాని వంతు కొక బండి అంటే నావంతుకు ఒక్క బండే నిరకు చేయించండి. అతగాడు ఎకరానికి పైసా పన్ను కడితే నేనూ అంతే కడతాను! అనుగ్రహించండి అని మొరపెడతాను" అన్నాడు.

అనడమే తరువాయి. అన్నంతా చేశాడు. కుబేర పుల్లయ్య పెద్దగవర్నరుగారి పాదాలు

పట్టుకొన్నాడు. తన కష్టాలన్నీ ఒలకబోసుకొన్నాడు. పెద్దగవర్నరు అతడిని ఎంతో మెచ్చుకొన్నాడు.

"ఎంత ఉత్తముడివి! నీ పొరుగునున్న కుచేల పుల్లయ్యను మరిచిపోలేదు. ధన్యుడవోయ్. సార్వభౌముని ఏలుబడిలో ప్రజలంతా చేదోడు వాదోడుగా బతుకు తున్నారంటే అంతకన్నా మాకు ఆనందకరమైనదేముంది? కీచులాటలూ, కలహాలతో కాలక్షేపంచేస్తే అంతకన్న హాని మరొకటుందా?"

అలా అని గవర్నరు చట్టం విషయంలోనూ, పన్నుల విషయంలోనూ ఇద్దరు పుల్లయ్యలను సమానంగా చూడవలసిందని తన అమల్దారులకు ఆదేశించాడు. ఇలా కొంతకాలం పరీక్షించి చూస్తామన్నాడు. ఒకరు దంచుతూవుంటే మరొకరు పక్క లెగరవేయడం ఇకమీదట చెల్లదన్నాడు.

అక్కడనుంచి ఆఘమేఘాలమీద ఇంటికి చేరుకొన్నాడు కుబేర పుల్లయ్య.

కుచేల పుల్లయ్యనుచూసి "పెద్దబరువు దిగిపోయిందోయ్" అన్నాడు.

"గవర్నరుగారు దయగల ప్రభువు. పన్నులు, సుంకాలు, శిస్తులు, ఒకటేమిటి సర్వ విషయాల్లోనూ నిన్నూ నన్నూ ఏకంచేశారు. ఈ పద్ధతిని కొంతకాలం పరీక్షించి చూస్తామన్నారు. నిన్ను సేవకు పిలిస్తే నేను కూడా సేవకు వస్తాను. నీ వాటా ఒక బండి తెస్తే నేను కూడా ఒక బండి తెస్తాను. నీవు ఎకరానికి పైసా పన్ను కడితే నేనూ అంతే చేస్తాను. నిన్నూ నన్నూ సమానం చేయడం వల్ల వారానికి ఒక రోజేం కర్మం ప్రతిరోజూ నీవు మాంసం తింటావు."

ఇలా చెప్పి కుబేర పుల్లయ్య సద్భావం పొంగులువారుతూ వుండగా విదేశయాత్రకు బయలుదేరాడు. రెండేళ్ళ పాటు విదేశాలలో తిరిగి తీరికను సద్వినియోగం చేశాడు.

లింబర్గువెళ్ళి లింబర్గు కోవా రుచిచూశాడు. స్ట్రాస్‌బర్గు వెళ్ళి కూరలు చవిచూశాడు. బోర్డో వెళ్ళి సారాయి చవిచూశాడు. కొసకు పారిస్ చేరుకుని అన్నీ తిన్నాడు. అన్నీ తాగాడు. అక్కడ కాలం ఎంత కులాసాగా గడిచిందంటే కాలు నిలవడమే కష్టమయిందనుకోండి. ఎక్కడికి వెళ్ళినా ఏం చేసినా కుచేల పుల్లయ్యను గురించి ఆలోచన మాత్రం మానలేదు. ఇద్దరూ అప్పుడు అన్ని విషయాల్లోనూ సమానులే కనుక కుచేల పుల్లయ్య మనసుతీరా తాగి హాయిగా ఆనందంగా కాలక్షేపం చేస్తూ వుండివుంటాడు!

ఇక్కడ కుచేల పుల్లయ్యకు కానికాలం వచ్చింది. ఈ వేళ ఆ చిన్నమడి చెక్కను దున్నుకోవాలి. రేపు గొర్రు తోలాలి, ఆ తర్వాత గట్లు పెట్టుకోవాలి. దేవుడు చల్లగా చూస్తే గింజలు నూర్చుకోవాలి. ఇక సారా పాక సంగతి. కుచేల పుల్లయ్య దాని దారెటో కూడా మరిచిపోయాడు. సారా పాక తనపాలిటి మిత్తి అని అతనికి తెలుసును. భార్య పుల్లమ్మ కూడా పొలంపనిలో కట్టెపుల్లలు కొట్టడంలో మగనికి చేదోడువాదోడుగా

వుంటోంది. ఇప్పుడు వారి బిడ్డలు కూడా పెద్దవారయ్యారు. అందుకని వారుకూడా పనిలో ఒక చెయ్యి వేస్తున్నారు. అలా ఆ కుటుంబమంతా కోడి కూసింది మొదలు పొద్దుకూకేవరకూ రెక్కలరగదీస్తున్నారు. అయినా ఉప్పులేని చప్పని గంజే వారికి గతి. కుబేర పుల్లయ్య వెళ్లిననాటినుంచీ ఆదివారాల్లో అడపాదడపా వచ్చే ఆ మాంసం కూడా ఇప్పుడు లేదు.

"ఇది మన దురదృష్టం. దొరతనంవారు పరీక్షించి చూడ్డంకోసం నన్ను కూడా కుబేర పుల్యయ్యతో అన్ని విధాలా సమానుణ్ణి చేశారు. అయినా మార్పేమీలేదు. ఒకరు ఇంకా శ్రీమంతుడే. నేనో? నాది అని చెప్పుకోడానికి ఒక పుల్లముక్క కూడా లేదు." అని కుచేల పుల్లయ్య భార్యతో అన్నాడు.

కుబేర పుల్లయ్య తిరిగివచ్చిచూచి నిశ్చేష్టుడయ్యాడు. కుచేల పుల్లయ్య పూర్వంలాగే పేదరికంతో పెనుగులాడుతున్నాడు. చెప్పొద్దూ ఈ పుల్లిగాడు డబ్బంతా సారాపాకకు పోశాడని మొదట కుబేర పుల్లయ్య అనుకొన్నాడు. "నిజంగా అంత తాగుబోతా? ఇంక బాగుపడ్డం సాధ్యమే కాదా?" అని ఆలోచనలో పడిపోయాడు కుబేర పుల్లయ్య. కాని ఏ పాపము ఎరగనని చెప్పి బైటపడ్డానికి కుచేల పుల్లయ్య ఎక్కువ కష్టపడన క్కరలేకపోయింది. సారామాట దేవునికెరుక ఉప్పుకూడా కొనలేకపోయాడు. కుచేల పుల్లయ్య ఒక్క పొదుపరే కాదు కష్టించి పనిచేసేవాడనికూడా చెప్పడానికి తగినన్ని సాక్ష్యాధారాలున్నాయి. తన వ్యవసాయ పనిముట్లనీ, వున్న నిల్వనీ చూపించాడు. అన్నీ యథాక్రమంగా వున్నాయి. కుబేర పుల్లయ్య విదేశయాత్రకు వెళ్ళడానికి పూర్వం ఏవి ఎలా వున్నాయో అవన్నీ ఇప్పటికీ అలాగనే వున్నాయి. కుంటెద్దలజత, బోడావు, ఒక గొర్రె, బండి, నాగలి, గొర్రు. కొసకు దంపనాగలి కూడా గోడకు చేరపెట్టివుంది. మళ్ళా ఊడ్పుల దాకా దాని అవసరం వుండదుకదా అని సారాపాకలో కుదువ పెట్టినా వ్యవసాయానికి ఇబ్బంది వచ్చేదికాదు. కుబేర పుల్లయ్య గుడిసెలోకి వచ్చి చూశాడు. అక్కడకూడా అన్నీ ఎక్కడివక్కడ వున్నాయి. పైకప్పు గడ్డిమాత్రం అక్కడక్కడ ఊడదీసిన మొర్రెలున్నాయి. గడ్డికరువైనప్పుడు పాకమీది గడ్డిపీకి పశువులకు వేయవలసి వచ్చింది.

కుచేల పుల్లయ్య విచ్చలవిడిగా తిరిగాడని కాని, ఒళ్ళు తెలియకుండా ఖర్చుపెట్టాడని కాని చెప్పడానికి తగిన ఆధారాలేవీ లేవు. అతడు నేలతల్లి బిడ్డడు. పేదరైతు, బతికే హక్కును సంపాదించడం కోసం రెక్కలు ముక్కలు చేసుకొంటున్నాడు కాని ఫలితం అంతగానే వుంటోంది.

"ఓయి దేవుడా! ఏమిటి దీని అర్థం?" అని విస్తుపోయాడు కుబేర పుల్లయ్య.

"ఇదిగో మనిద్దరమూ అన్ని విషయాల్లోనూ సమానులం. ఇద్దరికీ సమానమైన హక్కులే వున్నాయి. ఇద్దరమూ ఒకలాగే పన్నులు చెల్లిస్తున్నాం. అయినా నీకేమీ మేలు

కలగడంలేదు. దీనికి కారణమేమిటి? అంతా చిత్రంగా వుంది!"

"నిజమేనండి. అప్పుడప్పుడు నేనుకూడా ఆశ్చర్యపడుతూ వుంటాను!" అన్నాడు కుచేల పుల్లయ్య దిగులుగా.

తర్వాత కుబేర పుల్లయ్య బుర్రను బాగా రాపాడించాడు. కీలకం దొరికిపోయింది.

"ఇంతకీ వచ్చిన చిక్కల్లా మనకు ప్రభుత్వ ఆదరణా లేదు ప్రజాదరణాలేదు. నాకేం పట్టిందన్నట్లుగా వుంది సంఘం. ప్రతివాడూ తన పనుల్లోనే మునిగి తేలుతున్నాడు. ప్రభుత్వం ఏదైనా ప్రారంభిస్తే అది ఎక్కడ వేసిన గొంగళి అక్కడేగా వుంది. అందుకని ఈ సంఘంలో కొంత చైతన్యం కలిగించడం అవసరం" అనుకొన్నాడు కుబేర పుల్లయ్య.

అనుకొన్న తక్షణం కుబేర పుల్లయ్య ఒక సమవేశం జరిపించాడు. గ్రామస్తులంతా చూస్తూ వుండగా ప్రభుత్వాదరణ, ప్రజాదరణవల్ల కలిగే లాభాలను గురించి గొప్పగా ఉపన్యసించాడు. పందులమీద పన్నీటిజల్లులాగ ముత్యాల జడిలాగ చాలాసేపు సూక్తులను విరజిమ్మాడు. తమ అవసరాలను నెరవేర్చుకొనగలిగిన సంఘాలే గొప్ప సంఘాలు అని అనే కోదాహరణలతో నిరూపించాడు. అలాకాక ఏవో పరిస్థితులు పరిపక్వం కావాలి, వాటంతట అవి రావాలి అని ఎదురుచూసే సంఘాలు క్రమంగా క్షీణించి నశిస్తాయని హెచ్చరించాడు. అణాకానీ బాలశిక్షలోంచి తాను పిండిన విజ్ఞానాన్నంతనీ అక్కడికక్కడ ఒలకబోశాడు.

అనుకొన్న దానికన్నా అద్భుతమైన ఫలితాలు కలిగాయి. గ్రామీణులకు తలకడుక్కొన్నట్లయింది. అంతేకాదు. వారిలో మమకార భావంకూడా పొటమరించింది. ఇన్ని రకాల భావాలతో వారింతకు ముందెన్నడూ ఉక్కిరిబిక్కిరి కాలేదు. ఎన్నడో రావలసిన జీవనతరంగం ఏ కారణం వల్లనో మధ్యలో ఆగిపోయి ఇప్పుడు హఠాత్తుగా ఈ అజ్ఞాన ప్రజానీకాన్ని ఆకాశానికి ఎత్తినట్లనిపించింది. ప్రజలు సంతోషించారు. తమకు వెలుగు చూపినందుకు ఆనందించారు. కుబేర పుల్లయ్య గొప్ప వీరుడని పొగిడారు. కొసకు వారంతా సారాపాకను శాశ్వతంగా మూసివేయాలనీ, పైసా పరపతి సంఘాన్ని స్థాపించి ఒకరికొకరు చేదోడు వాదోడుగా వుండే పద్ధతిని ప్రవేశపెట్టాలనీ ఏకగ్రీవంగా తీర్మానించారు.

ఆ రోజునే సంఘానికి తొలి విరాళం వచ్చింది. అది మొత్తం రెండువేల ఇరవైమూడు పైసలు. గ్రామంలో వున్నవారంతా తలొకపైసా వేసుకొన్నారు. కుబేర పుల్లయ్యగారు నూరు అణాకానీ బాలశిక్షలను సంఘానికి దానం చేశారు.

"మీకు కావలసిన విజ్ఞానమంతా అందులోవుంది. చదవండి" అని గ్రామస్తులకు చెప్పాడు.

కుబేరపుల్లయ్య మరొకసారి విదేశయాత్రకు వెళ్ళాడు. అతడి ప్రతిద్వంది ఇంటివద్దనే

వుండి రెక్కలరగదీస్తున్నాడు. కొత్తగా ఏర్పడిన పరస్పర సహకార పద్ధతివల్లా, అణాకానీ బాలశిక్ష ఇచ్చే సలహావల్లా ఈసారి మంచిఫలితాలు కలుగుతాయి అనడంలో సందేహం లేదు.

ఒక ఏడు గడిచింది. మరొక ఏడు గడిచింది. కుబేర పుల్లయ్య లింబర్గ్, స్ట్రాస్‌బర్గ్ మున్నగుచోట్ల భోజనాలతో గడిపాడో లేదో చెప్పలేం. కాని రెండేళ్ళ తర్వాత ఆయన ఇంటికి తిరిగివచ్చాడు. వచ్చి నిలువునా కొయ్య అయిపోయాడంటే నమ్మండి.

కుచేల పుల్లయ్య ఎముకల గూడులా వున్నాడు. తినడానికి ఇంత సంకటి ముందు పెట్టుకొన్నాడు. ఆనాడు ఆదివారం కాబట్టి కుచేల పుల్లమ్మ దానిలో ఇంత నూనెబొట్టు విదిల్చింది. పిల్లలు చుట్టూకూర్చుని తమవంతు ముద్దల్ని ఎవరో లాక్కొంటారన్నంత ఆతురతతో నోట్లో కుక్కుకొంటున్నారు.

"ఎందుకిలా జరుగుతోంది?" అని చింతామగ్న స్వరంతో ప్రశ్నించాడు కుబేర పుల్లయ్య.

"నేనూ అదే అంటున్నాను. ఎందుకిలా జరుగుతోంది అని!"

కుబేర పుల్లయ్య ఇంటి అరుగుమీద శనివారం సాయంత్రాలు మళ్ళీ బాతాఖానీలు సాగుతున్నాయి. ఈ సమస్యను గురించి ఇద్దరు మిత్రులూ ఎంత దీర్ఘంగా ఆలోచించినప్పటికీ ఫలితం కలగడంలేదు. "అసలు మనకింకా తగినంత ప్రాజ్ఞత రాలేదేమో" అని కుబేర పుల్లయ్య ముందు అన్నాడు. కాని కాస్త ఆలోచించిన మీదట పోళెలు తినడానికి ప్రత్యేకం చదువుకోనక్కరలేదని ఒప్పుకొన్నాడు. కాని మొదటి ప్రయత్నంలో బూచులు వచ్చి దడిపించాయి. అందుకని సమస్య లోతుకు వెళ్ళరాదని అప్పుడు ఒట్టుపెట్టుకొన్నాడు. కొసకిద్దరు మిత్రులూ ఆఖరి యత్నంగా ఊరయోగి అయిన పిచ్చి పుల్లయ్య ఉపదేశం విందామని నిర్ణయించుకొన్నారు.

పిచ్చిపుల్లయ్య ఆ ప్రాంతాలవాడే. దొడ్డికాళ్ళు, గూని. అందుకని పనిపాటలకు పనికిరాడు. అడుక్కుతిని కాలక్షేపం చేస్తున్నాడు. గ్రామంలో మాత్రం పురోహితుని కన్నా చాలా తెలివైనవాడనే ప్రతీతి వుంది. ఆ ప్రతీతిని పుల్లయ్య నిలబెట్టుకొంటున్నాడు.

పుల్లయ్యకన్నా బాగా ప్రశ్నలెవరు చెప్పగలరు? శకునాలెవరు చూడగలరు? పిచ్చిపుల్లయ్య "అగ్గి" అని అరుస్తేచాలు. ఎవరికొంపమీదో ఎర్రకోడిపుంజు ఎగిరిపడిందన్నమాటే. పిచ్చిపుల్లయ్య 'వడగళ్ళు! వడగళ్ళు!' అంటే చాలును దోసకాయలంత వడగళ్ళు రాలుతాయి. ఆ దెబ్బకు పశువుల మందలు కాళ్ళు విరగదన్నుకొంటాయి. పిచ్చిపుల్లయ్యంటే అందరికీ భయం. ఎవరి గుమ్మం ముందైనా పిచ్చి పుల్లయ్య కర్రచప్పుడు వినిపిస్తే చాలును. ఇల్లాళ్ళు ఎక్కడి పనులక్కడే విడిచిపెట్టి కలిగిన దాంట్లో మంచి కబళం పెట్టడానికి పరుగెత్తుతారు.

ఈ సారికూడా పుచ్చిపుల్లయ్య జ్ఞాని అన్న పేరును నిలబెట్టుకొన్నాడు. కుబేర పుల్లయ్య విషయమంతా చెప్పి "ఇలా ఎందుకు జరుగుతోంది?" అని ప్రశ్న వేశాడో లేదో పిచ్చిపుల్లయ్య వెంటనే జవాబు చెప్పేశాడు:

"నీకు అలా రాసిపెట్టివుంది."

కుచేల పుల్లయ్యకు దాని అర్థం వెంటనే తెలిసిపోయింది. నిరాశగా తలపంకించాడు. కాని కుబేరపుల్లయ్య మాత్రం నిజంగానే ఇరుకునపడ్డట్టు ఇదయ్యాడు.

పిచ్చిపుల్లయ్య తన తెలివికి, తన జ్ఞానానికి తానే మురిసిపోతూ మొదలుపెట్టాడు.

"ప్రతివారూ కర్మఫలాన్ని అనుభవించక తప్పదు. నుదుటి రాతనెవరూ తప్పించుకొనలేరు. కుచేల పుల్లయ్య కూలిపోతున్న గుడిసెలో ఊరిబైట కాపురముంటున్నాడు. గుడిసెకు తలుపుల్లేవు. పై కప్పునిండా కన్నాలే. అందుకని లక్ష్మి అక్కడ ఎలా నిలుస్తుంది? కుబేర పుల్లయ్య ఇల్లు కోటలాంటిది. నలుమూలలనుంచీ లక్ష్మి అక్కడికే ప్రవహిస్తుంది. ఇల్లు కోటలాంటిదవడంవల్ల లక్ష్మి కదలదు. ధనం నిన్ను వదిలించుకోగలదేమో కాని నీవు ధనాన్ని వదిలించుకోలేవు. ఈ రోజున నీవు సగం సంపదను ఇచ్చేస్తే మర్నాడు మూడు వంతులు తిరిగివస్తుంది. నీవు ఎక్కడికి వెళ్ళినా లక్ష్మి నీమీద పడుతుంది. అందుకని కర్మపరిపక్వం అయేవరకూ నీవెంత బుర్రబద్దలు కొట్టుకొన్నా ఈ సమస్య తెగదు."



కుందేలు హేతువాదం



ఆ కుందేలు సామాన్యమైనదే కాని చాలా తెలివి గలది. దాని హేతువాదం గాడిదను కూడా మెప్పించగలిగింది. ఏదో తుప్పలో దూరి కూర్చుని స్వగతానికి దిగుతుంది.

"ప్రతి జంతువుకూ కర్మఫలం రాసి వుంది. తోడేలు, సింహం, కుందేలు అన్నీ అంతే. ఇష్టంవున్నా లేకపోయినా కర్మానుభవం తప్పదు. అదలా అనుభవిస్తూ పోవాలి అంతే. ఉదాహరణకు మా కుందేళ్ళనే చూడండి. ప్రతివారూ మమ్మల్ని కబళించేవారే. ఇది అన్యాయంలాగ కనిపిస్తుంది. కాని జాగ్రత్తగా ఆలోచించిచూస్తే అందులో అన్యాయం ఏమీ కనిపించదు. మమ్మల్ని కబళించే ప్రతివారికీ తాము చేస్తున్న పనేమిటో క్షుణ్ణంగా తెలుసును. ఇదేమిటి ఈ అన్యాయం అని మేము అన్నప్పటికీ మమ్మల్ని కబళించడం ఎవరూ మానరు. ఏమయినప్పటికీ తనకు కావలసిన దానికన్నా ఎక్కువ ఎవరూ తినరు. తక్కువకూడా తినరు. దేశీయ శాఖామంత్రిగారు ప్రకటించిన లెక్కల ప్రకారం..."

ఈ దశకు వచ్చేసరికి కుందేలు నిద్రపోతూ వుంటుంది. లెక్కలపేరు చెపితే చాలును దానికి మగత కమ్ముతుంది. ఒక కునుకు తీసిన తర్వాత తిరిగి హేతువాదం మొదలు.

"మమ్మల్ని ఒక మూలనుంచి భక్షిస్తూ ఉన్నప్పటికీ కుందేళ్ళ సంఖ్య మాత్రం ఆయేటికాయేడు పెరుగుతూనే వుంది. మేం మాత్రం మూర్ఖులమా యేమిటి? ఎండైనా

వానైనా అలా బయళ్ళల్లో గెంతుతూనే వుంటాం. పొలాల మీదో, కూరగాయ తోటలమీదో విరుచుకొని పడుతూ వుంటాం. మేం మాత్రం రైతులను ముప్పుతిప్పలు పెట్టడం లేదూ? మా కుందేళ్ళమీద ఒక కన్నేసి వుంచాలి. ఆశ్చర్యమేం వుంది? దేశీయశాఖా మంత్రిగారు ప్రకటించిన లెక్కల ప్రకారం...”

మళ్ళీ నిద్ర. మళ్ళీ మెలకువ. మళ్ళీ కనివిని ఎరగనంతటి గట్టి హేతువాదం. ఈ కార్యక్రమానికి అంతూ దరీ లేదు. కుందేలు తన మేధను మధించి దీన్ని గురించి ఆలోచిస్తుంది. దాన్ని గురించి చర్చిస్తుంది. ఫలితం ఒక ఉన్నతాదర్శం మూర్తీభవిస్తుంది. అంతకన్నా గొప్పసంగతి మరొకటుంది. ఈ మేధాశక్తితో ఏదో పైకి రావాలనే యావ దానికి లేదు. తన అమూల్యాభిప్రాయాలను అధికారులకు తెలియపరచాలనే తపన కూడా లేదు. (తను నోరు మెదపకముందే వారు చీల్చుకొని తినేస్తారని దానికి తెలుసును) ప్రతిదాని మీదా తన స్వంత కుందేటి అభిప్రాయాలేర్పరుచుకొనడం దాని అభిమతం. నిజంగా కుందేళ్ళెంత తెలివైనవి! అనుకొంటూ వుంటుంది.

విలువ తక్కువగుటచేత
ఇత్తడి పుత్తడికన్నా
హీనమనుట పాడిగాదు
ఇది సత్యమురోరన్నా!

ఇలాగ ఒకరోజున తుప్పకింద కూర్చుని తన తెలివినంతనీ ప్రియురాలిముందు చూపించాలని ఆలోచన చేసింది. వెనుక కాళ్ళమీద నిలబడి చెవులు రిక్కించింది. ముందరి కాళ్ళతో ఒకసారి మూతి తుడుచుకొని బాణంలా దూసుకుపోయింది.

“కుందేళ్ళు తలుచుకొంటే చాలా చక్కగా బతకగలవు. పెళ్ళి వేడుకలు చేసుకొంటాం. నాట్యాలు చేస్తాం. పండుగలు వస్తే సారా కాచుకొంటాం. కోసులకు కోసులు కావలిపెడతాం. గొంతువిప్పి హాయిగా పాడుతాం. తోడేళ్ళు మా పాటను వింటాయి. విని చూడ్డానికి వస్తాయి. ఏమిటోయ్ పాడుతున్నారు? అని అడుగుతాయి. అప్పుడు ఎవరికివారు అందినదారి పట్టుకొని పరుగెత్తుతాం. తప్పించుకొనగలిగామా సరేసరి. మరొకచోట సారా కాచుకొనవచ్చును. లేదా తోడేలుకు ఫలహారం అవుతాం. కుందేళ్ళగీత అంతేకదు అంతేనా శ్రీమతీ?”

“నీవు చెప్పినదానిలో అబద్ధంలేకపోతే అంతే” అని ఆచిఆచి తూచితూచి చెప్పింది కుందేటిసాని. వ్యక్తురాలైన తర్వాత దానికిది పదవ భర్త. పూర్వపు తొమ్మండుగురు భర్తలూ తన కళ్ళముందరే దారుణంగా మృత్యువువాత పడ్డారు.

“ఆ తోడేళ్ళున్నాయే అవి శుద్ధరౌడీసజ్జు. కొట్టుకు తిండంతప్ప వాటికింకొక పనిలేదు. దీనిమీద ఎన్ని ఉపన్యాసాలివ్వచ్చునని? ఎన్నిసార్లు పత్రికలకు రాశానని? గౌరవనీయులైన

అయ్యలారా! కుందేళ్ళను నిలువునా చంపడం కన్న వాటి చర్మం వలిచి తీసుకొనరాదా? కొంత కాలానికి ఆ కుందేలు మీకు మరొక చర్మాన్ని సమర్పించుకొన గలుగుతుందే!

కుందేళ్ళ జనాభా త్వరగా పెరుగుతుంది. కాని మీరీ వేళ ఒక మందనీ, రేపొక మందనీ చంపివేశారనుకోండి. అప్పుడు అంగడి ధరలు ఆకాశానికెక్కుతాయి. అలాకాక మీరు పెద్దమనుషులుగా వచ్చివుంటే ఇంకా బాగుంటుంది, 'అయ్యా నేటి భోజనానికి ఇన్ని డజన్ల కుందేళ్ళను అప్పజెప్పండి' అని మీరంటే మహాసంతోషం అని మేమంటాం. ఏమోయి దళవాయీ ఆ మందకు కబురుపెట్టు అని ఏర్పాటుచేస్తాం. అప్పుడన్నీ సజావుగా, హుందాగా, చట్టబద్ధంగా వుంటాయి. మీ తోడేళ్ళకీ, మా కుందేళ్ళకి అందరికీ సంతృప్తికరంగా వుంటుంది. కనీసం ఆశయినా మిగిలి వుంటుంది. అవును మీరూ మేమూ... మేమూ మీరూ.. ఇదీ అదీ, వారూ ..."

ఇలాగ కుందేలు ఇంకా ఎంతకాలం మాట్లాడేదో తెలియదు కాని హఠాత్తుగా పక్కనున్న పచ్చగడ్డిలో ఏదో అలికిడైంది. కుందేలు చెవులు రిక్కించింది. హేభగవాన్ తన భార్య ఏనాడో పారిపోయింది. అక్కడ పచ్చగడ్డిమీద ఒక ముసిలినక్క పొంచి పొంచి చూస్తూ తనవైపే వస్తోంది. చూసేవారికి అది ఏదో ఆట ఆడుతున్నట్లు . . .

"ఓహెూహెూ! ఎంత తెలివైన వాడివోయి కుందేలూ! నీమాటలు వినడానికి మహా ముచ్చటగా వుందోయ్. యుగాలు యుగాలు నీ మాటలు విన్నా ఇంకా తనివి తీరదోయ్" అంది నక్క.

మన కుందేలు మెలకువగలదే. కాని ఆ క్షణాన ఎటూ తోచక మ్రాన్పడిపోయింది. అప్పుడు దాని మనసులో ఏముందో మనకు తెలియదు. ఎటునుంచి పారిపోదామా అని ఆలోచిస్తున్నదో లేక మొదటిసారిగా ఇలాంటి పరిస్థితి వచ్చింది కనుక ఆత్మావలోకనం చేసుకొంటున్నదో చెప్పలేం.

సరే ధైర్యాన్ని కూడదీసుకొని "నక్కమ్మగారు ఆకలితో వున్నట్లున్నారు?" అని అడిగింది.

"నీ అమ్మకడుపు చల్లగా నేనిప్పుడే పసందైన ఫలహారం చేసి వచ్చాను. ముందేమవుతుందో తెలియదు కాని ప్రస్తుతానికి ఆకలిలేదు. సరేకాని ప్రపంచం ఏమంటున్నదోయ్ కుందేలూ!"

తాను వెనక కాళ్ళమీద కూర్చుని కుందేలుని కూడా కూర్చోమని పురమాయించింది. కుందేలు కాళ్లు ముడుచుకొని కూర్చొంది. అలా కూర్చునికూడా మనసులో స్వగతం మానలేదు.

"అదే. సరీగా నేననుకొన్నట్లే అయింది. ప్రతిదానికీ కర్మఫలం రాసి వుంది. సింహం, తోడేలు, కుందేలు అన్నీ అంతే. ఓ కుందేలు కర్మఫలమా ఈ గండాన్ని గడిపించలేవా?"

కుందేలు మనసులోని మాట నక్కకు తెలిసినట్లుంది. మన హేతువాదిని పొగడడం

మొదలుపెట్టింది.

"ఎవరి భాగ్యాన్ని పండించడానికి ఈ ప్రాంతాలకు వచ్చారు స్వామీ?"

"మా ప్రాంతం ఇక్కడికి ముప్పదికోసులావల వుంది. అది చాలా దూరంకిందే లెక్క కాని నా వేగానికదొకదూరం కాదు. ఇంటికి పోవలసిన తొందర పనులున్నాయని చెప్పడం లేదుకాని పోకతప్పదు. అక్కడ నాకూ ఒక సంసారం వుందాయె మరి. చలికాలం అంతా ఒకదొరగారి ఖాళీ గోశాలలో గడిపాం. పగలంతా నిద్ర. రాత్రి అంతా ఈ మొక్కలు కొరకి ఆ కాయలు కొరకడంతో కాలం హాయిగానే గడిచింది. ఇంతలో వసంతం వచ్చింది. వేసంగి సెలవలకు అడవికి పోదామని సరంజామా చేసుకొన్నాం. సరీగా అదే సమయానికి ఒక తోడేలు ఆ గోశాలకు వేంచేసింది. 'ఏం చేస్తున్నావోయ్ కుందేలూ ఇక్కడ? ఏదీ నీ పర్మిటు?' అని అడిగింది. నేనెలాగో తప్పించుకొన్నాను. కాని మా ఆవిడా పిల్లలూ..."

"ఆ కథంతా విన్నాను. ఆ తోడేలు మా చుట్టమే తెలిసిందా? ఇందులో ఆశ్చర్యపడవలసిన దేమీలేదు. 'మొన్న ఒక కుందేలు కుటుంబాన్ని వేటాడానోయ్. కాని పెద్దకుందేలు తప్పించుకొని పోయింది. దాని జాడ నీకేమైనా తెలుసునా?' అని నన్నడిగింది. ఇదుగో ఇక్కడ నువ్వు కనిపించావు. మీ ఆవిడమీద మనేది పట్టుకొందనుకొంటాను ఏం?"

"అబ్బే అదంతా ఏనాడో మరిచిపోయాను. అక్కడ నుంచి వెళ్ళిపోవలసిన తరుణం వచ్చిందనుకొన్నాను. అంతే ఇక్కడికి వచ్చాను. రాగానే ఒంటరిగావున్న ఒక యువ వితంతువు కనిపించింది. 'ఏం కలిసివుందామా?' అన్నాను. కలిసిపోయాం. పేచీపూచీలూ, కీచులాటలూ ఏమీలేవు. ఇప్పుడే ఆవిడ చెక్కేసింది. నే నిక్కడే దిగడిపోయాను."

"పాపం! ఫర్వాలేదులే. ఆవిడనుకూడా త్వరలోనే వెతుకుదాం."

నక్క ఒకసారి ఆవులించి కుందేలు వెనక కాళ్ళను గీరింది (ఈ సంగతి తనకు తెలియనట్లే నటించింది కుందేలు.) తర్వాత ఒత్తిగిలింది. మెడ వెనుకకువంచి కన్నులరమోడ్చింది.

"ఈ వేళ పొద్దు సరీగా పొడిచిందికదూ. వ్యవహారమంటే వ్యవహారమే మరి. వింటున్నావా కుందేలూ? నేనొక కునుకుతీస్తాను. నీవు కబుర్లు చెపుతూవుండు" అని మధ్య మధ్య ఆవులిస్తూ చెప్పింది నక్క.

నక్క చెప్పినట్టే జరిగింది. నక్క కునుకుపాటు పడుతూవుంటే దానికి అందుబాటులో కూర్చుని కుందేలు కబుర్లు సాగించింది.

"మీమీద ఉప్పనిమాటలూ చప్పనిమాటలూ చెప్పే బాపతుకానండి నేను

నక్కమ్మగారూ! పూర్ణాయువు పోసుకోవాలని నా కోరిక. నాకింకా మూడేళ్ళు నిండలేదు. అయినా దేశంలో సగం తిరిగి చూశాను. ఏమో ఏనాటికి ఏ తోడేలు ఎదురౌతుందో, ఏ పెద్దపులుగు మీదపడుతుందో, ఏ వేటగాడు వెంటపడతాడో అని ముందు దేశం తిరిగి చూశాను. ఎక్కడో దూరాన ఇల్లూ సంసారం అంటూ ఏర్పరచుకోవాలికదా. ఇంతకీ నేను ఎవరినీ నిందించడంలేదు. మా కుందేళ్ళ నుదుటిరాత ఏమిటో నాకు తెలుసును. కర్మసంగతి తెలియని రోజుల్లో కూడా గుండెలు కవుక్కొంటూ పరుగులు పెట్టక తప్పలేదు. ఇప్పుడు తెలుసుకొన్న తర్వాత కూడా మా ప్రాంతాల్లో అంతే. సరే ఇంక నడుం వాలుద్దామనుకొంటూ ఉండేసరికి తలుపు చప్పుడవుతుంది. 'ఎల్లయ మామా బండితోలుకు రమ్మంటున్నారు' అని పిలుపు. బైట గాలివాన వున్నా, తుపానువున్నా, ఎద్దు సగం చచ్చివున్నా అంతే. ఏం చేయగలం? బండినిండా సిపాయోళ్ళ నెక్కించుకొని ఆ వానలో బక్కటెద్దును లాక్కుంటూ పాతిక కోసులు ప్రయాణం చేయాలి. ఇంటిమొహం పట్టేసరికి వారంరోజులు పడుతుంది. పిల్లలకు పిడికెడు పప్పులు, పెళ్ళానికి ఒక రవికల గుడ్డా అందరికీ కన్నీళ్ళు! అలాంటివాణ్ణి పిలిచి ప్రపంచం కబుర్లడగండి. రైతుల కర్మ ఇంతేనంటాడు. మా కుందేళ్ళ కర్మ కూడా అంతే. ఏదో తోచినట్లు బ్రతుకుతూ వుంటాం. మా వాళ్ళను మేమెన్నడూ ముంచం. కాని సర్వదా మేం.. ఏమంటారు నక్కమ్మగారూ?"

బాగా నిద్రలో వున్నట్లు నక్క గుర్రుమని ఊగొట్టింది. నక్క నిజంగా నిద్రపోయిందో లేదోనని కుందేలు ఓరగంటితో చూసింది. పారిపోదామని ఆలోచిస్తున్నదా? ఏమో చెప్పలేము కాని, కుందేలు జీవిత కార్యక్రమంలో ఇలాంటి విధానానికి కూడా తావులేకపోలేదు. కాని నక్క మూసిన కన్ను తెరవకుండానే వెల్లకిలా తిరిగి కాళ్ళు బారజాపింది. దొంగముండ! నాటక మాడుతోందని కుందేలు తెలుసుకొంది.!

"మా మామయ్య ఒక సిపాయి దగ్గర కొలువు చేశాడు. ఎలాగో తెలుసునా? మామయ్య అప్పుడు చాలా చిన్నవాడు. సిపాయి ఉచ్చుపన్ని పట్టుకొన్నాడు. మామయ్యకు సిపాయి విద్యలన్నీ నేర్పాడు. తుపాకీ పేల్చడంలో, డోలు వాయించడంలో ఆనాడు మా మామయ్యకు సాటి వచ్చేవారే లేరు.

"దేశమంతా తిరిగి తీర్థాలలో తిరునాళ్ళలో విద్యలు చూపి కానీ దమ్మిడీ పిడికెడు బియ్యం సంపాదిస్తూ వుండేవారు. ఆటల్లేనప్పుడు ఆ సిపాయి తన కథని మా మామయ్యకు చెప్పేవాడు. 'నేను మా అమ్మా నాన్న దగ్గరే వుండేవాణ్ణి. ఒకసారి మా నాన్న బండిని బాగుచేయమని చెప్పాడు. నేను చుట్ట కాల్చుకొంటూ కూనిరాగాలు తీస్తూ పనిలో పడ్డాను. అప్పుడు తలారి వచ్చి అబ్బాయి! నిన్ను మునసబుగారు పిలుస్తున్నారు. ఇప్పుడు పటాలంలో చేరడం నీవంతు' అని చెప్పాడు. నేను అక్కణ్ణుంచి అటే దారిపట్టాను.

అప్పటినుంచీ ఇరవై ఏళ్ళు పటాలంలో పనిచేశాను. నేనింటికి తిరిగి వచ్చేసరికి అక్కడేం వుంది బూడిద? అని చెప్పాడా సిపాయి. రైతులగతి అంతే. ఇవాళ రైతు. రేపు సిపాయి. మా కుందేళ్ళ బ్రతుకు కూడా అంతే.

'ఏమిటీ? నిన్ను కూడా పటాలంలోకి పిలిచారంటావా?' అని అప్పుడే మేల్కొన్న దానిలాగ ప్రశ్నించింది నక్క.

"లేదండీ! మమ్మల్ని తింటారు అంతే" అంది కొంచెం నిర్లక్ష్యంగా కుందేలు.

"అంతేమరి. లేకపోతే నీవు సిపాయిగా ఏం పనికి వస్తావు. జనరల్ బిబికోవ్ చెత్త అని పిలిచేవాడే పటాలం! ఆ ముసిలి పటాలానికి కూడా నీవు పనికిరావు. సరే ఆ సిపాయి మీ మామయ్యను తినేసివుంటాడు. అవునా?"

"లేదు. ఆ సిపాయి చచ్చిపోయాడు. మా మామయ్య పారిపోయాడు. ఇంటికి వచ్చాడు. కాని కుందేలు పనులేవీ చేయలేకపోయేవాడు. అలవాటు తప్పిందికాదూ మరి. మా అత్త ఊరికే కూర్చోపెట్టి తిండి పెట్టనంది. అందుకని ఒకనాడు ఏమైనాసరే తిరునాళ్ళకు వెళ్ళి స్వంతంగా ఆట చూపిద్దామనుకొన్నాడు. డోలు మీద చేయివేశాడో లేదో ఇంతట్లో కుక్కలు మీదపడి చీల్చేశాయి."

"అవును అందర్నీ ఊదరపెట్టినందుకు తగినశాస్తి అయింది. తానెవరికో ఒకరికి కబళమవుతానన్న విషయం మీ మామయ్యకి ఆదినుంచీ తెలిసివుండాలి. కుక్కలు కాకపోతే నక్కలు. అవునా? మీ అందరిగతీ ఒకటే. సరేకాని కుందూ! మీ వైపు నక్కలెలా వుంటాయి? మాంచి చురుకైనవనుకొంటాను అవునా?"

"నిజమే. మంచి చురుకైనవి. వాటితో నాకెప్పుడూ స్వయంగా పని పడలేదు. కాని నేను చూస్తూ వుండగా ఒకసారి వేటగాడొకదాన్ని కూలవేశాడు. చెప్పొద్దూ నేను నేను.." నేను సంతోషించాను అని చెప్పాలనుకొంది కుందేలు. కానీ సమయానికి తమాయించుకుంది. నక్కమాత్రం దాని మనసులో మాటను పసిగట్టింది.

"అయితే నీవలాంటి ఆకతాయివన్నమాట" అని మొరిగి కుందేలు డొక్కలో నెత్తురు వచ్చేలాగా కరిచింది.

కుందేలు బాధతో చుమ్మలు చుట్టుకొంది. కాని ఎలాగో తేరుకొని "మావైపు నక్కల సంగతి చెప్పానండి అమ్మగారూ! ఇక్కడి నక్కలు దయగలవని అంటారు" అంది.

"అలాగా!"

"నిజమండి! నిరుడు మా అడివిలో ఒక కుందేలుపిల్ల తప్పిపోయిందండి. ఒక నక్క చూసి దాన్ని తన పిల్లలతో పాటే సాకిందండి."

"నిజం? అలా సాకి ఊరికినే పోనిచ్చిందంటావా? ఇప్పుడెక్కడుంది ఆ దిక్కులేని కుందేలుపక్షి?"

"ఏమోనండి. దానికి కాలం మూడిందని విన్నానండి. దొంగతనం అలవాటైంది. పోకిరీ తిరుగుళ్ళు మరిగింది. ఒక చిన్న నక్కమ్మను చెరిచిందని కూడా విన్నాను. అప్పుడు తల్లినక్కకు కోపం వచ్చి దాన్ని కబళించిందని విన్నానండి."

"ఇదుగో అబ్బీ! దాన్ని కబళించింది నేనే! నీవు విన్న నక్కను నేనే. అది పోకిరీగా తిరుగుళ్ళు మరిగిందని తినలేదు. దాని కాలం మూడిందని కబళించాను. అంతే."

నక్క ఒక్క క్షణం ఏదో ఆలోచించింది. ఒక గోమారును నలిపింది. తర్వాత తాపీగా లేచింది. ఒళ్ళు విరుచుకొంది. నవ్వుమొహంతో కుందేలువైపు తిరిగి "ఇప్పుడు ఎవరిని కబళిస్తాననుకొంటున్నావు చెప్పు!" అని అడిగింది.

కుందేలు ఎంత తెలివైనదైనా ఈ విషయాన్ని ఊహించలేకపోయింది. "ఇంతటితో నాకు రోజు తీరింది" అన్న భావం ఒకసారి మెదడులో మెరిసింది. కాని అలా ఊహించడానికి కూడా ఇష్టంలేకపోయింది కుందేలుకి.

"నాకు తెలియదండి!" అంది. అలా అంది కాని, దాని వాలకం చూసేసరికి నక్కకు చాలా కోపం వచ్చింది.

"ఎంత అబద్ధాలకోరువి! నీ వొక పెద్ద వేదాంతివనీ, జ్యోతిష్కుడవనీ ఇదనీ అదనీ చెప్పగా విన్నాను. ఇప్పుడు నీవు శుద్ధ బదుద్ధాయి కుందేలువి తప్ప మరేమీ కాదని తేలింది. ఇప్పుడు నేను కబళించేది నిన్నే. తెలిసిందా. అచ్చంగా నిన్నే. మరొకర్ని కాదు!"

కుందేలును చీల్చి వేసేదానిలాగ లంఘించింది నక్క. కాని అంతలోనే కూర్చుంది. ఏమీ జరగనట్లు చెవివెనక ఒకసారి గోక్కుంది.

"తమరు నన్ను పోనిస్తారనుకొంటున్నాను" అని కుందేలు బెరుకు బెరుకుగా గొణిగింది. దానితో నక్కకు కోపం ఇంకా ఎక్కువయింది.

"ఏమన్నావు? నక్క కుందేలును దయతలచడం ఎక్కడైనా విన్నావా? నిన్ను నేను కరుణించడానికి నీవూ నేనూ ఒకే లోకంలో వుంటున్నామా ఏమిటి?"

"కాదండీ! అలాంటి ఉదాహరణలు కొన్ని వున్నాయండి" అంది కుందేలు కొంచెం ధైర్యాన్ని కూడదీసుకొని. కాని ఆ ధైర్యం ఎక్కవసేపు నిలవలేదు.

గత జీవితమంతా ఒక్కసారి కళ్ళముందాడినట్లయింది. స్వర్గనగరాన్ని వెతికే ధ్యాసలో రైతాంగాన్ని ఎలా బాధించినదీ, తిండీ తిప్పలు లేక గజగజ వణుకుతూ రోజుల తరబడి చెట్టుతొర్రలో ఎలా కూర్చున్నదీ గుర్తుకు వచ్చింది. ఒకనాడు అడివి జంతువేదో తరుముకు వస్తూవుంటే పోయిపోయి ఒక రైతు ఇంట్లో పడింది. అదృష్టవశాత్తు అది శివరాత్రి అయింది. రైతు దాన్ని విడిచిపెట్టేశాడు. తన కుందేటి ప్రియురాంగ్రంతా ఒకరొకరే స్మృతిపథంలో నిలిచారు. వారితో సంసారం చేసిన రోజు, నాడు కన్న సంతానం

సంగతి జ్ఞాపకం వచ్చాయి. కాని ప్రాణాలరచేత పెట్టుకొని పరుగెత్తవలసి వుండడంవల్ల వారినొకనాడు కూడా తాను సరిగా చూడలేదు. ఇలా ఇవన్నీ మెదడులో మెసులుతూ వున్నంతసేపూకూడా "మరికొన్నాళ్ళు బ్రతికివుంటే ఎంత బాగుండును!" అన్నమాటను మాత్రం మంత్రంలాగ పునశ్చరణ చేస్తూనే వుంది.

ఇంతలో నక్క కుందేలుకు ఆశ్చర్యం కొలిపే ఒక పన్నాగం పన్నింది.

"చూడు బోడికుందూ! నీవు నిజమైన వేదాంతివనుకొన్నాను. కాని చావుపేరు వినేసరికే నీకు వణుకు పట్టుకొంది. సరే నీకొక అవకాశం ఇస్తున్నాను. నేను నాలుగడుగులు వేసి నీవైపు వీపు తిప్పి కూర్చుంటాను తెలిసిందా బోడీ! అయిదు నిముషాలవరకు నీవైపు చూడను. నీవు తప్పించుకొని పారిపోవచ్చును. పారిపోగలిగావా నీ అదృష్టం. లేదా నీ పని ఇంతటితో సరి."

"అదేమిటండి అమ్మగారు ఎలా పారిపోగలనండి!"

"మొద్దువెధవ! నీవు పారిపోకపోయినా నీకు అయిదు నిమిషాల వ్యవధి ఎలాగూ ఇస్తాను. సరే కాలక్షేపం కానియ్యి. హాయిగా వుంటుంది. సిపాయిలంతే. కాలం మూడే వరకూ కాలక్షేపం చేస్తూ వుంటారు."

కుందేలు ఒక్క క్షణం ఆలోచించింది. నక్క ఒక పరిష్కార మార్గాన్ని సూచించిన విషయాన్ని ఒప్పుకొనక తప్పదు. సోమరిగా చచ్చేకన్నా ఏదో పనిచేస్తూ చావడం హాయి. అంటే పరిగెడుతూ చావడమన్నమాట. నిజమైన కుందేటి చావంటే అదే. మంచి వేగంతో పరుగెడుతున్నావనుకో. హఠాత్తుగా ఒక పంజాదెబ్బ. అంతే ఆఖరు!

"మరొక క్షణంలో ఏం జరుగనున్నదో నాకు తెలియదు. నీపని రెండు తుండేలు" అని కుందేలు ఆత్మబోధ చేసుకొంది. "బహుశా..." అని ఏదో అనుకొబోయేటంతలో నక్క హెచ్చరించింది.

"ఇదిగో! ఆ వెర్రిమొర్రి ఆలోచనలు కట్టిపెట్టు. మనిషివనిపించుకో. సరే. దేవుడు మేలుచేయుగాక! ఊ.. సిద్ధం. పద!"

నక్క నాలుగడుగులు ముందుకు వెళ్ళింది. కాని అంతకు ముందే కుందేలును చిక్కని తుప్పల పక్కన కూర్చోపెట్టింది. కుందేలెంత ప్రయత్నించినా వెనకనున్న ఆ తుప్పలలోంచి సందుచేసుకొని పోవడం పొసగదు. నక్కవున్న దిక్కుకే పరుగెత్తుకొని రాకతప్పదు.

జిత్తులమారి నక్క కూర్చుంది. కుందేలును చూడనట్లే నటించింది. నక్క మరో నాలుగడుగులు ముందుకు పోయినప్పటికీ తన ప్రతి కదలికను పసికట్టగలదని కుందేలుకు తెలుసును. ఒకటి రెండుసార్లు కుందేలు లేచి చెవులు వెనుకకు రిక్కించింది. నక్కకందకుండా ఒక్కదూకు దూకాలని చాలాసార్లు అనుకొంది. కాని నక్క చూడకపోయినా

అంతా కనిపెడుతూనే వుందన్న నమ్మకంవల్ల ఉన్నచోటినుంచి కదలలేక పోయింది కుందేలు. ఒక విధంగా చూస్తే నక్క వైఖరి సబబుగానే వుందని చెప్పక తప్పదు. కుందేలు కుందేటికి తగిన వ్యావృత్తిలో పడింది. దానితో కొంత మానసికాందోళన తగ్గింది.

అనుకొన్న అయిదు నిమిషాలూ గడిచిపోయాయి. కుందేలు కుందేటి ఆలోచనలతో మునిగిపోయివుంది.

"కుందూ ఆడుకొందామా?" అని అడిగింది నక్క.

ఆట మొదలైంది. పావుగంటవరకూ నక్క కుందేలు చుట్టూ గెంతులు వేసింది. గొంతు చీల్చేదానిలాగ లంఘించేది. అంతలోనే దయతలచడమా మానడమా అనే మీమాంస వచ్చినదానిలా పక్కకు తప్పుకొనేది. దానివల్ల కూడా కుందేలుకు కాలక్షేపానికి కావలసినంత వ్యవధి దొరికింది. కుందేలు దేనికీ కాదనలేదు. అప్పుడప్పుడు మునికాళ్ళతో కళ్లుమూసుకొనేది.

ఏమయితేనేం పావుగంటలో అంతా అయిపోయింది. మిగిలినవల్లా నాలుగు చర్మపు ముక్కలూ.. కుందేలు ప్రవచించిన కుందేటి తత్వం "అన్ని జంతువులకు కర్మ రాసిపెట్టివుంది."



మితవాది



అనగా అనగా ఒకానొక దేశంలో ఒక మితవాది ఉండేవాడు. అతడెంత నిష్కర్షగా ఉండేవాడంటే "అయ్యలారా మీరు చేస్తున్నదేమిటి? నాశనమవదలుచుకొన్నారా?" అని వస్తూనే బడబడ లాడేవాడు. ఎదుటివారు నోరు మెదపక ముందే ఉపన్యాసాలు కుమ్మరించేవాడు. అయితే ఎవరికీ కోపం వచ్చేదికాదు. పైగా "నిజమే! మితవాది హెచ్చరిక చేస్తున్నాడు. చేయనీయండి. మంచిదేగా" అని అతడిని పొగిడేవారు.

మితవాది మొదలుపెట్టేవాడు:

ప్రతి సమాజానికీ మూడు అంశాలు పునాదిగా ఉండాలి. అవి: స్వేచ్ఛ, భద్రత, చౌరవ. స్వేచ్ఛలేని సమాజానికి ఆదర్శాలుండవు. గొప్ప ఆలోచనలుండవు. మంచి పనులు చేయడానికి ఉత్సాహం వుండదు. భవిష్యత్తుమీద నమ్మకం వుండదు. భద్రతారహితమైన సమాజం నిరాశా నిస్తబ్దతలతో నిండి నిబిడమై పోతుంది. అలాగే చౌరవ లేని సమాజం తన వ్యవహారాలను తాను నిర్వహించుకొనలేదు. చివరికి స్వదేశమన్న భావమే ఆ సమాజానికి లేకుండా పోతుంది.

మితవాది ఇలాగ ఆలోచించేవాడు. అతడి ఆలోచనలు న్యాయమైనవేనని చెప్పక తప్పదుమరి. ప్రజలు తన చుట్టూ విషకీటకాల్లాగ ముసురుతున్నట్లు చూశాడతడు. అదిచూసి ...

"తమ భవిష్యత్తుకు తామే అధినాయకులమన్న భావంవల్ల వచ్చిన స్థితి కాదిది. వారు కేవలం బరువులుమోసే బానిసలు. అదృష్ట దురదృష్టాలు చెప్పకుండానే వారిని ఆవహిస్తాయి. వారిలో పుట్టే రాగవిరాగాలు నిజమైన రాగవిరాగాలో ఎండమావుల్లాంటివో వారికి తెలియదు. అందుకని ఆ రాగవిరాగాలకు వారెన్నడూ లొంగరు." అని తనలో తాననుకొనేవాడు.

సరే పైన పేర్కొన్న మూడు అంశాలు మాత్రమే సమాజానికి దృఢమైన పునాదులు వేయగలవనీ, సమాజాభివృద్ధికి కావలసిన హంగులన్నింటినీ సమకూర్చగలవనీ మితవాది దృఢంగా నమ్మాడు.

అంతేనా? మితవాది ఉదాత్తంగా ఆలోచించడమే కాదు. ఉదాత్తమైన పనులు చేయాలని కూడా ఆరాటపడేవాడు. తన ఆలోచనలకు వన్నెతెచ్చిన వెలుగు రేక పరిసరాంధకారాన్ని చీల్చి వెలుగులు విరజిమ్మాలనీ అందరికీ వినయభావాన్ని నేర్పాలనీ కొండంత ఆశపెట్టుకొన్నాడు. అందరు మానవులూ అన్నదమ్ములేనని అతని వాదన. తన ఆదర్శాల జడిలో అంతా ఓలలాడాలని అతని ఆకాంక్ష.

నింగినున్న ఆదర్శాలను నేలకు దింపాలన్న ఈ ప్రయత్నం అనుమానాల కతీతంగా వుందని చెప్పడానికి వీల్లేదు. కాని మితవాది నిష్కాపట్యం, దృఢత, మృదుత్వం, వినయం చూసి అంతా అతని అనుమానాస్పద ఆదర్శాలను క్షమించారు. సత్యాన్ని హితవుగా చెప్పగలడు. అవసరమైనచోట అమాయకంగా కనిపించగలడు. లాభం వచ్చేచోట తన త్యాగశీలాన్ని చాటగలడు. తన కోర్కెలను తీర్చాలని ఎన్నడూ పట్టుపట్టలేదు. సాధ్యమైతే మంజూరు చేయవలసిందని విజ్ఞప్తి మాత్రమే చేసేవాడు.

ఈ 'సాధ్యమైతేనే' అన్న పదంవల్ల తలవంచని ఘటికుడు అన్న కీర్తి రానిమాట నిజమే. అయినా ఫరవాలేదని మితవాది మనస్సు సమాధాన పరచుకొన్నాడు. దానికి కారణం తాను కోరేది సర్వజన శ్రేయస్సు. అన్నిటికన్నా ఎక్కువ ప్రాధాన్యం దానికివ్వాలి. రెండవది తన ఆదర్శాలు అనవసరంగా అకాల మృత్యువు వాత పడకుండా వుండాలి కదా.. అందుకని కీర్తి లేకపోయినా ఫరవాలేదనుకొన్నాడు. అదీకాక తన ఆదర్శాలు వాస్తవాలమీద ప్రభావం వేయదగ్గంత స్ఫుటమైనవి కావని అతనికి తెలుసును. స్వేచ్ఛ, భద్రత, చొరవ అంటే ఏమిటి? కేవలం అస్ఫుట అవ్యక్త సంకేతాలు. సమాజం పెంపొందాలంటే ఆ సంకేతాలకు ఇంకా స్ఫుటత్వం కల్పించవలసి వుంటుందికదా? అసలు ఇలాంటి మాటలు సమాజం ఆశలను ఆశయాలను ఉన్నత పథానికి కొనిపోయేందుకు తోడ్పడతాయి. అంతేకాని సర్వతోముఖ సంతృప్తిని కలిగించే ప్రత్యక్ష లాభాలను ఆ పదాలు కల్పించజాలవు. ఈ శ్రేయోవ్యవస్థను సాధించాలన్నప్పుడు, అంటే ఈ ఆదర్శాన్ని అందరికీ అందుబాటులోకి తేవాలన్నప్పుడు ఈ ఆదర్శాలను చిల్లరగా

మార్చి ఆతురుల కందించవలసి వుంటుంది. ఇదిగో సరిగా ఈ దశలోనే అంటే ఆదర్శాలను చిల్లరగా మార్చిన దశలోనే 'సాధ్యమైతేనే' అన్న పదం ఆవిర్భవిస్తుంది. ఇరుపక్షాలవారు తలపడినప్పుడు ఒకరు 'కొన్ని' సర్దుబాట్లకు లొంగాలి. మరొకరు తమ కోర్కెలను 'తగువిధంగా' తగ్గించుకోవాలి. ఇదంతా మన మితవాదికి క్షుణ్ణంగా తెలుసును. ఈ ఆలోచనలతోనే ఆయన వాస్తవం మీద యుద్ధం చేయడానికి నడుంబిగించాడు. ముందు ఎందుకైనా మంచిదని 'అభిజ్ఞుని' సలహా అడిగాడు.

"స్వేచ్ఛ.. అనేది నింద్యం కాదనుకొంటాను. ఏమంటారు?"

"అది నింద్యంకాదు సరిగదా స్తవనీయమైనదికూడా" అని అభిజ్ఞుడు జవాబిచ్చాడు.

"మేం స్వేచ్ఛను వాంఛించడం లేదనేది నిజానికి ఘోరాపవాదం. మేం కోరేది స్వేచ్ఛ కాక మరేమిటి? కాగా అది పరిమితుల్లో ఉండాలంటాం..."

ఓహో! పరిమితులలో... సరే. భద్రత విషయంలో మీరేమంటారు?"

"దానికి కూడా స్వాగతమే... కాగా అది కూడా దాని పరిమితుల్లో వుండాలి."

"సరే సంఘంలో చొరవ వుండాలన్న నా ఆదర్శం మీద మీ అభిప్రాయం ఏమిటి?"

"మేం మధనపడుతున్నది కూడా అందుకోసమే కద! అయితే అది కూడా పరిమితుల్లో వుండాలి."

సరే పరిమితులంటే పరిమితులే మరి. అందులో తభావతు రాకూడదని మితవాదికి క్షుణ్ణంగా తెలుసును. కళ్ళెం లేని గుర్రాన్ని విడిచిపెట్టావా అది చేసే యాగీ ఇంతా అంతా కాదు. ఈ ప్రపంచంలో కళ్లెమంత గొప్ప వస్తువేదీలేదు. గుర్రానికి కళ్ళెం తగిలించు. ఇక ఎప్పుడూ వెనక్కే చూస్తూ వుంటుంది. "జాగ్రత్తగా చూడు!" లేకపోతే కొరడా దెబ్బ రుచిచూడవలసి వుంటుంది! అదీ కళ్ళెం తత్వం!"

అలాగనుకొని మితవాది తన కార్యకలాపాలలో పడ్డాడు. అయితే పరిమితుల్లో మాత్రమే. ఇక్కడ కాస్త కతకడం. అక్కడ కాస్త కెలకడం. అప్పుడప్పుడు ముణిచి పెట్టుకొని పడుండడం ఇదీ పని. అభిజ్ఞులు అతడిని కనిపెట్టి చూశారు. చాలా ఆనందించారు. ఒకప్పుడాతని పనిని చూసి వారెంత ముగ్ధులై పోయారంటే వారుకూడా మితవాదులుగా మారిపోతారేమో నని చూసినవారికి కనిపించింది.

వారు మితవాదిని వెన్ను తట్టారు.

"చాలా బాగుంది. ఇంకే బాదరబందీ పెట్టుకోకు. అలాగే సాగనీ. అంతా అద్భుతంగా సర్దుకొంటుంది. ఓహో మేకా! నీవు మా తోటలోకి రావడానికి ఎట్టి అభ్యంతరమూ లేదు. కాని చూస్తూన్నావుగా గోడలు చాలా ఎత్తుగా వున్నాయని!"

"చూడకేం చూస్తూనే వున్నాను. కాని నా ఆదర్శాల మీద చింతపట్టుకొంది. వాటిని వదులుకొనడం చాలా చిన్నతనంగా వుంది. చెబితే మీకర్థంకాదు మరి"

"అదేమిటోయ్! కాస్తంత చిన్నతనానికి మరేం ఫరవాలేదు. చిన్నతనం వల్ల వచ్చే నష్టమేమిటిలే. నీ ప్రణాళికను నీవు కొనసాగించవచ్చును. సాధ్యమైనంత పరిమితిలో.. తెలిసిందా?"

అలాగ 'సాధ్యమైతేనే' అన్న పరిధిలోనే మితవాది కార్యకలాపాలు కొనసాగాయి. ఈ దశలో కూడా మితవాది ఆదర్శాలు ప్రమాద రహితాలు కావు అని అభిజ్ఞులకు తోచింది. ఒక వైపున ఆ వ్యవహారం చాలా విపులంగా సాగించడానికి ఏర్పాటు అయింది. రెండవ వైపుచూస్తే దాన్ని అంగీకరించడానికి ఇంకా పరిపక్వం కాలేదు మరి.

"నీ ఆదర్శాలు మాకు చాలా భారంగా తోస్తున్నాయి. వాటిని భరించడానికి మేమింకా తయారు కాలేదు.. ఇంకా పరిపక్వ దశకు రాలేదు" అని అభిజ్ఞులు మితవాదికి తెలియజేశారు.

ఆదర్శాలలో గల లోపాలను, లొసుగులను వారు అతి చిన్న వివరాలతో స్పష్టంగా నిరూపించారు. అది విన్న తర్వాత మితవాది తన పథకం చాలా ప్రమాద గర్భితమైనదని ఒప్పుకొనక తప్పిందికాదు. ఆ పథకం ఇంక పనిచేయదు. అంతే!

"ఎంత శోచనీయం" అని మితవాది శోకించాడు.

అభిజ్ఞులు అతడిని ఊరడించారు.

"ఎంత చిత్రమైన వాడివోయ్. ఈ వ్యవహారాన్ని గురించి కన్నీరుపెట్టకు. అది కన్నీరు పెట్టతగినదికాదు. భవిష్యత్తులో నీ ఆదర్శాలు వ్యాప్తి పొందాలనేకదా నీ అభిమతం? అందుకు మా అభ్యంతరం లేదు. నీకు పుణ్యం వుంటుంది తొందరమాత్రం పడకు. 'సాధ్యమైన పరిమితుల్లో, నీ పథకాలు విఫలమయ్యాయే అనుకో. అయినప్పటికీ' 'కనీసం ఏదో' ఒకటి సిద్ధిస్తుందికదా! దానితో సంతృప్తిపడు 'కనీసం ఏదో' ఒకదానికి కూడా కొంత విలువ వుందని తెలుసుకదా. తొందరపాటు లేకుండా తాపీగా భగవత్ ప్రార్థన చేస్తూ 'తృణశ: కణశ:'గా సాధిస్తూ పోతే ఒకనాటికి నీకు తెలియకుండా లక్ష్యాన్ని చేరుకొంటావు. ఆ లక్ష్యం ఏర్పడినప్పట్నుంచీ దాన్ని చూసినవారెవరూలేరు. నీవే మొదటి వాడివవుతావు అప్పుడెంత అద్భుతంగా వుంటుందని!"

ఇక చేయగలిగింది లేదు. ఉన్నదానితో సర్దుకోవాలి. 'సాధ్యమైనంత' సాధించలేకపోతే 'కనీసం ఏదో ఒకటి' సాధించడానికైనా ప్రయత్నించి అదే పదివేలనుకోవాలి. మన మితవాది అక్షరాలా అంతే చేశాడు. కొత్త పరిస్థితులకు అనువుగా అంతా సరిపెట్టుకొన్నాడు. ఇంతకన్నా వేరు మార్గం లేదని ఇంతకుముందు అంత తెలివి తక్కువగా ఎలా ఆలోచించానా అని విస్తుపోయాడు. ఇందుకెన్నో దృష్టాంతాలు కూడా కనిపించాయి. వడ్లగింజకూడా వెంటనే ఫలితానికిరాదు. తెలిసిందా? ముందు దాన్ని నాటాలి. మొలకెత్తేవరకూ చూడాలి. మొలకెత్తి, ఆకులుతొడిగి వెన్నువేయాలి. ఒక

గింజ పదిగింజలై చేతికి రావాలంటే ఈలోగా ఎన్ని అద్భుతాలు జరగాలో చూశారామరి. ఆదర్శాల వ్యాప్తి విషయంలో కూడా ఇంతే. 'కనీసం ఏదో ఒకటి' నేలను నాటు. అప్పుడక్కడ కాచుకొని కూర్చో.

అలాగ మన మితవాది, కనీసం ఏదో ఒకటి, నేలను నాటి అక్కడ నిరీక్షిస్తూ కూర్చున్నాడు. కాని అలాగ ఎంతసేపు కూర్చున్నా 'ఆ కనీసం ఏదో ఒకటి' మొలకెత్తలేదు అంతే. దాని దుంపతెగా అది రాతినేలను పడిందా లేక పేడలోపడి మురిగి పోయిందా? ఎవరు చెప్పగలరు?

"ఏమై వుంటుంది?" అని మితవాది పాపం గొణుగుకొన్నాడు.

అప్పుడు సందేహ నివృత్తిచేశాడు అభిజ్ఞుడు.

"అయ్యా! మీరు చాలా చాలా ఆశించారు. ప్రజలెంత హీనంగా ఎంత దుర్బలంగా వున్నారో మీకు క్షుణ్ణంగా తెలుసును. వారికేదో మేలు చేద్దామనుకొంటున్నారు. కాని వారు మాత్రం మిమ్మల్ని వీలైతే పుడిసెడు నీటిలో ముంచివేయడానికి సిద్ధం. ఇలాంటి ప్రజలమధ్య చిత్తశుద్ధిని కాపాడుకోవాలంటే చాలా తెలివితేటలుండాలి. మెలకువలు తెలియాలి."

"అయ్యా కాస్త కరుణించండి! అసలీ రోజుల్లో చిత్తశుద్ధిని గురించి ఎవరు మాట్లాడుతున్నారని. నేను ఆదిలో ఎవడినో మీకు తెలుసునుకదా! ఇప్పుడు నేనెవరిని? నాకున్న మర్యాదంతా మంటగలసింది. తొలుత నేను 'సాధ్యమైతే' అన్న సిద్ధాంతం మీద నడిచాను. ఆ తర్వాత 'కనీసం ఏదో ఒక' కాడికి దిగజారాను. అయ్యోరాత! ఇక నేను చేయడానికేమైనా మిగిలివుందా?"

"తప్పకుండా వుంది. ఉదాహరణకు దగాతో సర్దుబాటు చేసుకోవడం వుందనుకోండి. దానికేమంటారు?"

"ఎలాగ?"

"ఎలాగేమిటి? చాలా సులభం. మీరు మా వద్దకు కొన్ని ఆదర్శాలను కొనివచ్చారు. సరే బాగానే వుంది. మేం వాటిపట్ల సానుభూతి చూపాలంటే మీరు సర్దుబాటుకు సిద్ధంగా వుండాలని మేమంటామనుకోండి..."

"అంటే?"

"అదే! మీ ఆశయాలతో ఆకాశానికి కెగరకండి. మా అభిరుచికి అనువైనంత వీలుగా వాటిని కిందికి దింపండి. అప్పుడు ముందుకు సాగండి. సర్దుబాటు చేసుకోండి. అప్పుడు బహుశా ప్రయోజనం ఉందనుకొంటే మేం కూడా... చూశారూ మేం పాతకాపులం లెండి. మీలాంటి వారిని చాలామందిని చూశాం. మొన్న మొన్ననే కాదూ జనరల్ మకరయ్యగారు మీలాగే కొన్ని ప్రతిపాదనలు చేశారు.. 'లాకప్ అనేది నా

సిద్ధాంతమండి. అది మీకు సమ్మతమేనా?... ఏమంటారు' అన్నారు మకరయ్యగారు. మేం బుద్ధిగడ్డి తిని ఆయనను నమ్మాం. ఇప్పుడాయన పోయాడు. మేం లాకప్పులో వుండిపోయాం."

ఈ మాటలు విన్నమీదట మితవాది చాలా దీర్ఘంగా యోచించాడు. తన ఆదర్శాల తాలూకు పేర్లు మాత్రమే ఇప్పటికి మిగిలాయి. అది చాలదన్నట్లు దానికి ప్రత్యక్షంగా దగాను జోడించాలంటున్నారు. ఇలాగే ఇంకా సాగితే తాను అచ్చమైన దగాకోరుకింద మారిపోవడం ఖాయం. హే భగవాన్ ఏం చేయాలి?

మితవాది ఇరుకునపడ్డంచూసిన అభిజ్ఞుడు అతడి వెన్నుతట్టాడు.

"ఇదిగో పనంటూ ప్రారంభించిన తర్వాత దాన్ని కొనసాగించాలి. అంతేకాని తెలివితక్కువగా వ్యవహరించుట కూడదు. ఇప్పుడు నీవు మమ్మల్ని కదిపావు. మరి ఇంతవరకూ నీవేమీ చేయలేదని రుజువు చేసుకోగలవా?"

మితవాది పనిలోకి దిగాడు. అప్పటినుంచీ అతడు చేసిందంతా దగాకు అనువుగానే వుంది. దానిలోంచి ఎప్పుడైనా బైటపడ్డానికి ప్రయత్నించినప్పుడల్లా అభిజ్ఞులలో ఒకరు వచ్చి "ఇదుగో మితవాదీ ఏం చేద్దామనుకొంటున్నావు? ఏదీ మొహం పైకెత్తి చూడు!" అనేవాడు.

అలాగ కాలం గడిచింది. అభ్యుదయోద్యమం (దగాతో సర్దుబాటు చేసుకొన్నదే అనుకోండి) ముందుకు సాగింది. కంపుతప్ప గత ఆదర్శాల ఛాయ కూడా మిగల్లేదు. అప్పటికీ మితవాది నిరాశపడలేదు.

"నా ఆదర్శాలను నేను నిజంగా తుంగలో ఊర తొక్కుతే మాత్రం ఏం? వ్యక్తిగతంగా నేనిప్పటికీ పందిరి గుంజలాగ తిన్ననైన వాణ్ణేగద! ఈవేళ నేనీ జంబాలంలో పడి కొట్టుమిట్టాడుతూ వుండవచ్చుగాక. రేపు ఎండకాస్తుంది. ఈ బురదలింకుతాయి. అప్పుడు నేను మళ్ళా ఆ పూర్వపు అదృష్టవంతుణ్ణవుతాను."

అభిజ్ఞుడీ స్వగతాన్ని విన్నాడు. నిజం అంతే అని ఒప్పుకున్నాడు.

మితవాది ఒకనాడు స్నేహితునితో కలిసి బజారు వెంటపోతూ అలవాటు ప్రకారం తన ఆదర్శాలను గురించీ, తన మేధాశక్తిని గురించీ గొప్పలు చెప్పుకొంటూ వుండగా తటాలునేదో మొహంమీద పడింది. అదేమై వుంటుంది? వాన పడుతున్నదేమోనని పైకి చూశాడు. కాని చిన్న మబ్బుతునక కూడా ఆకాశంలో లేదు. కొద్దిపాటి గాలి రివట వీస్తున్న మాట నిజమే. మేడలమీదనుంచి మురికినీళ్ళు కింద బజార్లో పోయడానికి వీల్లేదని నిషేధాజ్ఞలున్నాయి. అందుకని పైనుంచి మురికినీళ్ళు పడ్డాయని అనుమానించడానికి వీల్లేదు.

"ఏమిటీ చిత్రం!" అని మితవాది స్నేహితునితో అన్నాడు.


"ఇప్పుడు వాన పడ్డంలేదు. మేడమీంచి పారపోసిన మురికినీరు కాదు. అయినా నా మొహంమీద ఏవో చుక్కలు పడ్డాయి."

"ఆ మూల ఎవడో నక్కివున్నాడు చూశావా?" అని మిత్రుడు చూపించాడు.

"అది వాడు చేసిన పనే. నీ మితవాదాన్ని చూసి నీ మొఖంమీద ఉమ్మాలనుకొన్నాడు. కాని ఎదురుగా వచ్చి మొహంమీద ఉమ్మడానికి దుమ్ములు చాలలేదు. అందుకని దగాతో సర్దుబాటు చేసుకొని ఆ మూల నక్కి ఉమ్మాడు. గాలి దాన్ని నీ మొహందాకా మోసుకొచ్చింది."



ముసిలి తట్టు



ముసిలితట్టు దారిపక్కన పడి గాఢంగా నిద్రపోతోంది. రైతు అప్పుడే అరక విప్పి మేతకు విడిచాడు. కాని ఆ పసరానికి మేతమీద ధ్యాసలేదు. అప్పుడు దున్నతున్న చెక్కరాతి నేల. దాన్ని దున్నడం తట్టుకూ, దాని యజమానికీ కూడా తలప్రాణం తోకకొచ్చింది.

సర్వసాధారణంగా ప్రతి రైతుదగ్గరా వుండేదే ఈ మసిలితట్టు. ఒట్టి ఎముకలగూడు. ఎండిన బోర. పైకి పొడుచుకొనివచ్చే పక్కటెముకలు. కీళ్ళు సడలిన కాళ్ళు. ఎండకు పెట్రేగిన ఒళ్ళు. తల ఓ పక్కకు పోతూవుంటుంది. జూలు అట్టలు కట్టింది. కళ్ళు ముక్కులు సంతత ధారగా చెమర్చుతున్నాయి. పెదవి వ్రేలాడుతోంది. ఇలాంటి పసరంతో ఎక్కువ పని చేయించడం కష్టం. కాని పనిచేయాలి కదా! ముప్పొద్దులూ ముసిలి తట్టుకు కళ్ళెం బిగించే వుంటుంది. వేసవిలో వేకువ మొదలు చీకటి పడేవరకూ పొలంలో నాగటిపని. చలికాలమంతా బండిపని.

అలాంటప్పుడు సత్తువెలా పోసుకొంటుంది? దానికి వేసే గడ్డి గడ్డికాదు. వేసవిలో రాత్రి మేతకు కళ్ళెం విప్పినప్పుడు ఏదో మెత్తని పరకలు నాలుగు కొరికేది. కాని చలికాలంలో బండిపని చేసి వచ్చిన తర్వాత ముక్కిపోయిన యెండుగడ్డి దాని మొఖాన పడేసేవారు. వసంతంలో పశువుల్ని పొలానికి తోలినప్పుడు గడలు బోటుపెట్టి దాన్ని లేవదీయవలసి వచ్చేది. పొలాల్లో ఒక్క గడ్డిపరకకూడా కానవచ్చేదికాదు. అక్కడక్కడ

ఆవుల కంట పడకుండా మిగిలిన ఒకటి రెండు పరకలుతప్ప.

ముసిలి తట్టు బతుకు ఏం బతుకు? పాడు బతుకు! యజమాని దయగలవాడే! అనవసరంగా కొట్టడు. అయితే ఏం లాభం? ఇద్దరూ కలిసి కొయ్యనాగలితో పొలంలో పడతారు. "హె హె హె నడునడు!" అలవాటైన ఆ అదలింపు వినేసరికి నడుస్తుంది ముసిలి తట్టు. ఒళ్ళుసాగదీసి ముందు కాళ్ళను తన్నిపట్టి వెనక కాళ్ళ నీడుస్తూ మూతి బోరకానించి ముందుకు శరీరాన్నీడుస్తుంది. "దొంగముండా నడు!" రైతుకూడా తన బరువంతనీ అరకమీద వేస్తాడు. పట్టుకారుల్లాంటి చేతులతో మేడితోకను బిగించి చాళ్ళలో కళ్ళుగుచ్చి కర్రెక్కడైనా తప్పుతున్నదేమోనని చూస్తాడు. ఈ మూలనుంచి ఆమూలకు ఒక చాలు వేసేసరికి ఇద్దరికీ వణుకు పుడుతుంది. నిజం! మిత్తి నెత్తిమీదికి వస్తుంది. మనిషి నెత్తి మీదా, ముసిలి తట్టు నెత్తిమీదా మిత్తి కూర్చుంటుంది. ప్రతిరోజూ వారి బతుకంతే.

దుమ్ము కొట్టుకొన్న బండిబాట పాములాగ మెలికలు తిరుగుతూ ఒక ఊరునుంచి మరొక ఊరికి పాకుతుంది. అలా పాకి పాకి బాట ఎక్కడో ఒక పల్లె మొగలో మరుగు పడుతుంది. మళ్ళా ఊరావల తలెత్తి ముందుకు పాకుతుంది. అలా ఎక్కడికి పోతుందో ఆ దేవునికే ఎరిక. ఆ బాటపొడవునా ఇటూ అటూ పొలాల కంతులేదు. భూమీ ఆకాశం కలిసే ఆకడదాకా పరుచుకొన్నాయి పొలాలు. ఒకప్పుడు పసిమి మిసిమిగా, మరొకప్పుడు పచ్చపచ్చగా, వేరొకప్పుడు మొక్కా మోడూ లేని బీడుగా ఆ పొలాలు సర్వకాలాల్లోనూ ఆ గ్రామాల నన్నింటినీ పిడికిలిలో బిగించి వుంచుతాయి. ఆ పిడికిలి సడలదు. ఆ గ్రామాలలోంచి ఏ జీవి ఎటు మళ్ళవలసి వచ్చినా ఆవులిస్తున్న పొలాల కడుపున పడ్డంతప్ప వేరుమార్గంలేదు. అడుగో ఆ మనిషి అలాపైకి నడచిపోతున్నాడు. ఆ నడక వేగం చూస్తే ఇంకో క్షణానికి కాళ్ళు విరిగిపోతాయా అనిపిస్తోంది. కాని దూరాన్నించి చూస్తే మాత్రం ఈ అంతులేని పొలాలనుంచి తప్పించుకొనటం కోసం గిజగిజలాడుతు న్నట్లనిపిస్తుంది. చిన్న బుడిపలాగ కనిపిస్తున్నాడు ఆ మనిషి. కదులుతున్నట్లే అనిపించడంలేదు. క్రమక్రమంగా మసకబారుతున్నాడు. అలా మసకబారి మసకబారి హఠాత్తుగా మాయమవుతాడు. అంతులేని ఆ పొలాలలో కరిగిపోతాడు.

వందలఏళ్ళు గడచినా అంతులేని ఈ పొలాలలో కదలిక లేదు. చలనం లేదు. తమ గుండెల్లో బందీగావున్న ఏదో అద్భుతశక్తి పారిపోకుండా కావలి కాస్తున్నట్లు కనిపిస్తాయి ఆ పొలాలు. ఈ శక్తిని చెరనుంచి ఎవరు విడిపిస్తారు? దాన్ని వెలుగులోకి ఎవరు తెస్తారు? ఈ భారం ఇద్దరిమీదపడింది. ఒకరు రైతు. రెండవది తట్టు. పుట్టిన దగ్గరనుంచి బుగ్గి అయేదాకా ఇద్దరూ ఆ పనిలోనే సతమతమౌతారు. చెమటా, నెత్తురూ వారపోస్తారు. రైతుల సంకెళ్ళు తెగనరికి, తట్టు మూపున వున్న పుళ్ళను మాన్పగలిగిన

ఆ మహాశక్తిని పొలాలు ఇంకా కోల్పోలేదు.

ముసిలి తట్టు మండుటెండలో పడివుంది. కనుచూపు మేరలో ఎక్కడా చెట్టులేదు. వడగాలికి ప్రాణం సాలొస్తున్నది. అప్పుడప్పుడొక సుడిగాలి బాటమీది దుమ్మునంతనీ పోగు చేస్తుంది. ఆ గాలికి ఒళ్ళంతా చిమచిమ లాడుతుందేకాని ప్రాణం హాయిగా వుండదు.

జోరీగలూ, గోమార్లూ పిచ్చెత్తినట్లుగా తట్టుపొట్టకింద ముసురుతాయి. ముట్టెను ముంచెత్తుతాయి. పుళ్లను కరుస్తాయి. అవి కరిచినప్పుడల్లా మసలి తట్టు చెవులు ఇటూ అటూ తపతపలాడిస్తుంది. ముసిలి తట్టు కలలు కంటున్నదా లేక కైలాసానికి ప్రయాణమవుతున్నదా? ఏమో ఎవరికీ తెలియదు. ఈ ఎండకీ, చాకిరికీ ఒళ్ళంతా పేలిపోతున్నదని పాపం ఫిర్యాదుకూడా చేయజాలదు. ఆ మూగజీవానికి దేవుడు ఈ మాత్రం సౌకర్యాన్ని కూడా యివ్వలేదు. అలాగే మగతగా పడివుంది. విశ్రాంతి అన్న పేరుతో లభించిన ఈ బాధలో వచ్చేవి కలలు కావు. ఒక తీరూతెన్నూ లేని పీడకల. ఆ పీడకలకు ఆకారంలేదు. కొసకు భయంకరాకారాలు కూడా కానరావు. ఏవో పెద్దపెద్ద మచ్చలు, ఒకప్పుడు నల్లగా మరొకప్పుడు నిప్పులా మచ్చలు ఒకప్పుడు కదలకుండా అలాగే ఉంటాయి. మరొకప్పుడు అలిసిపోయిన ముసిలి తట్టుతోపాటే కదులుతూ వుంటాయి. తట్టుని అడుగులేని అగాధ పాతాళంలోకి ఎక్కడికో ఈడ్చుకొని పోతూవుంటాయి.

పొలానికంతులేదు. దానినుంచి తప్పించుకొనడం సాధ్యంకాదు. ముసిలి తట్టు అరకనీడుస్తూ ముందుకూ వెనకకూ ఎంత నడిచినా అంతు అనేది కనుచూపు మేరలో కానరావడంలేదు. మొక్కా మోడూ లేక బోడిగావున్నా, పచ్చగావున్నా మంచుకప్పి నిశ్శబ్దంగావున్నా అన్ని దశల్లోనూ కూడా దూరదూరాలకు పరుచుకొని వుంటుంది పొలం. అన్నింటికీ అది రాజు. అన్నింటినీ పట్టుకొని బందీగాగొని బానిసల్ని చేస్తుంది. దాని రహస్యాలు తెలిసినవారు లేరు. దాన్ని జయించినవారు లేరు. దాని సంపదను పూర్తిగా వెలికి తీసినవారు అంతకన్నా లేరు. ఈ రోజున అది శూన్యంగా నిర్జీవంగా కనిపిస్తుంది. రేపు నవనవోన్మేషంగా గోచరిస్తుంది. అందులో సజీవమేదో, నిర్జీవమేదో తెలుసుకొనడం సాధ్యం కాదు. కాని ఆ చావు బ్రతుకులకు మాత్రం మన ముసలి తట్టు ప్రథమసాక్షి. అందరికీ ఆ పొలం ఒక కవిత్వం లాంటిది. విశాల కేదారం. కాని మన తట్టుకు మాత్రం బానిసతనానికి పుట్టినిల్లు. పొలం దానిమీద తన బరువునంతా మోపుతుంది. దానిలోని ఆఖరి శక్తి కణాన్ని కూడా హరిస్తుంది. అంతటితో తృప్తిపడక ఎప్పటికీ ఆవురావురుమంటూ వుంటుంది. వేకువనుంచి చీకటి పడేవరకూ ముసలి తట్టు కాళ్ళీడ్చుకొంటూ సాగుతుంది. కళ్ళముందు ఏదో నల్లగా మిలమిలలాడుతూ దాన్ని



ముందు కీడ్చుకొంటూ పోతుంది. మళ్ళీ కళ్ళ ముందు అదే సిద్ధం. అలాగ ఆ మగతలోనే "హె హె హె నడు నడు – మొండిముండా నడు నడు!" అన్న అదలింపు వినిపిస్తుంది.

మింట అగ్గిగోళం ఎన్నడూ ఆరదు. పవలంతా ముసిలి తట్టుమీద అగ్గి జడి కురిపిస్తుంది. వానలకు, పిడుగులకు మంచు జడులకు అంతంలేదు. ప్రతివారూ ప్రకృతిని మాత అని పొగుడుతారు. కాని తట్టుకు మాత్రం ఆ ప్రకృతి ఒక పెద్ద హింసాయంత్రం. ఒక శాపం. ఆ ప్రకృతిలో దాని మట్టుకు పరిమళంలేదు. నానాస్వరాల సంగీతంలేదు. నానావర్ణ కిమ్మీరితంకాదు. అలసట, దైన్యం, బాధ తప్ప దానికి మరొక అనుభూతిలేదు. సూర్యకిరణాల వెలుగులో అన్ని జీవాలూ ఆనందించుగాక. కాని దౌర్భాగ్యపు తట్టుకు మాత్రం జీవితంలోని అనంత బాధల్లో ఆ సూర్యకిరణాల బాధ ఒకటి.

విశ్రాంతిలేని పని. దాని బతుకంతా పని పని పని! పనికోసమే అది తల్లి కడుపున పడింది. పనికోసమే పుట్టింది. పనికోసం కాకపోతే దాని మొహంకూడా ఎవరూ చూడరు. పైగా పొదుపుగల రైతు అదొక లేనిపోని బరువని కూడా భావిస్తాడు. దాని పరిసర వాతావరణానికంతకీ ఒకే ఒక ప్రయోజనం కనిపిస్తున్నది. అది దాని పనికి తోడ్పడే కండరాల సత్తువ అలసి హతమారి పోకుండా అడ్డుపడ్డం. తూచినట్లు తీరిక, ఎలాగో పనిచేయడానికి తగిన శక్తినిచ్చేపాటి తిండే దొరుకుతుంది. ఆ తర్వాత పొలాలు పంచ భూతాలూ ఏం కసితీర్చుకొన్నా, దాని కాళ్ళమీద అఱ్రుమీద నడుంమీద ఎన్ని కొత్త పుళ్ళు పడ్డాయన్న విషయాన్ని పట్టించుకొనే వారేవుండరు. కాడి మోయదగ్గ బలం దానికుందా లేదా అనేది తప్ప దాని క్షేమం సంగతి ఎవరికీ పట్టదు. ఎన్ని యుగాలుగా ఈ కాడి మోస్తున్నదో దానికి తెలియదు. ఇంకెన్ని యుగాలు మోయాలో ఊహించలేదు. చీకటి పాతాళ బిలంలోకి పడిపోతున్నట్లుగా అది బతుకు వెళ్ళమారుస్తుంది. జీవులకు గల అనంత అనుభూతులలో దానికి తెలిసిన అనుభూతి ఒక్కటే. అది అంతులేని చాకిరీ మూలాన పుట్టిన బాధ!

ముసిలి తట్టు బతుకుమీద అమరత్వ ముద్రపడింది. అది నిజంగా బతకడంలేదు. అయినా చావదు కూడా. ఆ పొలం అష్టపాదితిమిలాగ అనంత బాహువులతో దాన్ని పొదువుకొంటుంది. ఆ మృత్యు హస్తాలనుంచి దానికి విముక్తిలేదు. తట్టు లక్షణాలేవైనప్పటికీ దాని బతుకు సర్వత్రా ఒకటే.. దెబ్బలు తన్నులు తాపులు హింసలకు గురై సగంచచ్చి బాధతో బండబారడం తప్పదు. తన రక్తంతో తడిసిన పొలంలాగే దానికి కూడా రోజులు ఏళ్ళు యుగాలు అనే లెక్కలులేవు. దానికి తెలిసినది అనంతత్వం ఒక్కటే. దాని తోబుట్టువులు ఆ పొలంనిండా వున్నాయి. ఎక్కడ చూసినా ఎప్పుడు చూసినా కండలరగదీస్తున్న ఆ జంతువు కనిపిస్తుంది. ఎక్కడైనా దాని బతుకు అంతే. అదే ముసిలి తట్టు. దానిలో వున్నదేదో ఇదమిత్థమని చెప్పరాని పదార్థం. అది

కనిపించదు. తరగదు. విరగదు. నాశనం కాదు. జీవితం అంతులేనిది. అదొక్కటే ఆ పదార్థానికి క్షుణ్ణంగా తెలిసిన సత్యం. కాని ఈ జీవితం ఏమిటి? ఇది ముసిలితట్టును అనంతత్వ శృంఖలాలతో ఎందుకు బంధించింది? అది ఎక్కడినుంచి వచ్చింది? ఎలా బంధించింది? బహుశా భవిష్యత్తులో ఒకనాడు ఈ ప్రశ్నలకు జవాబు దొరకవచ్చును. లేదా అదికూడా గత కాలపు గాఢాంధకారంలాగ, జీవాల నాహరించే దెయ్యాలను సృష్టించిన చీకటి యుగంలాగ వుంటుందేమో!

ముసిలి తట్టు కునుకుపాట్లు పడుతూవుంటే పనికిరాని పరుగువాజెలు దౌడుతీస్తూ వుంటాయి. ఈ పనికిమాలిన పరుగువాజెలూ ముసిలితట్టూ ఒక కడుపున పుట్టినవారేనని చూసినవారికి మొదట స్ఫురించదు. ఐనా వాటి బంధుత్వం ఇప్పటికీ ఇంకా వస్తూనేవుంది.

ఒకప్పుడొక ముసిలిగుఱ్ఱం వుండేది. దానికి తట్టు, పనికిమాలిన పరుగువాజి ఇద్దరు బిడ్డలు. ఇందులో రెండవది అణకువ మెలకువ గలది. తట్టు అల్లరి చిల్లరిది. తట్టు ఆగడాన్ని ముసిలిగుఱ్ఱం చాలాకాలం సహించింది. బిడ్డలిద్దరినీ సమానంగానే పెంచింది. కాని కొసకు విసువెత్తి అంది: "నా ఆస్తిలో గడ్డి తట్టుకీ, ఉలవలు పనికిమాలిన పరుగువాజికీ చెందాలి. ఇది శాశ్వత శాసనం!" అని. అందుకని అప్పటి నుంచీ పనికిమాలిన పరుగువాజికి మంచి అస్తబలూ మెత్తని పక్కా అమిరాయి. తాగడానికి ఉలవచారు, తినడానికి గుగ్గిళ్ళు. కాని ముసిలితట్టుకు మాత్రం ఒక పాత గోశాల వచ్చింది. తినడానికి సందెడు ముక్కిన గడ్డి దక్కింది. "తీరిగ్గా నములు ముసిలిముండా. అక్కడా గుంటలోనీరు తాగు!"

ఈ ప్రపంచంలో తనకొక దాయాది వున్న సంగతే మరచిపోయింది పనికిమాలినవాజి. కాని దానికి హఠాత్తుగా ఏదో విసువు పుట్టింది. "హాయిగా వున్న ఈ అస్తబలుతోనూ, ఈ గుగ్గిళ్ళతోనూ విసుగెత్తుతోంది. మా తోబుట్టువెలా వుంటుందో చూడాలని మనసుపుట్టింది." అనుకొంది.

సరే బయలుదేరింది. తన తోబుట్టువు చావులేనిదని తెలుసుకొంది. చేతికేది అందుతుందో దానితో కొడతారు. అయినా అది బతుకుతోంది! ఎటువైపు చూచినా తన తోబుట్టువులు బానిసల్లాగ పనిచేస్తున్నట్లు కనిపించింది. ఇప్పుడే ఈ వైపున కనిపించింది. కనుమూసి తెరిచేటంతలో అక్కడ ఆ మూల కాళ్ళీడుస్తూ కనిపించింది.

ఓయి బాబో దానికేదో మాయోమంత్రమో తెలిసి వుండాలి. దాని నడుంమీద ఎన్ని కఱ్ఱలైనా విరుగుతాయి కాని దాని నడుంమాత్రం విరగదు.

ఇలాగ అనుకొంటూ పనికిమాలిన పరుగువాజెలన్నీ ముసిలితట్టు చుట్టూ చేరాయి.

అందులో ఒకటి అంది: "అసలేదీ తట్టుమీద పనిచేయలేక పోవడానికి కారణమేమిటో నాకు తెలుసును. అంతులేని పని చేయడంవల్ల దానికి చాలా లోకజ్ఞానం అబ్బింది.

చెవులకన్నా కొమ్ములు ముందు మొలవవనీ, తాడుతో గొడ్డలిని నరకడం సాధ్యం కాదనీ దానికి క్షుణ్ణంగా తెలుసును. అందుకని అది సామెతలను నెమరువేసుకొంటూ తన మానాన తాను హాయిగా బ్రతుకుతున్నది. అదృష్టమంటే నీదే ముసిలితట్టూ. హాయిగా బ్రతుకు!"

'అదికాదోయ్' అంది మరొక పనికిమాలిన వాజి.

"దానికా సత్తువా ఆ ఓపికా లోకజ్ఞానంవల్ల వచ్చినవికావు. అసలు లోకజ్ఞానమనగా ఏమిటి? లోకజ్ఞాన మనేది అతి సామాన్యమైనది. అందరిలోనూ వుండేదే అది. ఒక లెక్కను కట్టడానికో ఒక పోలీసు శ్రీముఖాన్ని అర్థం చేసుకోవడానికో అది పనికివస్తుంది. మన తట్టులోగల అనంతత్వానికి కారణం ఆ లోకజ్ఞానంకాదు. దానిలో గలది జీవనతత్వం, తాత్విక జీవనం. ఈ రెండు నిక్షేపాలూ దానిలో వున్నంతకాలం ప్రపంచంలోని ఏ కర్రా కూడా దాని నడుమును విరగగొట్టజాలదు."

మూడవది ఇలా అంది:

"నీవు చెప్పేదానికి అర్థంలేదు. 'జీవనతత్వం తాత్విక జీవనం' ఏమిటి? పదాలతో గారడీ చేస్తున్నావంతే. ముసిలి తట్టు అజేయ గుణానికీ నీవు చెప్పేదానికీ సంబంధం ఏమీ లేదు. అది తన జీవిత లక్ష్యాన్ని కనిపెట్టింది. అసలు కారణం అది. దానివల్లనే దానికి స్థితప్రజ్ఞత అలవడింది. తనను చూసి, తన వర్ణాన్ని చూసి తృప్తి పడగలుగు తున్నదంటే దానికి కారణం అదే. అపార శక్తీ, యుగ యుగాల దాస్యం కూడా జయించజాలని దిట్టతనమూ, అందువల్లనే కలిగాయి. కష్టం చేయమ్మా ముసిలితట్టూ. నీ పని యధాప్రకారం కొనసాగించు! పనికిమాలిన వాజెలమైన మాకు హృదయ నైర్మల్యం ఏనాడో నశించింది. నీ పనిలో నీకది లభించుగాక!"

అప్పుడు నాల్గవది (అది తిన్నగా సారా పాకనుంచి అస్తబులుకు వచ్చింది) ఇలా అంది:

"ఓహెూహెూ! మహాశయులారా అనవసరంగా కంఠశోషకు పాల్పడుచున్నారు. తట్టుమీద ఏదీ పనిచేయలేక పోవడానికి ప్రత్యేకంగా దానిలో మహత్తు ఏదీలేదు. తరతరాలనుంచీ ఈ దుర్భర జీవితానికి అది అలవాటుపడిపోయింది. ఒక చెట్టును దాని నడ్డిమీద ముక్కలు చేయండి. అయినా అది బ్రతికే వుంటుంది. అదుగో అటుచూడండి. అసలు ఊపిరి వుందాలేదా అని కూడా అనుమానం వస్తుంది. కాని కొరడాతో తగిలించవలసిన చోట తగిలించండి. అదే ముందుకు సాగుతుంది. ఎవరికి నియతమైన పనిని వారు చేస్తారు. పొలంనిండా ఇలాంటి తట్లు ఎన్ని ఈడిగిల పడుతున్నాయో లెక్కకట్టడానికి ప్రయత్నించి చూడండి. అన్నీ ఒకలాగే వున్నాయి కదూ? అందులో మీకు చేతనైనన్నింటిని పనికిరాకుండా చేయండి. అయినా ఆ సంఖ్య

ఏమాత్రమూ తగ్గదు. ఈ క్షణంలో అది మాయమైపోతే, మరొక క్షణంలో భూమిని చీల్చుకొని పుట్టుకొస్తుంది."

ఇదంతా ఉబుసుపోక కబుర్లు తప్ప మరొకటికాదు. అందుకని వాటిలో వాటికి రోషాలు పుట్టేవరకూ ఈ బాతాఖానీ ఇలాగే సాగిపోయేది. కాని, అదృష్టవశాత్తూ ఆ సమయానికి రైతు మేల్కొని "హె హె హె దొంగముండా నడు నడు" అని అదిలించడంతో ఈ తగాదా ముగిసిపోయింది.

దానితో పనికిమాలిన వాజెల ముఖాలు వికసించాయి.

"చూడండి! చూడండి!" అని చోద్యం చూసే ధ్యాసలో తగాదాలు మరిచిపోయాయి.

"చూడండి, ఆ ఎముకల గూడును ఎలా సాగదీస్తున్నదో.. ముందు డెక్కలను తన్నిపట్టి వెనకకాళ్ళతో ఆ కాయాన్ని ఎలా నెట్టుతున్నదో ! మంచి పనివాడెప్పుడూ పని చక్కగా చేస్తాడు మరి! అలాగే సాగించు తట్టూ, అలాగే సాగించు! చూసి నేర్చుకొనడానికి ఎవరో ఒకరు కావాలి. దీన్నిచూసి నేర్చుకొందాం "హె హె హె దొంగముండా నడు నడు!"



పొసుకోలు



ఇప్పుడు లేదుకాని ఒకప్పుడు అత్యున్నతోద్యోగులలో ఓల్టైర్ పంథీయులు చాలామంది వుండేవారు. అత్యున్నతాధికారులు ఆ పంథాను మెచ్చుకొనేవారు. తక్కువవారు అనుసరించేవారు.

ఆ కాలంలోనే ఒక గవర్నరుండేవాడు. ఇతరులు అమాయకత్వంవల్ల నమ్మే అనేక విషయాలమీద ఆయనకు అనుమానం వుండేది. అసలు ఈ గవర్నరు పదవి ఎందుకో ఆయనకు ఎంత కొట్టుకొన్నా అర్థమయేదికాదు.

అదే రాష్ట్రంలోవున్న ఖిల్లేదారు ఇందుకు పూర్తి విరుద్ధం. ఆయన అన్నింటినీ నమ్మేవాడు. గవర్నరు పదవి ఎందుకో కారణాలన్నీ ఆయన జిహ్వాగ్రమందుండేవి.

ఒకరోజున ఉభయులూ గవర్నరుగారి కచేరి సావిడిలో కూర్చుని వాదన మొదలుపెట్టారు.

"మనలో మనమాట" అని ముందు గవర్నరు ఎత్తాడు.

"నా కసలేమీ అర్థం అవడంలేదు. మా గవర్నర్లనందర్నీ చడీచప్పుడూ లేకుండా బర్తరఫుచేస్తే అసలెవరూ పట్టించుకోనే పట్టించుకోరు"

“దొరగారు అలా అనడం చిత్రంగా వుంది” అని సంభ్రమాశ్చర్య భయాలను ప్రదర్శించాడు ఖిల్లేదారు.

“ఇది మనలో మానమాట. చాలా రహస్యం... నిజం చెప్పాలంటే నాకర్థం అవడంలేదు. ప్రజలు ప్రశాంతంగా బ్రతుకుతున్నారు. దేవుడన్నా, చక్రవర్తి అన్నా భయభక్తులున్నాయి. అలా వుండగా వారి పాలిటికి ఒక గవర్నరును పంపించారు. ఎందుకు? ఏం పనికోసం? ఏం కారణంమీద?”

“ఎందుకేమిటి అధికారం నిర్వహించడంకోసం” అని ఖిల్లేదారు మందలింపు ధోరణిలో అన్నాడు.

“అది లేకుండా వుండడం సాధ్యమా? అందరికన్నా పైన గవర్నరుంటాడు. మధ్యలో పోలీసు అధికారి. ఆఖరున వుండేవారు సుంకరి. వారిచుట్టూ ఖిల్లేదార్లు. సర్దార్లు సిపాయిలు...”

“అవును అది నాకు తెలుసును. అయితే ఎందుకు అనేది నా ప్రశ్న. మీరన్న ఆ సుంకరి వున్నాడే వాడు రైతులమీద ఒక కన్నువేసి వుంచుతాడు. వినడానికి న్యాయంగా వున్నట్టే అనిపిస్తోంది. అయినా ఆలోచించి చూడండి. రైతు ప్రశాంతంగా తన పల్లెలో బతుకుతాడు. దున్నుతాడు. కోస్తాడు. గుణిస్తాడు. పెంపొందిస్తాడు. ఒక్క మాటలో చెప్పాలంటే జీవిత చంక్రమణాలు చేస్తాడు. అలాంటప్పుడు హఠాత్తుగా మింటినించి ఊడిపడతాడు సుంకరి. ఎందుకు? ఏమయిందని?”

“ఇంకా ఏమీ కాలేదు. అయినా తమరు చెప్పలేరండి దొరగారూ!”

“అదికాదు. ప్రజలు సంతృప్తితో ప్రశాంతంగా బతుకుతూ వున్నప్పుడు, దైవభక్తీ, రాజభక్తీ వున్నప్పుడు చెడుపెలా జరుగుతుంది? అంటే మంచిమాత్రం ఎలా జరుగుతుంది? ఏం జరిగినప్పటికీ సుంకరి చేయగలిగిందేమిటి? దేవుడు దయదలిచి మంచి పంట పండిందా మంచిదే. లేదా వారెలాగో ఒకలాగ కాలం గడపాలి. ఇక సుంకరి, వాడు ఒక గింజనెక్కువకాని, తక్కువకాని చేయగలడా? చేయలేడు. వాడికి చేతనైనదల్లా ఊడిపడడం. హంగామా చేయడం. వీలైతే ఎవరినో ఒకర్ని పట్టుకొని బందిఖానాలో తొయ్యడం! వాడు చేయగలిగిన పనల్లా అంతే.”

“కాని జనాన్ని ఊరికే బందిఖానాకు తోలరుకదా? దానికేదో తప్పకుండా ఒక కారణం వుంటుందంటి దొరగారు!”

“సుంకరి అనేవాడు మధ్యన రాకుండావుంటే అంతా మామూలుగా గడిచిపోయేదనీ, మీరన్న ఆ యేదో జరగకుండానే వుండేదనీ ఒప్పుకోక తప్పదు. ఏమైనప్పటికీ ఎవరూ జైలులో వుండేవారుకాదు. నేను చెప్పదలుచుకున్నదిదీ.. సుంకరి రంగంమీదికి వచ్చిన మరుక్షణంలో ఆ ‘యేదో’ జరిగితీరుతుంది.

“మరి సుంకరులలో మంచివారూ వుంటారు, చెడ్డవారూ వుంటారు.”

“నేను చెప్పేది వినండి మరి. నేను వ్యక్తులను గురించి చెప్పడంలేదు. విచిత్ర వ్యవహారాలను గురించీ చెప్పడం లేదు. ఈ వ్యవహారం నాకు బాగా తెలుసును. నా అనుభవం సంగతే చెప్తున్నాను. ఉదాహరణకు నేనీ రాష్ట్రాన్ని విడిచిపోయాననుకోండి. అప్పుడేమవుతుంది? నేను గడప దాటకముందే గాలికూడా స్థిమిత పడుతుంది. పోలీసు అధికారి పరుగులు కట్టిపెడతాడు. అతని జవాన్లు చిందులు మానుతారు. సుంకరులు కూడా తమ ఉత్సాహానికి పగ్గాలు తగిలిస్తారు. నన్నేనాడూ చూసి ఎరగని అమాయకులు కూడా బతుకులో ఏదో తెరిపిచ్చినట్లు పక్కలో బాధిస్తున్న బల్లాన్ని తీసివేసినట్లు భావిస్తారు. దానికర్థం ఏమిటంటారు? అయ్యా దానికర్థం ఇది: నాకు మారుగా నచ్చిన వ్యక్తి నాలాగ దండించలేడు. దానివల్ల అందరికీ జీవితం ఆ మేరకే తెరిపిచ్చినట్లు అనిపిస్తుంది. నా స్థానే వచ్చిన ఉద్యోగికన్నా నేనెంత పెద్ద ఉద్యోగినో ఆ మేరకు తెరిపిస్తుందన్నమాట. కాని నేను తిరిగివచ్చి పనిలో చేరేసరికి రొద, హంగామా, పరుగులు అన్నీ మొదలౌతాయి. తెల్లబట్టలు కట్టుకొని తిరిగినవాడు మళ్ళీ నీరు కావిగుడ్డలకు వస్తాడు. హుషారుగా కాలం గడిపినవాడు తిరిగి చికాకులో పడతాడు. అందరికీ దుర్భరమైన ఆ పాతబతుకే తిరిగి ప్రత్యక్షమవుతుంది. ఇదంతా మీకెందుకు చెపుతున్నానంటే మీకు కూడా ఇది ఇంతో అంతో అనుభవమై వుంటుందని.”

నిజమే. ఖిల్లేదారు గతాన్ని జ్ఞాపకం తెచ్చుకొంటున్నాడు. అతడు కూడా ఈ విషయంలో ఒక విధంగా చూస్తే దోషే మరి. గవర్నరు ఎక్కడికైనా సెలవుమీద వెళ్ళినప్పుడు బగ్గీ పూన్పించి తన పల్లె భవంతికి పోయేవాడు. మళ్ళీ అధికారి దగ్గరనుంచి శ్రీముఖం వచ్చేవరకు అక్కడ ఏ పటాటోపమూ లేకుండా పొద్దుపుచ్చేవాడు. పాటించవలసిన అధికార మర్యాద చిన్నదొకటే వుండేది. అది ఊరుకు వెళ్ళేముందు ఉప గవర్నరుగారిని ఒకసారి దర్శించడం:

“అవసరంవస్తే కబురంపించడం మరిచిపోకండేం . . .”

“మరేం ప్రమాదం లేదు. హాయిగా వెళ్ళండి.”

“అయితే సెలవు మరి! మీ వారికి నా నమస్కారాలు చెప్పండి! ఇకవస్తా!”

ఇంతకుమించి గొడవ పడనక్కర లేకుండానే పల్లె బసకు బయలుదేరేవాడు.

“నిజమే. అప్పుడప్పుడు అలాగే జరుగుతుంది. అయితే అది మీరన్నట్లు మాత్రం కాదు. ఎవరికైనా అప్పుడప్పుడు విశ్రాంతి కావాలి. అందుకని అవకాశం దొరికినప్పుడు...”

“విశ్రాంతి! అక్కడే మళ్ళీ తప్పుడు ధోరణిని పడుతున్నారు. అసలంతకుముందు విశ్రాంతి తీసుకొనకుండా మిమ్మల్నెవరు అడ్డుపెట్టారు? విశ్రాంతి తీసుకొనడం

పాపంకాదే? అవునా? కాదుకద! ఎన్నటికీ పాపంకాదు. నేను గవర్నరును కాబట్టి మీకు విశ్రాంతి నివ్వలేదంటారా? కొంచెం ముందుకు వెళదాం పదండి. జనం గవర్నరును పొగడాలనుకొన్నప్పుడు ఏమంటారో ఎప్పుడైనా విన్నారా? 'మా గవర్నరు గారెంత మంచివారు! ఆయన ఎన్నడూ హంగామా చేయరు. జనాన్ని వారిమానాన వుండనిస్తారు!' అంటారు. అంటే మంచి గవర్నరైనవాడు ఏమీ చేయకుండా ఊరికే కూర్చోవాలన్నమాట. అదీకాక ఇతరుల వ్యవహారాల్లో వేలుపెట్టడం వల్ల కలిగే ప్రయోజనం ఏమిటి కాస్త ఆలోచించండి. తాను వచ్చేసరికి గవర్నరుకు రాష్ట్రమంతా కొత్త. అది మొదటి విషయం. రెండవది అతడెప్పుడైనా ఏదైనా తెలుసుకొన్నాడనుకోండి. అదెప్పటికీ సరియైనదై వుండదన్న విషయం ఖాయం. అందులో సందేహం లేదు. లెక్కల సంగతికాని, అక్కడి జాతుల సంగతి కాని, జనుల ఆచార వ్యవహారాల సంగతి కాని అతడికేమీ తెలిసి వుండదు. ఆ విషయంలో కావలిస్తే పందెం కాయండి. రాష్ట్రమంతటా నాలుగైదు సార్లు కలయదిరిగిన మీదటగాని ఒక నది ఎక్కడనుంచి ఎక్కడికి ఎలాగ ఎందుకు పారుతున్నదో తెలియదు. ఇక రైల్వేల విషయం: అతడికి తెలిసినదల్లా టైంటేబుల్ మాత్రమే. అదైనా తన రైలు తప్పకుండా వుండడంకోసం. కాని ఆ రైలుమార్గాన్ని ఎందుకు వేశారు. దానిమీదవచ్చే లాభమెంత. మరొక కొత్తమార్గాన్ని ఎక్కడ కలపవలసిన అవసరం వుంది అన్న విషయాలు మాత్రం అతనికేమీ తెలియవు. అతడు కావాలనుకొంటే విషయాన్ని పూర్తిగా గ్రహించగలడు. అన్ని అంశాలూ అందుబాటులో వుంటాయి. కాని బద్ధకం, అజ్ఞానం. ఒకవేళ తెలుసుకొన్నా దానివల్ల ఒరిగేదికూడా ఏమీ వుండదు.

"ఇక మనచేతి పరిశ్రమలు, వృత్తుల సంగతి చూద్దాం. పాదరక్షలు చేస్తారు. పళ్ళు, కూరగాయలు అమ్ముతారు. ఇక్కడ నారచాపలల్లుతారు. అక్కడ కొడవళ్ళు, గొడ్డళ్ళు చేస్తారు. ఎందుకు చేస్తారు! ఎక్కడచేస్తారు? చలికాలంలో ఈగలన్నీ ఎక్కడికి పోతాయనికూడా అడగవలసి వుంటుంది. అవునా?"

"కాని దొరగారూ! నేనీ ప్రాంతంవాణ్ణే, అయినా నాకా విషయాలన్నీ తెలియవు మరి!"

"మీ సంగతివేరు. మీరు ఖిల్లేదారులు. విందుకు పసందుగా మాంసం తెచ్చి ఇస్తారు. అది రుచిగా వుంటే చాలును. అదెక్కడనుంచి వచ్చిందో మీకేం పట్టింది? కాని నేనలాకాదు. నేను గవర్నరుని. నాకన్నీ తెలిసివుండాలి. 'మీ రాష్ట్రంలో తోటల ఫలసాయం ధరవరలెలా వున్నాయి? అనెవరైనా నన్ను అడగవచ్చును కదా!

"కాదు మరీ! ఈ రోజుల్లో ఏమైనా జరుగుతుంది."

"అయ్యో ఈ రోజుల్లో ప్రతిపైసకూ లెక్కచూపాలి. ప్రతిచెత్తనీ చిట్టా రాసి వుంచాలి.

'దానిమీద పన్ను సంగతేమిటి?' అదీ ఈనాటి పరిస్థితి. చిక్కులు రాకుండా తప్పుకోవాలంటే 'చాలా అవసరమండి!' అని జవాబు చెప్పడం ఒక్కటే శరణ్యం."

"అవును నిజమే! అయినా మన కేబేజీ..."

"అవునా మరి? కేబేజి. నేను దాని సంగతి నిన్ననే విన్నాను తెలుసునా? నాకు కేబేజి కూర వడ్డించారు. అది బహుశా అల్జీరియానుంచి వచ్చిందేమోనని నేననుకొన్నాను. కాని అది మన వూళ్ళోనే పండుతోందట!"

"నిజమే! చాలా ఆశ్చర్యంగా వుంది. మన వూళ్లో పండేవేమిటి? ముల్లంగి, కోసుదుంప. అన్నిరకాల ఆకుకూరలు. మన సంగతి ఎప్పుడూ అంతే. ఆరోగ్య జలాలకోసం మనం మరియంబాదు వగైరా వగైరాలకు వెళతామా? కాని ఇక్కడే మన ఊళ్లోనే ఖనిజ జలాలు వున్నాయి. పైగా ఈ నీళ్ళు మంచివి కూడాను. మరియంబాదు సరుకులాగ కడుపులో గుండించవు ఇవి."

"మన వూళ్లో మొట్టమొదట కేబేజి నాటిందెవరంటారు? గవర్నరా? చస్తేకాదు. సామాన్యమైన ఒకానొక రైతు. చాలా కాలం కిందట అతడొకసారి దూరప్రాంతాలకు వెళ్లాడు. అక్కడ కేబేజి పండించడం చూశాడు. స్వస్థలానికి చేరుకొన్న తర్వాత తానుకూడా అలాగే పైరుచేయాలనుకొన్నాడు. అంతే.. కేబేజి పండుతోంది."

"నిజమేనండి" అని ఖిల్లేదారు ఒప్పుకొనక తప్పలేదు.

"ఈ ప్రాంతాలలో అన్ని వృత్తులూ అలాగే అతుకుల బొంతలలాగ వచ్చినట్లనిపిస్తోంది. ఒక స్థలం స్వర్గంలాగ కనిపిస్తుంది. దానికి సరీగా అరమైలు ఆవల నేలంతా మన అరచేయిలాగ బోడిగా వుంటుంది. మన వూరికి పక్కనేవుంది పాదూరు. అక్కడ ఒక్క తోటకూడా కానరాదు. అక్కడి రైతులంతా ఉన్ని పని చేస్తారు. వేసవిలో రైతులందరిలాగే వారుకూడా పొలంపనులు చేస్తారు. శీతాకాలంలో ఉన్ని పని చేస్తారు. ఆ వృత్తిని గవర్నరు ప్రవేశపెట్టాడంటారా? లేదు. ఎవడో ఒక సామాన్యమైన రైతు పొరుగు రాష్ట్రానికి వెళ్ళి అక్కడనుంచి ఈ వృత్తిని తీసుకొని వచ్చాడు. అన్నీ ఎలా వున్నాయో చూశారా? కేబేజీలు, దోసకాయలు, ఉన్ని, పాదరక్షలు, నారచాపలు, అన్నింటినీ సామాన్య ప్రజలు కొనివచ్చారు. మనవూరి గుళ్ళో గంటగోపురం కట్టించినదెవరు? గవర్నరా? కాదు. ప్రముఖ వర్తకుడు లాభాల లోభయ్య కట్టించాడు. గవర్నరు దాని ప్రారంభోత్సవానికి వచ్చి చాపకూర పీకలమొయ్యా ఆరగించాడు."

"నిజమేనండి. అక్షరాలా నిజం."

"అసలీ దేశంలో మొదట ఉప్పుడు చాపల పద్ధతిని కనిపెట్టిందెవరు?"

"ఎవరైతేనే. గవర్నరు మాత్రం కాదు."

"పులసచాపలుపట్టే పద్ధతి, గాలికాయలేరే పద్ధతి, బాసిబూరె, నానాలడ్డూలు చేసేపద్ధతి

ఎవరు తెచ్చారంటారు? గవర్నరు మాత్రం కాదు. ఏమంటారు?

"ఒక్క విషయం దొరగారూ! పళ్ళు, పచారి దినుసులు కాక ఇతర విషయాలు కూడా చాలావున్నాయి మరి."

"ఉదాహరణకు?"

"పన్నులు, వాటి వసూళ్ళు మొదలైన వ్యవహారాలు."

"పన్నులంటే ఏమిటి? మీకేమైనా ఒక అభిప్రాయం వుందా?"

"పన్నులు అంటే... అంటే.. ఒకవిధంగా అవి... హక్కుకు ఫలితం అన్నమాట" అని ఖిల్లేదారు ఏదో మొదలుపెట్టాడే కాని మాటలు తడబడి సాగక ఆపివేశాడు.

"అదే నేననేది! ఫలితమట! ఛీ! ఈ ఫలితాన్ని గురించి సంతోషించదగ్గదేమైనా వుందని మీరనుకొంటున్నారా? పన్నులు వసూలుచేసే వాళ్ళను చూడండి. ఎంత సంతోషమో! అన్నింటిమీదా పన్నులు! ఆ వూరునుంచి దోస ఊరగాయ రహస్యాన్నో, ఈ ఊరునుంచి ఎండుమాంసం కీలకాన్నో అతడు తీసుకొని వచ్చివుంటే బాగుండేది. కాని అదికాదుగదా. పన్నులు పిండడానికి వస్తాడు. అయ్యా! మన వూళ్ళో కేబేజిపంట పాడైపోతే ఈ ఫలితాన్ని నేనెలా రాబట్టగలుగుతాననుకొన్నారు? అప్పుడు నా ప్రసక్తి ఎలా వస్తుంది? నేను పోలీసు అధికారికి ఒక ఉత్తరువు చేస్తాను. వాళ్లు రాష్ట్రమంతటా హంగామా లేవనెత్తుతారు అంతే. ఏమయినా నేనిక్కడున్నది వారికి పని కల్పించడం కోసం. అదెందుకో నాకు తెలిసివుంటే పీకకు ఉరి పడుతుంది! పోలీసు అధికారి హత్యాకాండ మొదలుపెడతాడు. ఎందుకో అతడికే తెలియదు. ఇదంతా ఏమిటి? ప్రభుత్వం వసూలుచేసే పన్నులన్నీ ఎక్కడికి పోతున్నాయి? పంటలుపాడై రైతుచేతిలో చిల్లిగవ్వ లేకపోయిందా? అతడు తాగుడుకలవాటుపడి చితికిపోయాడా? వడ్డీవ్యాపారి అతడిని నిలువుదోపిడీ చేశాడా? ఉన్న డబ్బును కుండలో దాచి రైతే నాటకం ఆడుతున్నాడా? ఇలా ఎన్నో కారణాలు కనిపిస్తాయి. అయితే వాటితో మాకేం నిమిత్తం? మేం మీదపడతాం. హంగామా చేస్తాం. వారి మొరలను చెవినిపెట్టం. పన్నులు చెల్లించు అంతే. మాకు తెలిసినదల్లా అదొక్కటే!"

"అది నిజమే! వస్తారు. హంగామా, ఆర్భాటం చేస్తారు. రైతుల మొలలుకూడా తడివిచూస్తారు. ఇలా ఎందుకు చేస్తారో ఆ పరమాత్మునికే తెలియాలి" అని ఖిల్లేదారు కొంచెం విచారంతో అన్నాడు.

ఒక క్షణంసేపు ఇద్దరూ మిన్నకున్నారు.

ఆ నిశ్శబ్దాన్ని తొలుత ఛేదించినవాడు ఖిల్లేదారు. ఇంకా మరొక వాదన ఏదోవుంది. ప్రజల్లో, నీతి, విద్య, కళలు, శాస్త్రాలు వీటి సంగతేమిటని అడుగుదామనుకొన్నాడు. ఇంతలో ఆలోచనామగ్నుడైనట్లు కనిపిస్తున్న గవర్నరు ఒక్కసారి అదోలాగ చూసేసరికి

ఖిల్లేదారు ఏదో గొణిగి ప్రజల తిండి సరఫరా విషయాన్ని ప్రస్తావించాడు.

"సిగ్గు వేయడంలేదూ?" అని గవర్నరు వెంటనే మొహంమీద అనేశాడు.

ఖిల్లేదారు మొహం సిగ్గుతో జేవురించింది. కొద్ది రోజుల క్రితం స్థానికసభ అధ్యక్షుని హోదాలో దేశమంతా పర్యటనచేసి వచ్చాడు. అప్పటి స్మృతులలో పూర్తిగా గందరగోళంలో పడ్డాడు.

"అయినా నిజంగా అది..." అని ఆశ్చర్యం ప్రకటించాడు. అంతలో ఏదో కొత్త ఊహ తట్టింది: "ఒక్క క్షణం దొరగారూ మీరు చేయవలసిన దొకటుంది. సమాజాన్ని సంఘటితపరిచే చర్యలను గురించి ఏమంటారు?"

"ఏ సమాజాన్ని?"

"ఇదే. మన స్థానిక సమాజాన్నే."

"ఊ... అయితే సమాజాన్ని సంఘటిత పరచడానికి నేనేదో చేయాలంటారు?"

"తప్పకుండా మీరూ, మీ సతీమణిగారూ . . ."

"సతీమణిగారు బహుశా చేయవచ్చును. కాని అది నావల్లకాదు. అయ్యా మనవి చేస్తున్నాను, అదిమాత్రం నావల్ల కాదు. అసలు సమాజాన్ని ముఖ్యంగా మన సమాజంలాంటి దాన్ని సంఘటిత పరచడంవల్ల ప్రయోజన మేమిటి?"

సంభాషణ పాకాన పడుతోంది. సమయానికి కోశాధికారి అక్కడికి రాకపోతే ఆ చర్చ బహుశా ఇద్దరినీ ఇరకాటంలోకి ఈడ్చేదేమో కూడా.

అది ఆ నెల ముప్ఫయ్యవతేదీ. పూర్వం ఆ రోజున అధికారులకు జీతాలందేవి. సర్కారు కచేరీల్లో కోశాధికారులు పెద్దపెద్ద చిఠావు పుస్తకాలు, డబ్బుపెట్టెలు పట్టుకొని తమ పై అధికారులవద్దకు వచ్చేవారు. చిఠాలు నిండిన కొలదీ పెట్టెలు ఖాళీఅయ్యేవి.

కోశాధికారి ఇచ్చిన నోట్లను తీసుకొని గవర్నరు తాపీగా లెక్కపెట్టుకొన్నాడు. తర్వాత వాటిని బల్లమీద పెట్టి పుస్తకంలో సంతకం చేశాడు.

"దానికేమంటారండి" అని అడిగాడు ఖిల్లేదారు నోట్లకేసి కొంటెగా చూపుతూ.

"ఓ . . . ఇదంటారా?" అని గొణిగాడు గవర్నరు అప్పుడే ఏదో మేల్కొన్న వానిలాగ.

"అవును అదే."

"అదా – అది . . . చేసిన సేవకు ఫలితం!"



మహా వీరుడు



ఒకానొక దేశంలో మహావీరుడు పుట్టాడు. తల్లి పేదరాసి పెద్దమ్మ. మహావీరుడు పెరిగి పెద్దవాడయ్యే వరకూ ఎంతో గోముగా చూసింది. తర్వాత తన కొడుకును వీరకృత్యాలు చేయవలసిందని బుద్ధులుచెప్పి ప్రపంచం మీదికి పంపి తాను పారలౌకిక చింతలో మునిగింది.

మన మహావీరుడు తిన్నగా అడవికి బయలుదేరాడు. అక్కడొక సాలవృక్షం కనిపిస్తే దాన్ని వేళ్ళతో సహా పెకలించి విసిరేశాడు. మరొక సాలవృక్షాన్ని ముష్టిఘాతంతో ముక్కలు చేశాడు. మూడవ వృక్షాన్నెక్కి దాని తొర్రలో పడుకొని నిద్రపోయాడు.

అతని గురకకు అడవిలోని చెట్లన్నీ అల్లాడిపోయాయి. జంతువులన్నీ నెలవులు విడిచి పరుగులు పెట్టాయి. పిట్టలు కూడా ఎగిరిపోయాయి. ఆఖరికి దెయ్యాల మర్రిమీది దెయ్యం కూడా భార్యా బిడ్డల్ని తీసుకొని పారిపోయింది.

మహావీరుని కీర్తి ప్రపంచమంతా వ్యాపించింది. దేశీయులు, విదేశీయులు, మిత్రులు, శత్రువులు, అంతా అతని శక్తికి ఆశ్చర్యపోయారు.

దేశీయులు ఎవరినో ఒకరిని చూసి భయపడనిదే ఉండలేరు కాబట్టి మహావీరుడు

నిద్రలో ఇంకా బలాన్ని పొందటంకోసం తొర్రలో పడుకొన్నాడు. అందులో సందేహం లేదు. "మహావీరుడు మేల్కొనేవరకూ వుండు, అప్పుడతడు మన దేశానికి ప్రపంచ ప్రఖ్యాతి తీసుకొని వస్తాడు" అనేది వారి ఆశ. విదేశీయులు కూడా భయపడుతూ వుండేవారు. "విన్నావా భూదేవి మూల్గులు? ఈ దేశంలో ఒక మహావీరుడవతరించాడు. మనం జాగ్రత్తగా వుండాలి. అతడు లేచాడంటే మన పనిపట్టించవచ్చును" అని వారి భయం.

అందుకని అంతా మునివేళ్ళమీద నడుస్తూ "నిద్రపో మహావీరా! నిద్రపో!" అని సన్నగా చెవిలో వూదినట్లు అనేవారు.

వందఏళ్ళు గడిచాయి. రెండువందలు, మూడు వందలు, కొసకు వెయ్యి ఏళ్ళు గడిచాయి. ఆఖరికి అనుకొన్న రోజుకూడా వచ్చింది. రాజు కొడుకులు పట్టిన ఏడు చేపల్లో ఒక చేప కూడా ఎండిపోతుంది. రైతు చెమట ఓడ్చిఓడ్చి ఇక ఓడ్చడానికేమీ మిగలక మానేసే రోజు వచ్చింది.

వ్యవహారమంతా పూర్తి అయింది. లావాదేవీలు ఫైసలయ్యాయి. ప్రతివారూ ఇతరుల్ని నిలువుదోపిడి చేశారు. అయినా మహావీరుడింకా నిద్రపోతూనే వున్నాడు. గాజువారిన అతని కళ్ళు తొర్రలోంచి సూటిగా సూర్యుణ్ణి చూస్తున్నాయి. అతని గురక వందలమైళ్ళ పర్యంతం ప్రతిధ్వనిస్తోంది.

శత్రువులు చాలాకాలం అదనుకోసం ఎదురుచూశారు. అలా ఎదురుచూస్తూ "అది చాలా బలంగల దేశమై వుంటుంది. అక్కడొక మహావీరుడు తొర్రలో నిద్రపోతున్నందుకు జనం భయపడి చస్తున్నారు" అనుకొన్నారు.

కాని క్రమక్రమంగా వారు విషయాలను గుదిగుచ్చి చూశారు. ఆ దేశాన్ని ఉపద్రవాలు ముంచెత్తినప్పుడు కూడా మహావీరుడు తన దేశీయులను ఉద్ధరించని ఆ రోజులను గుర్తుకు తెచ్చుకున్నారు.

ఒక ఏడాది ఆ దౌర్భాగ్యులు అడివి మృగాల్లాగ పోట్లాడుకొన్నారు. చాలామంది చనిపోయారు. ఇంతకూ కారణం ఏమీలేదు. అప్పుడు ముసలివారు చాలా విచారించారు. "నాయనా మహావీరా! లేచి రావయ్యా! ఈ అన్నదమ్ముల కుమ్ములాటను తుదముట్టించవయ్యా" అని మొరపెట్టుకొన్నారు. వారి మొరాలించి రావడానికి బదులు మహావీరుడు అలాగే నిద్రపోయాడు. ఒకయేడు పొలాలన్నీ ఎండకు ఎండి బీళ్ళయిపోయాయి. మొలిచిన నాలుగు మొక్కలూ వడగళ్ళ వానకు దెబ్బతినిపోయాయి. అప్పుడు మహావీరుడు వచ్చి అందరికీ అన్నం పెడతాడని ఆశించారు. కాని మహావీరుడు తొర్రలో గుర్రుపెట్టాడేగాని రాలేదు. ఒక సంవత్సరం పట్నాలూ, పల్లెలూ అన్నీ పరశురామప్రీతి అయ్యాయి. ప్రజలకు కూడూ గూడూ గుడ్డా కరువయింది. మహావీరుడు

వచ్చి ఈ బాధలనుంచి కడతేరుస్తాడనుకొన్నారు. కాని ఈసారికూడా ఆయన నిద్ర లేవలేదు.

సరే కథనింతటితో తుంచేయాలంటే ఆ దేశం ఈ వేయి సంవత్సరాలలోనూ ఊహకందిన అన్ని ఉపద్రవాలకూ గురైందని చెప్పవచ్చును. కాని ఒక్కమారు కూడా మహావీరుడు కన్ను తెరిచి చూడలేదు. ప్రజల హాహాకారాలు దేశమంతటా ఇలా ఎందుకు ప్రతిధ్వనిస్తున్నాయని వీనులొగ్గి వినలేదు.

ఇదేమి మహావీరుడయ్యా అని మీరు అడగవచ్చును.

ఆ దేశం చిరకాలం బాధలనుభవించింది. అందుకని దానికెంతో ఓరిమి అలవడింది. దానికి అచంచలమైన విశ్వాసం కూడావుంది. తమ కళల్లో నీరిగిరిపోయిన మరుక్షణంలో మహావీరుడు వచ్చి రక్షిస్తాడని వారి నమ్మకం. ఇప్పుడా రోజు వచ్చింది. అయితే ఇది ప్రజలు అనుకొన్న రోజుమాత్రం కాదు. శత్రువులు చెలరేగారు. మహావీరుడు తొర్రలో నిద్రిస్తున్న దేశంమీద దండు వెళ్ళారు. వారు తిన్నగా అతని సాలవృక్షంవైపు నడిచారు. అందులో ఒకడు అదిచూచి అడుగులువేస్తూ చెట్టువద్దకు వెళ్ళాడు.. కంపుకొట్టింది. మరొకడు వచ్చాడు. అతని ముకుపుటాలు బ్రద్దలయ్యాయి. "ఛీ ఛీ! ఈ మహావీరుడు పూర్తిగా కుళ్ళిపోయాడు!" అన్నారు శత్రువులు. వారాదేశాన్ని ముట్టడించారు.

శత్రువులకు దయాదాక్షిణ్యాలు లేవు. వారు చాలా క్రూరులు. కంటికి కనిపించినదాన్నల్లా తగలబెట్టారు. శతాబ్దాలు మహావీరుని భయంతో అణచిపెట్టిన కసిని ఇప్పుడు మనసారా తీర్చుకొంటున్నారు. మరొక పెద్ద ఉపద్రవం ఎదురయేసరికి ఆ దౌర్భాగ్య ప్రజలు ఇంకా శోచనీయ స్థితిలోపడ్డారు. శత్రువు నెదిరించడానికి పరుగెత్తారు కాని, పాపం ఎదిదించడానికి చేతిలో ఏదీలేదు.

"వారు తమ మహావీరుని తలుచుకొన్నారు. ఒక్కగొంతుతో మొరబెట్టారు:


"త్వరగా రా! మహావీరా త్వరగా రా!"

అప్పుడొక అద్భుతం జరిగింది. మహావీరుడు కదల్లేదు! వేయేళ్ళ పూర్వంవలెనే ఇప్పుడుకూడా చలనంలేని శిరస్సు, అందులో గాజువారిన కళ్ళు. ఆ కళ్ళు సూర్యుణ్ణి చూస్తూనే వున్నాయి. కాని అడివంతనీ కంపింపచేసిన ఆ భీషణమైన గురకమాత్రం ఇప్పుడు లేదు.

సరీగా అప్పుడే పరమానందయ్య మహావీరుని వద్దకు బయలుదేరాడు. ఒక ముష్టిఘాతంతో సాలవృక్షాన్ని తునాతునకలు చేశాడు. ఓహో! ఏమిటిది? మహావీరుని కాయాన్ని కంఠం వరకూ చెదలు తినేశాయి. నిద్రపో మహావీరా నిద్రపో...'

✦ ✦ ✦

కాకి సత్యాన్వేషణ



ముసిలికాకి మనసు క్షోభించింది. కాకి జాతి నశిస్తున్నది. ప్రతివారూ కాకులను కాల్చి కూలవేస్తున్నారు. అదేదో ప్రయోజనానికైతే బాగుండేది. కాని కాదు. కేవలం విలాసంకోసం. కాకులకు దిగులుపుట్టింది. పూర్వంలాగ ఆ కర్కశమైన కూతలిప్పుడు వినరావడంలేదు. కాని కాకిమూక ఒక చెట్టుమీదికి చేరుతుంది. కేవలం తెలివితక్కువతనంగా "ఇక్కడ మేం వున్నామండోయ్!" అని అరుస్తాయి. అప్పుడు 'ఢాం' అనడం సహజంకదా. మూకలో పదో పరకో తగ్గిపోతాయి. పూర్వపు ఆ సుఖజీవితమూ పోయింది. ఉచిత భోజన వసతి పోయింది. అడవులను నరికివేశారు. చిత్తడి నేలలను ఓడ్చివేశారు. జంతువులను తరిమివేశారు. నూరింట ఒకవంతుకూడా న్యాయంగా బతకడానికి అవకాశం లేదు. అందుకని కాకులన్నీ పొలాలచుట్టూ, తోటలచుట్టూ ప్రదక్షిణాలు చేస్తున్నాయంటే అందులో ఆశ్చర్యమేముంది? దీనితో 'ఢాం'లు ఎక్కువయ్యాయి. మరొక పదో పరకో హతం! అయితే అదృష్టవశాత్తు కాకుల సంతానం తామరతంపరగా పెరుగుతుంది. లేకపోతే గద్దకూ, డేగకూ కప్పం కట్టడానికి

ఒక్కకాకికూడా మిగిలేదికాదు.

ముసిలికాకి పిల్లకాకులకు బుద్ధినేర్పాలని ప్రయత్నించింది. "అవసరం లేనప్పుడు కాకారవాలు మానండి! ఇతరుల తోటలను పట్టుకొని వ్రేలాడకండి!" కాని దాని సత్ప్రయత్నానికి వచ్చిన ఫలితం ఈసడింపు మాత్రమే.

"నీకు మహా తెలుసు పోవోయ్ ముసిలికాకి! దొంగిలించడంతప్ప మన కింకొక పనిలేదు. శాస్త్రం ఏం చెపుతున్నది? నీకు తినడానికి లేకపోతే నీ తెలివిని చూపి బ్రతుకు అని. తెలిసిందా? ఈరోజుల్లో ప్రతివారూ అలాగే బ్రతుకుతున్నారు. ఎవరూ పనిచేయరు. అంతా తమ తెలివిని నమ్ముకొంటారు. మేం చావాలనివుందా ఏం నీకు? పొద్దుపొడవక ముందే గూళ్ళు విడిచిపోతున్నాం. అడివి ఆ మూలనుంచి ఈ మూలకు వెతుకుతున్నాం. అంతా శూన్యం. ఒక్క కాయ కాని కళేబరం కాని కనిపించదు. ఆఖరికి పురుగులుకూడా లోతు బొరియలలో దాగొంటున్నాయి."

ముసిలికాకి ఈ వాదం విని ఆలోచనలోపడింది. తన కాలంలో అది కష్టాలెన్నో చూసింది. కాకిజాతి ఎన్నో ఏళ్ళు ఆకలికి మలమల మాడింది. లెక్కలేని కాకులు చనిపోయాయి. ఆ రోజుల ధర్మమే వేరు! నీకు వాడిగోళ్ళున్నాయి కనుక వాటితో నీ శరీరాన్నయినా చీల్చుకోకానీ అన్యులదాన్ని ఆశించరాదు అనేది ఆనాటి ధర్మం. అయినప్పటికీ కాకిజాతి ఈ ధర్మానికి కట్టుబడి లేదనేది స్పష్టం. నీ కడుపు కాలుతూవుంటే భోగాలనుభవించేవారిని చూసినప్పుడు గుండె మండదూ?

అప్పుడు శాస్త్రంవచ్చి ఆదుకొంది. ఎక్కడ ఏది దొరికితే దాన్ని పొడుచుకొని తిను అని వేదాంతం బోధిస్తోంది. నీకు అదృష్టం కలిసివచ్చిందా కడుపు నింపుకొని హాయిగా ఎగిరిపో. లేదా తుపాకి దెబ్బకు ఎరవై పెరటి తోటలో దిష్టిబొమ్మ అవతారం దాల్చు. "హత్వావాభోజ్య సేస్వర్గం జిత్వావా భోజ్యసే మహీం!"

ముసిలికాకికి ఇంకా రెక్కలు రానప్పుడు దాని తండ్రి కాకి ముత్తొమ్మిదినాడునుంచి ఈ దేశానికి తీసుకొచ్చింది. అప్పుడిది స్వతంత్రభూమి. కన్నానిన మేరల్లా అడవులు, వాగులు వుండేవి. అడవుల నిండా కాయా కసరూ, కావలిసిన వేటా పుష్కలంగా వుండేవి. వాగుల నిండా చేపలు బిలబిల లాడేవి. ఇప్పటిలాగే అప్పుడుకూడా వారికి నాయకుడు డేగ. కాని ఆ రోజుల్లో తిండి పుష్కలంగా వుండేది. చాలా నిరాడంబరజీవి. ఎంత నిరాడంబర జీవి అంటే దాన్ని గురించి ఈ నాటికీ కథలూ గాధలూ చెప్పుకొంటారు. అప్పటి డేగ కాకి పిల్లలను కబళించడానికి వెనుకాడేదికాదు. ఆ మాట నిజమే. కాని అందుకుకూడా కొన్ని మర్యాదలను పాటించేది. ఇప్పుడేముంది ఈ వేళ ఈ గూడులోంచి ఒక పిల్లను తినేస్తే రేపు ఆ గూడులోంచి. గూడు సరిగా లేకపోతే గూడులేని పిల్లనే కబళిస్తుంది. ఆ రోజుల్లో పన్నులింత భారంగా వుండేవికావు. గూడుకొక గుడ్డు. రెక్కకొక

ఈకపన్ను. ప్రతి పదిగూళ్ళకూ ఒక కాకిపిల్ల చొప్పున డేగకు నజరానా.. పన్నులు కట్టేశావా టింగురంగా అని బొంగరంలాగ నిద్రపోవచ్చును.

కానీ కాలం మారింది. కాలం గడచిన కొద్దీ పరిస్థితులు మారాయి. స్వేచ్ఛగావున్న స్థలాలమీద మనిషికి సరదా పుట్టింది. అతడు మొదట గొడ్డలికి పనిచెప్పాడు. అడవులు తరిగిపోయాయి. చిత్తడి నేలలు నీరోడి ఎండిపోయాయి. నదుల్లో నీళ్ళు తగ్గిపోయాయి. మొదట నదిగట్టున నాలుగు గుడెసెలు లేచేవి. తర్వాత చిన్న పల్లెలు, ఊళ్ళు, భూస్వాముల భవంతులూ లేచాయి. గొడ్డలి చప్పుళ్ళు అడవులలోని ప్రశాంతతను భంగపరిచాయి. వనచర ఖేచర జీవితాలను తలక్రిందులుచేశాయి. ఏదో కానికాలం వస్తున్నదని అప్పటి ముసిలికాకులు ముందే చెప్పాయి. కాని కుర్రకాకులు మాత్రం మనుషులకు స్వాగతం ఇస్తున్నట్లు వింతగా కాకారవం చేస్తూ ఇళ్ళమీద గిరికీలు కొట్టాయి. ముసలికాకులు పెట్టిన కఠిన నిబంధనలకు కుర్రకాకులు ఎదురు తిరిగాయి. అడవులంటే వాటికి విసుకెత్తిపోయింది. ఏదో కొత్తదనం, కొత్తవింత వాటికి కావలసివచ్చింది. దానితో కాకిమూకలో చీలికలు వచ్చాయి. ముఠాలు పడ్డాయి. తగువులు తలెత్తాయి. కలహాలు వచ్చాయి.

అదే సమయంలో ఖేచర సామ్రాజ్యంలోని ఉన్నత జాతుల్లోకూడా మార్పులు వచ్చాయి. ముసలి డేగకు సామర్థ్యం ఉడిగిందని నిర్ణయించారు. అది పితృస్వామిక పద్ధతిపై పరిపాలన సాగించవచ్చును. కాని పరిస్థితులు బెడసిపోవడంవల్ల పరిపాలనాదక్షులంతా డేగను విడిచిపెట్టారు. అధికారవర్గం దాన్ని "ముసలివీరుడు" అని పిలిచేది. కాకి మూక దాన్ని నీలెక్కేమిటంది. పైగా సిగ్గులేకుండా నానా చెత్త దాని చెవిలో కూసింది. కాని డేగ మాత్రం దీన్ని గోళ్ళతో తుంచివేయడానికి మారుగా మందహాసం చేస్తూ "సంస్కరణలు వచ్చేవరకూ ఆగండి. ఆ తర్వాత ఏది ఎలా వుంటుందో చూద్దురుగాని!" అని హెచ్చరించింది. అనుకొన్న ఆ సంస్కరణలు ఆఖరికి రానేవచ్చాయి. ముసలిడేగకు పింఛను ఇచ్చారు. కుర్రడేగ గద్దెనెక్కింది. చట్టాలను సరిగా అమలు పరచడంకోసం వేటపులుగును సహాయకునిగా నియమించారు.

కొత్త అధిపతి గద్దెనెక్కగానే కాకిమూకకు "మీ వ్యవహారం చూస్తాను" అని గట్టి హెచ్చరిక చేసింది. "నేనూ అంతే"నంది వేటపులుగు. ఉభయులూ కలిసి ఈ పైనుంచి పన్నులు మూడురెట్లు అవుతాయని ప్రకటించాయి. పన్ను చీట్లను పంచిపెట్టి అక్కడినుంచి ఎగిరిపోయాయి.

ఇంక వినాశకాలం దాపురించింది. "ఘోరమైన ఈ పన్నుల భారంతో నలిగిపోతున్నాం. కట్టలేం బాబో" అని కాకిమూక మొత్తుకోళ్ళు మొదలు పెట్టింది. అడవి అడవి అంతా ఇదే మొర. కాని డేగ, వేటపులుగు కూడా ఈ మొరాలకించలేదు.

ఒట్టిమాటలతో ప్రజలను రెచ్చగొట్టే అసంతృప్త జీవులను పట్టుకొనడానికి ఏంత్రింతలను నియమించాయి. తుపాకి గుళ్ళకు గురై ఎన్నో గూళ్లు కూలాయి. ఎన్నో కాకుల్ని పట్టుకొని జైల్లో పెట్టారు. కొన్నింటిని తోడేళ్ళకు మేతవేశారు. దీనితో కాకులు హడలిపోయి తోకలమీద పెట్టుకొని కప్పాన్ని మోసుకొని వస్తాయని ఆశించాయి. కాని కాకులుమాత్రం "చంపండి! కాల్చండి. ఇష్టంవచ్చినట్లు చేసుకోండి. మాకు లేనిదాన్ని మాత్రం తెచ్చిమ్మంటే ఇవ్వలేం" అని రెక్కలల్లారుస్తూ కాకారవాలు చేశాయి.

అలాగే కాలం గడిచింది. కాకులు నాశనమయ్యాయి. కాని ఖజానా మాత్రం నిండలేదు. అదృష్టంకొలదీ ఏ కాకైనా ఏమైనా సంపాదిస్తే దాన్ని ఏంత్రింతలు లాక్కొనేవి. ఏమైనా పరిస్థితి ఇంతకన్నా చెడేదేమీలేదు. కాకి మూక మరొకచోటికి వలసపోదామని ఆలోచించింది. ముందు కొన్ని ఎలగోలు దళాలను పంపించింది. కాని ఆ ఎలగోలు దళాలు తిరిగి రాలేదు. బహుశా దారి తప్పిపోయి వుండవచ్చు. ఏంత్రింతలు దారికాచి పీక నులిమి వుండవచ్చును. లేదా ఆకలి తాళలేక చనిపోయి అయినా వుండవచ్చును. అదీగాక తాత ముత్తాతలనాటినుంచీ వుంటున్న స్వస్థలాన్ని విడిచిపెట్టి తెలియని దేశాలకుపోవడం అంత తేలికకాదు. ఈరోజుల్లో స్వతంత్ర ప్రాంతాలెక్కడాలేవు. మనుషులు సర్వత్రా వ్యాపించారు. అసలా మనిషికే మెసలడానికి తావులేదు. గొడ్డలి తీసుకొని వెళతాడు. అడవులు ఆక్రోశిస్తాయి. జంతువులు చిందరవందరగా పరుగులు పెడతాయి. పొద్దు పొడిచింది మొదలు పొద్దుకూకేవరకూ చెట్లను పెకలిస్తూ వుంటాడు. తుప్పలు కొడతాడు, దుంగలు కోస్తాడు. రాత్రిళ్ళు బొరియల్లో దూరి గజగజ వణుకుతాడు. చలితో ఆకలితో పగటికోసం ఎదురుచూస్తాడు.

ముసలి కాకి ఆలోచించి ఆలోచించి కడకొక నిశ్చయానికి వచ్చింది. తానుపోయి అసలు సత్యాన్ని చాటుదామనుకొంది. కాని తాను ముసిలిది. జవసత్వాలుడిగి పోయాయి. దూరాభార ప్రయాణం. ఈ పని తన వశమా? ముందు డేగకు అభివాదాలు చేయాలి. తర్వాత వేట పులుగుకు. ఆ తర్వాత కాకి మూకమీద గవర్నరుగావున్న గద్దకు.

పక్షులకు కూడా మనుషుల్లాగా ఉద్యోగాంతరాల విషయంలో కఠిన నిబంధనలు వున్నాయి. ప్రతివారినీ "డేగను దర్శించావా? వేటపులుగు దర్శనం చేసుకున్నావా?" అని అడుగుతారు. దర్శనం చేసుకోకపోతే తిరుగుబాటుదారు అని ముద్రపడుతుంది.

ఎలాగైతేనేం ఒకనాటి ఉదయం ముసిలికాకి గూటిలోంచి బయలుదేరింది. పొడుగాటి ఏపె చెట్టుపై కూర్చున్న డేగ దర్శనం చేసుకొంది. ఆ పూట డేగ సుష్టుగా భోజనం చేసింది. గోళ్ళతో ముక్కును అప్పుడే శుభ్రం చేసుకొంటోంది. ముసిలి కాకిని చూసి...

"సుప్రభాతం సాధుపక్షీ! నీ వ్యవహారం ఏమిటో తెలుసుకొనవచ్చునా?" అని ప్రశ్నించింది.

"సత్యాన్ని చాటడానికి ఇక్కడికి వచ్చాను దేవరా!" అని కాకి ససంభ్రమంగా పలికింది.

"కాకులు నశిస్తున్నాయి... నశిస్తున్నాయి. మనిషి వాటిని చంపేస్తున్నాడు. దారుణమైన పన్నులభారం వాటిని కుంగదీస్తున్నది. ఏంట్రింతలు బతకనీయడం లేదు. అవి చచ్చిపోతున్నాయి దేవరా! బతికున్నవాటికేమో తిండే లేదు."

"అలాగా? కాకిమూక కష్టాలన్నింటికి కారణం సోమరితనం కాదా?"

"మేం సోమరులం కామన్న సంగతి తమకు తెలియనిది కాదు. పొద్దుటినుంచి సాయంత్రం వరకు తిండికోసం మేం అడవంతా గాలిస్తాం. నిజాయితీగల కాకుల్లా కష్టించి బ్రతుకుతున్నాం. కాని ఇప్పుడు నిజాయితీగా బతకడం దుస్సాధ్యమై పోయింది!"

దేగ తన మనసులోని మాటను చెప్పడానికి సంకోచిస్తున్న దానిలాగ కొంచెంసేపు ఊరుకొని కొసకు అంది.

"మీ తెలివిని ఉపయోగించండి!" కానీ ఈ సలహా ముసిలికాకికి తృప్తి కలిగించలేదు. దేగను ఇంకా ఊదరపెట్టడానికి దిగింది.

"ఈ రోజుల్లో అంతా తెలివినుపయోగించే బతుకుతున్నారని నాకు బాగా తెలుసును. కాని మా మూక చాలా అమాయకమైనది. ఇతరులు లక్షలకు లక్షలు కాజేసికూడా హాయిగా వుంటున్నారు. కాని కాకి ఒక పైసను దొంగిలించిందా దానికి చావు మూడుతుంది. ఒక్క పైస కోసం మరణం! ఇది చాలా దారుణంగాలేదూ? తెలివి తేటలు ఉపయోగించండని తమరు సలహాయిస్తారు. తమరు మా ఏలికలు. మమ్మల్ని అన్యాయాల నుంచి రక్షించడానికి తమరిని పంపారు. అయినా మమల్ని పీడించడంలో తమరిని మించినవారు లేరు. తమరు మమ్మల్ని సర్వనాశనం చేస్తున్నారు. ఇలా ఎంతకాలం బాధపడతామనుకొంటున్నారు? మేం కానీ. . ."

ఆ పైమాట అంటే ఏం ప్రమాదం వస్తుందో అన్న భయంతో మాట సగంలోనే తుంచింది ముసిలికాకి. సత్యాన్ని చాటడమంటే సామాన్య విషయం కాదుమరి!

కాని దేగమాత్రం ఇంతకుముందే చెప్పినట్లుగా ఉదయం సుష్టుగా ఆరగించింది. అందుకని పిలవని పేరంటంగా వచ్చిన ఈ పెద్దమనిషిని మందహాసంతో తిలకించింది.

"ఆపైమాట నాకు తెలుసును.. నీవు పూర్తిచేయవలసిన అవసరం లేదు" అంది.

"మేం ఇదంతా ఇంతకుముందే విన్నాం. ఇంకానయం బ్రతికున్నాం..కాని ఒక విషయం జ్ఞాపకముంచుకో. నీవిక్కడికి సత్యాన్ని చాటడానికి వచ్చావు. కాని తొలి అడుగులోనే తూలి పడ్డావు ... సరే నీవు చెప్పదలచుకొన్నదంతా చెప్పావా?"

"ప్రస్తుతానికంతా చెప్పినట్లే" అని కాకి భయం భయంగానే అంది.

"మంచిది. ఇంక ఇప్పుడు నావంతు. నీవు చెప్పిన ఈ సత్యం చిరకాలంగా అందరికీ తెలుసును. మీ కాకులొక్కరికే కాదు ఏంట్రింతలకు, వేటపులుగులకు, దేగలకు అందరికీ

తెలుసును. అయితే అది ప్రస్తుత దశలో మనకు పనికిరాదు అంతే. నీవు కొప్పెక్కి ఎంత గట్టిగా అరిచినా ప్రయోజనం ఏమీవుండదు. సమయం వచ్చినప్పుడు ఆ సత్యం దానంతట అదే వెల్లడి అవుతుంది. కాగా ఆ సమయం ఎప్పుడు వస్తుందో ఎవరికి తెలియదు. అర్థమయిందా?"

"నాకు తెలిసిందల్లా కాకి మూక బతుకు ఇంతటితో సరి" అని ముసిలికాకి నిష్ఠూరంగా అంది.

"నీకింకా అర్థం కాలేదన్నమాట. అయితే ఇంకా చెపుతాను విను. మనిషి మిమ్మల్ని నాశనం చేస్తున్నాడన్నావు కాని పక్షులమైన మనం మనిషినెలా ఎదిరించగలం? మనిషి తుపాకి మందు కనిపెట్టాడు. మనం దాన్ని ఎదిరించగలమా అని అడుగుతున్నాను. మనలను కాల్చి చంపడంకోసం మనిషి తుపాకిమందు కనిపెట్టాడు. తన చిత్తం వచ్చినట్లు చేసుకొంటాడు. మనం రైతుల్లాంటివారం. రైతు మీదకూడా అన్నివైపులనుంచీ అగ్గిపిడుగులు కురుస్తాయి. రైల్వేలో, కొత్త యంత్రమో, కరువో, కొత్త పన్నో ఏదో ఒకటి. అన్నింటికీ గురి అతడే. రైతు అటు ఒరుగుతాడు ఇటు ఒరుగుతాడు. వాగుడు కాయగాడు ఒకరోడ్డును ఎలా గుత్తగొన్నాడో ఎవరికీ తెలియదు. తర్వాత తెలుస్తుంది రైతుకు తన బొడ్డులో ఒక రూపాయి తగ్గిందని. ఆ చదువు రాని మనిషి దానినుంచి ఏం గ్రహిస్తాడు? ఏమీలేదు. చాలా తేలిక. వాగుడుకాయగాడు తుపాకి మందు కనపెట్టాడు. రైతుకు మాత్రం ఎర్రలాగ మట్టిపిసుక్కొనడం మాత్రమే తెలుసును. నీవు ఎర్రవైనప్పుడు ఎర్రలాగే బ్రతుకు. మీ కాకులుకూడా ఎర్రను కనికరించవు. మీ అత్యాచారాలను గురించి అది ఎలుగెత్తితే మొట్టమొదట ఆశ్చర్యపోయేది మీరే! మన్నులో తిరిగే పురుగు మాటనుకూడా వినిపించుకోవాలట! అంటారు. తాతా ఇలా వున్నాయి వ్యవహారాలు. బలంగలవాడిదే రాజ్యం. ఇప్పుడైనా అర్థమయిందా?"

"అయితే మేం ఊరికినే నాశనమై పోవాలన్నమాట? ఎంత కటువైన మాటలు సెలవిచ్చారు!" అంది కాకి రుద్ధకంఠంతో.

"కటువో గిటువో.. అసలు విషయమేమిటంటే నేను నిజం నీ ముందు దాచలేదు. అయితే అది నీవు కోరిన సత్యం కాదు. ఈ రోజుల్లో అంతా గుర్తుంచుకొనవలసిన సత్యం. సరే మన ప్రసంగాన్ని కొనసాగిద్దాం. ఏంట్రింతలు దారి కాచి మీ తిండిని దోచుకొంటున్నాయంటున్నావు. మేం నిన్ను కాపాడ్డానికి బదులు మీ గూళ్ళను కొల్లగొడుతున్నామంటున్నావు. మేం నిన్ను నాశనం చేస్తున్నాం. సరే నీవు తినాలనుకొంటున్నావా లేదా? అలాగే మేమూ. నీకెక్కువ బలంవుంటే నీవే మమ్మల్ని తినేదానివి. కాని నీకన్న మేం బలవంతులం కనుక మేం నిన్ను తింటున్నాం. అదికూడా సత్యమే. అవునా? నీవు నీ సత్యాన్ని నాకు చాటావు. నేను నా సత్యాన్ని నీకు చాటాను.

ఉన్న భేదమల్లా ఒకటే. అది.. నా సత్యం ఇక్కడ ఈ భూమిమీద వుంది. నీ సత్యం అక్కడ ఆ మబ్బుల్లో వుంది. అర్థమవుతోందా?

"అంటే చావన్నమాట. మేం చచ్చి తీరాలి" అని ముసిలికాకి డేగ మాటలను అర్థం చేసుకొనలేకపోయినా వాపోయింది. కాగా డేగమాటలు ఇంకా క్రౌర్యాన్ని సూచిస్తున్నాయన్నమాట మాత్రం దాని మనసుకు తట్టింది.

డేగ కాకిని నఖశిఖ పర్యంతం పరిశీలనగా చూసింది. కడుపు నిండి వుందేమో కాస్త పరిహాసం చేద్దామనుకొంది.

"నిన్నిప్పుడు చీల్చుకొని తినడానికి మనస్కరించడం లేదు" అంది. ఆ మాట వినేసరికి కాకికి వణుకు పట్టుకొంది. అదిచూచి "అదుగో చూశావా! నేను నిజంగానే... నీవు వుట్టి ఎముకల గూడువి. ఏదీ ఒక్క క్షణం ఆ కోటు విప్పు చూద్దాం" అంది డేగ.

కాకి రెక్కలు చాపింది. తన ఆకారానికి తానే ఆశ్చర్యపోయింది. ఎముకలు చర్మం తప్ప ఏమీలేదు. కండల్లేవు. ఈకల్లేవు. ఆకలిగొన్న తోడేలుకూడా ఇలాంటి పక్షిని మూచూడదు.

"చూడు బూచిలాగ వున్నావు. నీవు సత్యాన్ని గురించి ఆలోచిస్తూ వుండడమే దీనికి కారణం. అసలు నీవు ఆలోచన అనేది లేకుండా కాకిలాగ బతికివుంటే ఇలా వుండే దానివికావు. కాని చూశావా...సరే. కాకులు పన్నులెక్కువ కడుతున్నాయని నీ ఫిర్యాదు. అది అక్షరాలా నిజం. కానీ మరి పన్నులు కట్టేవారింకెవరు? ఆలోచించు. పిచికా, పికిలిపిట్టా, కత్తెరపిట్టా, పైడిపిట్టా? అవేమి ఇవ్వగలవు? కౌజు, కాటుక పిట్ట, వల్లంకి పిట్ట, పూరిపిట్ట ఇవన్నీ తమ బతుకు తాము బతుకుతున్నాయి. సామెత చెప్పినట్లు వీటిని పగటి దివిటీతో కూడా పట్టలేం. ఒక కాకులు మాత్రమే రైతుల్లాగ మూకగా బతుకుతున్నాయి. పైగా నిరంతరం తమ ఉనికిని చాటుతూ వుంటాయి. అలాంటప్పుడు అవి జనాభా లెక్కల్లోకి ఎక్కడంలో వింతేముంది? ఒకసారి జనాభా లెక్కల్లోకి ఎక్కితే ఇంక ఆ దృష్టితో ఉండక తప్పదు. ఇటీవల పన్నులెక్కువయ్యాయంటే దానికి కారణం అవసరాలు కూడా ఎక్కువ కావడమే. అవసరం ఎంత ఎక్కువైతే పన్నుల బరువు అంత ఎక్కువౌతుంది. విషయాలలా వున్నాయి తాతా. నీవు సత్యం చెప్పావు. నేను సత్యం చెప్పాను. ఇందులో ఎవరి సత్యం గొప్పదో మీ కాకులకు బాగా తెలుసును. సరే ఇంక వెళ్ళిరా. నేను నిద్రపోవాలి."

అయితే ముసిలికాకి ఇంటికి వెళ్ళడానికి బదులు వేటపులుగు దగ్గరకు బయలుదేరింది.

"ఏమైనా సరే దీని అంతు చూస్తాను. వేటపులుగు నా సత్యాన్ని ఒప్పుకొనకపోతే గవర్నరు గద్ద దగ్గరకు వెళ్ళుతాను. అంతేకాని న్యాయాన్వేషణను మాత్రం విడిచిపెట్టను"

అని రెక్కలను బరువుగా ఈడుస్తూ తలపోసింది కాకి.

ఒక లోయలోని కొండగుహలో వుంటోంది వేటపులుగు. దాని గుహకు వెళ్ళడం చాలాకష్టం. గుమ్మంముందు ఒక ఏంట్రింత ఎప్పుడూ కావలి వుంటుంది. ఇప్పుడు కావలి వున్న ఏంట్రింత పేరు పుల్లయ్య. పుల్లయ్య అంటే వేటపులుగుకు చాలా అభిమానమన్న సంగతి కాకిమూక కంతకీ తెలుసును. (పుల్లయ్య వేటపులుగుకే పుట్టాడని కూడా పుకార్లున్నాయి).

అతి ప్రధానమైన రహస్య రాచకార్యాలను పుల్లయ్యకు అప్పగిస్తారు. మహావెర్రిగా వుంటాడని వాడికి పేరుంది. చూపులకు మంచివాడిలాగే కనిపిస్తాడు. మర్యాదా మన్ననా కూడా వున్నాయి. కలుపుగోలుగా మాట్లాడుతాడు. ఎకసెక్కాలకు వెనుకాడడు. మబ్బులనంటే పరుగు పందేలూ, ఆడపిల్లలతో దాగుడుమూతలు అంటే వాడికి చాలా సరదా. అప్పుడప్పుడు స్నేహితులకు ఉపకారాలుకూడా చేశాడు. అయితే ఈ పనులన్నీ ఉద్యోగధర్మంలో లేనప్పుడు మాత్రమే. ఉద్యోగధర్మంలో వున్నప్పుడు (ముఖ్యంగా రహస్య రాచకార్యాలమీద వున్నప్పుడు) వాడు పూర్తిగా మారిపోతాడు. తొణకడు. బెణకడు. క్రౌర్యంలో అందెవేసినచేయి. ఎవరినైనా అరెస్టుచేయాలని ఉత్తరువిస్తే అరెస్టు చేస్తాడు. పీక నులమమంటే పీక నులుముతాడు. తనకన్న రెట్టింపువున్న పిట్ట అయినా సరే కోపంతో మీది కెగిరితే చాలును ఆ పిట్ట అరుచుకొంటూ పారిపోతుంది. దాని ధాటి నెరిగిన పిట్టలన్నీ ఆ పేరువింటే చాలును వజవజ వణికిపోతాయి.

ముసిలి కాకి అక్కడికి రాగానే పుల్లయ్య "ఇంకా కలలు కంటున్నావా ముసిలీ!" అని పలకరించాడు. సంగతంతా ఇక్కడిదాకా తెలిసిపోయిందన్న విషయాన్ని ముసిలికాకి గ్రహించింది. పిట్టలలో కూడా వేగులున్నాయి. చేసే పనులే కాకుండా జనం కడుపులో ఏముందో కూడా వాటికి తెలిసిపోతాయి.

"ఆ... ముసిలివాళ్ళకు కలలేంవుంటాయి?" అంది ముసిలికాకి మాటను దాటేస్తూ.

"సత్యాన్ని చాటుదామని వచ్చావు అవునా? సరే అది నీ స్వంత వ్యవహారం. నీవు వచ్చినట్లు చెప్పాలా?"

"నీకు దయపుడితే"

పుల్లయ్య గుహలో దూరాడు. ఒక గంటవరకూ అక్కడే వుండిపోయాడు. బైట ముసిలికాకి వణుకుతూ కాచుకొని కూర్చుంది. ఏలాగైతేనేం పుల్లయ్య బైటికి వచ్చాడు.

నీ వాగుడు వినడానికి తగ్గ తీరిక దొరగారికి లేదని చెప్పవలసిందిగా సెలవైంది. నీవు చెప్పదలుచుకొన్న సత్యం తరతరాలుగా అందరికీ తెలుసును. అదింతవరకూ వెలువడ్డం లేదంటే దానిలో ఏదో ఒక లోపం వుండి వుండాలి. నీవు ఆందోళన కారుడివి. జనంతో నిరర్థకంగా ప్రమాదకరమైన సంగతులు మాట్లాడుతున్నావు. నీవు చేసిన

పనులకుగాను నిన్ను ఏనాడో కబళించి వుండవలసింది కానీ నీవు చాలా బక్కచిక్కి వున్నావు. ఇప్పుడిక గవర్నరుగారి వద్దకూ వెళతావనుకొంటాను. అవునా?" అని ఒక ప్రకటన చేశాడు పుల్లయ్య.

"లేదు...లేదు. వెళ్లి ఏం లాభం?" అని గొణిగింది ముసిలికాకి.. విషయాన్ని తప్పించుదామనే ఉద్దేశ్యంతో.

"ఇదిగో నాదగ్గర నాటకాలాడకు. నీ గుండెల్ని చీల్చిచూడగలను నేను. సరే వెళ్ళు. నీ సత్యానికి మెచ్చినవారు నీ కళ్ళు రెండూ పొడిచేయకుండా మాత్రం చూసుకో. నేనే అయితేనా వెళ్ళేముందు ఒకటికి రెండుసార్లు ఆలోచించుకొని వుండేవాణ్ణి. నీకసలు దారికూడా తెలియదు. ఆ మబ్బులు చూశావా వాటికావలవుంది."

ఏంట్రింత జోస్యం చెప్పినప్పటికీ వ్యవహారాన్ని అంతు తేల్చుకోవాలని నిశ్చయించింది కాకి. చుట్టుతిరిగి చాలా దూరం ప్రయాణం చేయాలి. రాత్రిళ్ళు ఖాళీ బొరియల్లో తలదాచుకొంది. అప్పుడప్పుడు కొండల్లో ఏదో కాయా కసరూ కనిపిస్తే కడుపు నింపుకొంది. కొసకు ఒక మబ్బులో దూరింది. అక్కడి దృశ్యం అద్భుతం.

మంచుకప్పిన కొండశిఖరాలు లేయెండలో మిలమిల మెరుస్తున్నాయి. దూరాన్నుంచి చూస్తే అదేదో దేవతల నగరులా కనిపిస్తుంది. ఆ నగరు మొదట మబ్బులు ముసురుకొన్నాయి. పైన నీలాకాశం.

నానారకాల పక్షులు పరివేష్టించగా ఒక రాతి కొమ్మున కొలువుదీరింది గద్ద సలహాదారు. పాదాల ముందు చిలకలు, చదువుకొన్న ఏంట్రింతలు, పైడిపిట్టలు, మొదలైన నానారకాల కార్యదర్శి పిట్టలూ కూర్చున్నాయి.

వెనుక బెగ్గురు పిట్టలు నిలబడి ఉదయం పత్రికలను చదివి వినిపిస్తున్నాయి. పక్కన మరొక శిఖరంమీద గూబలు, గబ్బిలాలు కునుకుపాట్లు పడుతున్నాయి. చూసేవారికది రాష్ట్ర శాసనసభలాగ కనిపిస్తున్నది. కాకులు చెవిసందున ఈక కలాలు దోపుకొని మహా హడావుడిగా తిరుగుతున్నాయి. ఉత్తరాలు, ఆదేశాలు, ఉత్తర్వులు, శ్రీముఖాలు రాస్తున్నాయి. "కాకాకా.. తాజాతాజా మొత్తం ఐదుపైసలు!" అని వేలంపాటలు పాడుతున్నాయి.

గద్ద శతవృద్ధు. వయసు పెరగడంతో శక్తి ఉడిగింది. ఇప్పుడది గట్టిగా ముక్కును కూడా గీరలేదు. కాకి దాని పాదాలముందు వాలే సమయానికి అప్పుడే గద్ద భోజనం ముగించింది. కళ్ళు మూసుకొని మగతగా కూర్చుంది. చుట్టుపక్కల రొదకు చెవులు దిమ్మెక్కి పోతూవున్నా గద్దమాత్రం విలాసంగా తలతాటిస్తూవుంది.

ఏమైతేనేం అర్జీదారు రాకతో పక్షులలో కలకలం పుట్టింది. దానితో ముసిలిగద్ద కాస్త కన్ను విప్పింది.

"ఏదో విజ్ఞాపన గొని వచ్చావా సాధుపక్షీ!" అని ప్రశ్నించింది కాకిని గద్ద.

"నేను చాలా దూరంనుంచి వచ్చాను దేవరా" అని ఉత్సాహం పుంజుకొని మొదలుపెట్టింది కాకి. "తమకు సత్యాన్ని చాటుదామని" అనబోతున్నంతలో వేటపులుగు అడ్డుతగిలింది.

"పదాడంబరాలు పనికిరావు. నీ వ్యవహారం ఏమిటో చిలవలు పలవలు లేకుండా సూటిగా, స్పష్టంగా, క్లుప్తంగా చెప్పు. నీకేం కావాలి?" అంది వేటపులుగు.

కాకి తన విజ్ఞాపనలోని ఒక్కొక్క అంశాన్నీ వివరించింది. మనిషి కాకిమూకను నాశనం చేస్తున్నాడు. ఏంట్రింతలు, డేగలు, వేటపులుగులు అన్నీ కాకులను బాధిస్తున్నాయి. దారుణమైన పన్నులభారం కుంగదీస్తోంది... కాకి ఇలా ఒక్కొక్క అంశాన్నీ పేర్కొన్నప్పుడల్లా గద్ద ముక్కు తెరిచి "నిజం నిజం సాధుపక్షీ!" అంటూ వచ్చింది.

దీనితో ముసిలికాకి ఉత్సాహం మిన్ను ముట్టింది. "ఏలాగైతేనేం చిన్ననాటినుంచీ కలలుకన్న సత్యాన్ని ఈనాటికి చూడగలుగుతా"ననుకొంది. ప్రసంగం సాగినకొలదీ ప్రోత్సాహం ఎక్కువ వచ్చింది. చెప్పవలసిందంతా చెప్పిన మీదట ఊరుకొంది.

"చెప్పవలసినదంతా చెప్పావా?" అని గద్ద అడిగింది.

"అంతా"

"నీవు డేగ దగ్గరకూ వేటపులుగు దగ్గరకూ కూడా వెళ్ళి విన్నపం చేశావా?"

"చేశాను"

డేగతోనూ, వేటపులుగుతోనూ తాను జరిపిన సంభాషణను కాకి గద్దకు క్లుప్తంగా తెలియపరిచింది.

"సరే నీ సత్యాన్ని గురించి నేను చెప్పదలుచుకొన్నదిది. రెండువందల ఏళ్ళకు పైగా నేనిక్కడే ఈ కొండ కొమ్మున కూర్చుంటున్నాను. కనీసం కడకంటనైనా సూర్యుణ్ణి చూస్తున్నాను. కాని ఈనాటికి కూడా సత్యాన్ని సూటిగా చూడలేక పోతున్నాను."

"ఎందుచేత?" అని అడిగింది కాకి.

"ఎందుకంటే పక్షి సత్యాన్ని అనుష్టించజాలదు. దానికా శక్తిలేదు. ఎవరైనా సత్యాన్ని గ్రహించామని భావిస్తే దాన్ని అనుష్టించాలి. పక్షులమైన మనం దాన్ని అనుష్టించలేము. అందుకనే మనం సత్యంవైపు ఒకచూపు విసరగలమే కాని దాన్ని సూటిగా చూడలేము. మనం దాని వైపు చూద్దాం. కాని అది మాత్రం మనలనంటకుండా పోవాలనేది మన అభిమతం."

గద్ద కొంచెంసేపు అలాగే ఆలోచిస్తూ కూర్చుంది. ఆ తర్వాత తిరిగి మొదలుపెట్టింది.

"డేగ నీతో నిష్ఠూరంగా మాట్లాడింది. కాని ఆ మాట్లాడినదంతా నిజం. సత్యం మంచిదే. కాని అన్నివేళలా అన్ని స్థలాలలోనూ దాన్ని వినడం మంచిదికాదు.

కొంతమందిలో దానివల్ల ఆశ జనించవచ్చును. ఇతరులకు అది దూషణలాగ అనిపించవచ్చును. సత్యాన్ని ప్రచారం చేయాలనుకొనేవారు కొందరున్నారు. కాని ఉట్టి చేతులతో సత్యాన్ని ఎలా అందుకోగలరు? సత్యం అంటే కాకి కాదు తోకపట్టుకొనడానికి. నీ చుట్టూచూడు. అంతా దు:ఖం. అంతా ద్వేషం. తాను ఎటుపోతున్నాడో ఎందుకు పోతున్నాడో ఎవడూ చెప్పజాలడు. అందుకనే ప్రతివారూ తమ స్వంత సత్యాన్ని గురించి మాట్లాడుతారు. కాని ప్రతిజీవికీ సముచితమైన సీమలు స్పష్టంగా కనిపించగల ఒకానొక కాలం వస్తుంది. ఆ సీమల మధ్యనే జీవితం గడపవలసిన రోజు వస్తుంది. ఆ రోజున ఈ దు:ఖాలు వుండవు. అప్పుడే వ్యక్తిగత సత్యాలనే పొగమంచులు కూడా ఎగిరిపోతాయి. సర్వతోముఖమైన సత్యం సర్వత్రా ప్రచలితమవుతుంది. ఆ రోజు వస్తుంది. అప్పుడు ప్రపంచం దాని వెలుగులో ధగద్ధగాయమానంగా వుంటుంది. మనమంతా ప్రేమ, సామరస్యాలతో జీవిస్తాం. అదీ విషయం మహానుభావా! సరే ఈ లోగా చల్లగా బ్రతుకు. ఇంటికి వెళ్ళి మీ కాకి మూకతో చెప్పు వారి మీదే నా నమ్మకం అంతా వుంచానని."



పితూరీరావు దుర్గతి



ఒకరోజు ఉదయమే లేచేసరికి పితూరీరావుకు తాను 'లేనన్న భావం' కలిగింది. నిన్నటిదాకా తానున్నట్లు తెలుసును. నిన్నటి 'భావం' ఏదో మాయమంత్రంవల్ల నేడు 'అభావంగా' మారిపోయింది. కాని ఈ 'అభావం' మాత్రం ప్రత్యేక లక్షణంగలది. పితూరీరావు తన ఒళ్ళంతా తడువుకొని చూసుకొన్నాడు. గట్టిగా నాలుగు మాటలు కూడా మాట్లాడాడు. కొసకు అద్దంలో చూసుకొన్నాడు. తాను 'ఉన్నాడు'. చెక్కు చెదరకుండా జనాభా లెక్కలలో మనిషిలాగ నిన్న ఏ స్థితిలో వున్నాడో నేడు కూడా అచ్చం అలాగే వున్నాడు.

అంతేకాదు. అతను ఆలోచించడానికి ప్రయత్నించాడు. మామూలుగానే ఆలోచించగలడని తేలింది. అయినా అతడు 'లేడ'న్న విషయంలో మాత్రం అనుమానం లేదు. వెనకనుంచి తలుపు ధబీమని మూసుకొని పోయినట్లు, ముందున్న దారికి అడ్డుపడినట్లు, ఎక్కడికీ వెళ్లడానికి సందులేదు. అవసరంకూడా... చాలసేపు ఆస్తి నాస్తి విచికిత్స చేశాడు. తన పరిసరాలను ఎక్కువ ఆసక్తితో పరికించాడు. అలా పరికిస్తూ వుండగా ఇటీవలనే తాను ప్రారంభించిన రచన మీద దృష్టి పడింది. ఆ గ్రంథం బల్లమీద పడుంది. హఠాత్తుగా అతని స్వరమూ మెరుపు దెబ్బతిన్నట్లు వణికింది...

నిరర్థకం! నిరర్థకం! నిరర్థకం!

"ఏమిటీ పిచ్చి!" అనుకొన్నాడు మొదట. కలం అందుకొన్నాడు. కానీ పనిలో పడదామనుకొంటూ వుండగా ఒక గీత గీయాలనీ ఆ గీత కింద "నిరర్థకం!" అన్న మాటను వ్రాయాలనీ బుద్ధిపుట్టింది.

అవును అంతా మునపటి వలెనే వుంది. పోతే అతని ఆత్మమాత్రం మూతపడింది. ఇటుపైన అతను జనాభా లెక్కల్లో వున్నమనిషి చేయదగ్గ పనులన్నీ స్వేచ్ఛగా చేయవచ్చును. బహుశా ఆలోచనకూడా చేయవచ్చును. అయితే అంతా నిరర్థకం. అతని జీవితానికి అర్థాన్ని ఆకారాన్ని కల్పించిన ఆలంబనం పోయింది. తనలో కణకణరగిలే అగ్నితో ఇతర హృదయాలను వెలిగించడానికి వీలిచ్చిన ఆ జాజ్వల్యశక్తి పోయింది.

అతనికి నోటమాట పెగలలేదు. అన్వేషించాడు కాని కానలేదు. గవేషించాడు కాని దొరకలేదు. ఏదో అనంతమైన వేదన అతని ఉత్సాహాన్ని కబళించింది... గాలిలో హేళన గుసగుసలాడింది. "వారు నిన్ను కనిపెట్టారు! వారు నిన్ను పసికట్టారు! వారు నిన్ను పట్టుకొన్నారు!"

"ఏమిటి సంగతి? ఏం జరిగింది?" ఏమీలేదు. అతని ఆత్మ మూతపడింది అంతే.

నియమ నిష్టలు గల అందరిలాగే పితూరిరావులో కూడా ఒక గర్భగుడి వుంది. అతని ఆత్మవిధానం అందులో వుంటుంది. తన విధానాన్ని అతనెన్నడూ దాచలేదు. అది తన ఒక్కనిదేనని ఎన్నడూ భావించలేదు. దాన్ని ఉదారంగా అందరికీ పంచిపెట్టాడు. మానవ జీవిత పరమార్థమంతా అందులోనే వుందని భావించాడు. ఈ చేతన శక్తిలేనివాడు, తనతోటి వారిపై వెలుగునూ మంచినీ ప్రసరింపచేయడానికీ ఇతరులనుంచి వెలుగునూ మంచినీ గ్రహించడానికి ప్రోద్భలమైన ఈ శక్తిని లేనినాడు సమాజం శ్మశానమవుతుంది. దాన్నప్పుడు సమాజం అనడానికి వీలులేదు. అది శవాలపోగు... ఇప్పుడతనిలో ఆ శవదశ మొదలైంది. మంచితనాన్ని వెలుగును ఇచ్చి పుచ్చుకొనడం ముగిసింది. పితూరీరావు ఇప్పుడొక శవం. ఇటీవల తన కార్యకలాపాలన్నింటికీ జీవంపోసే అమృతపు సోనలని ఎవరిని భావించాడో వారంతా కూడా శవాలే... ఇంత దారుణ ఉపద్రవం సంభవిస్తుందని అతను కలనైనా ఊహించలేదు.

పితూరీరావు నిజమైన బడుగునాటి పండితుడు. అతనికి తన పాఠకుల మీద అభిమానం లేదు. వారికి తనతో సంబంధం వుందని తప్పితే వేరు ఆనందం లేదు. పితూరీరావు పాఠకునికి ఒక ప్రత్యేకరూపం ఎన్నడూలేదు. అయినా ఎల్లప్పుడూ పితూరీరావుముందే వుండేవాడు. ఈ అవ్యక్త వ్యక్తిని ఆరాధించడంలోగల ఆసక్తి అసాధారణం. అదొక జబ్బు కూడా. ఏళ్ళతరబడి ఈ ఆసక్తే అతను నిలవడానికి ఆస్కారమైంది. కాలం గడిచిన కొలదీ అదిలేకుండా వుండలేని పరిస్థితి ఏర్పడింది.

ఆఖరికి వయసు వాటారింది. జీవితంలో అన్నింటికన్నా గొప్పదీ, ముఖ్యమైనదీ ఆ ఒక్క మెరుగుతప్ప మిగిలినవన్నీ మూలపడ్డాయి. వాటి అవసరం పోయింది.

హఠాత్తుగా ఈ క్షణాన ఆ తుదిమెరుగుకూడా ఎగిరిపోయింది. కళ్ళముందు అంధకార అగాధ పాతాళబిలం ఏర్పడి జీవితాన్ని సార్థకం చేసిన ఆ పదార్థాన్ని కబళించింది.

బుద్ధి ఒకవైపున మాత్రమే ప్రసరించే వ్యక్తులు సాహిత్య ప్రపంచంలో అప్పుడప్పుడు కనిపిస్తూ ఉంటారు. బుద్ధి ఒకవైపునే ఒరగడం అనే ఈ లక్షణం వారికి చిన్నతనంలోనే అలవడుతుంది. వారు పయనించడానికి నిర్ణీతమైన పథం నుంచి పక్కపుంతలకు ఎంతలా మళ్ళినా ఆ మళ్ళుడు ప్రధానమైనదిగానూ వుండదు. దానికి స్థిరత్వమూ వుండదు. మేట్లుమేట్లుగా మేటవేసిన చెత్తకిందినుంచి వారి అసలు ఆలోచన సంతత ప్రవాహంగా సాగుతూనే వుంటుంది. జీవితంలోని వైవిధ్యమంతా అవాస్తవంగా గోచరిస్తుంది. వారి జీవితంలోని వైవిధ్యమంతా అవాస్తవంగా గోచరిస్తుంది. వారి అభిరుచి అంతా ఒకే ఉజ్వల బిందువుపైన కేంద్రీకృతమవుతుంది. జీవితంలో ఎదురయే మార్పులను ద్వంద్వాలను వారు లక్ష్యంచేయరు. ఎన్నడూ ముందుకు చూడరు. వెనుక నుంచి రక్షణ ఏర్పాటు చేసుకోవాలని యోచించరు. పరిసరాలను పర్యాలోకించరు. గతంనుంచి అనుభవాన్ని నేర్చుకోరు. అంతమాత్రాన వర్తమాన పరిస్థితుల అర్థం వారికి తెలియదని కాదు. ఆ పరిస్థితుల మీదే తాము ఆధారపడాలన్న విషయం ఎరగనిదికాదు. ఎంత దూరదృష్టి, ఎంత విజ్ఞానం వున్నా కూడా అది వారి నడవడిలో అణుమాత్రమూ మార్పు తేజాలదు. ఆ నడవడి అంతమవడం అంటే వారి అస్తిత్వమే అంతటితో అంతమవడమన్నమాట. ఆ నడవడిని అంతం చేయాలంటే ఆ మనిషినే అంతం చేయవలసి వుంటుంది.

అయితే ఇప్పుడు ఈ విచిత్ర ముహూర్తంలో అలాంటి హత్య నిజంగా జరగడం సాధ్యమేనా? ఈ ప్రశ్నకు జవాబు కోసం అతను వ్యర్థాలోచన చేశాడు. అతనికి తెలిసినది ఒకే ఒక విషయం. అది 'ఆవులించిన శూన్యం' తనను ఆవరించింది.

పితూరీరావు తన దేశాన్ని మనసారా ఆరాధించాడు. తన దేశ గతాన్ని గురించీ, వర్తమానాన్ని గురించీ అతనికి క్షుణ్ణంగా తెలుసును. అనంతవేదనకు ఆలవాలమైన అదే అతని జీవితానికి ప్రధానాంశమయింది. అతని పనులన్నింటికీ ప్రోద్బలమదే. తన వేదనను పోగొట్టుకోవడానికి అతను ప్రయత్నించలేదు. పైగా అది తన హృదయంలో శాశ్వతంగా వుండడానికి అన్నివిధాల పాటుపడ్డాడు. ఈ వేదనా అది నిరంతరం ఉన్నదనే జ్ఞానమూ అతని ఊహా చిత్రాలకు ప్రాణం పోశాయి. ఆ చిత్రాలద్వారా అతను ఈ వేదనను ఇతరుల కందించేవాడు.

బడుగునాడు చాంచల్యానికి, అస్థిరతకూ చాలాకాలంగా పేరు మోసిందని అతనికి

తెలుసును. అక్కడ ప్రకృతి ఒక్క అపనమ్మకాన్ని మాత్రమే మెచ్చుకొంటున్నట్లు అనిపిస్తుంది. అక్కడి మహానదులు ప్రతి ఏటా ఇసుకమేటలడ్డుకొనగా తమ పథాన్ని మార్చుకొంటూ వుంటాయి. వాతావరణం తృటిలో మారిపోయి అందరినీ చకితుల్ని చేస్తుంది. ఈ వేళ ఉక్కపోసి శరీరంమీద బట్టలు దుర్భరమవుతాయి. రేపు ఆ బట్టలే మంచుకు బిగిసి కొయ్యముక్కల్లా అవుతాయి. వేసవి కొద్దికాలమే వుంటుంది. చెట్లు చేమలు తక్కువ. కన్ను పారినంతమేరా చిత్తడి నేల. ఒక్కమాటలో చెప్పాలంటే అక్కడి ప్రకృతి విపరీత వైకల్యానికీ నమ్మకద్రోహానికీ పెట్టిందిపేరు. అందుకని ముందే దేన్ని గురించి అయినా ఏర్పాటుచేసుకొనడం అనేది పొసగనే పొసగదు.

బడుగునాటి మనిషి బ్రతుకు అంతకన్నా ప్రమాదభరితం.

“జోలె, జైలు తప్పేదిలేదు” అని గొణుగుతాడు పొలంబానిస.

“మా లాభాల లెక్కలు గొర్రుతో నీటిమీద రాసి వున్నాయి” అంటాడు రైతు. “నిన్నటికి నా చెవులు నుదురు కన్న ఎత్తుగా వుండేవి. కాని ఈ వేళ అవి బొత్తిగా కనిపించడమే లేదు!” అని వ్యాఖ్యానిస్తాడు భూస్వామి. మనిషి అదృష్టమనే లోయపైన అల్లల్లాడుతున్నట్లు అనిపిస్తుంది. దేవుడు రక్షించాడా మహారాజులా వుంటాడు. లేదా మరిపికరుండదు.

చుట్టూ ఎటుచూసినా దగా మోసం ముసురుకొన్నప్పుడు నిజాయితీ ప్రసక్తి ఏమి వుంటుంది? నిజాయితీకి ఆధారం ఏది? ఆలంబన ఏది?

పితూరీరావు కిదంతా తెలుసును. కాని నేను ముందే చెప్పినట్లు ఈ జ్ఞానం అతని హృదయ వేదనను ఇంకా అధికం చేసింది. ఆతని కార్యకలాపాలకు కొత్త ప్రోద్బలాన్ని కలిగించింది. అతను తనదేశాన్ని గాఢంగా ప్రేమించాడని మరొకసారి చెపుతున్నాను. తన దేశ దారిద్ర్యాన్ని, నగ్నతను, దాని కష్టాలను ప్రేమించాడు. ఇప్పుడు తన దేశాన్ని కబళిస్తున్న ఈ శోకాన్ని బాపగల అద్భుతమేదో మున్ముందు జరగగలదని బహుశా దూరదృష్టితో అతను చూసివుండవచ్చును. మహాత్మ్యాలమీద అతనికి నమ్మకం. మాయ మంత్రాల దేశంలో అతను పెరిగాడు. తనకు తెలియకుండానే ఆ మంత్రాలకు వశుడైపోయాడు. బడుగునాటి జీవితాన్ని ఈ మంత్రశక్తే ఇటో అటో తేల్చగలదని అతని నమ్మకం. ఆ మంత్రశక్తి ఎటు పనిచేస్తుంది అన్నదే సమస్య. అదీకాక ఆ దేశానికి గతమంతా అంధకార బంధురంకాదు. అప్పుడప్పుడు చీకటి తెరలు కొద్దికొద్దిగా తొలగేవి. ఆ కొంచెంసేపూ బడుగునాటివారు కాస్త మెరుగనుకొనేవారు. ఎండ ఎంత మసకగా వున్నప్పటికీ అది తగిలేసరికి హాయిగా వుందనుకొంటున్నారు. వెలుగు మానవులందరికీ హర్షదాయకమని చెప్పడానికి ఇంతకన్న తార్కాణం ఇంకేమి కావాలి? కాంతి కోసం తహతహలాడే ఈ గుణాన్ని అన్ని విధాలా ప్రోత్సహించాలి. జీవితం ఆనందమయమనీ అంతేకాని చచ్చేవరకూ వెన్నాడే బాధల బ్రతుకు కాదనీ వారికి గుర్తుచేయాలి. మనిషి

నిగళాలను మృత్యువు ఛేదించడానికి వీల్లేదు. మనిషే ఛేదించాలి. కొత్త తనాన్ని సంతరించుకొన్న నిజమైన మనిషి. తరతరాలదాస్యం అతనిలో పేర్చిన క్రోధాన్ని నిర్జించిన మనిషి ఆ నిగళాలను ఛేదించాలి. మానవ నైజానికి గల అనంత నిర్వచనాలలో ఈ సత్యం స్పష్టంగా కనిపిస్తోంది. అందుకని అది కొసకు జయించి తీరుతుందన్న విషయాన్ని శంకించడం సాధ్యంకాదు. సత్యం జయిస్తుందని పితూరీరావు నమ్మాడు. ఆ విషయాన్ని ఇతరులకు చెప్పడమే పనిగా పెట్టుకొన్నాడు.

తనతోటివారి హృదయాలలో వెలుగు, సత్యం అనే భావాన్ని కలిగించడానికీ వెలుగు అనేది వస్తుంది, చీకటి దాన్ని ఆర్పజాలదు అన్న విశ్వాసం కలిగించడానికి అతను త్రికరణశుద్ధిగా పాటుపడ్డాడు. అదే అతని కార్యకలాపాల సారాంశం.

మంత్రమహిమ వ్యక్తమవడంలో జాప్యం కాలేదు. నిజమే. కాని అది అతను కలలుకన్న మంత్ర మహిమ కాదు. అది బడుగునాటివారి మామూలు కల్లగారడి.

నిరర్ధకం! నిరర్ధకం! నిరర్ధకం!

ఏం చేస్తే తనకీగతి పట్టింది అని పితూరీరావు ఎన్నడూ తనను తాను ప్రశ్నించుకోలేదు. అసలు నేరమేమీ చేయనప్పుడు ఇలాంటి ప్రశ్న వేయడం అసంగతమే కాకుండా అది ప్రశ్న వేసేవారి దుర్బలత్వానికి స్పష్టమైన తార్కాణమని కూడా అతనికి తెలుసును. కాలవశాన ఈ దుస్థితి కలిగిందన్న విషయాన్ని అతనెన్నడూ కాదనలేదు. కాగా అది అతి క్రూరంగా, అతి బాధాకరంగా వుందని మాత్రమే అనుకొన్నాడు. అతని సుదీర్ఘ సాహిత్య జీవితంలో అనేక పర్యాయాలు మంత్రముగ్ధుడు కావలసి వచ్చింది. కాని ఇంతవరకు ఆ మంత్రశక్తి కనీసం అతని ఆత్మను తాకకుండా విడిచిపెట్టింది. ఈసారి దాన్ని కూడా ఆక్రమించింది. మడతపెట్టి మూసివేసింది. మంత్ర మహిమను ఎరిగినవాడే అయినా ఈసారి పితూరీరావు భయపడ్డాడు. తాను పూర్తిగా ముద్దగా నలిగినట్లు, విరిగినట్లు అనిపించింది. ఇంతకుముందు తెలియని దుర్భర వేదనతో అల్లాడిపోయాడు.

ఆ బాధ మధ్యలో హఠాత్తుగా అతనికి తన "పాఠకుని" సంగతి గుర్తుకు వచ్చింది. ఇంతవరకూ పితూరీరావు తన శక్తులన్నింటినీ అనుకోకుండా పాఠకునికిచ్చివేశాడు. అందుకని అతనినుంచి ఏవైనా సానుభూతి సహాయాలు లభించగలవనే చిన్న ఆశ మొదటిసారిగా అతనిలో మొలకెత్తింది.

వెంటనే లేచి బయటికి పోవాలనిపించింది. అక్కడ బజారులో తనకు దీని భావం బోధపడగలదనిపించింది.

వీధి మామూలు బడుగునాటి వీధిలాగే వుంది. తన ముందు గుడ్డీ చెవుడూ మూగా మూర్తీభవించిన ఒక శూన్యం వున్నట్లు పితూరీరావుకి అనిపించింది. రాళ్ళు మాత్రమే

రోదిస్తున్నాయి. ఈ శూన్యంలో జనం ఏదో దోపిడీ చేయనున్నవారిలా దొంగచూపులు చూస్తూ ఇటూ అటూ హడావుడిగా నడుస్తున్నారు. కానవస్తున్న ప్రాణస్ఫులింగం అదొక్కటే. మిగిలినదంతా ఆశ్చర్యచకితమై మూగవోయినట్లు కనిపిస్తోంది. ఈ మూగవీధికి కూడా ఏదైనా తెలియక పోతుందా అని అతను మొదట అనుకొన్నాడు. అనుకొనడమేమిటి పాషాణాల ఆక్రోశాన్ని మనుషుల ఆక్రోశమేననుకొన్నాడు. అయినా అతను పూర్తిగా పొరబడ్డాడని చెప్పడానికి వీలులేదు. నిజానికి ఇక్కడా అక్కడా సన్నని రొద ఒకటి లేకపోలేదు. ఈ రొద మితవాదులది. వారు తనకు ఇటీవలనే స్నేహితులయ్యారు. అతను నాలుగంగలు వేసి అందులో కొందరిని కలుసుకొన్నాడు. మరికొందరు అతనివైపే వచ్చారు. కాని వారి ముఖంలో సానుభూతి మచ్చుకైనా కానరావడంలేదు. పైగా ధర్మచ్యుతి వారి నందరినీ అలముకొంది.

"సరే నేస్తం, మొత్తానికి వారు నిన్ను పూడ్చిపెట్టారు! అంతా చిటికలో తేల్చేశారు!" అని అందులో ఒకడన్నాడు. "అది పెద్ద దెబ్బే అనుకో! అయినా నీవు చేసినదేమిటి? నీకు తెలుసుగా... దానివల్ల లాభంలేదు... నేనెన్నడో చెప్పాను నీకు. వాళ్ళకు గిజాటు కలిగింది. కొసకు..."

"కొసకు ఏమిటి?"

"ఏమీలేదు 'కొసకు' అంతే. వాళ్ళకు విసుగెత్తింది. ఇది మాటలకు సమయంకాదు. ఇది చూడవలసిన సమయం. చూసి సాధ్యమైనప్పుడల్లా గ్రహిస్తూవుండాలి. అదనులోనే ఈ విషయాన్ని నీవు ఊహించి వుండవలసింది. దానితో నీవు ఏకీభవించలేకపోయినా కనీసం వ్యతిరేకించకుండా వుండవలసింది. నా మనసులో ఏం వుందో తెలుసుకో చూదాం! తెలుసుకోలేవు. ఎంచేత? ముక్కుకు సూటిగా చూస్తావు కనుక. అందుకనే వారికి విసుగెత్తింది. నన్ను చూడు. నాకు మాత్రం ఈ పరిస్థితులు సరిపడ్డాయంటావా? నిన్నటిదాకా నీవు నన్నెరగవు! సరే. ఇటీవల నేను చాలా ఆలోచించాను. ఎంతో మంది సలహాలడిగాను. ఆలోచించాను. ఆలోచించాను. ఆఖరికి నేనుకూడా దిగాను!"

"అవునోయ్ నేస్తం" అని మరొకడందుకొన్నాడు.

"నిన్ను చూస్తే జాలి వేస్తోందోయ్. చాలా జాలివేస్తోంది. నీ రాతలు చదవడం అంటే నాకెంతో యిష్టం. చదువుతూంటే చిరునవ్వులు చిందుతాయి. నిట్టూర్పులు నెగడుతాయి. అప్పుడప్పుడు నాలుగు మంచి ముక్కలుకూడా కనిపిస్తూవుంటాయి... దాన్నే స్నేహితునికో చెప్పాలని ఆరాటపడుతూ వుంటాను. నా స్నేహితుడొకడున్నాడు. అతనికి నీ సరుకు కంఠతా చాలా వచ్చును. ఏమైతేనేం దేనికైనా హద్దు అంటూ వుంటుంది. ఇప్పుడు కావలసింది ఇదికాదు. మరేదో. నీవీ విషయాన్ని గ్రహించాలి. కాక అలాగే కాచుకొని కూర్చుంటానంటావా? ఎప్పుడో ఒకరోజున జైల్లో తోస్తారు. ఆ

"ఏదో" అంటే ఏమిటో తర్వాత స్పష్టమవుతుంది. కాని ప్రస్తుతానికి... నా విషయమే చూడు. నేను ఇంతకాలం చూశాను. ఇతరులేం చేస్తున్నారో గమనించాను. అప్పుడు మా ఆవిడదగ్గరకు వెళ్ళి 'ఇదుగో తరుణం వచ్చింది' అన్నాను. ఆమె వెంటనే ఒప్పుకొంది. అప్పుడు నిశ్చయించాను..."

"ఏమని నిశ్చయించావు?"

"ఏముంది? నలిగినదారినే నడవాలని. అంతే ముందూ వెనకా చూడవలసిన పనిలేదు. ఆకాశానికెగిరే అవసరం లేదు. ప్రపంచ సమస్యలను గురించి ఆలోచించనక్కరలేదు.... ఒక్కొక్క అడుగే. తెలిసిందా? సుఖానున్న ప్రాణాన్ని కష్టాన పెట్టకు. అందులో కొంచెం ఉషారు తక్కువ. ఆ మాట నిజమే. కాని మనమంతా మహా మేధావులం కాలేముకదా? అదీకాక సంసారం సంగతి చూసుకోవాలా మరి? మా ఆవిడకు విలాసాలంటే యిష్టం. తెలియంది కాదూ? వినోదాలమీద ప్రీతి మెండు. ఇక స్వవిషయం కూడా ఆలోచించుకోవాలి కదా. మన హెూదా, పరిచయాలు, సంబంధాలు ఎన్ని వున్నాయి మరి. అంతా హాయిగా గడుపుతూండడం చూస్తున్నాం. అన్నింటినీ వదులుకొనడం మంచిదేనా అని అడుగుతున్నాను. నేనెప్పటికీ ఇలాగే వుంటానని అనుకొనకు. ఎన్నటికీ వుండను. కొన్ని పరిమితులకు లోబడి ఈ పని చేస్తున్నాను. కాలం ఎప్పటికీ ఒక్కతీరుగా వుండదు. మంచిరోజులు వస్తాయి... ఉదాహరణకు మన ఎల్లయ్యగారున్నారు... మేనేజిమెంటు మారవచ్చును. ఈవేళ ఎల్లయ్యగారున్నారు. రేపు పుల్లయ్యగారు. అప్పుడు మనం మళ్ళీ..."

"కాని పుల్లయ్యగారు పచ్చిదొంగ."

"దొంగా? ఏమిటయ్యా నీవనేమాట!"

ఆఖరికి మూడవవాడు వచ్చాడు. వచ్చీ రాగానే "మా బాగా అయిందిలే" అని మొహంపట్టుకొని అనేశాడు.

"నీ ఆకతాయితనం ఇంక చాలును. నీవూ చిక్కుల్లో పడతావు. ఇతరుల్ని చిక్కుల్లో పడేస్తావు. ఇంతెందుకు. నిన్ననే నీ మూలాన నేను సంజాయిషీ ఇచ్చుకోవలసివచ్చింది. ఈ వేళ నేను బ్రతికున్నానో చచ్చిపోయానో కూడా తెలియని స్థితిలో వున్నాను. నీకున్న హక్కేమిటి? అని అడుగుతున్నాను. 'నీవు పితూరీరావుతో స్నేహంగా వున్నట్లు మాకు తెలియవచ్చింది. అందుకని...' 'అయ్యా స్నేహంగా వుంటున్నావు అనడంలో తమ ఉద్దేశ్యం నాకవగతం అవడంలేదు. అతడు కేవలం గంధోళిగాడు. రోజంతా పాటుపడిన తర్వాత కాస్త కులాసాగా నవ్వితే తప్పేముంది?' ఇలా సంజాయిషీ ఇచ్చుకోవలసివచ్చింది. ఆలోచించుకొనడానికి నాకు ఇరవై నాలుగు గంటల వ్యవధి ఇచ్చారు. ఏమి కానున్నదో ఆ దేవునికే తెలియాలి! నాక్కూడా సంసారం వుందయ్యా! భార్యా బిడ్డలు... ఇక

నేనంటారా? నేను మాత్రం కొయ్యబొమ్మను కానుకదా? ఇలా జరుగుతుందని ఎవరనుకొన్నారు? మీకేం హక్కుంది అని మళ్ళీ మళ్ళీ అడుగుతున్నాను. అయ్యో! రాతా!!"

ఇక సంభాషణ సాగించడంలో అర్ధం కనిపించలేదు పితూరీరావుకు. దారిలో తన చిన్ననాటి స్నేహితుని ఇంటి మీదుగా పోవలసివుంది కనుక అక్కడైనా కాస్త ఉపశాంతి లభిస్తుందేమోనని తలుపు తట్టాడు.

నౌకరు చాలా మర్యాద చేశాడు. బహుశా వానికి జరుగుతున్న సంగతులేవీ తెలియవని దీన్నిబట్టి స్పష్టమవుతుంది. అయ్యగారు ఇంటిలోలేరు. అమ్మగారు కచేరీ గదిలో వున్నారు అని చెప్పాడు నౌకరు. పితూరీరావు తలుపు తెరిచి గడపదాటాడా లేదో ఆవిడ కెవ్వున అరిచి పారిపోయింది. పితూరీరావు వెనకకు తిరిగాడు.

అప్పుడు తన పాతస్నేహితుడు, పిరికికండ పిచికోజీరావు సంగతి జ్ఞాపకం వచ్చింది. అతను పొరుగు వీధిలోనే వుంటున్నాడు (పదిహేనేళ్ళక్రితం వీరిద్దరూ పాపకూపాల శాఖలో సహోద్యోగులు).

పితూరీరావంటే పిచికోజీరావుకు చాలా అభిమానం వుంది. ఉద్యోగంలో మాత్రం పైకెక్కలేక పోతున్నాడు. పదేళ్ళకుపైగా హెడ్ గుమస్తాగా గాడిద చాకిరీ చేశాడు. ఆ పదేళ్ళలోనూ పైకిపోయే ఆశ అణుమాత్రమూ కనిపించలేదు సరికదా రాజకీయంగా మార్పులు వచ్చినప్పుడల్లా ఉద్యోగం ఎక్కడ ఊడిపోతుందోనని గజగజలాడి పోయేవాడు. అసలే పిరికి. చొరవ బొత్తిగాలేదు. అందుకని ప్రైవేటు సంస్థలలో ఎక్కడా అతను నౌకరీ సంపాదించలేక పోయాడు. పైకి రావాలన్న ఆలోచన పుట్టినప్పుడల్లా అది తనకు సాధ్యమయే పనేనా అని తనలోతాను నవ్వుకొనే వాడు. పై అధికారులకు అర్జీ పంపుకొనడానికి భయం. తన పైవారి గదులచుట్టూ ప్రదక్షిణాలు చేయడంకూడా చాతకాదు. ఒకసారి తనలాంటి మేధకులను ప్రోత్సహించవలసిన అవసరాన్ని వివరిస్తూ పై అధికారికి విజ్ఞాపన అందజేశాడు. అధికారి దాన్ని చదివి తర్జని ఆడించాడు. అంతే దానితో మరెన్నడూ కూడా పిచికోజీరావు నోరెత్తలేదు. కొద్దికాలంగా అతనికి ఆశలు తిరిగి చిగురిస్తున్నాయి. తమ దొరగారు వెళుతున్న గుళ్ళోకే తానూ వెళుతున్నాడు. ఒకనాడు దొరగారు దానాల రొట్టెలో సగం ముక్కకూడా (మాడిపోయిన సగం) బహూకరించాడు. సంతోషించానోయ్ అని కూడా ఒకసారి అన్నాడు. ఇలాగ మంచిరోజులు రాబోతున్న తరుణంలో హఠాత్తుగా...

పితూరీరావు పిలుపు విని ఇంట్లోవున్న ముసిలిదాది తలుపు తెరిచింది. పిల్లలు భయంతో దాది వెనుక నక్కి చూస్తున్నారు. పేలు కుక్కుకుంటూ వుంటే హఠాత్తుగా ఊడిపడ్డవాడెవడా అన్న చిరాకు దాదిలో ద్యోతకమవుతోంది. అందుకని ఎక్కువ

మాట్లాడ్డం ఆవిడ కిష్టంలేదు.

"పిచికోజీరావుగారు ఇంట్లో లేరు. దొరగారు కబురు పంపగా వెళ్ళారు. ఇదిగో మీ మూలానే. ఆయనింకా బతికే వున్నాడో చనిపోయాడోకూడా తెలియదు. అమ్మగారు గుడికి వెళ్ళారు."

పితూరీరావు వెనకకు తిరిగాడు. నాలుగడుగులు వేసే సరికి పిచికోజీరావే ఎదురయ్యాడు.

"ఈసారి ఎలాగో బతికి బయటపడ్డాను. అయినా ఇంకా నమ్మకంగా చెప్పలేను. 'నీమీద ఒక బ్లాకుమార్కు వుందోయ్' అని మా దొర అన్నాడు. నాకూ పెళ్ళాం బిడ్డలున్నారు. నీకు తెలుసునుగదా? బాబూ పితూరీరావు! నీకు దండంపెడతాను. నన్ను విడిచిపెట్టు. ఇంత పిరికితనం చూపిస్తున్నందుకు క్షమించు. ఏం చేయగలను? నీవే చెప్పు మరి!"

నీరసంతో, నిరుత్సాహంతో ఇల్లుచేరాడు పితూరీరావు. ఇటుపైన తనకు ఏకాంతవాసమే గతి అని అతనెరుగును. ఈ ఏకాంతవాసం గతి పట్టిందంటే పాఠకునికి తనమీద అభిమానంలేక కాదు. నిజానికతనికి అభిమానమే కాదు ప్రేమ కూడావుంది. కాని 'నిజమైన' పాఠకునితో సంబంధాలు తెగిపోయాయి పితూరీరావుకు. అదే ఈ ఏకాంతవాసానికి కారణం. తనకు చుట్టుకొన్న ఈ బంధనాలను తెంచుతాడేమో అనుకొనడానికి ఆ పాఠకుడు చాలాదూరాన వుండిపోయాడు. పోతే తనకు సర్వదా సన్నిహితంగా వుండే మరొక పాఠకుడు మిగిలాడు. అతడు విషపు పుచ్చె. తేలుకొండె. ఎప్పుడైనా కుట్టగలడు. అలాంటివాడు మిగిలాడు. ఈ మౌనం అంటే తనకు మహామంటగా వుందని ఆ పాఠకుడు పితూరీరావును బాహాటంగా హెచ్చరించాడు.

ఆలోచనలు మెదడులో మెల్లగా పారాడాయి. ఈ ధర్మభ్రష్టత అంతలోనూ వ్యక్తి ద్రోహం ప్రధానాంగంగా అతనికి కనిపించలేదు. సర్వే సర్వత్రా పీడన అతనికి గోచరించింది. నిన్నటిదాకా నిర్భయంగా కనిపించిన ఈ మేధావులు, మొన్న మొన్నటిదాకా తనతో మనసారా మాట్లాడిన వీరు ఈనాడు తననేదో మహమ్మారిని చూసినట్లు చూస్తున్నారంటే కారణం... కేవలం ప్రాణాలమీద తీపి ఒక్కటేనంటామా? కాదు. వారు పీడనకు గురయ్యారు.

వారు తమ జీవిత తృష్ణతో పీడితులయ్యారు. ఈ తృష్ణ సహజమైనదే. న్యాయమైనదే. అయితే "బతకాలనుకొన్నవాడు క్రూరమైన బానిసతనానికి తలవంచక తప్పదా?" ఈ ప్రపంచంలో సహజత అనేది ఎల్లప్పుడూ మంచికీ మహోదాత్తతకూ విరుద్ధంగానే వుంటుందా?" ఈ ఆలోచన వచ్చేసరికి పితూరీరావుకు భయంతో వళ్ళు కంపించింది.

అదీకాక మొన్న తనతో మాట్లాడిన వారంతా తమకున్న సంసార బాధ్యతలు

వెళ్ళబోసుకొని తమ ధోరణిని సమర్థించుకొన్నారు. మా ఆవిడకు విలాసాలంటే ఇష్టం అని ఒకరన్నారు. మరొకరు "మా ఆవిడ" అన్నారు. అంతే... అన్నిటికన్నా దారుణంగా వుంది పిచికోజీరావుస్థితి. అతని కుటుంబాన్ని గురించి దిగులు పట్టుకొంది. ఆ కుటుంబం కోసం నిద్రాహారాలు కూడా లేవతనికి. ఎప్పుడూ ఏదో పై పని చూసుకొని మరింత సంపాదించాలనే ధ్యాసతప్ప మరొకటిలేదు. అయినా అతను సంపాదించేది అతిస్వల్పం. ఇల్లాలు ఆత్మత్యాగం చేయబట్టికాని లేకుంటే ఆ దారిద్ర్యానికి తట్టుకోలేక పోయేవాడు. అందుకని ఈ పిడికెడు మెతుకులకోసం, ఈ బిచ్చంకోసం...

ఏమిటిది? ఏమిటి ఈ కుటుంబం? ఈ సమస్యను పరిష్కరించేదెలాగ? మనిషి పాలిట ఈ కుటుంబం మహామారి కాకుండా వుండాలంటే అతని మెడకు గుదిబండ కాకుండా వుండాలంటే ఏంచేయాలి?

పితూరీరావు ఈ విషయమై చాలా ఆలోచించాడు. హఠాత్తుగా కంపించాడు.

"ఇంతటి ప్రధాన సమస్యలు ఇప్పుడున్నంత తీవ్రంగా ఇంతకు ముందెందుకులేవు?" అని అతని అంతర్వాణి ప్రశ్నించింది.

"నీవిప్పుడు ఎందుకూ కొరగాని ఏమీచేయలేని బానిసవనుకొంటున్నావు. కాని నీలో ఇంతో అంతో శక్తి ఉందనుకొనడానికి ముందు కూడా నీవు బానిసవు కాదా? నీవు ధైర్యంగా ముందుకువచ్చి ఆత్మత్యాగం ఎందుకు చేయలేదు? ఆర్తనాదాలు వినవచ్చిన చోటికి తిన్నగా పరుగెత్తకుండా నీకొక హెూదానిచ్చిన వృత్తికీ, పరిచయాలకు, స్నేహితులకు ఎందుకు బానిసవైనావు? ఏదో అవ్యక్త సానుభూతి చూపడానికి మారుగా ఆవేదనలనే నీవెందుకు భరించలేదు?

"నిరసన, ఆక్షేపణ నీ కలం కుమ్మరించిన మాట నిజమే కాని, వాటికి నీవు ఇచ్చినరూపం వల్ల అది చచ్చి వూరుకున్నాయి. నీవు ఏ చెడగులను ఆక్షేపించావో అవి నీ ఆక్షేపణకు పూర్వం ఎలా వున్నాయో ఇప్పుడుకూడా సరిగా అలాగే వున్నాయి."

"నీవు వృధా శ్రమ చేశావు. అబద్ధాల అల్లకాలలో నాలుకలు వాలికలైన బారిస్టర్ల శ్రమలాగే నీ శ్రమకూడా వృధా. నీవు గొంతెత్తి ఆక్షేపణ తెలిపావు. కాని ఏమిచేయాలో నీవెన్నడూ చెప్పలేదు. పోరులో దిగి నాశనమైన వారిని గురించి నీవు కేవలం సానుభూతి వెల్లడించావేకాని వారి తరఫున నిలిచి నీవు మాట్లాడలేదు. కోపిష్టి బానిసల మనస్తత్వం నీది. ఉద్దేశాలు మంచివేకాని ఫలితం శూన్యం. ఈవేళ నిన్నుచూసి మొహం తిప్పుకొన్నవారు మరి నీతో మాట్లాడరు. వారు నిన్నటివరకూ బాగానే వున్నారని నీవనుకొన్నావు.

"నిజమే. వారు చేసిన పనులను చేయడం నీకు చాతకాదు. చిన్ననాటినుంచీ నీ అణవణువునా జీర్ణించిన ఆ నిరర్థక సదుద్దేశాలను విడనాడే శక్తి నీకు లేదు."

"అయితే దీనివల్ల నీకు మేలుకలుగుతుంది. . . . ఎప్పుడు? ఎక్కడ? కాని ఇప్పుడు నిన్ను ముదిమి పొదువుకొంటున్నది. దాని అవలక్షణాలన్నీ పొడసూపుతున్నాయి. అలాంటప్పుడు నీవాశించేదేమిటి? ఆలోచించు!"

తాజాకలం...

ఇప్పుడు చెప్పినదంతా కేవలం కట్టుకథ అని వేరే చెప్పనవసరంలేదు. పితూరీరావనే వ్యక్తి ఎవరూలేరు. అసలలాంటివారు పుట్టనేలేదు. ద్రోహులు, ఏ యెండకాగొడుగు పట్టే ప్రబుద్ధులూ ఇప్పుడే కాదు ఎప్పుడూ వున్నారు. మిగతావన్నీ సజావుగానే వున్నాయి కాబట్టి ఆర్భాటం చేయదగ్గ అంశమేదీ ఇంకలేదు. మనసులో మాయలేని రచయిత పాఠకుణ్ణి క్షమించవలసిందని వేడుకొంటున్నాడు.



గవర్నరుగారి పట్టుదల



అనగా అనగా ఒకానొక దేశం. ఆ దేశంలో ఒక రాష్ట్రం. ఆ రాష్ట్రానికి మంచి పట్టుదల గల గవర్నరొకడుండేవాడు. ఆ రోజుల్లో ప్రతి గవర్నరూ తను చేయకలిగినంత కీడు చేసేవారు. దానివల్ల మేలుకలిగి తీరుతుందని వారి నమ్మకం.

ఆ రోజుల్లో పెద్దపెద్ద అధికారులంతా ఏమనేవారంటే "ముందు జానాన్ని పట్టుకొని ఉన్నదంతా ఊడ్చేయాలి. ఆ తర్వాత తాటవలవాలి. అప్పుడు కొరడాలతో మెరుగుపెట్టాలి. ఆపైన తగినంత కవాతు చేయిస్తే ఊపిరిలేచి వచ్చి బాగుపడతారు" అని.

మన గవర్నరు ఈ సూత్రాన్ని అప్రయత్నంగా తన ముక్కుమీద గిలకరించుకొన్నాడు. తర్వాత అతడిని (అతని తెలివితేటలకు బహుమతిగా) ఒకానొక దత్త మండలానికి పంపినప్పుడు సిద్ధంగావున్న ఈ కార్యక్రమంతో పదవిలోకి చేరాలిమరి. మొదట శాస్త్రాలను నిషేధించడం. తర్వాత ఊరును తగలబెట్టడం. ఆ తర్వాత జనాన్ని హడలెత్తించడం. ఇలాగ ఈ కార్యక్రమం సాగుతున్న కొలదీ అప్పుడప్పుడు గుడ్లనీళ్ళు కుక్కుకొని "ప్రజల మేలుకోసమే కీడునంతా చేస్తున్నాను. పైన భగవంతుడే సాక్షి"

అనుకొంటాడు. ఇలా రెండేళ్ళపాటు ఆ ప్రదేశాన్నంతా సర్వనాశనం చేసేసరికి ఆ దత్తమండలం క్రమంగా మర్యాద మన్ననగల మండలంగా మారిపోతుంది. ఆ తర్వాత ఎలాగూ ఇంతవరకూ వచ్చింది కాబట్టి అది నేరస్తులకు చక్కని శిబిరంగా వుపయోగపడుతుంది.

అవును చక్కని నేరస్తుల శిబిరం. అక్కడి జనం ఒకరి జోలీసొంటీ పట్టించుకోరు. తుపాకి మందు కనిపెట్టరు. సంపాదకీయాలు రాయరు. వారంతా గౌరవంగా హాయిగా బతుకుతారు. వారంలో ఆరురోజులూ తమ పనులు తాము చూసుకొంటారు. ఆదివారాల్లో గవర్నరుగారి ఆరోగ్యంకోసం ప్రార్థనలు చేస్తారు. ఇలాగ కాలం గబగబ గడిచిపోతుంది. వారికి చదువురాదు కాని పరీక్షలకు మాత్రం సర్వదా సంసిద్ధం. వారు తాగరు కాని సారాపాకల లాభాలు మాత్రం మేటలు పేరుకొంటాయి. వారు విదేశీ సరుకు కొనరు. కాని దిగుమతి సుంకాలు మాత్రం వరస తప్పకుండా వస్తూవుంటాయి. ఇక వారి గవర్నరు పట్టుదల మనిషి. అంతా చూసి ఆనందిస్తాడు. ఆడవారికి పచ్చడాలు, మగవారికి నడికట్లు బహూకరిస్తాడు. అతని నేరస్తుల శిబిరం తీరు ఇది. అందుకనే శాస్త్రాలను నిషేధించడం, ఊరు తగలబెట్టడం. జనాన్ని ఎముకలు విరగగొట్టడం తెలిసిందా?

"చిత్తం చిత్తం. తెలిసిందండి!"

ఇలాంటి ఆశలు పెట్టుకొని వచ్చాడు గవర్నరు. రాగానే కీడుచేయడానికి దిగాడు. ఇలాగ ఒక ఏడాది గడిచింది. మరొక ఏడాది గడిచింది. ప్రజలకు కావలసిన వస్తువులన్నింటినీ బంద్ చేశాడు. వైద్యశాఖలను రద్దుచేశాడు. పుస్తకాలన్నీ తగలబెట్టి బూడిదను గాలిలో విరజిమ్మాడు. మూడేళ్ళపాటు ఇలాంటి ఫలవంతమైన కృషిసలిపిన మీదట సింహావలోకనం చేసుకొనడానికి ఆగాడు. హేభగవాన్! ఈ దత్తమండలం ఏనాడో బాగుపడి వుండవలసింది. కాని తీరా చూస్తే మర్యాద మన్ననగల మండలంగా మారే లక్షణం కలలోకూడా కనరావడంలేదు. తాను వచ్చినప్పుడు జనం భయంతో ఎలా బిక్కచచ్చిపోయారో ఇప్పుడూ అలాగే వున్నారు. గాజువారినకళ్ళు, తెరిచిననోళ్ళు, అలాగే నడుస్తున్నారు.

దీనికి కారణం ఏమిటా అని గవర్నరు ఆలోచనలో పడ్డాడు.

ఆలోచించగా ఆలోచించగా ఆఖరికి ఒక ఉపాయం తోచింది. "మితిమీరిన ఆలోచన.. అదేవచ్చిన చిక్కు" ఇంతకుముందు తార్కాణాలేవైనా వున్నాయా అని వెతికాడు. వెతికినకొలదీ అంతా స్పష్టంగా తేలింది. తానెంతో కీడు చేసినప్పటికీ అదింకా నిజమైన కీడుగా రూపొందలేదు. ఊరంతటినీ ఒక్క తృటిలో ఊడ్చిపెట్టగల కీడుగా మారలేదు. అబ్బే. అదింకా సిద్ధించలేదు. దీనికంతటికీ మూలకారణం 'ఆలోచన'. 'ఇదిగో

మీపనిపడతా' అని అరిచి అడుగువేసినప్పుడల్లా ఈ 'ఆలోచన' వల్ల అడుగు ఆగిపోయేది. ఎంత మూర్ఖుడవయ్యా నీవు అనిపించేది. దానితో వెనకడుగు పడేది. ఈ ఆలోచనే అడ్డురాకపోతే అందర్నీ ఏనాడో నేరస్తుల శిబిరంలో కుక్కి వుండేవాడు.

ఇలాగ కొత్త ఊహ తోచేసరికి "ఇదిగో ఇప్పుడు మీకు కావలసినంత హుషారు కల్పిస్తాను!" అని అరిచాడు గవర్నరు.

పిడికిలి బిగించి కిటికీ వైపు చేయివిసిరాడు. బహుశా దానివల్లనైనా దత్తమండలానికి మేలుకలగ వచ్చును.

అతని అదృష్టవశాత్తు ఆ ఊళ్ళో ఒక కొరవంజి వుంది. ఆమె తేయాకు చూసి సోదె చెపుతుంది. ఆలోచనలు రాకుండా తాయెత్తులు కడుతుంది. అందుకని అతను తిన్నగా ఆ కొరవంజి దగ్గరకు వెళ్ళి "ఆలోచనలను తీసెయ్" అని అరిచాడు. ఏ మాత్రమూ ఆలసించకుండా చేయవలసిన పనాయె ఇదిమరి. అతని బుర్రలో రంధ్రమెక్కడుందో వెతికి దాని బిరడా వూడదీసింది కొరవంజి. ఝుమ్మంటూ ఏదో ఆ రంధ్రంలోంచి ఎగిరిపోయింది. గవర్నరుగారి ఆలోచనలు ఎగిరిపోయాయన్నమాట!

దానితో అతనికి అమితానందం కలిగిందని వేరే చెప్పాలా? ఆ హుషారులో తినడం మొదలుపెట్టాడు. కాని చేయి నోట్లోపెట్టుకొనడం చాతకాలేదు. అదికొంచెం చికాకు కలిగించింది.

కొంతసేపు అయినాక ఆఫీసుకు పరుగెత్తాడు. ఏదో కీడుచేయాలనే కుతూహలంతో గది మధ్య నిలబడ్డాడు. కాని పాపం ఏం కీడు చేయాలో ఎలా చేయాలో కూడా తోచలేదు. ఊరికే కూడా వుండలేకపోయాడు. అందుకని కళ్ళప్పగించకుండా చూస్తూ ఏదో రొదచేశాడు. అతని అనాలోచిత స్థితిని చూసేసరికే అందరికీ హడలు పుట్టి పరుగులుపెట్టారు. అప్పుడతను టేబిలును గుద్ది తుత్తునియలు చేశాడు. తాను కూడా అక్కడినుంచి పరుగుపెట్టాడు.

పొలాల్లోకి వచ్చాడు. అక్కడ దున్నేవారు, నూర్చేవారు, గడ్డివాములు వేసేవారు కనిపించారు. వారిని నేరస్థుల శిబిరంలో వుంచడం ఎంత అవసరమో అతనికి తెలుసును. కాని ఆ పని ఎలా చేయాలి అదే తోచడంలేదు. అందులో ఒకరివైపు కళ్ళెర్రచేసి చూశాడు. చేతిలో వున్న గొర్రును లాక్కొని తునాతునకలుచేశాడు. మరొకరి మీదికి ఉరికి నాగలిని గుంజుకొనేలోగా జనం భయపడి పారిపోయారు. తృటిలో పొలం అంతా ఖాళీ అయిపోయింది. అప్పుడే వేసిన ఒక కుప్పను తిరగదీసి అక్కడనుంచి వెళ్ళిపోయాడు.

ఊళ్ళోకి వచ్చాడు. దానికి నాలుగు మూలలనుంచీ నిప్పు పెట్టాలనుకొన్నాడు. కాని ఎలా ప్రారంభించాలో తెలియలేదు. అలవాటువల్ల అగ్గిపెట్టెతీసి ఒక పుల్ల వెలిగించాడు. కాని మంటవున్న వైపు కిందికి వంచి పట్టుకొన్నాడు. అక్కడినుంచి

గంటల గోపురం దగ్గరకు పరుగెత్తి గంట మ్రోయించాడు. ఒక గంట, రెండుగంటలు అలా మ్రోయిస్తూనే వున్నాడు. అలా ఎందుకు చేశాడో ఎంత బుర్రకొట్టుకున్నా తెలియలేదు. జనమంతా గుమికూడి "నిప్పెక్కడ అంటుకొంది?" అని అడిగారు. ఆఖరికి గంటలు మ్రోయించడం విసువెత్తింది. కిందికి దిగివచ్చి అగ్గిపెట్టె తీశాడు. అగ్గిపుల్లలన్నింటినీ ఒక్కసారే వెలిగించాడు. దాన్ని జనం మీదికి విసురుదామనుకొంటూ వుండేసరికి జనం కకావికలై పారిపోయారు. అతనొక్కడే మిగిలిపోయాడు. అప్పుడింటికి వచ్చి తలుపులు బిడాయించుకొన్నాడు.

అలా ఒక వారం కూర్చున్నాడు. రెండువారాలు కూర్చున్నాడు. కీడేమీ చేయలేదు. అతనికేమీ తెలియడంలేదు, అంతే. ఊళ్ళో జనానికి కూడా ఏమీ తెలియడంలేదు. గవర్నరుగారు నిరపాయకరంగా కూర్చున్నారు. కాబట్టి వారిప్పుడైనా తెలివి తెచ్చుకోవలసింది. కాని అలా చేయలేదు. ఇంకా భయపడిపోయారు. భయపడకుండా వుండలేకపోయారు. అంతవరకూ కీడును మాత్రమే వారు చూశారు. దానినుంచి ఏ క్షణంలోనైనా మేలుకలుగవచ్చునని ఎదురుచూస్తున్నారు. ఆ ఎదురుచూసిన గడియ రానున్న ఈ తరుణంలో హఠాత్తుగా ప్రశాంతత అలముకొంది. కీడులేదు. మేలులేదు. అంతా నిస్తబ్దత. జనం నిశ్చేష్టులైపోయారు. తమతమ పనులు మానేశారు. కలుగుల్లో దూరారు. ఓనమాలు మరిచిపోయి అక్కడ నిరీక్షిస్తూ కూర్చున్నారు.

ఇలా వుండగా గవర్నరుగారి బుర్రలో బిరడాకింద క్రమక్రమంగా ఆలోచనాశక్తి పేరుకొంది. ఒక రోజున కిటికీలోంచి బైటకు చూశాడు. అప్పుడే ఏదో మెరుపులాగ తోచింది.

"నేను అనాలోచితంగా వున్నట్లు కనిపించడంవల్ల నిజమైన కీడు జరిగిందనుకొంటాను" అనుకొన్నాడు. జనం వచ్చి అయ్యా ఒక నేరస్తుల శిబిరాన్ని నెలకొల్పండి అని ప్రాధేయపడతారని ఎదురుచూస్తూ కూర్చున్నాడు.

ఎంతకాలం ఎదురుచూసినా ఎవరూ రాలేదు. అంతా సర్వసిద్ధంగా వున్నట్లు కనిపించింది. పొలాలు వల్లకాడుల్లా వున్నాయి. నదుల్లో నీరులేదు. తెగుళ్ళు తగిలి పశువులు చనిపోతున్నాయి. బడులు మూతపడ్డాయి. ఇంకొక్క ఊపు ఊపితే చాలును. దేశం యావత్తూ నేరస్తుల శిబిరం అయి ఊరుకుంటుంది. అయితే నేరస్తులు ఎవరవుతారు అనేది ప్రశ్న. కనుచూపుమేరలో మనిషన్నవాడు కానరావడంలేదు. కుళ్ళుమీద ఈగలు ముసిరినట్లు గూండామూక మాత్రం గుంపులు గుంపులుగా తిరుగుతున్నారు. కేవలం వీళ్ళతోనే నేరస్తుల శిబిరాన్ని పెట్టడం సాధ్యంకాదు. నేరస్తుల శిబిరం పెట్టారంటే అందులో ఒక్క సోమరిపోతులు మాత్రమే వుంటే చాలదు. నిజంగా కష్టించి పనిచేయగల పేదజనం కావాలి.

గవర్నరు కేమీ తోచలేదు. వీధిలోకి నడిచాడు. జనం దాగొన్న కలుగుల్లోకి పాకాడు. ఒక్కొక్కరినే జుట్టు పట్టుకొని పైకిలాగాడు. ఒక్కొక్కరినే పైకిలాగడం, నిశ్చేష్టులను చేయడం ఇదీవరస. ఇక్కడొక కొత్తసమస్య వచ్చి పడింది. ఆఖరి కలుగులోవున్న మనిషిని ఈవలికీడ్చేసరికి అంతకుముందు వారు తిరిగిపోయి దాగొనేవారు.

ఇలాంటి ఆపత్సమయంలో తన గురువుగారి మాటలు జ్ఞాపకం వచ్చాయి. "నీ స్వదేశాన్ని నీచపరచాలంటే గుండాలను పిలు" అంటూ వుండేవాడాయన.

గవర్నరుకు హుషారెక్కింది. గూండామూకను పిలవనంపి "అబద్ధాలూ, అపవాదులూ వెదజల్లండి!" అని హుకుం చేశాడు.

దేశం అల్లకల్లోలమైపోయింది. కొంతమందికి కన్నీరుమున్నీరై ప్రవహించింది. కాని గూండా మూకకు మాత్రం పండుగలాగా వుంది. రేయింబవళ్ళు వారు స్వైరవిహారం చేసేవారు. జన్మానికల్లా శివరాత్రి అన్నట్లు ప్రవర్తించేవారు. కొందరు అపవాదులు, ఆకాశరామన్న ప్రకటనలు తయారుచేశారు. ఇతరులు కీడు పథకాలు వేశారు. మరికొందరు తీవ్రచర్యలు తీసుకోవాలని సూచించారు. "కావలసింది తిండికాదండి.. దేహశుద్ధి!" అని వారు గోలపెట్టారు. ఈ కంగాళీ అంతా గవర్నరుగారి కచేరీలోకి ప్రవహించింది. అతను ఒక్కొక్క కాగితమే చదివాడు. కాని అతని తెలివి దానివల్ల పెరగలేదు. "ముందు డప్పులు వాయించాలి. అలా చేస్తే జనం హఠాత్తుగా నిద్రలోంచి మేల్కొంటారు." ఎందుకు? "జనాన్ని నిరంతర చింతలో ముంచాలి." ఎందుకోసం? "అమెరికాను మళ్ళీ బంద్ చేయాలి." కాని అది తాను చేయవలసిన పనికాదు. చదివినకొలదీ విసుకెత్తింది. ఒక్క నిర్ణయం కూడా చేయలేకపోయాడు.

అనాలోచిత నిర్ణయాలు చేసే గవర్నర్లుంటే ఊళ్ళు పాడౌతాయి. కాని అసలు నిర్ణయాలే చేయని గవర్నర్లు అంతకన్నా దారుణం! మళ్ళీ గూండా మూకను పిలవనంపాడు.

"నిజమైన కీడుకలగాలంటే ఏం చేయాలి? చెప్పండి గూండా వెధవల్లారా!"

దానికి గూండామూక ఒక్క గొంతుతో ఇలా జవాబిచ్చారు:

"మా కార్యక్రమాన్ని సమగ్రంగా అమలు జరిపితే తప్ప నిజమైన కీడు కలిగించడం సాధ్యంకాదు. ఇదిగో మా కార్యక్రమం ఇది: గూండా వెధవలమైన మాకు మాత్రమే వాక్స్వాతంత్ర్యం వుండాలి. మిగతా వారంతా నోరెత్తడానికి వీల్లేదు. మా గూండా వెర్రివేషాలన్నింటినీ ఆమోదించాలి. ఇతరుల కోర్కెలను ఖాతరు చేయకూడదు. మా గూండా సజ్జంతా విలాసంగా బతకాలి, మిగతా వారంతా మన్నుకొట్టుకుపోవాలి. హడావుడీ, హంగామా మా గూండాలే చేయాలి. మిగతా అందరికీ అరదండాలు వేయించాలి. మా గూండాలు చేసిన కీడునంతనీ మేలుగా భావించాలి. ఇతరులు చేసిన మేలైనా కీడైనా దుర్మార్గంగా భావించాలి. మా కెవరూ ఎదురాడరాదు. మాపై ఎవరూ

చాడీ చెప్పరాదు. కాగా మేం గూండాలం కాబట్టి మేం మాత్రం మా ఇష్టంవచ్చినట్లు ఇతరులమీద అపవాదు వేస్తాం. ఈ కార్యక్రమాన్ని అక్షరాలా అమలుపరుస్తే మీరు ఆశించిన నిజమైన కీడుమూడుతుంది."

గవర్నరు ఈ ప్రసంగం విన్నాడు. గూండాల గీర తనకు నచ్చక పోయినప్పటికీ వారి పద్ధతి సరియైన ధోరణిలోనే వుందని గ్రహించాడు. అందుకని వారి వరాలన్నింటినీ మంజూరు చేశాడు.

"సరే మీ కార్యక్రమాన్ని నేనంగీకరిస్తున్నాను. దానివల్ల కావలసినంత కీడు మూడుతుందని కూడా ఒప్పుకొంటున్నాను. అయితే అది మన దత్తమండలం అభివృద్ధి పొందడానికి తగినంత కీడు అవునా కాదా అన్న విషయాన్ని చూడవలసివుంది."

ఈ గూండాల ప్రసంగాలను అచ్చువేయించి జనం చదువుకొనడానికి వీలుగా గోడల కంటించాలని ఉత్తరువులు జారీచేశాడు. తర్వాత ఏంజరుగుతుంతో చూడ్డానికి కిటికీ దగ్గర తిష్టవేశాడు. ఒక నెల చూశాడు. రెండు నెలలు చూశాడు. గూండాలు అపవాదులు వేశారు. దోపిడులు చేశారు. ఒకరి గొంతులొకరు కోసుకొన్నారు. అయినా దత్తమండలం బాగుపడనని మొండికేసింది. అంతకన్నా దారుణమేమిటంటే, ఊళ్ళో జనం ఇంకా లోతు బొరియలు తవ్వుకొని దాగొన్నారు. వారి ఐపు ఆనవాలుకూడా కనిపించడంలేదు. వారిని బ్రతికి వుండగా కాదుకదా చచ్చిన తర్వాత కూడా వెలికితీసే ఆశ కనిపించలేదు.

కడకు గవర్నరొక నిశ్చయానికి వచ్చాడు. ఊరి గవనిదాటి తిన్నగా దారిపట్టాడు. అలా పోగా పోగా పోగా పెద్ద పట్నంలో పెద్ద గవర్నరు దొరగారి దివాణం వచ్చింది.

చుట్టూ చూసి తన కళ్ళను తానే నమ్మలేకపోయాడు. ఇక్కడ గూండాలు ప్రతివీధి మొగనానిలిచి తమ కార్యక్రమాన్ని గురించి అరిచి ఎంత కాలమయింది? పట్నవాసులు తమ కలుగుల్లో ఎంత కాలం దాగున్నారు? ఇప్పుడు పరిస్థితులన్నీ తారుమారయినట్లు కనిపిస్తోంది. పట్నవాసులు అడ్డూ అదుపూ లేకుండా వీధుల్లో నడుస్తున్నారు. గూండాలు దాగొన్నారు!

ఎటుచూసినా వాతావరణం తేనెలా గోచరించింది. నేల ఈనిన ఫలసాయం పుష్కలంగావుంది. ఒక పూటకూటింట్లో అడుగుపెట్టాడు. "అయ్యా వ్యాపారం ఇంత చక్కగా ఎన్నడూ జరగలేదనుకోండి" అని వినిపించింది. ఒక రొట్టెల దుకాణంలో అడుగు పెట్టాడు. "అయ్యా ఇన్ని రొట్టెలు మా జన్మలో అమ్మి ఎరగం" అన్నారు అక్కడివారు. ఒక పచారీ కొట్లోకి వెళ్ళాడు. "అయ్యా సరుకుకెంత గిరాకీగా వుందంటే మేం అందించలేక సతమతమవుతున్నా మనుకోండి. తెచ్చిన సరుకు చిటికలో అయిపోతున్నది!" అన్నమాటలు ఎదురయ్యాయి.

"దీనికి కారణ మేమిటి?" అని ఎరిగినవారినీ ఎరగనివారినీ అందరినీ అడిగాడు.

"ప్రతిదీ ఇక్కడింత అద్భుతంగా వుండడానికి చేదు నిజమైన కీడేమిటి?"

"అబ్బే! అసలు కీడేమీ జరగనేలేదండి. జరిగినదంతా మేలేనండి. పెద్దగవర్నరు పదవికి ఒక కొత్త దొరగారు వచ్చారు. ఆయన అసలు కీడు అనేదే లేకుండా చేసివేశారండి. అందుకనే ఇంత హాయిగా వుంటున్నాం!" అని వారంతా జవాబు చెప్పారు.

దానిమీద మన గవర్నరు పెద్ద గవర్నరుగారిని సందర్శించడానికి బయలుదేరాడు. పెద్ద గవర్నరుగారు ప్రాసాదం కొత్త రంగులతో ధగధగ మెరిసిపోతోంది. నౌకర్లు కొత్తవారు. చాకర్లు కొత్తవారు. పెద్ద గవర్నరు దొరగారు సరికొత్తవారు. పాతదొరగారు విషపుచ్చె అనిపించాయి. కాని ఈ కొత్త దొరగారు మంచి తప్ప మరేమీ చేయలేనివారిలా కనిపిస్తున్నారు. పాతాయనకు గురగురలాడ్డం ఒకటే చాతనవును. ఈ కొత్తాయనకు కోయిలపాటలాంటి ఒక పాట వచ్చును. ఆయన మందహాసంతో కరచాలనం చేశాడు. అతిధికి ఆసనం చూపాడు. దత్తమండలం పరిస్థితులను గురించి అడిగాడు.

"అక్కడి విశేషాలేమిటి? కొత్తకొత్త ఫ్యాక్టరీలు, మిల్లులు కట్టిస్తున్నారా? పశుక్షేత్రాలూ, తేనె పరిశ్రమలు బాగా పెంపొందాయనుకొంటాను. అవునా?"

ఇతనేదో దేవతలాగ వున్నాడు.

సరే ఇంక వెనకాడి లాభంలేదు. అందుకని మన గవర్నరు తన వ్యవహారాన్నంతా విప్పాడు. విషయం సాగిన కొలదీ అసహ్యం ఎక్కువైంది. అలాగ ఇలాగ; ఇదీ అదీ. తానెంత కీడు చేసినా దమ్మిడీ ఎత్తు మేలుగూడా జరగలేదు. దత్తమండలం ససేమిరా బాగుపడనంది. అదీ అక్కడి సంగతి.

కొత్త గవర్నరు దొరగారు చలించలేదు.

"దయచేసి మరొకసారి అంతా వివరిస్తారా?"

"ఇదిలాగ అదలాగ. నేను నిజమైన కీడుకలిగించలేక పోయాను దొరగారూ!"

"ఏమిటి మీరు మాట్లాడుతున్నది?"

ఇద్దరూ లేచారు. ఒకరి నొకరు చూసుకొన్నారు. చాలాసార్లు తానుకూడా ఇలాగే తన పూర్వపు వాళ్ళతో చెప్పిన సంగతి కొత్త గవర్నరుకు జ్ఞాపకం వచ్చింది.

అది జ్ఞాపకం రాగానే నవ్వువచ్చింది.

"అదా! అదిప్పుడు మానేశాం. తెలిసిందికాదూ. ఈ రోజుల్లో కీడు చేసేదిలేదు. మేలు ఒక్కటే చేస్తున్నాం. ఇంతకీ నదిలోకి మురుగుతోలి నీరు తీయగా వుండాలని ఆశించలేము కదా! దాన్ని గురించి మీ ముక్కుమీద గిలుకుకోండి"

మన గవర్నరుగారు స్వస్థానానికి తిరిగి వచ్చాడు. అప్పటినుంచీ అతని ముక్కుమీద రెండు గీరలేర్పడ్డాయి. మొదటిది (పాతది) "కీడుద్వారా మేలుచేయి" అంటుంది. రెండవది (కొత్తది) నీ దేశానికి నీవు మేలుచేయాలంటే... ఆపైన రాయడానికి

అక్కడ చోటుచాలలేదు.

అయినా అప్పుడప్పుడు ఒక గీరను మరొక గీరగా పొరబడుతూ వుంటాడు అప్పుడు....

"వగరూ చేదూ

రెండిట మంచిది

ఏదీ కాదూ"

